TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY
OU_204150
UNIVERSAL
LIBRARY

# తొలిపలుకు

ఆంధ్రవాఙ్మయరంగమున నలుబదియేండ్లపాటు అపార పరిశ్రమ జేసి భాషారహస్యముల నెన్నిటినో వెలుగునకు దెచ్చి తెలుగుభాషకు మెఱుగులు దిద్దినవారు శ్రీ ప్రభాకరశాస్త్రిగారు.

శ్రీవారి పరిశ్రమ ఫలితముగా రచింపబడిన వ్యాసము లెన్నో. కొన్ని చిరకాలముక్రింద ప్రకటితములు, మరికొన్ని యప్రకటితములు చెల్లాచెదరుగా నున్నవాటిని ఒకచో చేర్చి పుస్తకరూపముగా ప్రకటించుట యవసరమని పలువురు కోరుట చేత "మీఁగడ తఱకలు" అనుపేర ఈ వ్యాససంపుటిని యిప్పు డిట్లు ప్రకటించినాము.

"మీఁగడ తఱకలు" అను పేరు శ్రీ శాస్త్రిగారే 1914 వ సంవత్సరమున కొన్ని యపూర్వ భాషావిషయముల ప్రకటించుచు మొట్టమొదట వాడిరి. వారి కీపేరు అభిమత మగుటచేత ఆ పేరనే ఈ సంపుటిని ప్రకటించుచున్నాము.

శ్రీ శాస్త్రిగారు తమ నలుబదియేండ్ల భాషాపరిశ్రమ లోను సలిపిన పరిశోధనాత్మకము లయినవ్యాసములు, వ్యాఖ్యలు, ప్రకటన కయి పరిష్కరించి యుంచిన కొన్ని ప్రాచీన గ్రంథములు, అపూర్వములయినవి కొన్ని యింతవరకు అప్రకటితములుగానే వుండిపోయినవి. వాటి నెల్ల ప్రకటించుట భాషాయోషకు పరమోపకార మనుట కెట్టిసందియమును లేదు.

అట్టివాటి నెల్ల కాలక్రమమున ప్రకటింప దలంపుతో "శ్రీ ప్రభాకర పరిశోధకమండలి" యనుపేర శ్రీవారి శిష్యులు, పుత్రులు, అభిమానులు ఈ మండలిని స్థాపించి వరుసగా శ్రీ శాస్త్రిగారి రచనలను గ్రంథరూపమున వెల్లడింప నుత్సహించుచున్నారు. Checked 1909

ఆంధ్రమహాజనుల యాదరాభిమానములతో వరుస్తగా నట్టివాటి నెల్ల ప్రకటింపగలము.

ఇపుడీ మీఁగడ తరకలను చవిచూడగల సహృదయులగు నాంధ్రభాషాభిమానులు ఈప్రయత్నమున మాకు తోడ్పడగలరని ఆశించుచున్నాము.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారి శిష్యులలో నెన్నికగన్న శ్రీతిమ్మావఝ్ఝల కోదండరామయ్యగారు నీగ్రంథప్రచురణవిషయమున నెక్కువగా తోడ్పడినారు. వారి తోడ్పాటునకు మేమెంతయు కృతజ్ఞులము.


తిరుపతి దేవస్థానాధికారులు, ప్రెస్‌వారు మాయెడలగల ఆదరముతో వడివడిగా నీగ్రంథమును ముద్రించి యిచ్చినందులకు వారి నభినందించుచున్నాము.

గ్రంథముద్రణవిషయమున ప్రూఫుల నెంత జాగ్రత్తగా జూచినను కొన్ని యక్షరవ్యత్యయములు దొరలక తప్పినది కాదు. అట్టివాటిని సరిపరుచుకొన ప్రాజ్ఞులకు వేడికోలు.

ప్రకాశకులు.

# విషయానుక్రమణిక


| సంఖ్య. | | | పుట. |
|---|---|---|---|
| ౧ | సాతవాహనులు | ... | ౧ |
| ౨ | శివకవులు | ... | ౧౩ |
| ౩ | పండితారాధ్యచరిత్రము | ... | ౨౮ |
| ౪ | వేములవాడ భీమకవి | ... | ౪౦ |
| ౫ | ప్రాచీనాంధ్రవచనకావ్యములు | ... | ౪౯ |
| ౬ | భాగవతము | ... | ౭౯ |
| ౭ | మధురకవితలు | ... | ౯౩ |
| ౮ | కృష్ణరాయల విద్యాగోష్ఠులు | ... | ౧౧౩ |
| ౯ | ఉద్భటారాధ్యచరిత్రము | ... | ౧౨౫ |
| ౧౦ | మనుచరిత్ర | ... | ౧౫౧ |
| ౧౧ | దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము | ... | ౧౬౫ |
| ౧౨ | కొలచెలమవారు | ... | ౧౯౦ |
| ౧౩ | త్యాగరాజు | ... | ౨౦౮ |
| ౧౪ | ఆంధ్రభాషావతారము | ... | ౨౨౧ |
| ౧౫ | వాఙ్మయపరిణామము | ... | ౨౨౬ |



# హాఁగడ తళుకులు

## ౧
## సాతవాహనులు

సాతవాహను లంధ్రులు గారని వాదించువారు గొందఱు గలరు. సాతవాహన రాజులలోఁ బ్రఖ్యాతి గన్నవారు, కుంతల దేశమందలి ప్రతిష్ఠాన పట్టణము రాజధానిగాఁ గుంతల, సౌరాష్ట్ర మహారాష్ట్రాది దేశములనే పాలించినట్లు శాసనములందు గాన వచ్చుటయు నంధ్రదేశమును పాలించినట్లు గానరాకుండుటయు వారి వాదమునకుఁ బ్రబలసాధనము. పురాణములందు వా రంధ్రులుగాఁ జెప్పఁబడిరి. ఇది పై వాదమునకుఁ బ్రబల బాధకమే యయినను వారు దీనిని బుక్కిటి పురాణపు మాటగాఁ ద్రోసివేయఁ జూతురు. ప్రాచీన సాతవాహను లంధ్రదేశమును బరిపాలించిరనుట కాధారములు లేవా ? విచారింతము.

నాసిక, కార్లె మొదలగు చోట్ల గుహాలలోఁ గలసాతవాహన శాసనములలో వాసిష్ఠీ పుత్త్రపులుమావి శాసనములు ముఖ్యమాయినవి. వానిని బట్టియే పయి వాదమును, పి. టి. శ్రీని

వాసయ్యంగారు, సూర్యశంకరుఁడు, సుబ్రహ్మణ్యయ్యరు ప్రభృతులు, నెలకొల్పిరి[1]. అందు వారి వాదమున కాధారమయిన పట్టిది:— "రాజరాజ్ఞో గోతమీా పుతస, హిమవత మేరు మందర పవత సమసారస, అసిక, అసక, ముళక, సురఠ, కుకురా పరంత అనుపవిదభ అకరావతి రాజస, విఝ, చవత, పారిచాత, సహ్య, కణ్హగిరి, మచ, సిరిటన, మలయ మహింద, సెటగిరి, చకోరపవత పతిస,.." దీని సంస్కృతచ్ఛాయ :—రాజ రాజస్య గౌతమీా పుత్రస్య హిమవన్మేరు మందర పర్వత సమసారస్య, అసిక, అశ్మక, ముళక, సురాష్ట్ర, కుకు రాపరాం తానూప విదర్భాక రావంతి రాజస్య, వింధ్య ఋక్షవత పారియాత్ర సహ్య కృష్ణగిరి మఞ్చ శ్రీస్థాన మలయ మహేన్ద్ర శ్వేతగిరి చకోర పర్వత పతేః.[2] భాండారకరు పండితుఁడు, బూలరు పండితుఁడు, భగవాన్‌లాల్, ఇంద్రాజీ పండితుఁడు మొదలగువారు పలుమార్లు పయి శాసనమును బరిశోధించి ప్రకటించిరట! ఇందుఁ

---

1. మ. సోమశేఖర శర్మగారి 'ఆంధ్ర మహా సామ్రాజ్యము' అను వ్యాసము భారతి సంచికలఁ జూడుఁడు. పైవారి వాదములస్వరూప మెల్ల నందు వారు పరామర్శించిరి.

2. శ్రీభావరాజు వెంకటకృష్ణరావు పంతులుగారు, జయంతి ౨-వ సంచికలో నంధ్రాక్షరములలో సంస్కృతచ్ఛాయాంధ్ర వివరణసహితముగా నీశాసనముఁ బ్రకటించిరి. ఈ పూన్కి మిక్కిలి శ్లాఘ్యము. కడముట్ట నిర్వ

పేర్కొనఁబడిన దేశములను బర్వతములను, వారు గుర్తించిరి. కాని యీయెల్లరకుఁగూడ, 'ముళక' దేశమేదో తెలియరాలేదట! ఒకరు 'ముళక' మును 'ముండక' మునుగా సంస్కరింపవలె ననిరట! ఇంకొకరు సంస్కరింపకుండనే, 'ముళకు' లే 'ముండకు' లగుదురనుట కాధారములఁ జూపిరట! ఈ తలపోఁతలలో మునిఁగి యీముళక దేశమేదో వారు గుర్తింపఁజాలక పోయిరి.

ఈ తలపోఁతలలోఁగూడఁ గొంత వింత విషయమున్నది. అది కడపటఁ దెలుపుదును. పయి శాసనమునఁ బేర్కొనఁబడిన ముళక దేశము నేఁడు ములికినాఁ డనఁబడు దేశమే యని నేను నిశ్చయించుచున్నాఁడను. నేఁటి యంధ్రదేశము ప్రాచీనకాలమున వేంగీదేశముగాను ముళక దేశముగాను బేర్వెలసి యుండెను. కడప, కర్నూలు, బళ్లారి, నైజాము రాజ్యములోఁ గొంత, యీనాఁడు ములకనాడుగా నుండెను. ములకనాటికి శ్రీగిరి నడిబొడ్డు. రాజ్యములు, రాజధానులు మాఱుటలో ఈనాళ్ల

---

హింతురు గాకని కోరుచున్నాను. ఇప్పుడు ప్రకటించిన శాసనముల సంస్కృతచ్ఛాయలోఁ బ్రబలమయిన ప్రమాదములున్నవి. "అపరాజిత విజయ పతాక సతుజన దుపధసనీయ పురవరస" అను దానికి "అపరాజిత విజయ పతాకస్య శత్రుజన దుష్పృధ నియమనస్య పురవరస్య" అని ఛాయ వ్రాయఁబడినది. "అపరాజిత విజయపతాక శత్రుజన దుప్రధర్షణీయ పురవగస్య" అని యుండవలెను. ఇట్టి వింకను గలవు.

ప్రాముఖ్యమును, బరిమాణమును మాఱినవి. ఈ విషయమును ప్రబలముగా నిరూపించుట కిక్కడ చోటు చాలదు. పల్నాడు శ్రీనాథునినాఁడు గూడ ములికినాడను వ్యవహారము నందుచుండె ననుట కాధారముగలదు. క్రీడాభిరామమందలి యీ క్రింది పద్యముఁ జదువఁదగును.

ఉ॥ చిత్తముగూర్చి మాచెరల చెన్నుఁడు శ్రీగిరిలింగముం గృపా
యత్తతఁ జూడ ముల్కివిషయంబున కా మహిమంబు చెల్లెఁగా
సత్తరలోన మింట జల ముట్టిన మాత్రన నాపతాలలో
విత్తిన యావనాళ మభివృద్ధి ఫలించుట యెట్లు చెప్పుఁడా!

ముళికదేశము సాతవాహనుల యేల్బడిలో నుండుటచేతనే వారు 'శ్రీస్థాన' పురమునకును బతులయిరి. శ్రీస్థాన మనఁగా శ్రీశైలమే. పర్వతముల పేళ్ల వరుసలో నున్నది గాన యది శ్రీశైలమే యగును. అయినను గొందఱు సందేహించుచున్నారఁట. ఏకప్రమాద మనేకప్రమాదములకుఁ గారణ మగుట నిక్కడఁ జూడఁదగును. ముళిక దేశమును గుర్తింపక పోవుటచేతనే వారు శ్రీస్థానమనఁగా శ్రీశైలమగునని నిశ్చయింపఁజాలక సందేహింప వలసిన వారయిరి. అగును. ప్రత్యంత దేశమున కేలికలు గాక యాపర్వతమునకుమాత్రము వారెట్లు పతులు గాఁగల్గుదురు? పర్వతముమీఁది కాకాశయానమున రాకపోకలు జరపుచు ప్రభుత్వమును నెఱపుకొనుచుండినట్లు తలఁపవలెనా? ఈ యసంగతియే

శ్రీస్థానము శ్రీశైలము గాకపోవచ్చు ననుసపోహమును బుట్టించి నది. మఱియు నాసికగుహాలోనే కల వాసిష్ఠీపుత్రి పులుమావి శాసనాంతరమున 'ధనకట' భిక్షులకు దానము చేసినట్లు కలదు. ఈ ధనకటమును ధనకటక (ధరణికోట) మని తలంచుటకుఁ గూడఁ గొందఱు సందేహించిరఁట ! ఇది మూఁడవ ప్రమాదము. ధనకటకమున ననేక సహస్రసంఖ్యాకు లగుబౌద్ధభిక్షుకు లుండిరని హ్యూయెన్త్సాంగు వ్రాఁతలు తెలుపుచున్నవి. అంత ప్రసిద్ధ మయిన మన ధనకటమును గూర్చి కూడ సందేహించుటకుఁ గారణము వా రంధ్రదేశమును బాలించి రన్నవిషయమును గుర్తింపక పోవుటే యగును.

బళ్లారిజిల్లా మాయిడ్కోనిలోను, హిరహడ గల్లిలోను దొరకిన పల్లవ (శివస్కందవర్మ) శాసనములలో 'సాతవాహ నిహార' మని 'సాతాహానిరట్ఠ' మని (సాతవాహనహారము, సాతవాహనరాష్ట్రము) పేళ్లున్నవి. ఆపేళ్లా శాసనములు దొరికిన స్థలములకుఁ జెందినవేయని యందఱు నంగీకరింతురు. అందొక గ్రామముపేరు 'చిల్లరేక కోడుంక.' నేఁడు తెల్గుదేశమున 'చిల్లరిగె' యింటిపేరు గలబ్రాహ్మణులున్నారు. వారు మాధ్వులు. బళ్లారిజిల్లాలో చిల్లరిగె యను గ్రామము గలదేమో! పయి శాసనములోని చిల్లరేక చిల్లరిగె కావచ్చు నని నా తలంపు. బళ్లారిమండలము సాతవాహన రాష్ట్రమయియుండఁగా సాత

వాహను లంధ్రులగుట సంగతమేకాదా ? కాని యీ శాసనములు క్రీ. తర్వాత మూఁడవ శతాబ్ధిలోనివిగాన, యప్పటికి సాతవాహను లా యల్పదేశముఁ బాలించుచున్నట్లు తలఁపవలెసందురట ! ఇది యెంతయు నసంగతము. శివస్కందవర్మ దానము చేయునప్పు డాదేశము శివస్కందవర్మపాలితమే యగును గాని సాతవాహన పాలితముగాదు. శివస్కందవర్మ యాదేశమునకుఁ బారంపర్యముగా వాడుకలో నున్నపేరిని (సాతవాహన రాష్ట్రమని) పేర్కొన్నాఁడు గాని యానామ మానాఁడే పుట్టినదికాదు. ఆనాఁటి కనేకదేశములు సాతవాహన రాజ పాలితములుగా నుండెనను సాతవాహన రాష్ట్రమని విశిష్టనామ ముండుట, బళ్లారి ప్రాంత దేశమున కా సాతవాహనుల ప్రాచీన ప్రధాన పాలిత దేశత్వమును నిరూపించుచుండుట లేదా ? ఈ శాసనములఁబట్టి సాతవాహనులు తొలుత, ముళకదేశమునో, యందలి యేకదేశముగు బళ్లారిప్రాంతమునో పాలించినట్లును, దానికే సాతవాహన రాష్ట్రమని, సాతవాహన హారమని పేరయినట్లును దలఁపవలసి యుండును. అట్లు దలఁపకుండుట నాల్గవప్రమాదము. తొలుత వారు వేంగిదేశమును బాలించుచున్న యంధ్రరాజు లగునిక్ష్వాకు రాజులకు భృత్యులయియుందురు. ఈ కారణముచేతనే కొన్ని పురాణములలో సాతవాహను లంధ్రభృత్యులని పేర్కొనఁబడి యుందురు. క్రమశః ప్రబలులై కర్ణాటదేశమెల్ల నేలియుందురు.

ఈ 'కర్ణి' రాజులపేరనే 'కర్ణినాఁడు' అని దేశనామ మేర్పడి, మార్పులుచెంది కన్నడ, కర్ణాట రూపములఁ జెందియుండ వచ్చును. మైసూరు తల్గొండ స్టేటులో స్థానకుండూర శివాలయ శిలాశాసనమున "సాతకర్ణి పూజించిన యాలయములోఁ దాను పూజచేయుచు" న్నట్లు అర్చకుఁడు వ్రాసికొన్నాఁడు. ఇట్లు వారు క్రమముగాఁ బ్రాబల్యముఁజెంది, కుంతల ఘూర్జర మహారాష్ట్రాది దేశములను జయించి, క్రొత్తగా జయించినదేశముల పరిపాలనసౌకర్యముకై గోదావరీతీరమునఁ గుంతలదేశమునఁ బ్రతిష్ఠానము కల్పించుకొనియుందురు. అట్లు ప్రతిష్ఠానముఁ బడయుటచేతనే యా రాజధానికిఁ బ్రతిష్ఠానమని పేర య్యెను. జాతక కథలు, పద్మ, కూర్మ, లింగ, భవిష్య పురాణములు, రామాయణోత్తరకాండము, కథాసరిత్సాగరము, మహాభారతము, విక్రమోర్వశీయము ప్రతిష్ఠానమును బ్రశంసించుచున్నవి. ప్రతిష్ఠాననామము సాతవాహనరాజ కల్పితమని నా నమ్మకము. ప్రతిష్ఠానమనురాజధానీ నామమే యంధ్రభృత్యులుగా నున్న వా రంధ్రులగుటను, అది క్రొత్తగా నెలకొల్పఁబడిన రాజధాని యగుటను సూచించుచున్నది. ప్రతిష్ఠానమునుండఁగా వీరు శకరాజులచేఁ గొంతతాఁకిడిం బడిరి. కొంత యుత్తర రాజ్యమును గోల్పోయిరి. అప్పుడు ధనకటకమునుగూడ వీ రుప రాజధానిగాఁ జేసికొనిరి. ఇక్ష్వాకు లప్పటికి దుర్బలులయి

యుందురు. అనేకాధ్వరకర్తలును, వైదిక మతాభిమానులును నయ్యు సాతవాహనులు, ఇక్ష్వాకులవలె వారి మతమైన బౌద్ధమతమును బరిరక్షించిరి. బౌద్ధులకు దానములం జేసిరి. వారి స్తూపములం గాపాడిరి. పెంపొందించిరి. కృష్ణా గోదావరీ నదుల నడిమి దేశమెల్ల దుదకు వారియేల్బడి క్రిందనే యుండెను. హాలసాతవాహనుఁడు సంధానించిన సాతవాహనసప్తశతిలోఁ దెలుఁగు దేశమునకుఁ జెల్లఁదగిన వర్ణనలు పెక్కులు గలవు.

గోదావరీనది సముద్రముతో సంగమించునంతదాఁకఁ గల దేశములో సాతవాహన వంశముతో సమానమయిన వంశము వేఱొకటి లేదని యొక గాథలోఁ గలదు. బ్రహ్మశ్రీ మా. రామకృష్ణకవిగారు సంపాదించిన లీలావతీకథలో హాలునకు సప్తగోదావరతీరమున భీమేశ్వరమునఁ బెండ్లి జరగినట్లు కలదు. అమరావతీ స్తూపమున గౌతమీ పుత్త్రశాతకర్ణి శాసనమున్నది. కృష్ణాముఖద్వారమున యజ్ఞశ్రీ శాతకర్ణి పదునెన్మిదవ పాలన వత్సరమున వేయింపఁబడిన బౌద్ధదాత శాసనము దొరకినది. అంధ్రవల్లభుఁడని, యంధ్రనాయకుఁడని, అంధ్రవిష్ణువని, శ్రీవల్లభుడని, సిరికాకొల్ని నాథుఁడని వర్ణితుఁ డగుశ్రీకాకుళాంధ్రనాయక స్వామి యంధ్రు లగుసాతవాహనులలో నొక్కనిపేర వెలసిన దైవమై యుండవచ్చునని నాతలంపు. సిరికకొలను అని యా

గ్రామనామపుఁ దొలిరూపము. కొలనే వైష్ణవమువచ్చి దివ్య స్థలమై 'కోళ' మయినది. అక్కడ గొప్ప చెఱువుండినట్లు స్థలమాహాత్మ్యమునను గలదు. 'సిరిక' పదము 'శ్రీముఖ' పదమునకు తెలుఁగు వికృతి కాఁదగును. మఱియు, వాసిష్ఠీ పుత్రిపులుమావి నాసిక శాసనమున సాతవాహనులు బ్రాహ్మణులని ప్రస్తుతులయిరి. శ్రీకాకుళ స్థలమాహాత్మ్యమునఁ గూడ, నా యంధ్రనాయకస్వామి నాగదేవ భట్టారకు నింటఁబుట్టిన బ్రాహ్మణుఁడని కలదు. అక్కడ నాస్వామి బ్రాహ్మణకన్యను వివాహమాడెనఁట! ఈకథ శ్రీముఖ శాతకర్ణిది కాఁదగును. ఆంధ్రరాజులు తెలివాహ నదీతీరమున నుండినట్లు బౌద్ధ జాతక కథలలోఁ గలదఁట! లీలావతీకథ, హాలుని నాటికి గోదావరి సప్త శాఖలు గలదని తెలుపుచున్నది. జాతకకథలలోఁ బేర్కొనఁ బడిన తెలివాహనది గోదావరీ సప్తశాఖలలో నొక్కటియగు తుల్యభాగ యగు నేమో యని నాయూహము.

సంస్కృత, దేశి, భాషాకృతులలోఁ బెక్కింట నంధ్ర స్త్రీల కుచసౌభాగ్య మసాధారణమైనదిగా వర్ణితమయ్యెను. ఆవ ర్ణన మన్వర్థమయినదని యమరావతీ స్తూపశిల్పములు ప్రతిపాదించుచున్నవి. ఆస్తూపనిర్మాణకాలమున నంధ్రస్త్రీలకుఁ గుచాచ్ఛాదనము లేకుండుటనుగూడ నమరావత్యాది స్తూపరూపములు

నిరూపించుచున్నవి. అవికలు లేని యంధ్రస్త్రీలు ప్రతిష్ఠానమున కేఁగినపిదప నతినిగూఢకుచ లగుఘూర్జర మాహారాష్ట్రస్త్రీల సంగతిచేఁ గ్రొత్తనాగరకత బలసి అవికలను పైఁటలను నుంచుకొనసాగిరి. పైఁట పదము ప్రతిష్ఠాన పదభవమే. ప్రతిష్ఠానమున నుండే యలవడినది గాన కుచాచ్ఛాదనమునకు నానగరముపేరే తజ్జ్ఞాపకముగా బేరయ్యెను. అవికలకుఁగూడఁ బైఠిణీ అవికలనియే పేరు. పైఠిణీ పదముగూడఁ బ్రతిష్ఠానపద భవమే. సంస్కృతమున 'కంచుక' మను పద మున్నను, నది స్త్రీపురుష సామాన్యమయిన 'అంగరకా' కు పేరుగా నున్నది. సాతవాహన సప్తశతిలో నది ఘూర్జరాంగనలు వేసికొను మేలిముసుఁగు (ముఖమునకుఁ గూడ నుండును) పర్యాయముగాఁ గలదు. అంధ్ర, ద్రవిడ, కర్ణాట, మళయాళస్త్రీ లానాఁడు అవికలు లేని వారే. ప్రతిష్ఠాన సంగతిచే నంధ్ర కర్ణాటాంగనలు పైఁటలను అవికలను దాల్చిరిగాని యదిలేని ద్రవిడ మళయాళస్త్రీలు, నేఁటికిని వానిని దాల్పని వారుగానే యున్నారు. పురుషులు వోలె స్త్రీలును, (నేఁడును మళయాళమున నున్నట్లు) కొన్ని సమయములందు ఉత్తరీయమును దాల్చుటే కాని, అవికలఁ దాల్చుట మాకాలమున దక్షిణభారతదేశమున లేదు. ప్రతిష్ఠాన సంబంధము సాతవాహనుల తర్వాత నంధ్రదేశమునకు లేదు. సాతవాహనులతర్వాతఁ బ్రతిష్ఠాననగరము పాడుపడి పల్లెటూరయినది.

పైఠణీ రవికలును పైఁటలును బ్రతిష్ఠానము రాజధానిగా నొప్పుచున్నప్పుడే వెలయుట సంగతము. నాఁటి ప్రతిష్ఠానము, కృష్ణా గోదావరీ నదీసాగర సంగముదాఁకఁ గల యంధ్రదేశముతోఁ బ్రబలసంబంధము గలదనుటను 'పైఁట, పైఠణీరవిక' పదములు నిరూపించుచున్నవి. శాసనములం దేనాఁడు సాతవాహనులు రాజ్యమేలినట్టుగా గలదో యానాఁడే యంధ్రదేశము (ముళక) నేలినట్లును గలదు. వారాంధ్రులని పురాణములు చెప్పుచున్నవి. నేఁటి యాంధ్రదేశమునకే తక్క నితర దేశములకు నేనికిని నంధ్రనామ మేనాఁడును గానరాదు. సాతవాహనులంధ్రదేశముతోపాటుగా నితరదేశములనుగూడ జయించి పాలించుట వారి యంధ్రతకు రంజకము కాఁదగును గాని భంజకము గాఁగూడదు. తొలుదొలుతటి వారిరాజ్యము ముళకదేశములోని సాత్రాహాని రట్ఠమగును. సాతవాహనుల యంధ్రత యిన్నివిధములఁ బ్రవ్యక్తమగుచుండఁగా, వా రంధ్రులుగారనియు నంధ్రదేశమును బాలింపలేదనియుఁ జేయు వాదములకు విలువ నిలువఁ గలదా? విష్ణుపురాణమున వర్ణితు లగుముండకులే ముళకు లగుదురని ఇంద్రాజిపండితులు వ్రాసిరట! ఇది సంగతముగావచ్చును. ఇక్ష్వాకులనుగూర్చి నేను వ్రాసిన వ్యాసమున* ఆంధ్రులకు

* ప్రభవపుష్య భారతీ సంచిక చూచునది.

ముండియులని ధర్మామృత గ్రంథ కథలోఁ జేరున్నట్లు తెలిపితిని. 'ముండక' 'ముండియ' శబ్దము లేకార్థవాచకములు గావచ్చును. ధర్మామృతకథలోఁ జేర్కొనఁబడిన ముండియులే విష్ణుపురాణాదులలోఁ జేర్కొనఁబడిన ముండకులు గాఁదగుదురు.

పురాణములలోని కలియుగ రాజవంశానుచరితమును గూర్చి పర్జిటర్ పండితులు వ్రాసిన గ్రంథము మిక్కిలి విలువ గలదే. కాని దక్షిణహిందూదేశపు వ్రాఁత ప్రతులలోని పాఠములకును వారు ప్రకటించిన పాఠములకును భేదములు పెక్కులున్నవి. వానినెల్ల మరలఁ బరిశోధించి, దక్షిణ హిందూదేశ పోలిఖగ్రంథ పాఠభేదములను వేఱుగా నేను వెల్లడింపఁ జూచుచున్నాఁడను. పయిని జేర్కొనఁబడిన సాధనములు సాతవాహనులయాంధ్రత నాక్షేపింపరాకుండ నిలుపఁగలవని నానమ్మకము. హాలుని చరిత్రమే యనఁదగిన లీలావతీ కథలో సిద్ధనాగార్జునుఁడు హాలుని మంత్రియని కలదు. *సిద్ధనాగార్జునుఁ డాంధ్రుఁడగుట నాతనిపేర వెలసియున్న శ్రీశైలపాదమగు సిద్ధనాగార్జునుని కొండయు, నక్కడి స్తూపములును నిరూపించుచున్నవి. అతని నేలిన రాజు గూడ నాంధ్రుఁడగుట సంగతముగాదా? మఱియు సాతవాహనుల యాంధ్రతకు సాధకములయిన విషయములు సాతవాహన సప్తశతిలోఁ జాలఁగలవు. వానిని వేఱొక చోట వెల్లడింతును.

---

* రామకృష్ణకవిగారి పుష్పాంజలి. భారతి మాచునది.

*

# ౨

## శివకవులు

వీరశైవులు నాస్తికులనంబడు జైనబౌద్ధమతముల వారినే కాక శ్రౌతస్మార్త కర్మములాచరించు వైదికమతముల వారిని గూడ గర్హించిరి. వారు వీరవ్రతులు. భవులతో దర్శనస్పర్శన సంభాషణాది సాంగిత్యము వారికి దగదు (భవులనగా శైవేతరులు). శైవులలోఁ గవీశ్వరులగువారు శివునిమీదను దద్భక్తులమీదను దక్క నితరులగు భవులమీద నెప్పుడును గృతులు చెప్పినవారు కారు. కావున వారికి శివకవులని పేరు కల్గెను. కన్నడాంధ్ర గ్రంథములలో శివకవుల ప్రశంస పెక్కుచోట్లఁ గలదు శివకవులు భవికవులను గర్హించిరి. కవితలోఁగూడ శివకవులు వేఱుమతము వారైరి.

### శివకవులగ్రంథములు

మల్లికార్జున పండితారాధ్యుని శివతత్వసారమును, పాల్కురికి సోమనాథుని బసవపురాణాది గ్రంథములును, నన్నిచోడని కుమారసంభవమును నిప్పుడు మన కుపలబ్ధము లయిన శివకవులగ్రంథములలోఁ బ్రాచీనములు. మల్లికార్జున పండితుని

కృతులు మఱికొన్ని దొరకవలసియున్నవి. మల్లికార్జున పండితునికంటెఁ బూర్వుఁడు శ్రీపతిపండితుఁ డనువాఁడు గలఁడు! ఆయన బెజవాడలో నున్నవాఁడు. ఆయన తెనుగుకృతు లేవేని రచించెనేమో యెఱుఁగరాదు. పండితారాధ్యచరిత్రలో నీక్రింది గ్రంథములు పేర్కొనఁబడినవి.

" అంచితబాణగద్యా క్షురగద్య
పంచగద్యాదులు పటుగణాడంబ
రంబు వర్ణాడంబరంబు వ్యాసాష్ట
కంబును శ్రీనీలకంఠస్తవంబు
శ్రీరుద్రకవచంబు శారభంబునుమ
యూరస్తవము హలాయుధ మనామయము
మలహణమును మహిమం బనుస్తవము
మలయరాజీయంబు మానిదండకము
స్తుతిమూలమగు మహాస్తోత్ర సూత్రములు
శతకంబు శివతత్త్వసారంబు దీప
కళిక మహానాటకము నుదాహరణ
ములు రుద్రమహిమయు ముక్తకావళులు
గీతసూక్తములు భృంగిస్తవంబులు పు
రాతనముని ముఖ్యరచితాష్టకములు
సారలీల — "

శివతత్త్వసారము తెలుఁగుకృతిగాన పైవానిలో నింక నొకటి రెండేవయినఁ దెలుఁగుకృతులయి యుండవచ్చునేమో కాని తక్కినవన్నియు సంస్కృత గ్రంథములే. సోమనాథుఁ డింకను దుమ్మెదపదములు, ఆనందపదములు, నివాళిపదములు, వడ నాయకగీతములు, మొదలగు పదకృతులను తెలుఁగువానిని పేర్కొన్నాడు. దీనిని బట్టి చూడగా నా శివకవుల తెలుగుకృతులు పద్యరచనముగలవి మల్లికార్జునపండితారాధ్యునికంటెఁ బూర్వ కాలమున లేవేమో యని సంశయము కలుగుచున్నది. ఉన్నచో సోమనాథుడు పేర్కొనియుండును గదా! సోమనాథునికంటె నర్వాచీనులగు శివకవుల కృతులనేకము లున్నవి. శివకవుల రచనా రీతులను పరిశోధింపఁగా వీరిగ్రంథములకును, నన్నయ తిక్కనాదులగు (భవి) కవుల గ్రంథములకును పెక్కు భేదములు గానవచ్చుచున్నవి. ఈవిషయ మించుక వివరించి తెల్పెదను.

## రచనాభేదములు

ఛందస్సు:— ద్విపదరచనలో శివకవుల విధము వేఱు. తాళ్లపాక తిరువేంగళనాథుఁడు ద్విపదలక్షణము నిట్లు నిర్వచించినాడు.

" వాసవుల్ మువ్వురు వనజాప్తు డొకఁడు
భాసిల్లనది యొక్క పదము శ్రీకాంత

క్రమమున నవినాల్గు గణములనడుమఁ
గ్రమదూరముగఁ బ్రయోగము సేయరాదు
ఆపాదమునకు మూఁడవగణంబాది
దీపించుయతి యంబుధిప్రియతనయ
యుపమింపనవి ప్రాసయుతములై రెండు
ద్విపదనా విలసిల్లె వికచాబ్జపాణి
ద్విపదకుఁ ద్విపదకుఁ దెగఁ జెప్పవలయు
నెప్పుడు సంస్కృతమున నితరభాషలను
యతులలోపలఁ బ్రాసయతి దక్క సకల
యతులుఁ జెల్లును బ్రయోగానుసారమున
ద్విపదతో ద్విపద సంధిల నేకశబ్ద
మెపుడు ప్రయోగింప నది యయుక్తంబు
మఱియు సంస్కృతపు సమాసరూపమున
నెఱయ నెన్నిటిసైన నిర్మింపఁదగును
.....................
అను లక్షణమ్ముల ననువొంది సుకవి
జన సుప్రయోగైక శరణమై—"

అష్టమహిషీకళ్యాణము.

రంగనాథుని రామాయణము, గౌరనహరిశ్చంద్రచరిత్ర మొదలగు ద్విపదలందుఁ గాన వచ్చు విధమునే యీ లక్షణము చెప్పుచున్నది. శివకవుల ద్విపదరచన మిందులకు విరుద్ధముగా

నున్నది. రంగనాథ రామాయణాదులందుఁ గానరాని (ప్రాస యతి బసవపురాణము మొదలగు శివకవుల గ్రంథములందున్నది. మఱియు, ద్విపదయు ద్విపదయుఁ గలయునప్పు డొక్కపదమే యిటుకొంత యటుకొంత యగునట్లు రంగనాథాదు లెక్కడను గూర్పరయిరి. పాల్కురికి సోమనాథాదులగు శివకవులు పద మధ్యమందే ద్విపదము ముగియునట్లు పెక్కుచోట్ల రచనము నెఱపిరి సోమనాథుఁడు" జాతులు మాత్రానుసంధానగణవి, నీతులు గాన' యనియు 'తగణైర, నియును ' బ్రాసోవా ' యనియు 'యతిర్వా'య, నియుఁ జెప్పు ఛందో వినిహితోక్తగాన, ప్రాసమైనను యతిపై వడియైన, దేసిగానిలిపి యాదిప్రాసని యతి, తప్పకుండఁగ ద్విపదలు రచియింతు " నని మాత్రాగణ ఘటిత మగుటచే ద్విపదలో ప్రాసయతి చెల్లుననుటను సంస్కృత సూత్రములను గూడ నుదహరించి చెప్పినాడు. ( ద్విపదము ప్రాసయతి గలిగి యుండుటయు, రెండేసిచరణములకుఁ దును కలుగాక ద్విపదమునుండ ద్విపదమునకు దూఁకునట్లు పదమధ్య సంధిగలిగి జడవాఱి యుండుటయు శివకవుల కృతులలోనే కానవచ్చును. )

మఱియు నన్నయాదుల కృతులలోఁ బ్రాసములందు హ్రాస్వమ్యము దప్పక కానవచ్చును. అనఁగా మొదటిచరణము

ద్వితీయాక్షరమున నెన్నిహల్లులు సంయుక్తములుగా నున్నవో యన్ని సంయుక్త హల్లులును, దక్కిన మూఁడు చరణములందును గూడఁ బ్రాసస్థానమున నుండుఁ. శివకవులీ నియమము నంతగాఁ బాటింపరైరి. కతిపయ హల్సామ్యమున్నఁ జాలునని వీరు తలంచిరి. ఒక్క హల్లు హెచ్చుతక్కువో యయినను బ్రాసమును వీరు పరిగ్రహించిరి.

క॥ నమ్మిన భక్తుఁడు గన్నడ
బమ్మయ సద్భక్తిమహిమ పరికింపఁగ లో
కమ్ములఁ జోద్యము గాదె యు
ధర్మ్మంబును ధర్మమయ్యెఁ దత్త్వాతీతా! —శివతత్త్వసారము.

ప్రాఁత వ్రాఁతలలో "ధర్మ్మ" యని యుండును.

"మర్త్యలోకమునకు మఱివేఱె యొకఁడు,
కర్తయున్నాఁడె లోకత్రయవరద,—
తత్త్రిపురాంతక స్థానవాస్తవ్యుఁ
డై త్రిపురాంతకుఁ డభినుతి బేర్చె.— బసవపురాణము.

ఇత్యాదులు పెక్కులున్నవి.

మఱియు, నన్నయాది కవీశ్వరులు ప్రాసములం దెక్కడను బూర్ణబిందువును నర్ధబిందువును బొందింపరయిరి. శివకవుల గ్రంథములలో నది కానవచ్చుచున్నది.

క॥ పోఁడిగ నగజతపశ్శిఖి
మూఁడు జగమ్ములను దీవ్రముగఁ బర్విన్ బ్ర

హేమాండము గాఁగిన కాంచన
భాండము క్రియఁదాల్చెఁ దత్ప్రభాభాసితమై. —కుమారసంభవము.

పాండురాంగంబైన పడఁతిగర్భమునఁ
బోఁడిగా వెలుఁగుచుఁ బుత్త్రుఁడీ క్రియును. —బసవపురాణము

ఇత్యాదులు పెక్కులున్నవి.

ఇట్టి ఛందోలక్షణ విశేషములుగాక, శబ్దప్రయోగము లందునుగూడ శివకవులకు నితరకవులకుఁ బెక్కుభేదము లున్నవి.

## శబ్దప్రయోగములు

తెలుఁగువోలె, నడువువోలె, — ఇట్టిప్రయోగములు శివకవుల గ్రంథములందే నాకుఁగానవచ్చినవి.

"తెలుపుదాఁ దీర్చిచూపెడు తెలుఁగువోలె—
బలసికోలువున్న సురగిరి భంగివోలె—
నందనవనముగాపు వచ్చు వసువువోలె—
పాలకడలిలో నిల్చిన భంగివోలె—" —కుమారసంభవము.

"వచ్చువహిత్రంబు నడువునుబోలె—
కరమర్థినందిచ్చు కరణియుఁబోలె—" —బసవపురాణము.

పూంచు, పూన్చు,—ఈధాతువు నన్నయాది కవీశ్వరుల గ్రంథములందుఁ బెక్కుచోట్లఁ బ్రయోగింపఁబడియున్నది. అది పూను ధాతువు ప్రేరణరూపము. పూనఁజేయుట దాని యర్థము. 'అరదము పూంచి' ఇత్యాది ప్రయోగములున్నవి. శివకవుల

గ్రంథములందెల్ల నీధాతు వింకొక యర్థమునఁ బ్రఖ్యాతముగాఁ గానవచ్చుచున్నది. పూన్చు=పూజించు. ఈధాతువు నీయర్థమున నన్నయాదులు ప్రయోగించినట్లు కానరాదు.

క॥ కన్ను వడిఁబుచ్చి పూన్చిన
వెన్నుని భక్తికి వరంబు విదఁజల్లుక్రియన్.

క॥ మొఱటద వంకరగా దనతల
లతిమెల్లడఁ దఱిగి నీపదాంబుజములఁ గ్ర
చ్చఱఁ బూన్చిమగుడఁ బడయుఁడె.

క॥ ఉన్నతభక్తిశిరంబుల
బన్నగ శివుఁబూన్చి కరుణఁబడసిన భంగిన్
మున్నే విధులం గొలిచియుఁ
జన్నదశాననుఁడు వడయఁ జాలెనె చెప్రమా. —శివతత్త్వసారము.

ఉ॥ హరి వికచామలాంబుజ సహస్రము పూన్చి- —కుమారసంభవము.

—ద్విపదాంబు రుహములధృతిఁ బసవేశు
ద్విపదాంబురుహము లతిప్రీతిఁ బూన్తు
ఈపద్మములఁ గాక యింతియాకుంతి
పాపారిఁ బూజించి బడసెఁ బాండవుల
చెండి యీపద్మముల్ శివుఁబూన్చి కాదె
సుందరి భృగుపత్ని శుక్రునిఁ బడసె
అదిగాక యీపూల హరుఁబూన్చి కాదె
సుదతి కౌసల్య సత్పుత్రు రాముఁబడసె. —పండితారాధ్యచరిత్ర.

పూజించుట యందుఁ బూన్చు ప్రయోగము శివకవుల గ్రంథములలోఁ బెక్కు చోట్లఁ గలదు.

మఱియు సమూహి, దాసి (దాసుఁడనుటకు) ముల్లోకనాథుఁడు, పుడమీశ్వరుఁడు, సర్వాంగకచ్ఛడము, దీపగంభములు, తపనిధి, మొదలగు ప్రయోగములెన్నో శివకవులు తఱచుగాఁ బ్రయోగించినవి కలవు. ఇట్టి పదములు కొన్ని యితరకవుల కృతులలోఁ గూడఁ గ్వాచిత్కముగాఁ గాన వచ్చును గాని శివకవులే వీనిని తఱచుగాఁ బ్రయోగించిరి. ఇటీవలి లాక్షణికులు కరకంఠుఁడు, ప్రాణగొడ్డము, దినవెచ్చము మొదలగు పదములను గొన్నింటిని మాత్రము త్రోసిపుచ్చఁజాలక యనింద్యగ్రామ్యములని పేరుపెట్టి ప్రయోగార్హములనిరి. శివకవుల కృతులలో లాక్షణికు లనుగ్రహింపనివి యిట్టివి నుప్పతెప్పలుగానున్నవి. మఱియు నిప్పటివ్యాకరణమును దలక్రిందులొనర్చు ప్రయోగములనేకములున్నవి. మఱియు నపూర్వశబ్దములు శబ్దరత్నాకరమందుఁ గానరానివి యనేకములున్నవి. శివకవుల కృతులలోని వింతప్రయోగములను నేనొకచోట వివరించి తెల్పుదును.

## ఇతరకవులు వీరిని గర్హించిరి.

ఇట్టి రచనావిధానము లితరాంధ్రకవులకు సమ్మతములు గావయ్యెను. వారుపాటించిన ఛందోనియమములను భాషా

నియమములను వీరు సరకుసేయక కొంతసడలింపఁజాగిరి. పాల్కు-
రికిసోమనాథుని కాలముననే దీనిఁగూర్చి యోరుఁగంటిలోఁ దగవు
నడచినది.

సీ॥ ఒకనాఁడు శివభక్తులోరుగంటను స్వయం
భూదేవుమంటపంబున వసించి
బసవపురాణంబు పఠించి వినువేళ
హరునిఁగొల్వఁ బ్రతాపుఁ డచటికేఁగి
యీసంభ్రమం బేమి యనుడు భక్తులు బస
వనిపురాణం బర్థి వినెద రనిన
విన నాపురాణంబు విధ మెట్లొకో యన్న
ధూర్తవిప్రుఁ డొకండు భర్తఁజేరి

గీ॥ పాలకుర్కి సోమపతితుఁ డీనడుమను
బెనచె మధ్య (ప్రాస ? )వళ్లు పెట్టిద్విపద
నప్రమాణమిది యనాద్యంబు పటమన్న
నరిగెరాజు___"

తర్వాత సోమనాథుఁ డోరుఁగంటికి వచ్చి యద్భుత
చర్యలచే స్వరచనమును సమర్థించుకొన్నట్లు పద్యబసవ
పురాణమందున్నది. ఈకారణముచేతనే యీశివకవులకావ్య
ములనుండి ప్రాచీనలాక్షణికులు ప్రయోగముల నంతగాఁ గయి
కొనరయిరి. గ్రంథారంభమున దుష్టగ్ణ ప్రయోగముచేసి
యుద్ధములోఁ జచ్చెనని నన్నిచోడని నథర్వణుఁ డాక్షేపించెను.

* క॥ మగణమ్ము గదియ గగణము
వగవక కృతి మొదట నిలుపువానికి మగణం
బగు నిక్క మంద్రుమడియుఁ డె
యగునని యిడి తొల్లి వెంకణాదిత్యుఁడనిన్.

బమ్మెరపోతరాజుగారి గ్రంథములనుగూడ లాక్షణికులు కైకొనమికిది కారణముగావచ్చును. ఆయన వీరభద్ర విజయ రచనమును శివకవి సంప్రదాయము ననుసరించియేయున్నది. (వీరభద్రవిజయమును భాగవతకర్త యగుపోతరాజుగారు రచించినది కావచ్చుననీ నాతలపు.)

ఒక శివకవి యిట్లు చెప్పుచున్నాడు:—

ఇలఁబాలకురికి సోమేశుండు మున్ను
తొలఁగక ప్రాసయతుల్ ద్విపదలను
లలి రచించుట యది లక్ష్యంబుగాను
అలమి రేఫ రకారములు శివకావ్య
ములయందుఁ జెల్లుఁ దప్పులుగావు, గాన
ఆపాల్కురికిసోము ననుమతి నేను
దీపితప్రాస యతిచ్ఛద సరణి
వామహోగురుదేవు ననుమతియట్లు
శ్రీ మెఱయంగ రచించితినిట్లు:— —మతి బసవపురాణము.

* ఈపద్యమును శ్రీరామకృష్ణకవిగారు, కుమారసంభవ పీఠికలో నుదాహరించిరి.

ఇతరకవులు గ్రహించినను దర్వాతి శివకవులు సోమనాథాదుల మార్గమును వెన్నాడిరి. ఇప్పటికి రెండువందల యేండ్లకు ముందున్న కవులు, అత్తలూరి పాపకవి మొదలగువారుకూడ నా సంప్రదాయమునే పాటించిరి. పాల్కురికి సోమనాథుని గ్రంథములలో నితరకవులకు విరుద్ధములయిన ప్రయోగము లేవికలవో యవి పాపకవి మొదలగువారి గ్రంథములలోఁ గూడనున్నవి. మఱియుఁ బాల్కురికి సోమనాథుఁడు చూపిన త్రోవయగుటచేఁ గాఁబోలును శివకవులనేకులు ద్విపదకృతులను రచియించిరి.

## వీరు తెనుఁగునే ప్రేమించిరి

ద్రవిడదేశమున శైవులును వైష్ణవులును సంస్కృతభాషకంటెఁ దమ తమిళభాషనే పూజ్యమయిన మతభాషగాఁ జేసికొన్నట్లుగా నీ తెనుఁగుదేశమునఁగూడ వీరశైవులు తెలుఁగుభాషనే మతభాషగాఁ జేసికొనఁదలంచిరి. మల్లికార్జున పండితారాధ్యుఁడు శాస్త్రార్థములతోఁ గూడిన మతగ్రంథమును శివతత్త్వసారమును దెనుఁగుననే రచియించెను. పాల్కురికి సోమనాథుఁడు కూడఁ దానుగ్రొత్తగా వెలయించిన బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, చతుర్వేదసారము మొదలగు గ్రంథములను దెనుఁగుననే రచియించెను. వీరు సంస్కృతమునఁ

గూడ గొప్పవిద్వాంసులే. బసవపురాణమును, పండితారాధ్య చరిత్రమును సోమనాథుఁడు తెనుఁగుననే రచియింపఁగాఁ దర్వాతి వారు వానిని గర్ణాటమునకును, సంస్కృతమునకును బరివర్తించు కొనిరి. బసవపురాణ పండితారాధ్య చరిత్రాది గ్రంథములను శైవులు భారత రామాయణాదులవలెఁ బవిత్ర గ్రంథములుగాఁ బూజించుచుందురు. ఇది తెనుఁగున కొక గొప్పగౌరవము. తన గ్రంథములు సర్వ సామాన్యములుగా నుండవలె ననియు, నట్లుండుటకుఁ దెనుఁగు ద్విపదమే తగినదనియు, గద్య పద్యాది పూరితమయిన సంస్కృత ప్రాయరచన సర్వసామాన్యముకా దనియు సోమనాథుఁడు చెప్పినాఁడు.

> "తప్పకుండఁగ ద్విపదలు రచియింతు
> నొప్పదు ద్విపద కావ్యోక్తినావలదు
> ఆరూఢగద్య పద్యాది ప్రబంధ
> పూరితసంస్కృత భూయిష్ఠరచన
> మాను గా సర్వ సామాన్యంబుగామి
> జానుదెనుఁగు విశేషము ప్రసన్నతకు. —పండితారాధ్య చరిత్రము

మఱియు:—

> ఉరుతర గద్యపద్యోక్తులకంటె
> సరసమై పరఁగిన జానుదెనుంగు
> చర్చింపఁగా సర్వ సామాన్యమగుటఁ

గూర్చెద ద్విపదలు కోర్కిఁ దైవాఱఁ
దెలుఁగుమాట లనంగవలదు వేదముల
కొలఁదియ కాఁజూడుఁ డిల నెట్టులనిన— —బసవపురాణము

తెలుగు మాటలుగదాయని తేలఁదలఁపవలదు. వేదములవలెఁ జూడుఁ డని చెప్పినాడు!

## జాను దెనుఁగు

మఱియు జాను దెనుఁగు మిక్కిలి ప్రసన్నమయిన దనియు, సర్వసామాన్యమయిన దనియుఁ జెప్పినాఁడు. నన్నెచోడఁడు కూడ నీ జాను దెనుఁగును ప్రశంసించినాఁడు.

చ॥ బలుపొడతోలు సీరయును పాపసరుల్ గిలుపారుకన్ను వె
న్నెలతల సేఁదు కుత్తుకయు నిండిన వేలుపుటేఱు వల్గుపూ
సలుగల ఱేనిలెంక యని జానుఁ దెనుంగున విన్నవించెదన్
వలపుమదిన్ దలిర్ప బసవా! బసవా! బసవా! వృషాధిపా!

—వృషాధిప శతకము.

చ॥ సరళముగాఁగ భావములు జానుదెనుంగున నింపు పెంపుతో—

—కుమారసంభవము.

ఆకాలమున నీ జాను దెనుఁగు మిక్కిలి ప్రసన్నమై సర్వసామాన్యమై యుండెను. తర్వాతి మన కవీశ్వరులు సంస్కృతప్రాయమైన రచనను దెనుఁగున జొప్పించి జాను దెనుఁగును సన్న

గిలఁజేసిరి. ఇటీవలఁ దెనుఁగు రచనలలో రుచ్యములయిన తెలుఁగు పలుకుబళ్లు మిక్కిలి తక్కువ కాఁజొచ్చెను. పాల్కురికి సోమనాథుని గ్రంథములలోను, నన్నిచోడని కుమారసంభవము లోను మనకిప్పుడర్థముకాని తెలుగు పలుకు లనేకములున్నవి. సంస్కృతి ప్రాయమగు రచనకు మనమలవడుటయే దీనికి గారణము.

ఆంధ్రకవిత శివకవులమూలమున గొప్పయభ్యుదయము గాంచిన దన్నవాస్తవ విషయము వారి గ్రంథముల జాగ్రత్తగ చదివినప్పుడే మనకు వ్యక్తముకాఁగలదు.

3

# పండితారాధ్య చరిత్రము

## శ్రీమల్లికార్జున పండితారాధ్యుని

## జన్మాదిక వృత్తాంతములు-గ్రంథరచనా విశేషములు

శ్రీమల్లికార్జున పండితారాధ్యుఁడు ఆంధ్రశైవాచార్యులలో పండితత్రయ మని యెన్నికగన్న శ్రీపతి, మంచెన, మల్లికార్జున పండితులలో మూఁడవవాఁడు.

### జన్మాదికము

గోదావరి మండలమందలి దాక్షారామ మీాయన జన్మస్థలము. ఆయూర నెలసియుండు భీమేశ్వరస్వామివారి కీతని వంశమువారు పూజారులు. పురోహితులని సోమనాథుఁడు చెప్పినాఁడు. అర్చకులు, ఒండె స్థానపతులు కాఁదగుదురు. శివతత్త్వసారమును బట్టిచూడఁగా నర్చకులే యగుదురని తోఁచును. ఆనాఁడు కర్ణాటాంధ్రదేశములందుఁ బేరెన్నికగన్న వాణసవంశమున నీతఁడు జన్మించెను. చాళుక్యరాజులకు మంత్రులు, ఆస్థానకవులు నయి వన్నెకెక్కినవారు వాణసవంశము వారు. శాసనములలోఁ బలుచోట్ల తద్వంశ్యప్రశంస యుండును.

ఆంధ్రభారతకర్తయగు నన్నయభట్టారకుని సహాధ్యాయుఁడు నారాయణభట్టు వాణసవంశమువాఁడు. మడికిసింగన పాద్మోత్తరఖండకర్తృతికిఁ బతి కెందనామాత్యుఁడు వాణసవంశమువాఁడు.

తే॥ కశ్యపబ్రహ్మ యన జగత్కర్త పుట్టె
నతని తనువున నుదయించె నఖిలజగము
నతనిగోత్రజులందుఁ బెం పతిశయింప
వాణసాన్వయం బొప్పారె వసుధ నీతఁడు.

అని మడికిసింగన చెప్పినాఁడు. పండితారాధ్యుని చరిత్రము రచించిన సోమనాథుఁడు వాకొనలేదుగాని, వాణసవంశ్యులు కాశ్యపగోత్రులు గాన నారాధ్యదేవరకూడఁ గాశ్యపగోత్రుఁడే యనవలెను. 'చతుర్మతనిర్ణయ' మని యిటీవల ఓరుగంట ముద్రితమయిన యొక చిన్నిపుస్తకమున నాతఁడు గౌతమగోత్రజుఁ డని కలదు. గౌరాంబా, భీమనపండితు లీతని తలిదండ్రులు. భీమనపండితుఁడు తాను శ్రీశైలమునఁ బంచాక్షరీమంత్రము జపముచేసి పడసిన సంతానముగాన, యీపుత్రునికి మల్లికార్జునుఁడని పేరుపెట్టెను. దాక్షారామముచేరువనే కోటిపల్లిలో నున్న యారాధ్యదేవరదగ్గఱ నీతఁడు శైవమంత్రదీక్షఁ బడసినాఁడు. పండ్రెండవశతాబ్దియుత్తరార్ధమున, 1150 నుండి 1180 దాఁక నీమహనీయుఁ డాంధ్రదేశమునఁ బ్రఖ్యాతుఁడై యుండెను. గుంటూరు మండలమందలి ధనదుపురమున (నేఁటి

చందవోలు) వెలనాటి చోడని యాస్థానమునఁ నీతఁడు బౌద్ధా చార్యులతో మతవివాదము నెఱపెను.

## బౌద్ధాచార్యులపై కక్ష

శ్రీ కాకుళక్షేత్రమునఁ * గల మల్లేశ్వరాలయమునఁ (ఈయాలయము నేఁడును శ్రీకాకుళమునఁ గలదు) గల 'దీని యకంబమును' (దీపములు వెలిఁగించు లోహ స్తంభమును) బౌద్ధాచార్యులు పెల్లగించి కొనివచ్చి వెలనాటిచోడని వివాద సభలో నిలిపిరఁట. మల్లికార్జున పండితారాధ్యునితో

---

* శ్రీకాకుళక్షేత్రమును గూర్చి యింతకుముందు నేను గొన్నివ్యాసములు వ్రాసితిని. శ్రీముఖశాతకర్ణి పేరఁగాని, 'సిరిక' యున్నబౌద్ధోపాసిక పేరఁగాని ఆయూరు వెలసియుండవచ్చును. సిరిక-పేరు బౌద్ధప్రాకృత శాసనములలోఁ గానవగును. కాఖండి, కాకతేయ, కాకాంది- కావూరు, కావలి-పేళ్లు బౌద్ధశాసనములలోని "సిరిక" పేర వెలసియుండ వచ్చుననుట సంగతతరము. కాకతీయులు కూడ ఈపేర వెలసినవారేయని నాతలంపు. బౌద్ధశాసనములలోని కాకతేయులే యిటీవల కాకతీయులయి యుందురు. సిరిక పేర కొలనితో వెలసిన యూరుగాన 'సిరికాకొలను, శ్రీకాకొలను, కాకొలను' అను పేళ్లు పుట్టి, క్రమముగా వైష్ణవము ప్రబలినతర్వాత కొలను 'కోళమ్' అయి శ్రీకాకోళము, కాకోళము, కాకుళము రూపములు పుట్టినవి. ఈ శ్రీకాకుళము తర్వాత ఉత్తర శ్రీకాకుళము, దక్షిణ శ్రీకాకుళము గ్రామములు వెలసినట్టున్నవి. దక్షిణశ్రీకాకుళము నందివర్మపల్లవుని శాసనమునఁ గానవగును. అది యెక్కడిదో గుర్తింపవలెను.

వాదములందు శివనింద చేసిన దోషమును, దీపార్చనాసాధనమును హరించిన దోషమును సైపఁజాలక పండితారాధ్యులశిష్యులాబౌద్ధాచార్యులను జంపిరి. ఆబౌద్ధాచార్యులు ప్రతిదినము సముద్రమధ్యద్వీపమునఁగల బుద్ధ ప్రతిమను బూజింప నరుగుచుండువారఁట! ధనదుపురమునకు సమీపమునఁగల సముద్ర ద్వీపము నేఁటి దివిఖండము. అక్కడ బౌద్ధస్తూప ముండెడిది గాఁబోలును. కాదేని ధనదుపురమునకుఁ జేరువనే కల బుద్ధాము మొదలగుగ్రామములు గావచ్చును. కాని యవి సముద్ర ద్వీపస్థములుగావు. బౌద్ధాచార్యులా సముద్రద్వీపమునకు బుద్ధ పూజ జరపనేఁగినపుడే పండితారాధ్యుల శిష్యులు వారిని జంపిరి. అట్లు వారిని జంపుటకుఁ బండితారాధ్యుఁ డాశిష్యుల కనుజ్ఞ యిచ్చెనఁట. శివదూషకులను జంపుట పాపముగాదని పండితారాధ్యుఁడు శివయోగసారమునఁ జెప్పినాఁడు.

క॥ శివనిందావిషయాం బగు
నవమానము సెప్పువట్టి యప్పుస్తకముల్
అవిచారఁబునఁ గాల్చఁగ
నవుఁ జెప్పెడివానిఁ జంపనగు నీశానా!

క॥ శివనిందారతుఁ జంపిన
జవమతి తత్కారణమునఁ జచ్చిన నీశం
డువిధఁబుల నీకారు
న్యావశంబున ముక్తిఁ బొందు నరుఁ డీశానా!

## రాజుగారి ఆగ్రహము

ఈ ఘోరకార్యమునకుఁ గోపించి రాజు పండితారాధ్యుల వారికనులు దోడించెను. శివానుగ్రహమున నారాధ్యులవారికి మరలఁ గనులు వచ్చినవఁట! రాజును, దద్రాజ్యమును నాశమగు నట్లు శపించి యారాధ్యులవా రక్కడనుండి సశిష్యులై, కల్యాణ కటకమున వీరశైవ మత ప్రతిష్ఠాపనాచార్యుఁడై ప్రఖ్యాతిఁగను చున్న బసవేశ్వరుని దర్శింపఁ బయనమయిరి. బసవేశ్వరుని శివభక్తిపరాకాష్ఠకుఁ బరమాదరమును, వైదికవర్ణధర్మపరిత్యాగ మునకు నప్రీతియుఁ గలవారై యాయనతోఁ జర్చించుటకే పండి తారాధ్యులట్లు వెడలిరందురు. 'భక్తి మీఁదివలపు బ్రాహ్మ్యం బుతోఁ బొత్తు పాయలేను నేను బసవలింగ' యని బసవేశ్వరున కారాధ్యులవారు వార్త పంపిరఁట! అమరావతి, నడుగుడుములు (నేఁటి నడుగూడెము — మునగాల పరగణాలోనిది) పానగల్లు పురముల మీఁదుగాఁ గల్యాణమునకుఁ బోవుచు వనిపుర మను గ్రామమున నుండఁగా బసవేశ్వరుఁ డప్పటి కెనిమిదిదినములకు ముందు లింగైక్యమందుట పండితారాధ్యులకు తెలియవచ్చెను. పండితుఁడు చాల విలపించి యక్కడనుండి శ్రీశైలమునకు వెడలి యల్పకాలమునకే యక్కడఁ దానును లింగైక్యమందెను. ఇది పండితారాధ్యుల చరిత్రసారము. దీనిని బెంచి పెద్దచేసి

పాల్కురికిసోమనాథుఁడయిదు ప్రకరణముల ద్విపదగ్రంథముగాఁ బండితారాధ్యచరిత్రము రచియించెను. సోమనాథుని ద్విపద గ్రంథమున పండితారాధ్యుల శివతత్త్వసారము చాలఁగా ననువాదముఁబడసినది. సోమనాథుని ద్విపదపండితారాధ్యచరిత్రము ననుసరించి కవిసార్వభౌముఁడు శ్రీనాథుఁడు పద్యకావ్యముగా బండితారాధ్యచరిత్రమును శృంగారనైషధకృతిపతి యగు మామిడి సింగమంత్రి యన్నకు ప్రెగ్గడయ్యకుఁ గృతిగా రచించినాఁడఁట! అది యిప్పుడు గానరాదు.

## పండితారాధ్యుని గ్రంథములు

శివతత్త్వసారము, శతకము, రుద్రమహిమ, భీమేశ్వర గద్యము, లింగోద్భవదేవగద్యము, స్తుతిశ్లోకపంచకము, అమరేశ్వరాష్టకము, పర్వతవర్ణన అన్న గ్రంథములు పండితారాధ్య రచితములుగా సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. ఇందు భీమేశ్వర గద్యము 'యత్సంవిత్తి' అని యారంభశ్లోకము గలదిగాను, స్తుతిశ్లోకపంచకము 'తస్మైనమ శ్శ్రీగిరివల్లభాయ' అని మకుటము గలదిగాను సోమనాథుఁడే పేర్కొన్నాఁడు. పై గ్రంథములలో శివతత్త్వసారము, శతకము తెల్గుగ్రంథములు. తక్కిన వెల్ల సంస్కృతగ్రంథములే కాఁబోలును. ఇవిగాక, సంసారమాయాస్తవము, శంకరగీతము లని పదములు, ఆనందగీతము లని పదములు కూడ మల్లికార్జున పండితారాధ్యరచితము లనుకొనఁదగి

నట్లు సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. ఈగ్రంథములు గాక మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలో మల్లికార్జున పండితారాధ్య కృతి 'శ్రీముఖదర్శనగద్య' మని సంస్కృతగ్రంథమొకటి గలదు. బసవపురాణపీఠికలో దాని నేను వెల్లడించితిని. ఆరాధ్యదేవర మల్లికార్జున శతకములోనిదిగా నీక్రిందిపద్యము లక్షణగ్రంథములందుఁ గలదు.

ఉ॥ లోకములెల్ల నీతనువులోనిన, నీవట యెంత కల్గుదో
నాకపపద్మసంభవ జనార్దను లాదిగ నెల్లపెద్దలుక్
నీకొలఁ దింతయంత యననేరక మ్రొక్కెఁ గొంగి రన్నని
న్నేకగణింతు నెంతుఁ బరమేశ్వర శ్రీగిరి మల్లికార్జునా!

సోమనాథుఁడు పేర్కొన్న శతక మీశ్రీగిరి మల్లికార్జున శతకము గాఁబోలును. ఇది సమగ్రముగా దొరకవలసియున్నది. సోమనాథుఁడు తన పండితారాధ్యచరిత్రమునఁ జాలఁగాఁదన ద్విపదకృతిలోనికి మార్చుకొన్నది, ఆంధ్రకందపద్యాత్మకము, తిక్కనసోమయాజులవారి కింకను నూఱేండ్ల ప్రాఁతకాలపు దగుటచే భాషాచరిత్రాదిపరిశీలకుల కత్యంతోపకారకము, తత్కాలపు టాంధ్రదేశపు టారాధ్యశైవమతసంప్రదాయనిరూపకము నగుటచే, పండితారాధ్యుని గ్రంథములలో శివతత్త్వసారము ముఖ్యమయినదనవచ్చును. ఇర్వదియేండ్లకు ముందు నగసాపురమున నొకజంగముదేవరయింట దాని నేఁ గనుఁగొంటిని. చెన్న

పురిప్రాచ్యలిఖితపుస్తకశాలకు సేకరించితిని. కీర్తిశేషులు శ్రీలక్ష్మణరావుగారు దాని నప్పుడు సాహిత్యపరిషత్పత్రికలోఁ బ్రకటించిరి. తర్వాతఁ బుస్తకముగాను బ్రకటించిరి. కాని యప్పుడు దొరకిన పుస్తకముగూడ నసమగ్రమే. అందు నన్నూటయేనుబది తొమ్మిదిపద్యములు మాత్రమే కలవు. అందింక నెన్ని పద్యము లుండవలెనో అప్పుడు తెలియ నశక్యమయ్యెను. లక్షణగ్రంథములందు పండితారాధ్యదేవర శివతత్త్వసారములోనివిగా నుదాహృతము లయిన పద్యములు గొన్ని యీముద్రిత గ్రంథమునఁ గానరావు. ఆపద్యము లివి—

క॥ జడలల్లి భూతి పూయని
పాడవులఁ బొడగాన మాదిపురుషులలోనన్
నడుమంత్రపు సమయంబులు
జడమతు లలరించుకొనిరి చంద్రాభరణా!

క॥ ఆయొడఁ ద్రిపురాంతకదే
వా యని పిలుచుటయుఁ గటకమంతయు వినఁగాఁ
బాయక కిన్నర బ్రహ్మయ
కోయని యెలుఁగిచ్చె తొల్లి యురగాభరణా!

క॥ పతి! సద్వృత్తాధికతాప
త్రితయము, గుణత్రితయము, జన్మమృతి సుఖదుఃఖ
స్మృతివృద్ధిబంధమోక్ష
స్తుతినిందాదులును లేవు ధూర్జటి నీకున్

క॥ అంచితమతి నెవ్వరు ని
ర్మించిరి వంచితులు సురలు కృత్యాదికళా
ఖ్యంచితమై తవరారు ప్ర
సంచము నీయట్ల వగద పరమానందా!

ఈ పద్యములఁ బట్టిచూడఁగా నింక నెంతో గ్రంథము పోఁగవలసియున్నట్లేర్పడును. ఈపద్యము లిప్పుడు పోఁగకున్న గ్రంథభాగములోని వగు వనఁదగును.

## కన్నడ గ్రంథము

ఆంధ్రపద్యాత్మకమగు శివతత్త్వసారము విషయ మిట్లుండఁగా నాకు కన్నడమున గూడ నీకృతి గనుగొన నయ్యెను. చెన్నపురి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నేదో కర్ణాటక గ్రంథముతోపాటు, ఆద్యంతశూన్యమై యనామధేయమై కన్నడకందపద్యముల గ్రంథభాగ మొకటి కానవచ్చెను. కన్నడ పండితు లాపద్యములఁ జదువుచుండఁగా వింటిని. తెలుఁగు శివతత్త్వసారపద్యములే యనిపించెను. ఆనుపూర్వితోఁ బరిశీలించితిని. తెలుఁగుపద్యముల వరుసనే కన్నడపద్యము లున్నవి. తెలుఁగు కృతిలో మల్లికార్జునపండితారాధ్యుఁడు తనపేర నీక్రిందిపద్యము చెప్పికొన్నాఁడు—

క। ఒండేమి మల్లికార్జున
పండితుఁ డననుండుకంటెఁ బ్రమథులలో నె
న్నండో కో నీయాజ్ఞోన్నతి
నుండం గాంతు నని కోరుచుండుదు రుద్రా!

ఇట్లే పండితారాధ్యునిపేరనే కన్నడ పద్యము నున్నది.

క॥ ధరయొళగె మల్లికార్జున
వరపండిత నెనిసుతి హొందతిం నిర్వ్యాజా
భరమొ సెయల్ ప్రమథరొళా
నరకెం నిశ్చనువెనిస్సు బయసువె నీనా!

ఈ కన్నడకృతినిగూడ పండితారాధ్యుఁడే రచించెనో, మఱి యిటీవలివారెవరైన కన్నడీకరించిరో గుర్తింపవలెను. పండితారాధ్యుఁడు కన్నడమునఁగూడఁ బండితుఁడయినట్లు పండితారాధ్య చరిత్రమునఁ గలదు. కాన యాతఁడును రచించియుండవచ్చును. ఈ కన్నడగ్రంథమున గ్రంథాదిపద్యములు 183 లోపించినవి. 184 నుండి 491 దాఁక సరిగాఁ బద్యములున్నవి.

తర్వాత 725-వ పద్యమునుండి 740-వ పద్యముదాఁక గ్రంథము గలదు. ఈ పద్య సంఖ్యను బట్టి చూడఁగా శివతత్త్వసారము వేయిపద్యముల గ్రంథమయియుండునని తోఁచుచున్నది. సంస్కృతమున నుద్భటుఁడు 'హారలీల' యని వేయి శ్లోకముల స్తుతి గ్రంథమును రచియించెనఁట. మన పండితారాధ్యుఁడు గూడ నీవిషయము చెప్పినాఁడు.

క॥ హారలీలాస్తవరచనా
స్థిరనిరుపమభక్తిఁ దనదు దేహముతోఁడన్
సురుచిరవిమానమున నీ
పురమున కుద్భటుఁడు ప్రీతిఁబోవఁడె రుద్రా!

మఱియు బ్రహ్మదేవ కవియని కర్ణాటకవియు, పాల్కురికి సోమనాథుఁడును నీ హారలీలఁ జేకొనిరి. ఇది మూకపంచశతి, పాదుకా సహస్రము, లక్ష్మీ సహస్రము మొదలగు స్తుతి గ్రంథములఁ బోలినది కాఁబోలును. ఉద్భట గ్రంథచ్ఛాయను మన పండితారాధ్యుఁడు శివస్తుతిరూపముగా వేయి యాంధ్రపద్యములలో నీ శివతత్త్వసారము రచించియుండును. కన్నడ గ్రంథము పండితారాధ్యుఁడో, మఱి యింకొకఁడో రచించినను, తొలుతటి గ్రంథము తెలుఁగు గ్రంథమే యనఁదగినట్లున్నది.

క॥ మానిసిపైఁ గోల్గప్పిన
యీ నెవమున నున్న రుద్రు లీశ్వరభక్తుల్
మానుసులె వారు లోకహి
తానేకాచారు లీశ్వరాజ్ఞాధారుల్.

క॥ మానుషచర్మం బుదుగి
ర్ధి నెవదిందెప్ప రుద్ర రీశ్వరభక్తర్
మానుషర యివరు లోకహి
తానేకాచార రీశ్వరాజ్ఞాధారర్.

క॥ స్ఫుటశివతాంత్రికుఁ డపగత
కుటిలాత్మకుఁ డుద్ధరించు గోత్రము నెల్లన్
బటుగతి "గర్జః కూపాత్
ఘటం యథా" యనినసూక్తి కారణమగుటన్.

క॥ స్ఫుటశివతాంత్రిక నపగత
కుటిలాత్మక నుద్ధరిచను గోత్రమునెల్లం
బటుగతి "గర్జః కూపాత్
ఘటం యథా" యెంబసూక్తితథ్యమహుదతిం.

క॥ నిర్మలపదార్థ మగుటను
నిర్మాల్యంబనఁగ నెగడు నా నిర్మాల్యం
బర్మిలిఁ గుడుతురు భక్తులు
కర్మక్షయమగుట మోక్షకాంక్షులు రుద్రా.

క॥ నిర్మలవస్తువహుదఱిం
నిర్మాల్యమెనల్కె నెగళ్దు నిర్మాల్యమదం
కూర్మిగె సుంబర్ భక్తరు
కర్మక్షయమహుదఱిం ముముక్షుగళ్ శివా!

క॥ పురుషప్రతికూలత్వ
స్థిర దోషము సతికి దుర్గతిం జేయదు త
త్పురుషుఁడు భక్తుఁడ యేనిన్
బురుషుని మీఱియును శివునిఁ బూజింపనెడన్.

క॥ పురుష ప్రతికూలత్వఁ
స్థిరదోషం సతిగె దుర్గతియ నీయదు త
త్పురుషన భక్తనెయాగల్
పురుషననం మీఱి శివన నోల్తై పడియో.

ఆంధ్ర కర్ణాట పద్యములఁ బరిశీలింతు మేని యతిప్రాసములు రెండును గల తెలుఁగు రచనము తొలుతటి దగుట తెలియనగును. కర్ణాటక పద్యములకు యతినియమము తెలుఁగున కున్నట్టిది లేదు. కాని యిందు నేను జూపిన కర్ణాట పద్యములు ప్రాయికముగా నాంధ్రయతి సంగతి గలవే. యతిసంగతి గల తెలుఁగు పద్యములు ముందు రచించిన వగుటచే, నది కన్నడ పద్యములకుఁగూడఁ బరివర్తనమునఁ బొందుపడినది. ఈ యాంధ్ర కర్ణాట పద్యముల జోడించి శివతత్త్వసారమును నేను మరలఁ బ్రకటింపనున్నాఁడను.

౪

# వేములవాడ భీమకవి

వేములవాడ భీమకవి శాపానుగ్రహశక్తిమంతుఁ డనీ, ఉద్దండకవి యనీ ప్రాచీనకవులు ప్రశంసించినారు. శ్రీనాథుఁడు 'వచియింతు వేములవాడ భీమనభంగి నుద్దండలీల నొక్కొక్క మాటు' అన్నాడు.

క॥ భీమకవి రామలింగని
శ్రీమన్మథుఁడై చెలంగు శ్రీనాథకవిన్
రాజకవిముఖ్యులను బ్రో
ద్దామగతిన్ భక్తిమీఱఁ దలఁచి కడంకన్

అన్నాడు కూచిమంచి జగ్గన.

క॥ లేములవాడక సుఖి యై
లేములవాడన్ జనించి లేములవాఁడన్
నామంబునఁ బరగిన నుత
భీమున్ గవిభీము సుకవిభీముఁ దలంతున్

అన్నాడు గోపరాజు.

ఈ భీమకవి గోదావరీమండల దాక్షారామపు లేముల వాడ వాస్తవ్యుఁడని కొందఱును, నైజాం రాష్ట్రమందలి వేముల వాడ వాస్తవ్యుఁ డని కొందఱును తలచుచున్నారు. ఉభయ వాదములకును సాధనము లున్నవి. ఈ భీమకవికూడ శ్రీనాథుని వలెఁ దెలుంగాధీశునిఁ గస్తూరీ ఘనసారాది సుగంధవస్తువులు యాచించిన ట్లీచాటుపద్యము చెప్పుచున్నది.

మ॥ ఘనుఁడన్ వేములవాడవంశజుఁడ దాక్షారామభీమేశనం
దనుడన్ దివ్యవిషామృతప్రకటనానాకావ్యధుర్యుండ భీ
మన నా పేరు వెలుంగఁ జెప్పితిఁ దెలుంగాధీశ ! కస్తూరికా
ఘనసారాదిసుగంధవస్తువులు వేగం దెచ్చి లాలింపురా !

వృద్ధపారంపర్యమున నీపద్య మీవిధముగా వినికిడి కలదు గాని ప్రాతవ్రాఁతలలో 'తెలుంగాధీశ' యని కాక 'కళింగాధీశ' యని పాఠము కానవచ్చుచున్నది. మనభీమకవి కళింగాధీశుఁ డయిన యనంతవర్మచోడగంగదేవుని దర్శించిన ట్లింకనుగొన్ని చాటుపద్యములు చాటుచున్నవి గాన యీపద్యమున 'కళింగాధీశ' యను పాఠమే పరిగ్రాహ్య మనవచ్చును.

పయిపద్యమున భీమకవి 'విషామృతము' మొదలగు గ్రంథముల రచించినట్లున్నది. కాని యాగ్రంథము లేనియు నిప్పుడు కానరాకుండుట శోచనీయము. 'విషామృత' మని జ్యోతిషగ్రంథ మొకటి కలదు గాని యది యితనిదై యుండదు. ప్రసిద్ధ మైన కవిజనాశ్రయ మీభీమకవి రచించినదిగా లోకప్రతీతి. గ్రంథమున 'రేచన' రచించినట్లున్నది. అతఁడు కోమటి యట. అనంతవర్మ చోడగంగదేవుని సంధివిగ్రహి 'రేచన' యొకడు కలడు. అతని శాసనము గోదావరీమండల దాక్షారామభీమేశ్వరస్వామి యాలయములో నున్నది. మనభీమకవి యా రేచనపేర కవిజనాశ్రయము రచించి యుండు నేమో ! కవిజనాశ్రయ మిప్పుడు చాలా అప

పాఠములతో ప్రక్షిప్తగ్రంథములతో నిండియున్నది. దానిని జాగ్రత్తగా సంస్కరించి యుద్ధరింపవలసి యున్నది. చిత్రపుభీమన యనుకవి రచించినచ్ఛందస్సు 'ఉత్తమగండచ్ఛందస్సు' అను పేరిది వేఱొకటి గలదు. అదియు కవిజనాశ్రయము నొకటే యని కొందఱు భ్రమపడిరి. అది యట్లు గాదు. ఉత్తమగండచ్ఛందస్సు వేఱు; కవిజనాశ్రయము వేఱు. ఉత్తమగండచ్ఛందస్సు చిత్రపు భీమన రచించినది. కవిజనాశ్రయచ్ఛందస్సు వేములవాడభీమకవి రచించిన దని ప్రతీతి గలది. రెండును ప్రాచీనతర చ్ఛందోగ్రంథ ములే! వేములవాడభీమకవి గ్రంథము లేవియు దొరకక పోయి నను లక్షణగ్రంథాదులం దాతని చాటుపద్యము లుదాహృత ములై చాలా దొరకుచున్నవి. మఱెన్ని ఆంధ్రప్రయోగరత్నా కరమున వేములవాడ భీమకవికృతి నృసింహపురాణ మనుపేరితో కొన్ని పద్యము లుదాహృతము లయి యున్నవి. సాహిణిమారన, చాళుక్యచోక్కభూపతి, సాగిపోతరాజు, (అనంతవర్మ) కళింగగంగ దేవుడు, చోడగంగడు, మైలమభీమడు, నల్లసిద్ధి, లేటివరపుపోత రాజు, రణతిక్కన యనువారిమీఁద నీతఁడు చాటుపద్యములఁ జెప్పినాడు. ఇందుఁ గొన్ని కల్పితములును గావచ్చును. పై వారిలో మైలమభీమనికే ఏఱువభీమఁడనిచిక్కభీమఁ డని నామాం తరములు. ఈతనిపై భీమకవి ప్రశస్తమయిన ప్రశంసాపద్యములు చెప్పినాడు. అవి యెల్ల చాటుపద్యమణిమంజరిలోఁ జూడనగును. మచ్చునకు రెండు పద్యములు.

క॥ అరసరు లేఱువభీమని
పొరువున మనలేరు చిచ్చుపొంతను వెన్నై
తెరువునఁ బెసరై జూదరి
సిరియై రేన్పెట్టుక్రింద జిల్లెడుచెట్టై.

ఉ॥ యాచకఖేచరుంతు సుగుణాంబుధి మైలమభీముఁ డీల్గినన్
జూచి వరించె రంభ యొడఁజొచ్చెఁ దిలోత్తమ దారి నిద్దఱన్
నోచె ఘృతాచి మృగ్గఱకు దొడ్డడికయ్యము పుట్టె నంతలో
వాఁచుకపోయె ముక్తిసతి నవ్విరి యద్దఱఁ జూచి నిర్జరుల్
నోఁచినవారి సొమ్ము లవి నోమనివారికి వచ్చునే ధరన్.

ఈపద్యపుఁ దుదిచరణము గలపద్యము నాచనసోమ నాథుని యుత్తరహరివంశమునను గలదు.

ఉ॥ ఏఁచు నుపేంద్రునిం బనిక మిమ్ముని పుక్కిటి మున్ను; దేవుఁడుం
బూఁచినపూఁవు దప్పుటకుఁ బోకులఁబోవుచు నుండు నిమ్మెయిన్
డాఁచినసొమ్ము చేరె నిచటన్ మదిఁ గోరనిసత్యభామకున్
నోఁచినవారి సొమ్ము లవి నోమనివారికి వచ్చునే ధరన్.

—ఉ. హ. 168 ప్రథమాశ్వాసము.

భీమకవిచాటుపద్యముల పోలికపద్యములు నాచనసోమ నాథుని యుత్తరహరివంశమున నింకను గలవు. భారతిలో శ్రీ నేలటూరి వెంకటరమణయ్యగారు ప్రకటించిన శాల్లప్రొద్దుటూరి శాసనము వేములవాడ భీమకవిరచనము కావచ్చునని నాతలఁపు. ఏలనఁగా నందులో వేములవాడ భీమకవి పేరఁ బ్రసిద్ధి గన్న చాటుపద్య మిదికూడ గలదు.

ఉ॥ పన్నితురంగమంబునకుఁ బక్కర వెట్టినవార్త చారుచే
విన్నభయంబునం గలఁగి వేసటనాఁటనె చక్ర(?)గోట్టముల్
మన్నియపట్టణంబులును మక్కున వేంగి కళింగ లాదిగా
నిన్నియు నొక్కపెట్టఁగనె నేఁచువభీమనృపాలుధాటికిన్.

మఱికొన్ని ఆ శాసనపుఁబద్యముల యనుకరణములు కూడ నాచనసోమన గ్రంథములో నున్నవి. పయిచాటుపద్యము లన్నిఁటిని బర్యాలోచింపఁగా భీమకవి క్రీ॥ 12-వ శతాబ్దిపూర్వార్ధమున ననఁగా నిప్పటి కెన్మిదివందలయేండ్లకు పూర్వ మున్నవాఁ డగును.

వేములవాడభీమకవి శాపానుగ్రహశక్తి మంతుఁ డనుటకుఁ దార్కాణముగాఁ బెక్కు చాటు ధార లున్నవి. భీమకవి యొక్కప్పుడు గుడిమెట్ట యను గ్రామమున కరిగె నట! సాగి పోతురాజను రాజాతని గుఱ్ఱము నక్కడ దనసాహిణమునఁ గట్టి పెట్టించి యాతఁడు వేడినను విడిపింపఁ డయ్యె నట. దానిపైఁ గోపించి భీమకవి చెప్పినపద్యము.

చ॥ హయ మది సీత పోతవసుధాధిపుఁ డారయ రావణుండు ని
శ్చయముగ నేనురాఘవుఁడ సహ్యజ వారిధి మారుఁ డంజనా
ప్రియతనయుండు లచ్చన విభీషణుఁ డాగుడిమెట్ట లంకనా
జయమును బోతరక్కసునిచావును నేఁడవనాఁడు చూడుఁడీ!

కోమటివారిని నిందించినట్లు భీమకవి పద్యములు కొన్ని లక్షణగ్రంథములం దుదాహరింపఁ బడియున్నవి. కవిజనా

శ్రయమును కోమటిరేచన పేర రచించిన కవియే యిట్లు కోమటి వారిని గర్హించునా యని సంశయము.

చ॥ గొనకొని మర్త్యలోకమునఁ గోమటి పుట్టఁగఁ బుట్టెఁ దొన బొం
కును గపటంబు లాలనయుఁ గుచ్ఛితబుద్ధియు రిత్తభక్తియుం
ననువరిమాటలుం బరధనంబును గ్రక్కున మెక్కఁ జూచుటల్
కొనుటలు నమ్మటల్ మిగులఁ గొంటుఁదనంబును మూర్ఖవాదముం.

ఉ॥ కోమటి కొక్క టిచ్చి పది గొన్నను దోసము లేద ; యింటికిం
నేమ మెఱింగి చిచ్చిడినఁ జెండద పాపము ; వాని నెప్పుడే
నేమరుపాటునన్ మృతియు నేమి యొనర్చిన లేద దోస మా
భీమనిలింగ మాన ! కవిభీముని పల్కులు నమ్మి యుండుఁడీ !

ఉ॥ లేములవాడభీమ ! భళిరే ! కవిశేఖరసార్వభౌమ ! నీ
వేమని యాన తిచ్చితివి యిమ్ములఁ గోమటి పక్షపాతి వై
కోమటి కొక్క టిచ్చి పది గొన్నను దోసము లే దటంటి వా
కోమటి కొక్క టీక పది గొన్నను ధర్మము ధర్మపద్ధతిన్.

సాహిణిమారుఁ డనుదండనాథుఁడు చాళుక్యచొక్క భూపతి నెదిరించె నట ! భీమకవి యామారుని శపించి చొక్క భూపతికే జయము చేకూర్చె నట.

ఉ॥ చక్కఁదనంబుదీవి యగుసాహిణిమారుఁడు మారుకైవడిం
బొక్కపడంగలండు చలముం బలముం గలయాచళుక్యపుం
జొక్కనృపాలుఁ డుగ్రుఁ డయి చూడ్కుల మంటలు రాలఁ జూచినం
మిక్కిలి రాజశేఖరునిమీఁదికి వచ్చిన రిత్త వోవునే !

కళింగగంగు నాస్థానమునకు భీమకవి యరుగఁగా నాతఁ

డనాదరమున నిది సమయము కాదు పొమ్మనె నఁట! దానిపై భీమన కోపించి శాప మి ట్లొసగెను.

ఉ॥ కేములవాడభీమకవి వేగమె చూచి కళింగగంగు తా
సామము మాని కోపమున సందడి దీర్చన రమ్ము పొమ్మనెన్
మోమును జూడ దోస మిఁక ముప్పదిరెండుదినంబు లావలన్
జామున కర్ధమం దతనిసంపద శత్రులపాలు గావుతన్.

శాపము ఫలించెను. రాజకళింగగంగు గర్భదరిద్రుఁడై పరులు కెఱుకపడకుండఁ బ్రచ్ఛన్న వేషము దాల్చి తిరిప మెత్తుచుఁ బొట్ట గడపుకొనుచుండెను. భీమకవి యొకనాఁడు రాత్రి పల్లకి నెక్కి దివటీలతో నెక్కడకో పోవుచుండఁగా నాతఁడు త్రోవ నేఁగుచుఁ జీకటిలో నొకగోతఁ గూలి 'అయ్యో! కాలిదివటీ యైన లేదయ్యెఁ గదా!' యనుకొని చింతిల్లె నఁట! అది భీమకవి విని నీ వెవ్వండ వని యడుగ 'భీమకవిగారిచే జోగి చేయఁబడిన వాఁడ' ననె నఁట! భీమకవి 'రాజకళింగగంగవా' యనఁగా నాతఁడు కేల్మోడ్చి 'రక్షింపుఁ'డనె నఁట! అంతట

ఉ॥ వేయుగజంబు లుండఁ బదివేలు తురంగము లుండ నాజిలో
రాయలఁ గెల్చి సజ్జనగరంబునఁ బట్టము గట్టుకో వడిన్
రాయకళింగగంగు కవిరాజభయంకరమూర్తిఁ జూడఁగాఁ
బోయెను మీనమాసమునఁ బున్నమ పోయినషష్ఠి నాటికిన్.

అని యాశీర్వదించి తిరిగి లబ్ధరాజ్యునిఁ జేసె నఁట.

ఒక బ్రాహ్మణుని దొడ్డిలోని పేరాముదపాకులు భీమకవి తాలూకు నొక రొకఁడు మందు కని కోసికొనఁ బోగా నాయింటి బ్రాహ్మణుఁడా నొకరును బారఁకోలఁగొట్టెనఁట ! ఆ బ్రాహ్మణుఁ డడఁగారునట్లు భీమకవి శపించెను.

క॥ కూరడుగము కాయడుగము
నారయఁగా నుల్లి బచ్చ లల్ల మడుగ మా
పేరాముదపాకడిగినఁ
బారమ్మునఁ జేసె నష్టి బాపడు ద్రెళ్లున్.

అనుగ్రహించి భీమకవి జన్నమాంబ యనునామెకు గండ మాలావ్యాధిని పద్యరచనచేఁ గుదిర్చె నట.

క॥ ఘనరోగంబులబలమా
కనుఁగొనఁగా జన్నమాంబ కర్మపుఫలమా
నినుఁ బ్రార్థించెద వినుమా
మునుకొని యోగండమాల ! మునుగకుఁ జనుమా !

కొన్నాళ్ల కామెమీఁద మరలఁ గోపించి శపించి మరల నావ్యాధి నామెకే వచ్చునట్లు చేసె నట.

భీమకవి తనశాపానుగ్రహశక్తిమత్త్వమును బ్రశంసించు కొన్నపద్య మిది.

సీ॥ గడియలోపలఁ దాడి కడఁగి ముత్తునియగాఁ
దిట్టిన మేధావి భట్టుకంటె

రెండుగడెల బ్రహ్మదండిముం డ్లన్నియు
డుల్లఁ దిట్టినకవి మల్లుకంటె
మూఁడుగడెలకుఁ దా మొనసి యత్తినగండి
పగులఁ దిట్టినకవిభానుకంటె
అఱజాములోపలఁ జెఱువునీళ్ళింకంగఁ
దిట్టినబడబాగ్ని భట్టుకంటె

గీ॥ ఉగ్రకోపి నేను నోపుదు శపియింపఁ
గ్రమ్మఱింప శక్తి గలదు నాకు
వట్టిమ్రానఁ జిగురు పుట్టింప గిట్టింప
బిరుదు వేములాడ భీమకవిని.

ఉ॥ రామునమోఘబాణమును రాజశిఖామణికంటిమంటయున్
భీముగదావిజృంభణ ముపేంద్రునివజ్రముఁ జక్రిచక్రమున్
దామరచూలివ్రాఁతయును దారకవిద్విషు ఘోరశక్తియున్
లేములవాడ భీమకవి లేశము తిట్టిన రిత్త వోవునే.

౨

# ప్రాచీనాంధ్రవచనకావ్యములు.

“ దేశభాషలందుఁ దెలుఁగు లెస్స ” నాఁ బరఁగిన మన యాంధ్రభాషయందు నన్నయభట్టారకుఁ డాదిగాఁ గల తొల్లింటి కవులెల్లరును జంపూప్రబంధములను, మిక్కిలి తక్కువగా నిర్వచన పద్యకావ్యములను మాత్రమే రచించిన ట్లెఱుకపడుచున్నది గాని శుద్ధవచన కావ్యములను, మఱియు దృశ్యకావ్యములను రచించినట్లు కన్పట్టదు. ఆద్యప్రకృతి యగు గీర్వాణభాషయందు, సుబంధుని వాసవదత్తము, బాణుని కాదంబరీ హర్షచరిత్రములును, దండి దశకుమారచరిత్రమును మొదలుగాఁ గొన్ని ప్రౌఢతమము లగు గద్యకావ్యములు గలవు. కాళిదాస భవభూతి ప్రముఖుల రసోత్తరము లగు దృశ్యకావ్యములును గలవు. మన యాంధ్రవాఙ్మయము సంస్కృతవాఙ్మయమును బట్టి పుట్టి పెరుగుటయు, దొలుదొలుతఁ బ్రాయికముగా నాంధ్రకావ్యకర్తలు సంస్కృతగ్రంథములనే యనువదించుచు వచ్చుటయు విస్పష్టమ కదా. పురాణాదులతోఁ బాటు మున్నె కొన్ని గద్యకావ్యములును, దృశ్యకావ్యములును, సంస్కృతమునుండి మన వారిచేఁ దెనుఁగున ననువదింపఁబడెనుగాని యీ యనువాదములును జంపూరూపములే యయ్యెను. వచనకవిత్వ మొక

కవిత్వ మనిపించుకొన దని తలఁచి నన్నయ భట్టారకాదులు రచింపమానిరని కొందఱనియెదరు గాని యది సమంజసమయినట్లు కన్పట్టదు. సంస్కృతమున వాసవదత్తాకాదంబర్యాదులకున్న గౌరవమసామాన్యమైనది గదా! కవిత్వమునకు ఛందఃపరిశ్రమామే ముఖ్యమనుట కెవ్వరంగీకరించెదరు? పద్యకవిత్వముకంటె గద్య కవిత్వమే కవియొక్క సంపూర్ణ శక్తి నపేక్షించునని సంస్కృత భాషయందు "గద్యం కవీనాం నికషం వదంతి" యనునానుడి కలదు. నన్నయాదులు వచనకావ్యరచన మీ కారణముచేతనే మాని రన్నచో దృశ్యకావ్యములు రచింపమికి వేఱొక కారణము వెదకవలసియుండును. వారు వీనిని రచింపమికిఁ గారణమిదియని నిరూపింప వలనుపడదు.

పదపడి యిటీవల పదునాఱవశతాబ్ది తుదనుండియు వచన కావ్యములును యక్షగానము లనునొకవిధ మగురూపకవికారము లును రచింపఁబడుచు వచ్చినవి. యక్షగానము లంతకుఁ బూర్వము సయిత ముండిన నుండియుండును గాని వచనకావ్యములు లేవన వచ్చును. ఆంధ్రభోజుఁ డనఁబడు కృష్ణదేవరాయల నాఁట నుండియుఁ జోళపాండ్యాది రాజ్యములందుఁ దెలుఁగు రాజ భాషగా వ్యవహరింపఁబడుచు వచ్చెను. ఆరాజ్యములను విజయ నగరరాజసంబంధులు పరిపాలించుచువచ్చిరి. పదునాఱవ శతాబ్ది నుండి యాంధ్రదేశమున రచింపఁబడిన వానికంటె నక్కడ రచింపఁ

బడిన తెనుఁగుఁగబ్బములు మెండు. మఱియు నవి రసోత్తరములు నయి యున్నవి. విజయవిలాసాది ప్రబంధము లయ్యెడనప్పు డుప్పతిల్లినవే. నాఁ డక్కడ రచింపఁబడిన కబ్బము లింకను మనకుఁ గొన్ని చేకుఱలేదు. మన యాంధ్రభాషావధూటి శుద్ధ ద్రావిడదేశమున నయితముఁ దన నుడికారపుఁ బొంకమున సంపూర్ణాదరము వడసి పోషింపఁ బడినదిగదా! తొలుదొలుత నాంధ్రవచన కావ్యరచన దక్షిణదేశముననే యారంభింపఁ బడినది. దక్షిణదేశమందు రచింపఁబడిన యీ వచనకావ్యములఁ గూర్చి ప్రశంసింపఁ బోవునప్పుడు ముందు నన్నయభట్టారకాదులు తమ గ్రంథములం దందందుఁ బొందుపఱుచుచు వచ్చిన వచనములఁ గూర్చియుఁ గొంత చర్చించుట యావశ్యకము కాకపోదు. నన్నయభట్టారకునికవనమునం దెడనెడఁ గల్గుగద్యములు మన మెచ్చుకూర్పునఁ బదిపదునైదు పంతులకంటె హెచ్చుగాక ముచ్చట లిచ్చుచుండును. తొంటికవుల రచనలలో నన్నయ భట్టారకుని గద్యములే పద్యములట్లు ధారాచమత్కృతి గల్గి చదువ నింపై యుండును. తిక్కనామాత్యుని గద్యములు మిక్కిలి మెలపు మీఱిన తెలుఁగుఁ బలుకుబళ్లతో నించుక జిలుగులై బిగువుగల్గి రసమొల్కుచుండును. ఆతని కృతులందు గద్యములు నన్నయార్యుని కృతులందువలెఁగాక, కొంచెమెక్కుడై నిడుదలునై పొడకట్టుచున్నవి. ఎఱ్ఱనార్యుని కృతులందలి గద్యము

ఒక్కొక్కయెడఁ బ్రౌఢ మగుసంస్కృత రచనమును, గొండొక చోట నినుపారు తెలుఁగుఁగూర్పును గల్గి నిబిడములై ప్రాయికముగా వర్ణనాంశము గల్గియుండును. ఈ మువ్వుర గద్యములును ననుప్రాసప్రయోగరహితము లై యెల్లవిధముల మేల్మికూర్పు గల్గియున్నవి. కవిత్రయమునకుఁ దర్వాతివారు రచించిన గ్రంథములందు గద్యములు మిక్కిలి మాఱుపాటును జెందినవి. నాచన సోమనాథుని గద్యము చదువువారికి గుండియ తల్లడమును గల్గించుచుఁ గొండవీటిచేఁత్రాళ్లవలె బాదుగువాటి దేసి తెలుఁగుఁ బల్కులతో నిండారి యనుప్రాస విన్యాసములచే నతికఠినములై యుండును. ఈతని గ్రంథమున వచనము లచ్చునఁ బోసి ముద్ర కొట్టఁబడినట్లు నెలకొని యున్నవి. యుద్ధాదికమును వర్ణించు స్థలములం దీతఁ డిట్టివచనములఁ బెట్టుచుండును. కథాంశమును చెప్పునప్పు డీతని కృతియందు గద్యములే యంతగాఁ గాన్పింపవు. శ్రీనాథుఁడు సంస్కృతప్రాయముగా సుద్ధతశైలితో నతిప్రౌఢ మగువచనముల రచించెను. ఒక్కొక్కయెడ నీతని గద్యములు నన్నయార్యుని గద్యములతో సయితము సాటివచ్చుచుండును. తెలుఁగుఁగూర్పులఁగూడఁ గొండొక కలయఁ గూర్చినను బోతనామాత్యుఁడు వచనములను గమనిడుదలుగను గఠినములుగను నెలకొల్పెను. పెద్దనాదుల కృతులందు వచనములు మిక్కిలి తక్కువ. ఉన్నను వర్ణనాత్మకములై యతిప్రౌఢములై యుండును. పెద్ద

నాదులకుఁ దర్వాతికవులు కొందఱు పద్యములందు వలయు గణ యతిప్రాసనిర్బంధములేమిచేఁ దమకుఁ గలైడుసౌకర్యమును వీడ నాడి యిబ్బడిగా నిర్బంధములను దెచ్చి పెట్టుకొని, తమ గ్రంథము లందు బహుళక్లిష్టముగను, అనుప్రాస నిరంతరముగను, దురవ బోధముగను వచనములఁ గూర్చుచు వచ్చిరి. ఇట్టి వచన ములను ప్రాయికముగాఁ దద్గ్రంథములఁ బఠించువారు వదలి వేయుచుందురు.

నన్నయభట్టారకాదులు పద్యములం దింపుగాఁ గూర్ప వలను పడనివంశక్రమాది వృత్తాంతమును దెలుపవలసినపుడును మిక్కిలి విరివిగా నున్నకథ నల్లంతలో సంగ్రహింపవలసినపుడును బఠించువారికి నిరంతరపద్య సంఘటనమువలనఁ గల్గు విసుపు నపయింపవలసి నపుడును నెడనెడ సంస్కృత గ్రంథమును మీఱక హృద్యము లగుగద్యములఁ గల్పించిరి. నాచనసోమనాథుఁ డుత్తరహరివంశమును దెల్గించె నన్నపేరేగాని యందుండి తన యిచ్చకు వచ్చిన మూఁడునాల్గుకథలఁ గైకొని విచ్చలవిడిగాఁ గ్రంథము రచించినవాఁ డగుటచేఁ బద్యములందును గద్యము లందును గూడఁ దనగడుసరితనమును విశృంఖలముగఁ జూపు కొనఁ గల్గెను. పోతనామాత్యునకు భాగవతమందలి యాధ్యా త్మికవిషయములు కొన్ని పద్యములందుఁ గూర్పఁ గుదురని వగుటచే గొప్ప గొప్ప గద్యములఁ జెప్పక తప్పదయ్యె.

ఆధ్యాత్మికవిషయములఁ జెల్పునపుడే కాక మఱికొన్ని యెడలను గూడ నీతఁడు పెక్కువగా వర్ణనలఁ బెట్టుకొని కఠినము లగుగద్యములను గూర్చెను. తర్వాతఁ బెద్దనాదులు తాము విశృంఖలముగాఁ గల్పింప దొరఁకొన్న మనుచరిత్రాది ప్రబంధములందుఁ జంద్రికాదులను వర్ణింపమొదలిడి యనల్పము లగుకల్పనలఁ గల్పించుకొని యవి పద్యములం దిముడ్పఁ గుదురకపోఁగా శబ్దాడంబరముం దాదరము మెండుకొనుకతన నంతంత లేసి ప్రౌఢ గద్యములఁ గూర్చిరి. అప్పటి నుండియుఁ బ్రబంధ మనుచుఁ గూర్పమొదలిడిన తర్వాత నట్టి గద్యములఁ గూర్చుట కవులకుఁ దప్పని పనివలె నయ్యెను. మన తెల్గుదేశమున శుద్ధవచనకావ్యము లుప్పతిల్లమియ కాక చంపూప్రబంధములందలి గద్యములస్థితియు నీ విధమున నుండుకాలమున దక్షిణదేశమునం దాంధ్రవచనకావ్యరచన మారంభింపఁబడినది. అప్పుడక్కడ రచింపఁ బడిన గద్యకావ్యములందుఁ గేవల కల్పితములు లేవు. అన్నియును బురాణములును దదుపాఖ్యానములునుగనే కన్పట్టుచున్నవి. నన్నయాదులుచే రచింపఁబడిన భారతాదిప్రబంధములు ప్రౌఢతమము లగుకతనఁ దదర్థగ్రహణము సామాన్యజనసులభము గాక పోవుటయే యక్కడ తొలుత నీ వచనకావ్యరచనోపక్రమమునకుఁ గారణమయినట్టు చూపట్టుచున్నది. తఱచుగా నీ కావ్యములందు వాక్యములు క్లిష్టాన్వయములై యంతును బొంతును లేక యుం

డును. వీనియందు గిరిసరిదాదివర్ణన మంతగాఁ గన్పట్టదు. సంస్కృతమూలమునఁ గల ప్రధానకథ ననుసరించి పరిమితము లగు వర్ణనలతో నీ వచనరచన కావింపఁబడినది. ప్రౌఢదీర్ఘ సమాసములును, అనుప్రాసప్రయాసములును వీనియందుఁ గానరావు.

సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః
నిత్యా సమాసే వాక్యే తు సా వివక్షా మపేక్షతే.

సంస్కృతభాషయం దీ కారిక వాక్యమున సయితము సంహిత వివక్షాయత్త మని తెలుపుచున్నది. కాని యీపద్ధతి తెలుఁగుఁభాషయందుఁ దొల్లింటికవు లవలంబించినవారు కారు. గద్యమున నేకవాక్యమందు సంహితను దప్పక పాటించుటయేకాక, రెండువాక్యములు కలయునప్పుడు సయితము విడువరైరి. ఈ కారణముచేఁ బ్రాచీనాంధ్రగ్రంథములం దెక్కడను సంధి విడువఁబడిన గద్యము కాన్పింపదు. ఈదక్షిణదేశపుటాంధ్రవచనకావ్యములందుఁ గొన్నింట నట్లుకాక, యుచ్చారణసౌలభ్యముకొఱకై క్వాచిత్కముగాఁ బయికారిక ప్రకారము సంహిత యవివక్షితమై సంధి విడనాడఁబడియున్నది

కొందఱు లోకవ్యవహారానుగుణముగా నాబాలసుగ్రహమగు తెలుఁగున వచనము రచింపవలయు ననునభినివేశముతోఁ గావలయు శబ్దలక్షణాదికమును సైత మంతగాఁ బాటింపరైరి. ఎంతయేని సలక్షణమును బ్రౌఢమును నగుపద్యకవిత్వమున నాఁటి

తేరిన ప్రుష్పగిరి తిమ్మన్న రచించినవచనమును గాంఢ్గాకపట్టులఁ
వ్యాకరణమును నిరాకరించుచున్నది. ఇప్పటికి నాకుఁ జేకుఱిన
వచనగ్రంథములలోఁ దొల్తటిది

వ చ న భా ర త ము.

ఈ గ్రంథమునుగూర్చి తెలిసికొనవలసినయంశ మెక్కువ
కలదు గావున మునుమున్న యిందలి యాశ్వాసాంత గద్యముఁ
జదువుదము.

‘ ఇది శ్రీరామచంద్ర చరణారవింద సేవాభినందన పవన
నందన వరప్రసాదాసాదిత గీర్వాణాంధ్ర కర్ణాటకాది నానాభాషా
కావ్యరచనాచతుర, శ్రీమన్మహా రాజాధిరాజ రాజపరమేశ్వర
రాజమార్తాండ ప్రౌఢప్రతాపాప్రతిమ వీరనరపతిబిరుద తెంబర
గండ బిరుదాంకిత శంఖచక్రమకరమత్స్య హనూమద్గరుడ గండ
భేరుండ సింహశరభసాళ్వాది నానావిధదేవార్హ ధ్వజాంకిత యాద
వవంశతిలక, అంగ వంగ కళింగ కాశ్మీరలాటాంధ్ర ద్రవిడ ద్రావి
డాది నానాదేశాధీశ్వర కిరీటకోట సంఘట్టనత్రస్త నిస్తులనవరత్న
పరాగపరాగిత నిజభవన ద్వారాసక్తానేక జనపాలఫాలతల ఘటి
తాంజలిపుంజ రంజితారవిందక (ప) రాయమాణ సభాస్థానస్థ
సింహాసనాధిరూఢ నానావిద్వదభీష్ట వరప్రసాద దేవరాజచిక్క
దేవరాజకరుణాప్రాప్త కర్ణాటరాజ్యలక్ష్మీ నృత్యరంగాయమాణ

శ్రీరంగపట్టణ పరిపాలనాథా దృత 'సైన్యాధిపత్య నిర్వాహక' మహారాష్ట్ర మదేభ పంచానన, కేళాది వంశాటవీదావ దహన, మధురానాథమదవిమర్దన, జయాఘాటశిరః కందుక క్రీడన, యస మంతరాయ నాసికాకృంతన, నింమోజిసమూలో న్మూలన, దాదోజిప్రాణహరణ, దండధర ప్రతాప శిలవిశల ఫాలేరాయ ఫాలాక్షరవిదలన, నానావిధానేకాంతర్బాహ్యాదిశా త్రవ మేఘౌఘ జంఝానిల, పరరాజగర్వాంధకారవిదళనదిన రాజదళవాయి 'దొడ్డరాజతనూజ' యాచకసురభూజ భుజ బలాటోప పరాజితారిరాజన్య సమర్పితానేక రత్నరాశియుత ధనకనక వస్తు వాహనాది సువస్తువిస్తారిత సంతోషితాఖిల భూసు రాశీర్వాదానువర్ధిత పుత్రపౌత్రాది వంశాభివృద్ధి విరాజమాన, 'కళవేకుల వంశాంబుధి రాకానిశాకర' ఆశ్వలాయనసూత్ర, పరమపవిత్ర భారద్వాజగోత్రప్రదీప కాసేతు శీతాచల మధ్యవర్తి కాశీ ప్రభృతిపుణ్యక్షేత్ర నిత్యాన్నదానా ద్యనేకధర్మ శాస్త్రోక్త దానదీక్షావిచక్షణ, క్షాత్రాధీశ్వర కార్యఖడ్గప్రవీణ అనవధికాగ్రహారగృహారామక్షేత్రాది సంతోషితాఖిల కవిరాజ, శ్రీ వీరరాజ ప్రణీతం బైనమహాభారత వచనకావ్యమునందుఁ బ్రథమాశ్వాసము.

ఈ చదువఁబడిన గద్యమువలన నీ గ్రంథమును రచించిన యాతఁడు మైసూరుప్రభు వగుచిక్కదేవరాయలయొద్ద దళవాయి

యయిన దొడ్డరాజు కుమారుఁ డగువీరరాజని తెలియుచున్నది. మైసూరుప్రభువులలోఁ జిక్కదేవరాయలు మిక్కిలి ప్రఖ్యాతుఁడు. ఈతనిఁ గూర్చి సంస్కృతాంధ్ర కర్ణాటభాషలలోఁ గొన్ని గ్రంథములు రచింపఁబడెను. తెలుఁగునఁ జిక్కదేవరాయవిలాసమును నింక ననేకచాటు పద్యములును గలవు. ఈతఁడు 1650 తర్వాత 1700 లోఁగా రాజ్య మేలెను. ఇంచు మించుగా మనగ్రంథ కర్తయు నా కాలముననే యుండును. ఈకవి తాను ఆశ్వలాయన సూత్రమును భారద్వాజగోత్రమును గల క్షత్రియుఁ డయి నట్లు చెప్పుకొనెను. ఈతని దాతృత్వాదికమును, ఈతని జనకుని ప్రతాపాదికమును గద్యమువలనఁ దెలిసికొననగును. ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున నప్పకవీయమునకు రూపాంతరమైన వీర భూపాలీయ మనునొక లక్షణగ్రంథము గలదు. కూర్చినగ్రంథ కర్తపే రందుఁ దెలియుట లేదు గాని యది యీవీరరాజు నుద్దేశించి చెప్పఁబడినదే. ఈభారతసంగ్రహమును ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారముననే కలదు గాని యసమగ్రమై యాదిపర్వము మాత్రమే చూపట్టుచున్నది. ఇయ్యది శ్రీకృష్ణాంకితముగాఁ దేనియ తేటవోలె సారస్యము గలతెలుఁగు వచనమున రచింపఁ బడినది. నన్నయాదుల భారతమున కిది దండాన్వయము గాదు. సంస్కృతభారతపు మక్కికి మక్కి కాదు. కథాంశమును జక్కగాఁ దేటపఱుచు స్వతంత్రరచనము. ఈకవి తనగ్రంథ ముద్ధతశైలి

నుండవలయునని యపేక్షింపక సర్వసామాన్యముగా నర్థమగు నట్లుండవలయునని తలంచి తలంచినట్లు నిర్వర్తించెను. ఈ గ్రంథ మున నెక్కడను బిగువుదక్క నీరసముగా నుండుకూర్పు కాన్పింపదు. కొంత వచనభాగమును నుచ్చు చూపుచున్నాఁడను.

"కుమారకా! యేను జాత్యంధుండ నయినను బాండు భూపాలుండు నన్ను మిగులం బూజించె. అది యెట్లంటేని, లోచనంబులు లేమింజేసి పరదళంబుల మొగ్గరంబులు పన్ని యగ్గలిక మెఱయ గెలువంజాల; స్వరాష్ట్రపరిపాలనంబున కసమర్థుండ. సాంగంబులుగ వేదంబులను రాజనీతిశాస్త్రంబులు నధికరించితి. ఎంత యధికరించిన నేమి ప్రయోజనంబు. క్షత్రియుం డగువాఁడు ధర్మమార్గంబుదప్పక సమరంబుగావించి హతుండయ్యేనేని స్వర్గంబున కరుగు. జయించినఁ గీర్తియును భూమియుంబడయుంగావున నాయుధోపజీవుల కారాధనం బవశ్యకర్తవ్యంబు. అట్లు గెలిచి పుత్త్రులయెడ నైశ్వర్యంబు నిలిపి వనవాసంబున కరుగవలయు, నిట్టి కర్మంబున కే నసమర్థుండనయినను బాండునృపాలుండు నన్ను రాజ్యంబున నిలిపి తాను దిగ్విజయంబుసేసి సకలధనంబులు నా యధీనంబులు గావించె. అతండు నన్ను రాజ్యంబున నిలుపుటకు ధర్మంబు కారణంబగుంగాని వేఱొండు నిమిత్తంబు లేదు. క్షత్రియులకుఁబుత్త్రులెందఱున్నను, తేజోధికుండ జ్యేష్ఠుండగుంగాని వయోధికుండు జ్యేష్ఠుండు కానేరండు. అట్లు గావునఁ దేజోధ

కుం డగుపాండునృపాలుండు వయఃక్రమంబునఁ గనిష్ఠుండయ్యు జ్యేష్ఠుండనంబడు, నతనికుమారులు వేదశాస్త్రంబులు చదివి సకలార్థంబులుఁ దెలిసి గుణంబులం బ్రసిద్ధులగుచు నస్త్రాభ్యాసంబు సేసి లోకద్వయంబునం బూజ్యులగుచు జనులు తమయెడ ననురాగంబు సేయ మెలఁగుచున్నవారు. ధర్మపౌరుషప్రభావంబుల వార లధికులై యున్నయెడ వారల నెట్లు నగరంబు వెలువరింపించి వారణావతంబునకుం బనుపువాఁడ, నట్లు పనిచినను లోకంబునం గలజనులు నిందింపకుందురె ?

(ఆదిపర్వము-నూటముప్పది తొమ్మిదవ యధ్యాయము.)

ఈ వచనము సంస్కృభారతమునఁ గల్గు విషయము లన్నియును గల్గి యాంధ్రభారతము కంటె మిక్కిలి విపులముగా నున్నది. ఈచదువఁబడిన భాగము నన్నయార్యుని రచనమున నత్యల్పమగునట్లు సంకుచింపఁబడినది. విస్తరభీతిచే దానిని గూడ నిం దుదాహరింప మానితిని. సంస్కృత భారతప్రకార మధ్యాయ విభాగముతో నీయాదిపర్వము మూఁడాశ్వాసములుగా విభజింపఁ బడినది. ఆశ్వాసాద్యంతములందుఁ బద్యములు కలవు.

ఈ గ్రంథమునందుఁ గొంత ప్రాచీనప్రయోగసరళి కన్పట్టుచున్నది. (1) అమ్మహాసంగ్రామంబునకుం గూడిన పదునెనిమిది యక్షౌహిణుల రాజులును గాలవశంబునం జని రందులకు

సుయోధనుండు హేతువై నిల్చుటంజేసి యజ్ఞానంబునం దన కేమియుఁ దోఁచదయ్యె నెంత తెలిసెడ నన్నుం దెలివి సెందఁజా లక యున్నవాఁడ. (2) సూతనందనా! యీతకార్యంబు నడచిన పిమ్మటఁ దాను బ్రతికియుండుటకు ఫలంబు లేశంబునుం గాన (ధృతరాష్ట్రునిపల్కులు) (3) ఓ ద్విజకులోత్తమ! తొల్లి యొక మత్తభుజంగంబు తనకుఁ బ్రాణాపదం బయినప్రమద్వరకుఁ గీడా చరించె (రురునిపల్కు)

ఇట్టి వాక్యములందు 'నేను' శబ్దము ప్రయోగింపఁబడు స్థలములందుఁ 'దాను' శబ్దము ప్రయోగింపఁ బడినది. పూర్వకవుల రచనలం దిట్టి ప్రయోగములు కలవు.

(1) ఈప్రబంధముం-దన కిపు డంకితంబుఁ బ్రమదంబునఁ జేయుము. (ప్రౌఢకవిమల్లన)

(2) అత్యుగ్రబాణశక్తిఁ దన్నుఁ బంపు దేవ (మన్మథుని పల్కు) (నన్నిచోడదేవుఁడు)

ఇట్లు కొంతప్రాచీనప్రయోగసరణి కలదు.

మఱియు

(1) శంతనునరపాలుం డేకాంతంబున నేకాంతంగనుఁగొని మరులుకొనియె యథార్థంబునఁబలుకరింపుమన సూతుండిట్లను. (2) నే నిక్కన్నియకు జనకుండ నగుటం జేసి పలుకరించెద

నాకర్ణింపుము—ఇట్లు పెక్కువాక్యములందు 'పలుకు' ధాతువు ప్రయోగింపఁ బడునెడ 'బలుకరించు' ధాతువు ప్రయోగింపఁ బడినది. ప్రాచీన గ్రంథములం దిట్టి ప్రయోగములు కలవో యని సందియ మగుచున్నది. ప్రయోగ వైచిత్ర్యము లిట్టివి కొన్ని గలవు.

మఱియు నిందుఁ దత్సమక్రియలకు శత్రర్థమున నింపు గాగమము తఱచుగాఁ గావింపఁబడినది. దక్షిణదేశపుఁ బ్రబంధములం దెల్ల నిట్టిప్రయోగములు కుప్పతెప్పలుగాఁ గలవు. ఆంధ్ర దేశమందు రచింపఁబడిన వసుచరిత్రాది ప్రబంధములందును గలవు. పెద్దనామాత్యుఁడు కూడ 'ఇంపు మీఱంగ ధాత్రి పాలింపు చుండ' అని ప్రయోగించెను. ఇది ప్రాచీనకవిసమ్మతము కాదు.

అమహదర్థక మగుతచ్ఛబ్దమునకు 'వాటిని' మొదలగు రూపములు గూడ వాడఁబడినవి అయ్యవి యసాధువులు. ఇంక నెందేనిఁ జిన్నచిన్న దోషము లిట్టివి మఱికొన్నియు నుండిన నుండఁ బోలును. బహుస్థలములందుఁ జూపట్టు చుండుటచేఁ బై ప్రయోగములు గ్రంథకర్తృకృతములే యని చెప్పవలసియున్నది. ప్రాయికముగాఁ దాళపత్త్రిసంపుటములు లేఖక దోషభూయిష్ఠములై యుండును. అట్టి దోషములనుగూర్చి దద్గ్రంథకర్తలకుఁ దగిలింపరాదు.

ఈ వచనభారతము నీవీరరాజును మఱికొందఱును గలసి పూరించినట్లున్నది. తంజాపురపు సరస్వతీభాండాగారమున వచనాత్మకము లగుశాంత్యానుశాసనికపర్వములు క్రమముగా నారాయణ తుపాకుల యనంతభూపాలక కర్తృకము లయినవి కలవు. ఇక్కడి యీయాదిపర్వమునందుఁ గూడ వీరరాజు నాశ్వాసాంత గద్యమునం దొక్కచో నడుమఁ దుపాకుల యనంత భూపాలకు గద్యమును వ్రాయబడియున్నది. ఈతుపాకుల యనంత భూపాలకుఁడు మధురరాజుల యొద్ద దళవాయి యని తెలియుచున్నది. ఈతఁడును వీరరాజు సమకాలపువాఁడే కాఁదగును. అనంతభూపాలక కర్తృకము లయిన వచనకావ్యములు మఱికొన్ని గలవు. అందు విష్ణుపురాణము, భగవద్గీత యనుగ్రంథములు ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమునం దున్నవి. విష్ణుపురాణ మాఱాశ్వాసముల గ్రంథముగా రచింపఁబడినది. వెన్నెలకంటి సూరనార్యుని విష్ణుపురాణముకంటె నియ్యది కడు విపులమై సంస్కృత మూలము ననుసరించుచున్నది. ఈ కృతియును శ్రీకృష్ణునకే సమర్పింపఁబడెను. ఈ విష్ణుపురాణవచనము ధారాళ మగురచన గల్గి యించుక ప్రౌఢమై మిక్కిలి చక్కఁగ నున్నది. వచనభారత మందువలెఁ గాక యిందు సంస్కృతసమాసములు కొండొక మెండుగాఁ జూపట్టుచున్నవి.

ఇంచుక మచ్చు చూపుచున్నాఁడను.

"అంత శ్రీకృష్ణుండు విమలతర చంద్రికా సాంద్రంబును, హృదయానంద కరంబు నై, వికసితనీలోత్పల కుముద సౌరభంబులచే దిగంతంబులఁ బరిమళింపఁ జేయునట్టిశరత్కాలంబున నుత్ఫుల్లకుసుమవాసనాసక్తంబులై ఝుంకారం బొనర్చునట్టి తుమ్మెదలమొత్తంబుచే నలంకృతంబును విహారయోగ్యంబును నగుబృందావనంబుం గనుంగొని, యచ్చట గోపవనితానికరంబులతోడఁ గూడి రమియించి వారల మనోరథంబులు నెఱవేర్పఁ దలంచి, యొక్కనాఁటి రాత్రియందు నొక్కరుఁడ, నవరత్నఖచిత దివ్యాభరణభూషితుండును, దివ్యచందనచర్చితగాత్రుండును, మనోజ్ఞకుసుమమాలికాధరుండును నై వనంబునకుం జని, జగన్మోహనంబును, నవ్యక్తమధురంబును, నమృతోపమానంబును, మాత్రాలయసమన్వితంబును నగువేణుగానం బొనర్చుటయు, సర్వభూతమనోహరం బగునయమ్మురళీనాదం బాలకించి గోపాంగనలు మదనబాణవివళితహృదయలై యవ్వాసుదేవనందను సమీపంబున కరుదెంచిరి. అం దొక్కసుందరి నిజగృహంబునంద యుండి శ్రీకృష్ణుని వేణునాదంబున కనురూపమును, నవ్యక్తమధురంబును గా మెల్లమెల్లన గానంబు గావించె."

(అయిదవయాశ్వాసము 13వ అధ్యాయము)

ఈతని గద్య యిట్లున్నది.

“ ఇది శ్రీనందనందనచరణారవిందమత్తమధుకరాయమాణచిత్త చతుర్విధకవితాసామ్రాజ్యభోజ చంద్రగిరి కృష్ణభూపాలకతనూజ భాగమాంబాగర్భశుక్తిముక్తాఫల తుపాకుల యనంతభూపాలక ప్రణీతంబైన విష్ణుపురాణంబునందుఁ బ్రథమాశ్వాసము ”

వచనభారత కర్త యయినవీరరాజు కుమారుఁ డగునంజరాజుచే నయితము పెక్కులు వచనకావ్యములు రచింపఁబడెను. నంజరాజు మైసూరురాజునొద్ద మంత్రియై మిక్కిలి యెన్నికకెక్కినవాఁడు. ఈతని నుద్దేశించి సంస్కృతమున నభినవకాళిదాసబిరుదాంకుఁ డగునృసింహకవిచే నంజరాజయశోభూషణ మనుపేరఁ బ్రతాపరుద్రీయమునకుఁ బ్రతిబింబముగా నొకయలంకారశాస్త్రగ్రంథము రచియింపఁబడెను. తద్గ్రంథకర్త గ్రంథావసానమున నిట్లు చెప్పుకొన్నాఁడు.

శ్లో॥ ఆలూరితిర్మలకవే రభినవభవభూతినామబిరుదస్య
సుహృదా నృసింహకవినా కృతి రకృతే నవీనకాళిదాసేన.

ఈ యభినవకాళిదాసు డైనందినప్రబంధ నిర్మాణసాహసికుఁ డఁట ! నంజరాజయశోభూషణము ప్రౌఢరచన గల గ్రంథము. నంజరాజుచే రచింపఁబడిన వచనకావ్యములందు

హాలాస్యమాహాత్మ్యము, విష్ణుభక్తవిలాసము, హరభక్తవిలాసము, కాశీమహిమార్థదర్పణము ననునవి నాకుఁ జేకుఱినవి. హాలాస్య మాహాత్మ్యమున నీనంజరాజు తనతండ్రిని

ఉ॥ ఆదరవాయి కొడ్డవసుధాధవమాళికిఁ గర్తె సజ్జనా
హ్లాదకరుండు షోడశమహామ్మృతదానధురంధరుండు తే
జోదినవాథుఁ డంచితయశోధవళీకృతసర్వదిక్తటుం
డాదినృపాలసన్నిభుఁ డుదారుఁడు వీరనరేంద్రుఁ డున్నతిన్.

అని వర్ణించెను. ఈతనికబ్బములలో హాలాస్యమాహాత్మ్యము స్కాందపురాణమందలి దక్షిణమధురాపురీమహిమమును దెలుపు హాలాస్యఖండమునకు సరిగాఁ దెలుఁగున రచియింపఁబడినడెబ్బదిరెం డధ్యాయములవచనకావ్యము. నంజరాజకవి వచనరచన మించుక ప్రౌఢమై మిక్కిలి చక్కఁగనే యున్నను వచనభారతశైలికిఁ గొంతతక్కువ నెన్నఁబడుచున్నది. అందందు వ్యాకరణాపాకరణము లేకపోలేదు. ఈకవినిగూర్చి శ్రీవీరేశలింగముపంతులుగారు కొంత వ్రాసియున్నారు. గ్రంథవిస్తరభీతిచేఁ దక్కినగ్రంథముల వదలి హాలాస్యమాహాత్మ్యమునుండియే మచ్చున కించుక వచనభాగ మును జదివెదను.

“ఆసిద్ధుండు భయభక్తియుక్తుం డగురాజుం గనుంగొని వాంఛితార్థమ్ము వేఁడుకొమ్మనుచుఁ బలుక నమ్మహీపాలుం డతనికిం బ్రణమిల్లి యంజలి గావించి సద్గుణవంతుఁ డగుపుత్రుం

గరుణింపు మని యభ్యర్థింప సిద్ధవేషధరుండును సచ్చిదానంద స్వరూపుండును భగవంతుండు నగుహాలాస్యనాథుండు 'ఓయి పాండ్యభూపాలకా! నీ కత్యంతైశ్వర్యసమేతుం డగుపుత్రుండును కీర్తియు దీర్ఘాయుష్యంబును గడపల శాశ్వతం బగుముక్తియుం గలుగుం గాక యని వచియించి గజకుంభంబువలన నేకావళియుం దీసి యిచ్చి యాశీర్వాదంబులచేత నతనిం బ్రసాదంబు నొందించి కరమ్ముల దదీయశరీరమ్ము నివిరి ముహూర్తమాత్రమునం దదృశ్యుం డగుటయు భూపాలుం డాసిద్ధుని విచిత్రం బవలోకించి యిది సుందరేశ్వరువినోదం బని మనంబునం దలంచినవాడై లింగమూర్తిధరుం డగునమ్మహాదేవుసాన్నిధ్యంబున కరిగి భక్తిచేత నమస్కరించి యిట్లని వినుతించె."

(ఇరువదియేడవ యధ్యాయము)

ఈ సంజరాజు కర్ణాటభాషయందు భారతేతిహాసమును వచనకావ్యముగా రచించెను. అదియును ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున గలదు.

ఈకాలముననే మధురాపురీనాథుడై నవిజయరంగచొక్క భూపాలకునాదరమున బెక్కులు వచనకావ్యములును పద్య కావ్యములును రచింపబడినవి.

రాజరాజనరేంద్ర, కృష్ణరాయ, రఘునాథరాయాదుల

వలె నీప్రభురత్నమును నాంధ్రకవీశ్వరుల కాలంబనై 1704 మొదలు 1731 వఱకు రాజ్య మేలెను. శేషము వెంకటపతి మొదలగువా రీతని యాస్థానకవులుగా నుండిరి. అహల్యాసంక్రందనవిలాసమును రచించినసముఖము వెంకటకృష్ణప్పనాయకుఁ డీతనికొల్వున నున్నవాఁడు. అహల్యాసంక్రందనవిలాసమున

గీ॥ ' సముఖమీనాక్షినృపగర్భవిమలజలధ
చంద్ర! వేంకటకృష్ణేంద్ర! శౌర్యసాంద్ర!
మునుపు జైమినిభారత మనఘ! వచన
కావ్య మొనరించి ఖ్యాతిఁ గాంచితివి కావె.'

అని తారాశశాంకవిజయ మొనర్చిన శేషము వేంకటపతి మెచ్చినట్లు వెంకటకృష్ణప్పనాయకుఁడు చెప్పుకొన్న జైమినిభారత వచన మిప్పు డీయాంధ్రసాహిత్యపరిషత్తువారిచే దక్షిణదేశము నుండి సంపాదింపఁబడినతాళపత్రగ్రంథములందుఁ గలదు. ఈతనిచే రాధికాసాంత్వన మనునేకాశ్వాసక్షుద్రప్రబంధము రచింపఁబడి నది. కొంతకాలముక్రింద నాతాళపత్రగ్రంథమును విక్రయించు టకై యొకరు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునకుఁ గొనివచ్చిరి. దానిని నేను జూచితిని. ముద్దుపళని రాధికాసాంత్వనమం దిందలి పద్యము లన్నియుఁ గలవు. మఱికొన్ని పద్యము లెక్కువగాఁ జేర్పఁబడి నాల్గాశ్వాసములుగా ముద్దుపళని గ్రంథము విభక్తమయి కన్పట్టుచున్నది.

విజయరంగచొక్కభూపాలుని సంస్థానముననే కవీశ్వరుఁడుగా నున్న వెలగపూఁడికృష్ణకవిచే వేదాంతసారసంగ్రహ మను వచనకావ్య మొకటి రచింపఁబడెను. అది నాకుఁ జేకూడలేదు. ఈవిజయరంగచొక్కభూపాలుఁడునయి తము శ్రీరంగమాహాత్మ్య మనువచనకావ్యమును రచించెను. ఈవచన మంతగా నిర్దుష్టమున వలనుపడదు

సులభముగా నర్థ మగునట్లు వ్యావహారికశైలిని రచింపఁబడినది. ఇంచుక యుదాహరించెదను.

“అంత నవి యన్నియు దేవేంద్రుఁడు విని కోపము చేసికొని ఐరావతము నెక్కి వజ్రాయుధమును దూసికొని దేవతల నెల్ల సహాయముగాఁ గూర్చుకొని ఆరా జుండుతపస్థలంబునకుఁ జనె. అప్పుడు ఇక్ష్వాకుమహారాజు పూజాద్రవ్యముల నెత్తుకొని దేవేంద్రునికి నెదురుగాఁ బూజ చేసెను. అప్పు డాదేవేంద్రుఁడు ఏకకాలంబుగాఁ గొండలు కొట్టు వజ్రాయుధమును జేతఁ దీసికొని కొట్టెను. ఆదెబ్బదెబ్బమునకు రాజైనతాను ఇసుమంతైన మనస్సు చలించక శ్రీమన్నారాయణమూర్తియందుండెడు నక్షత్రమును ధ్యానము చేసెను.” ఈగ్రంథము లేఖకదోషములతో నిండియున్నది. ఇంచుక సంస్కరించి యీభాగమును మచ్చు చూపితిని.

ఈవిజయరంగచొక్కభూపాలుకాలమున నింక ననేక వచనకావ్యములు రచింపఁబడినవి. మిత్రవిందాపరిణయమును రచించినకుందుర్తి వెంకటాచలకవియు నీతని యాస్థానమం దున్నవాఁడే. ఈతఁడు

సీ॥ "చదివినా వేమేను చదువ యోగ్యంబు లౌ
 నవి యెల్ల నిస్సంశయంబు గాఁగ,
వచనకావ్యములుగా రచియించినావు భా
 రతభాగవతములు రామకథయు."

అని విజయరంగచొక్కభూపాలుఁడు తన్ను మెచ్చినట్లు చెప్పుకొనెను. ఈతని భారత, భాగవత, రామాయణ వచనములు మనకు లభింపవలసియున్నవి.

పదపడి సమీరకుమారవిజయ మనుప్రౌఢప్రబంధ మొనర్చినపుష్పగిరితిమ్మనార్యుఁడు భాగవతసార మను వచనకావ్య మొనర్చెను. ఉత్తరరామాయణము నొనర్చినకంకంటిపాపరాజకవి కితఁడు మిత్రము. ఈతని భాగవతసారము సంస్కృతాంధ్రభాగవతములకు మిక్కిలిసంగ్రహముగా నున్నది. ఇందలివచనశైలి మిక్కిలి తేలికగాఁ దేటగా నింపు గూర్చుచున్నది. రచనాప్రౌఢిమ యీగ్రంథమందు తిమ్మకవి చూపలేదు. వ్యాకరణమును మీఱిన ప్రయోగము లందం దిందుఁ గన్పట్టుచున్నవి. ఇంచుక మచ్చు చూపుచున్నాఁడను.

# భాగవతసారము.

## షష్ఠస్కంధము.

"ఆలో యమకింకరులు అఘోరయమపాశమున నతనిని గట్టిగాఁ గట్టి, కొంపోవ నుద్యోగించఁగా, నంతలో ఆజానుచతుర్బాహులు, నీలమేఘశ్యాములు, సుగుణాభిరాములు, అమిత దయాళురు, విష్ణుదూతలు వచ్చి, ఆపాశము త్రెంచి పాఱవైచి, యమదూతలఁ బాఱఁద్రోలి, యాతనాశరీరధారి యైన ఆయజామిళుని వెఱవకుమని అభయమిచ్చి, సాదరించి పలికిరి. యమభటులును దిట్టలుగనుక, వెనుకకుఁబోయి మఱలివచ్చి, ఆ మకరకుండల, కిరీట, హార, కేయూర, వైజయంతీ, వనమాలికా భరణులైన విష్ణుదాసులఁ జేరవచ్చి 'అయ్యా మీరెవ్వరివారలు? మమ్మేలుంగరా పాపకర్మునిఁబట్టి మేము కొంచుఁబోవఁగా అడ్డగించ మీకుఁ బని యేమి యున్నది. యముని శాసనము మీకు నవ్వులాయెనా?" అనఁగా శ్రీమన్నారాయణుని కింకరులు పలికిరి. "రారోయి యమభటులారా! మీరు ధర్మరాజు దూతలుగనుక గుణవంతులు. మీపలుకులయందుఁ గఠినత్వము లేదు. ఈ బ్రాహ్మణుండు దురాచారియగును. ఇతండు దండింపఁదగియుండియు దండనకుఁ దగనివాఁడైనాఁడు. దండార్హుం డెవ్వాండు? దండింపఁదగనివాడెవ్వండు? ఆత్మకు కర్మానుభవము ఎటువలె

కలుగును ? వినిపింపుండనిన కేలుపుణుకుచున్న యమదూతలు పలికిరి. వినరయ్యా మహాత్ములారా! శ్రీభగవంతుని నిశ్వాసంబులు వేదములు. అందు చెప్పఁబడ్డది ధర్మ మనంబడును. వేదమార్గము తప్పినదే అధర్మమగును. ధర్మమున సుఖమును అధర్మమున దుఃఖమును ప్రాణులు పొందుదురు. ప్రాణి చేసిన పాపపుణ్యములకు సాక్షులు సేనా యున్నారు. కర్మ మేవేళ జీవుఁడు సేయునో ఆకాలమే కర్మమునకు సాక్షియై యుండును. కాఁబట్టి తప్పించుక పోఁగూడదు.”

ఈ కవియే రచించిన సమీరకుమారవిజయ మందున్న వచనముఁగూడ నించుక చదివినచో నాతనికి భాగవతసార మెంత తెలిసెఁగా నర్థమగునట్లు రచింపవలయు ననునభినివేశము కలదో తేటపడఁగలదు.

సమీరకుమారవిజయమందలి వచనము.

“ఇప్పుగిది నప్పరమపావనుం డప్పు డప్పురంబునఁ గప్పు జిగిగప్పిన నాయొప్పిదంబు విప్పగుమెప్పునం దప్పక చూచి ముప్పిరిగొను భక్త్యనురాగసంభ్రమంబుల నుత్ప్రాయణుం డగుటంజేసి యవ్వోచ్చెము వాసి మదీయసన్నిధిఁ బెన్నిధిఁ గన్న పేదచందంబున డెందంబు గందళింపఁ దనమనోవృత్తి ననుసరించు శరీరంబు సభృత్యపరివారంబుగా మఱచి దూరంబున నున్ననన్నుఁ జేరంబోని

కూర్చున్న యటుల తద్గగనంబున కుద్గమించునయ్యంచితాత్మ సంచరణంబున. ”

మనుచరిత్రమునకుఁ దర్వాత రచింపఁబడుచు వచ్చిన ప్రబంధములందలి గద్యములు తఱచుగా నీ తెఱఁగుననే యుండును.

ఈ తిమ్మకవియు దక్షిణదేశపువాఁడో యని సందియము కలుగు చున్నది.

ఎరశూర్ యమ్మావాద్యార్ చిన్నయ యనునతఁ డీతని భాగవతసారమును ద్రావిడభాషలోని కనువదించెను. ఆ ద్రావిడానువాదమున నిట్లు కలదు. “ఇందె పన్నిరెండు కందంగళుం, శ్రీ కృష్ణప్రీతియాయ్, తెలింగిలెయుం పుష్పగిరి తిమ్మయ్యర్ పణ్ణినది పార్తు ఎరశూర్ యమ్మావాద్యార్ శిన్నయ్య తమళ్ వచన మాహ పణ్ణినదు.”

ఈ పుష్పగిరి తిమ్మకవి 18-వ శతాబ్ది మధ్యమున నున్నవాఁ డని శ్రీ వీరేశలింగము పంతులవారు వ్రాసియున్నారు. కంకంటి పాపరాజు నుత్తర రామాయణమునకు, విష్ణుమాయావిలాసమునకు, నీకవి సమీరకుమారవిజయమునకు నూఱు సం॥ పైబడినకాలమున వ్రాయఁబడిన భిన్నదేశపుఁదాళపత్త్రిప్రతులు ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునఁ గలవు. 200 సం॥ పూర్వము వ్రాయఁబడినతాళపత్త్రిపుఁబ్రతులు నైజాం దేశమునందు

బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు సంపాదించినట్లు చెప్పు చున్నారు. భాగవతసారపు ద్రావిడభాషానువాదమునకే వ్రాఁబడిన తాళపత్త్రప్రతులు చూపట్టుచున్నవి. కావునఁ గం కంటి పాపరాజకవియు, పుష్పగిరి తిమ్మకవియు, నంతకంటెఁ బూర్వులై యుందురు. తిమ్మకవి భాగవతసారము ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున నసమగ్రముగాఁ గలదు.

మీఁదఁ బేర్కొనఁబడినవిగాక తంజాపురపు సరస్వతీ భాండాగారమునఁ గొన్ని వచనకావ్యములు గలవు త్రికామకవి ధేనుమాహాత్మ్యము, ఆచార్యవిజయము, సోమకవి బలభద్ర విజయము, పరమానందతీర్థుల బ్రహ్మవిద్యాసుధార్ణవము, మాటియు, మైరావణచరిత్రము, వివేకచింతామణి, వివేకసారము మొదలగువచనగ్రంథము లచ్చటి పుస్తకసూచియందుఁ గన్పట్టు చున్నవి. ఆగ్రంథములఁ గూర్చియుఁ దత్కర్తలగూర్చియు దద్గ్రం థములఁ బరిశీలించిన పదపడిగాని తెలుప వలనుపడదు. 17, 18-వ శతాబ్దులం దింకను గొన్ని వచనకావ్యములు దక్షిణదేశ మున నుప్పతిల్లియుండును.

భారతసావిత్రి, గోవ్యాఘ్రచరిత్రము మొదలగు కొన్ని చిన్నచిన్నవచనగ్రంథములను, మనకుటుంబములందు వృద్ధపరం పరగా స్త్రీపురుషులు కంఠపాఠము చేసి భగవద్గీతవోలెఁ బ్రతిదిన మును పారాయణము సేయుచుందురు. ఏనాఁ డెవ్వరిచే రచింపఁ

బడెనో తెలియరాదు గాని యీవచనములు చక్కనికూర్పు గల్గి మాధుర్యములై యొప్పు లొల్కుచున్నవి. భారతసావిత్రినుండి యించుక యుదాహరించుచున్నాఁడను.

“సుయోధనా! ఆదరంబుమీఁద నొసంగిన శాకమాత్రం బేనియు మనంబున నమృతోపమానంబై చను. భక్తి లేక యిచ్చిన నమృతం బయినను నిస్సారంబై చను. నాపలుకులు వినఁ గలవాఁడ వైతేని నీదురభిమానంబు విడిచి పాండునందనులకు రాజ్యంబు సమభాగంబుగాఁ బంచి యిచ్చి మీరు నూర్వురు వారేవురుఁ గలసి భోగ మనుభవించి యుండుట కార్యంబు.”

ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమున నొండు రెండు శతాబ్దములకు మున్ను దక్షిణదేశమునఁ గేవలవ్యావహారిక భాషలో రచింపఁబడిన వచనగ్రంథములు కొన్ని సేకరింపఁబడియున్నవి. విస్తరభీతిచే వానినిం గూర్చి యిచ్చట ముచ్చటింప మానితిని.

తొంటికాలమున సర్వలోకసామాన్యముగా సర్థ మగుటకై యెంత పండితు లయినను వ్యాఖ్యానాది గ్రంథముల రచియించునప్పుడు కేవలవ్యావహారికభాషనే యుపయోగించుచుండెడివారు. సర్వలక్షణసారసంగ్రహ మొనర్చి ప్రసిద్ధి కెక్కినచిత్రకవి పెద్దన్న (హరిశ్చంద్రనలోపాఖ్యానవ్యాఖ్యాత) తాళ్లపాక తిరువేంగళనాథుఁడు (అమరకోశవ్యాఖ్యాత) మొదలగులాక్షణికు

లను ప్రాచీనవ్యాఖ్యాత లెల్లరును దమగ్రంథములందు సంస్కార శూన్య మయినయీభాషనే యుపయోగించుచు వచ్చిరి. అప్పటి యీవచనరచనలందును గొంతవఱకు వ్యాకరణ నిరాకరణ మీకారణమును చేతనే సహకరించియుండు నని యీవఱకే వాకొనియుంటిని గదా.

19-వ శతాబ్దినుండి మనదేశమున వచన రచన యుపక్రమింపఁబడినది. చిన్నయసూరిగారు 19-వ శతాబ్ది ప్రారంభమునఁ జెన్నపురమునఁ బ్రఖ్యాతపండితులుగా నుండిరి. వీరినాఁటనుండియుఁ గల్పితవచనగ్రంథములు మిక్కిలి వెలువడఁజొచ్చినవి. వారివచనరచన మిక్కిలి పరస్ప్రౌఢమై సర్వాతిశాయి యై తర్వాతివారి రచనలకు మార్గదర్శక మైనది. ఇంతకంటె సుప్రసిద్ధ మగువీరిరచనను గూర్చి చెప్పఁ బని యుండదు.

చిన్నయసూరిగారి కాలమునఁ జెన్నపురముననే కోలా శేషాచలకవి యను నాతఁడు గోడే వెంకట జగ్గారాయలవారికిఁ గృతిగా నీలగిరియాత్రాచరిత్ర మనునొకహృద్య మగు గద్యప్రబంధముం గల్పించెను. ఈకవి రచన చిన్నయసూరిగారి గ్రోవను వెన్నాడుచు మిక్కిలి చక్కగా నున్నది. అతిశయోక్త్యాదికావ్యాలంకారంబులం దొలంగి కలరూ పెఱింగించువేడ్క నిఖిలజనను బోధం బగునట్లుగా రచించిన ట్లాతఁడు చెప్పికొనియెను.

ఇంచుక చదివెదను

"నావిడిదలు యగునిలు సొచ్చినయనంతరంబ యెచ్చటఁ గూర్చుండిన నెచ్చటఁ గ్రుమ్మరిన నెద్ది యంటిన నాసర్వం బతిశీత లం బయి గోచరించె నంతఁ గొంతతడవునకె చలి మొలతెంచె. మార్గశ్రమంబున న్విడిదల ప్రవేశించు సమకాలంబునన శీతంబు గోచరింప దయ్యె నని తోఁచెను. మఱునాఁడె నాకును నాబాసట యయి వచ్చిన శ్రీనివాసమొదలారికిని స్వదేశంబునుండి కొంపో యిన చలితొడుగు లొడళ్లం దొడిగికొన వలసివచ్చె అచ్చట నగ్ని యొకండు దక్క నెల్లపదార్థంబులు నతిశీతలంబు లయి యున్న యవి. కొన్నిపదార్థంబులు మంచుగడ్డలంబోలి శీతంబుచే మస్పృశ్యంబు లయి యున్నయవి. టెంకాయనూనియ నేతి తెఱంగునం బేరుచున్నది. వార్చినతోడన పులియయందు వడ్డిం చిన యన్నంబు కొంత ఘృతవ్యంజనాదులతోడ మొదల భుజించి యెడఁ గలుగఁ ద్రోచి యుంచిన యవశిష్టాన్నంబు భుజి యింపఁ బోయిన నొకానొకప్పుడు పర్యుషితకల్పం బయి కానం బడియెడు. మఱియు నచ్చటిచలి కేవగిళ్లు హుూహుూకారంబుఁ బుట్టించుచున్నయది."

స్కాందపురాణాంతర్గత మగుశివరహస్యఖండము ముది గొండబ్రహ్మయ లింగారాధ్యకవిచే వచనకావ్యముగా రచింపఁ బడెను. ఈరచన మించుమించుగాఁ జిన్నయ్యసూరిగారికాలముననే

యాంధ్రదేశమున రచింపఁబడియుండును. కవివిషయ మంతగాఁ దెలిసినది గాదు. ఈరచన సానుప్రాసశ్లేషము గల్గి తత్సమపద బహుళమై యుండుటకంటె కష్టముగనే యున్నను నిర్దుష్టమైనట్లు కన్పట్టుచున్నది. ముద్రితమై విక్రయింపఁబడుచున్న యీగ్రంథమునుండి యుదాహరణము గైకొనలేదు.

చిన్నయసూరిగారి తర్వాత ప్రెసిడెన్సీకాలేజీయం దాంధ్రోపాధ్యాయులుగా నున్న వేదలువారి సీతారామశాస్త్రిగారు కొన్ని సంస్కృతనాటకాదులను కథలుగా వచనమున రచించిరి. తేలికపలుకులతోఁ జక్కఁగా నర్థమగుచు నీవచనరచన యింపు గూర్చుచున్నది. చిన్నయసూరిగారికిఁ దర్వాతి వచనగ్రంథకర్తలందు సంహితను బాటింపక సంధి విడఁగొట్టి వాక్యములఁ గూర్చినవారిలో వీరు తొల్తటివారని చెప్పఁ జెల్లును. వీరి గ్రంథములును ముద్రితములై యున్నవి గావున రచన నుదాహరింపలేదు. పదపడి నాఁడునాఁటికి నాంధ్రవచనరచన క్రొత్తక్రొత్తదై పలుతెఱఁగుల వెలయుచున్నది.

## ౬

# భాగవతము.

అష్టాదశపురాణములలో భాగవత మొకటిగాఁ బేర్కొనఁబడినది. విష్ణుభాగవత మష్టాదశపురాణములలోనిది గాదనియు బోపదేవుఁడు దానిని గల్పించె ననియుఁ గొంద అందురు. పదుమూఁడవశతాబ్దిలోఁ బ్రఖ్యాతాంధ్రకవీశ్వరుఁడుగా నుండినపాల్కురికిసోమనాథుఁడు విష్ణుభాగవతము కల్పిత మన్నాఁడు. ఎవ్వరేమన్నను విష్ణుభాగవతము మిక్కిలి ప్రఖ్యాతిని గడించినది. అష్టాదశపురాణములలోను దాని కున్నంతగౌరవము మఱి యేపురాణమునకును లేదు. సంస్కృతమున దాదాపుగా నలువదివ్యాఖ్యానములు దాని కున్నవి. సర్వభాషలలోను నది పరివర్తిత మయినది. తెలుఁగుపరివర్తనములఁగూర్చి నే నిక్కడఁ గొంత పేర్కొందును.

## పోతన — సింగన.

పదునైదవశతాబ్దిపూర్వార్ధమున భాగవతము నిర్వురుకవీశ్వరులు తెలిఁగించిరి. అందొకఁడు బమ్మెర పోతరాజుగారు. ఈయన కృతి జగత్ప్రసిద్ధమేకదా! రెండవవాఁడు మడికి సింగనార్యుఁడు. ఈతఁడు దశమస్కంధముమాత్రమే ద్విపదకృతిగాఁ

తెనిఁగించినాఁడు. అది తంజావూరుపుస్తకశాలలో నున్నది. అది యింకను నాంధ్రలోకమునఁ బ్రకటితము గాకుండుట శోచనీయము.

పోతరాజుగారిభాగవతము సమగ్రముగా లభించినట్లీనడుమ నొకప్రవాదము పుట్టినది. ఆంధ్రసాహిత్యపరిషత్పుస్తకభాండాగారమున కది చేరినదఁట! కాని యాపుస్తకభాండాగారమున నది కానరాదు. అట్టిది దొరకియుండ దనుకొనెదను. ఏల యనఁగా పోతరాజుగారికిఁ దర్వాత నించుమించుగా నలువదియేఁబది యేండ్లకె యాయన గ్రంథమందలి లుప్తభాగముల నితరులు పూరించిరి. పోతరాజుగారికిఁ దర్వాత నలువదియేఁబదియేండ్లకే లభింపనియాభాగము లిప్పుడు లభించిన వనుటను బ్రత్యక్షముగా నాగ్రంథమును జూచినప్పుడు కాని విశ్వసింపరాదు.

పోతరాజుగా రేకశిలానగర (ఓరుఁగల్లు) వాస్తవ్యులు. ఆకాలమున నానగరము విప్లవములపాలయి యుండెను. విద్యావినోదముల కప్పుడక్కడ వెరవులేదు. ఈకారణమునఁ గొన్నాళ్లదాఁక నగ్రంథము నెవరుఁ దాఁకరయిరి. పరిశీలనము లేకపోవుటచేఁ గాఁబోలు నది కొంతశిథిల మయినది. రాజున కంకిత మిచ్చినచో నాతఁడు పదిప్రతులు వ్రాయించి పసువురచేఁ జదివించి వ్యాప్తికిఁ దెచ్చియుండెడివాఁడు. పోతరాజుగా రట్లు చేయరైరి సరిగదా మఱియు నట్టివారిని దిట్టిరి. సర్వజ్ఞసింగభూపతి కుపి

తుఁడై యాగ్రంథమును బూడ్పించినాఁడని కూడఁ బ్రతీతి కలదు. కాని దాని మనము విశ్వసింపరాదు. ఆయన దానివ్యాప్తికిఁ దోడు పడకుండవచ్చును. పోతరాజుగారు క్రీ 1420 ప్రాంతములం దుండిరి. క్రీ 1490 ప్రాంతములందుఁ గల హరిభట్టు పోతరాజు గారిభాగవతమున లోపించినభాగములను (షష్ఠస్కంధము ఏకాదశద్వాదశస్కంధములు) పూరించినాఁడు. పోతరాజుగారిగ్రంథము సమగ్రముగా నాకాలమున లభించుచుండినదో నాతఁ డాస్కంధములఁ బూరింపఁ బూనఁడు. హరిభట్టుకాల మిప్పుడు మనకుఁ దెలిసినదిగాన యిట్లు చెప్పఁగలిగితిమి. వెలిగందలనారయ, ఏర్చూరిసింగన మొదలగువారికాలములు మన కెఱుఁగ రాలేదు. వారు హరిభట్టునకంటెఁ గూడఁ బూర్వులుగా నుండవచ్చునేమో! అప్పుడే లభింపనిపోతరాజుగారిరచన మిప్పుడు లభించె ననుట విశ్వాస్యముగా నాకుఁ దోఁపదు. అయినను దొరకినపుస్తక మేదో నలుగురకన్నులకుఁ గానవచ్చు నేని యెల్లని నిర్ణయ మేర్పడును. అదియుఁ గానరాకున్నది. వ్రాఁతప్రతులలో సామాన్యముగా నన్నిరచనములకుఁ గూడఁ బోతరాజుగారిపేరే కానవచ్చును. అది భ్రాంతిజనకమై యుండవచ్చును.

## లుప్తభాగములఁ బూరించినవారు.

### హరిభట్టు

పోతరాజుగారు భాగవతము నద్వైతసిద్ధాంతానుగుణ

ముగా శ్రీధరవ్యాఖ్యననుసరించి రచించిరి. హరిభట్టువిశిష్టాద్వైత సిద్ధాంతానుగుణముగా షష్ఠైకాదశద్వాదశస్కంధములఁ బూరించెను. హరిభట్టురచన మంత హృద్య మయినదిగాఁ దోఁపదు. తెలుఁగుభాగవతము వ్రాఁతప్రతులు పెక్కులు ఏర్చూరిసింగన షష్ఠస్కంధముతోను వెలిగందలనారయయేకాదశద్వాదశస్కంధములతోను నుండును. కాని యక్కడక్కడఁ గొన్నిప్రతులలో హరిభట్టురచనములు కూడఁ గలసియున్నవి. అమృతప్రవాహము వంటి పోతరాజుగారిరచనము నశించుటచేతఁ దత్తుల్యముగా లుప్త భాగములను బూరింపఁగోరి హరిభట్టువలెనే మఱికొందఱుకూడ రచనముల నెఱపిరి. కాని యెవ్వరికిని దత్తుల్యరచనము పొసఁగ లేదు. అట్టిభాగ్యము భారతకవులకే లభించినది. రామాయణమునఁ గూడ నొక్కయయ్యలార్యురచనముమాత్రమే భాస్కర రచనముతో సరితూఁగఁ గల్గినది కాని తక్కినవి కొఱవడినవే.

## ఏర్చూరి సింగన

భాగవతపూరణములలో నేర్చూరిసింగన షష్ఠస్కంధరచనము ప్రశస్త మయినది. అది కొంతవఱకుఁ బోతరాజుగారిరచనమును బోలుచున్నది. హరిభట్టుషష్ఠస్కంధరచనముకంటె నిది యెంతేని సొలితరముగా నున్నది. సింగనకాల మెఱుఁగరాదు. ఆతఁడుకూడఁ గృష్ణరాయలకుఁ బూర్వుఁడే కావచ్చును. కువల

యాశ్వచరిత్ర మను గ్రంథమునుగూడ నాతఁడు రచించెను. అది దొరకలేదు.

## సర్వన

ఈతఁడుకూడ షష్ఠస్కంధమును రచించె నఁట! ఈతని గ్రంథము దొరకలేదు. ఈతఁ డెప్పటివాఁడో యెఱుఁగరాదు. ప్రబంధరత్నావళిలో నీతని గ్రంథమునుండి పద్యము లుద్ధరింపఁ బడినవి.

## రాచమల్లువారు

ఇద్దఱో ముగ్గురో వీరి పేళ్లేమో యెఱుఁగరాదు. వీరు గూడ షష్ఠస్కంధమును దెనిఁగించిరి. లక్షణగ్రంథములందు వీరి గ్రంథమునుండి యుద్ధరింపఁబడినపద్యములు పెక్కులు గానవచ్చును. శృంగారషష్ఠ మని వీరి గ్రంథమునకుఁ బేరు. షష్ఠస్కంధము నిందఱు పూరించుటకుఁ గలని శేష మేమో!

## వెలిగందల నారయ

ఏకాదశద్వాదశస్కంధములు వెలిగందలనారయ రచితములు ఇప్పుడు ముద్రిత మయియే యున్నవిగదా! ప్రాఁతవ్రాఁత ప్రతులలోఁ బెక్కింట 11, 12 స్కంధములు పోతరాజుగద్యముతోనే కానవచ్చుచున్నవి. ప్రతివిలేఖకులప్రమాదము కావచ్చును. ఏల యనఁగా నారెండుస్కంధములును మిక్కిలి సంగ్రహాము

నీరసరచనము గలిగియున్నవి. అది పోతరాజుగారి రచనము కానే రదు. కాని యొకవిశేషమున్నది. పోతరాజుగారియితరస్కంధము లందలిపద్యము లిందుఁ గొన్ని కలవు. హరిభట్టురచనమును నారయ రచనమును గొన్నిపద్యభాగములందును వచనభాగము లందును నైక్య మందుచున్నవి. పోతరాజుగారి రచనము శిథిలమై యుండదుకులుగాఁ గొన్నికొన్ని పద్యభాగములు వచనభాగములు గలిగియుండఁగా హరిభట్టును నారయయును వేర్వేఱుగా నా తు నకల నదికించి పూరించి యుందు రేమో! ఇట్లగునేని వారిద్వర రచనములలోఁ గొంతయైక్య ముండుటకుఁ గారణము గుదురును.

## సంజీవరాయకవి

ఈతఁడు నందవరవంశ్యుఁడు. ఎప్పటివాఁడో యెఱుఁగ రాదు. ఏకాదశద్వాదశస్కంధముల నీతఁడుగూడఁ దెలిఁగించెను. ఈతని రచనము ప్రశస్తమైనది. హరిభట్టునారయరచనములకంటె మే లయినది. కాని సమగ్రముగా లభింపలేదు.

## గంగన

పంచమస్కంధము నీతఁ డొకఁడే తెలిఁగించినాఁడు. ఇది యిప్పుడు భాగవతములో ముద్రిత మయియే యున్నది. ఈతనిరచనము నీరస మయినది.

## ఇతర రచనములు

ఇంతవఱకుఁ బోతరాజుగారిభాగవతమున లుప్తభాగములఁ బూరించినవారిఁ గూర్చి పేర్కొంటిమి. ఇఁక స్వతంత్రముగా భాగవతములను మరల రచించినవారిఁ బేర్కొందును. ద్వైతవిశిష్టాద్వైతమతముల మూలమునను చైతన్యమతముమూలమునను భాగవతపురాణమునకు గౌరవము మఱి మఱి హెచ్చఁజొచ్చెను. పోతరాజుగారి భాగవతము బహుప్రచారము గలది గాని యది యద్వైతసిద్ధాంత ప్రతిపాదక మగుటఁ గొందఱ కతృప్తిని గొల్పి యుండవచ్చును. ఈకారణమునఁ గూడ మఱికొందఱు మరల భాగవతమును దెలిఁగించి యుందురు.

### కోనేరునాథుఁడు

ఈతఁడు కృష్ణరాయలయవసానకాలమందుఁ గలఁడు. బాలభాగవత మనుపేరఁ బద్యరూపముగాను ద్విపదరూపముగాను నీతఁడు రెండుగ్రంథముల రచియించినాఁడు. ఈతని రచనము రసోత్తర మయినది. విశిష్టాద్వైతసిద్ధాంతానుగుణముగా నీతఁడు గ్రంథము రచించెను గాని యనేకస్థలములందుఁ బోతరాజుగారిరచనమును బుడికిపుచ్చుకొన్నాఁడు. ఈతని పద్యగ్రంథ మింతవఱకు ముద్రితము గాకుండుట శోచనీయము. ఈతనిద్విపదరచనము కొంత యిటీవల ముద్రిత మయినది. కాని యది కూడ సమగ్రముగాఁ బ్రకటితము కావలెను.

## తేకుమళ్ల రంగశాయికవి

ఈతఁడుకూడ భాగవతమును ద్విపదరూపమునఁ దెనిఁగించినాఁడు. కోనేరునాథునిద్విపద సంగ్రహముగా నున్నది గాని యీతని ద్విపద విస్తృతముగా నున్నది. పుష్పగిరితిమ్మకవి సాహాయ్యమునఁ దా నాగ్రంథము రచించినట్లు కవి చెప్పుకొన్నాఁడు. వాణీవిలాసవనమాలికాదిబహుగ్రంథముల నీతఁడు రచించినాఁడు.

## పుష్పగిరితిమ్మకవి

ఈతఁడు ద్విపదభాగవతరచనమున రంగశాయికవికిఁ దోడుపడుటే కాక తెనుఁగున వచనభాగవతము గూడ రచించినాఁడు. అది తేటగా నున్నది. దానిఁ జూచి తదనుసారముగా నరవమున నొకకవి వచనభాగవతము రచించినాఁడు.

## తరిగొండ వేంకమాంబ

ఈమెకూడ భాగవతమును ద్విపదరూపమున రచించెను. ఈమె గ్రంథము ఓరియంటల్ లైబ్రరిలో నున్నది. వేఱొకప్రతి క్రొత్తగా చిత్రాడలో నాంధ్రపరిశోధకమండలివారికి దొరకినది. అది యింతవఱకుఁ బ్రఖ్యాత మయినది గాదు. మహనీయురాలగు స్త్రీ రచించిన దగుటచేతను సుకుమారకవిత యగుటచేతను నిది ప్రకటింపఁదగినది.

## యక్షగానములు

ఇప్పుడు పేర్కొనఁబడిన రచనములు గాక యక్షగానరూపముగా నున్న భాగవతరచనము లనేకము లున్నవి. అందుఁ గొన్ని రసోత్తరము లయినవి. సిద్ధేంద్రుఁ డనుయోగి రచించినగ్రంథము వానిలోఁ బ్రఖ్యాతము. కూచిపూఁడి (కృష్ణామండలము) బ్రాహ్మణులు పారంపర్యముగా నాయతీంద్రునికృతిని బ్రదర్శింతురు. ఇంత నెందఱో రచించినయక్షగానకృతులు నున్నవి. అన్నింటిలోను నసామాన్యముగాఁ బేర్కొనఁదగిన దింకొకటి కలదు. సంస్కృతమునఁ గృష్ణలీలాతరంగిణి యనుపేర భాగవతదశమస్కంధమును గేయరూపమున రచించినమహనీయులు నారాయణతీర్థులవారు తెలుఁగున రచించినపారిజాతకథ. ఇది భాగవతమందలి పారిజాతాపహరణకథమాత్రమే.

మీఁదఁ బేర్కొనఁబడిన కవీశ్వరుల రచనములలోనఁ బ్రఖ్యాతము లయినవానినుండి మచ్చుతునుకలఁ జూపుదును.

## భాగవతము.

### హరిభట్టు—షష్ఠస్కంధము.

గీ॥ శ్రీసమేత! నిన్ను సేవింప నొల్లక
మాటి శుభము పొందఁ గోరువాఁడు
చెంగలించి శునకలాంగూలముఖమున
నదిని దాఁటఁ గోరునట్టివాఁడు.

ఉ॥ అరయఁగఁ బ్రహ్మసంభవుఁడు నాత్మనివాససరోజకర్ణికాం
తరమున నుండి తీవ్రపవనప్రహితాధికవీచినాళికా
పరిచితఘోషభీషితవిభాస్వరమార్గ్గమునందు మగ్నుఁడై
పఱువడితో నిమ్ముఁ దలఁచి పాఁగము నొందఁడె భక్తవత్సలా!

శా॥ ఓరాజీవదళాభిరామనయనా! యోసత్యసన్మంగళా!
యోరాత్రించరకంఠనాళదళనా! యోసర్వలోకాధిపా!
యోరత్నాకరమేఖలాపరివృఢా! యోభక్తకల్పద్రుమా!
యోరాకాహరిణేందుభవ్యవదనా! యోపద్మనాభాచ్యుతా!

శా॥ శ్రీవత్సాంకితమూర్తయే విమలరాజీవాక్షయుగ్మాయ ల
క్ష్మీవక్త్రాంబుజషట్పదాయ వసుధామిత్రాయ సర్వాత్మనే
భావజ్ఞాయ కృపాకరాయ హరయే భక్తార్తసంధాయినే
గోవిందాయ సమస్తదైత్యనివహక్రూరాయ తుభ్యం నమః.

శా॥ ప్రస్ఫాన్నామరరాక్షసుల్...భూభారాపహర్తల్ మహే
శస్కందాదినుతప్రభావుఁ గమలాసంవాసరాజన్మహో
రస్కున్ విష్ణుఁ దలంచి భాగవతపౌరాణీయమైనట్టి ష
ష్ఠస్కంధంబుఁ దెనుంగుఁ జేసెదను కృష్ణప్రీతిగా వేడుకన్.

## సంజీవరాయకవి—ఏకాదశస్కంధము.

కం॥ ఒకనాఁడ కొప్పాటికిఁ గొం
కక కృష్ణకుమారు లేఁగి గర్వితులై కృ
ష్ణకుమారుఁడైన సాంబుని
నెకసక్కెము మీఱఁ జేసి రింతిగ నధిపా.

వ॥ ఇట్లతనియుదరంబున వస్త్రగ్రంథి నున్నతంబై యుండునట్లుగా నంగనావేషధారిఁ గావించి మునులకడకుం దోడ్కొని చని ప్రణతులై యిట్లనిరి.

తరల॥ పరిమసంయములార యిచ్చెలి బాల గర్భిణి దీనియం
దరయఁ బుట్టెడుపట్టి సూనుఁడొ యాఁడుబిడ్డయొ సిబ్బితిం
బెరసి మీ మ్రముగంగఁ జాలఁదు పేర్మిఁ జెప్పఁగ నోపు నీ
తరుణి మెచ్చఁగ మీకు హస్తగతంబు కాదె యశేషముల్.

మ॥ అనుచుం బ్రాఁతని చిచ్చుఁ ద్రొక్కినవిధంబై యాత్మఁ గ్రోధంబు పె
ల్లునఁ గన్నుల్ దొరఁగాన వీరి పెన్రుత్రుళ్ళుల్ బాపకున్న న్మహా
జనులం గేరెద రంచు నెంచి యదువంశం బెల్లఁ బోకార్పఁగా
ఘనమై పుట్టెడు నిన్నుఁ గోఁకలి వధూగర్భంబునం బోండనన్.

గీ॥ యదుకుమారులు భయమున నవయవములు
వడవడ వడంక సాంబగర్భభవముసల
మపుడ కన్గొని యద్భుత మంది యొగ్గి
గతియయో యని వగచిరి కౌరవేంద్ర.

వ॥ మఱియు.

చ॥ కటకట మంచిభాగ్యములు కాలగతిం గడవంగవచ్చునే
యిటు చను దించి సాధుజనహేళన చే మొనరించుటంగదా
పటుతర మైనశాపమున భంగము వచ్చెఁ గులంబు కెల్ల నా
రట మొక సంభవిల్లె ఘనరా జిఁక నే మనువాఁడొ దీనికిన్.

ఉ॥ ఆఁకటి కోర్చి దప్పికి భరింపక కాత్తిని శీతికాదులన్
గైకొన కింద్రియంబుల నఖండధృతిం గుదియించియుం దుదిం
జీకులువోలెఁ గ్రోధమునఁ జేసియె గోష్పదమగ్నులై కటా
వ్యాకులతన్ వహింతురుగదా! భువిఁ గొందఱు నిష్ఠ డిందఁగన్.

చ॥ తఱుగుమదంబున న్నిజపదంబులకుం బ్రణమిల్లు దేవులం
జెఱునగ వొప్పఁ జూచి మునిశేఖరుఁ డిట్లను వీరిలోపలం

దెఱవ నొకర్తుఁ గైకొనుఁడు దివ్యసభాభరణంబు గాఁగ న
క్కఱ గలదేని భీతివడఁగాఁ దగ దాత్మల మీ కొకింతయున్.

చ॥ వినుము విగాఢతర్షత వివేకము మాని సుఖం బటంచు గొ
బ్బునఁ బశుహింస సేయుదురు భూమి దయారహితాత్ములై కటా
వెనుకను బంచతం బెరసి వేదన బొందుదు రయ్య మున్ను జ
చ్చినపశుసంఘముల్ దము గ్రసింపఁగ దిక్కఱి ఘోరభంగులన్.

చ॥ ప్రియతమవస్తు వెద్దియుఁ బరిగ్రహయోగ్యము గాదు దానఁ గ
స్తియ సమకూడు సౌఖ్యములఁ దెచ్చు నకించనభావ మెప్పుడున్
రయమున మింట నొక్క కురరం బెఱచిం గొనిపోవు చన్యముల్
పయిఁబడ దానిఁ బోవిడిచి పార్థివముఖ్య వహించె నిర్వృతిన్.

మ॥ సరసావార్యవగాహశీతలములై సంఫుల్లసూనచ్ఛటాం
తరరేణూత్కరపశ్యతోహరములై నానాలతాలాసికా
చరణన్యాసవిధానదేశికములై సంచారమున్ సల్పె మం
ధరవాతంబులు సంయమీంద్ర తను నైదాఘాంబువుల్ డిందఁగన్.

## కోనేరునాథుఁడు—బాలభాగవతము.

ఉ॥ విశ్వముఁ గల్గఁజేసియును విశ్వములోనన యుండియున్ గృపా
శాశ్వతలీల విశ్వ మనిశంబును బ్రోచియు నొక్కవేళ న
వ్విశ్వము లీలకై పరిభవించియుఁ దా వెలుఁగొందు నెవ్వఁ డా
విశ్వము దాన యైనకృతి వేడుక నిప్పుడు నన్నుఁ గాచుతన్.

మ॥ బిసినీపత్రములందుఁ గానఁబడునబ్బిందుచ్ఛటల్ సాటిగా
నసువుల్ సంచలనంబు నొందెడి సమోహం బయ్యెడిన్ మేను స
వ్యసనం బయ్యెడు నింద్రియవ్రజము దిక్కై ప్రోవ నన్యుండు లేఁ
డసమానప్రతిభావ నా దయినకుయ్యాలింపు వేగంబునన్.

మ॥ అమితబ్రహ్మరహస్యమార్గగమనాయాసక్తిమచ్చేతసే
విమలాచారజుషే పదత్రయమితోక్యం విష్ణురూపాయ తు
భ్య మహం సంప్రదదే నమో నమమ నిత్యప్రీతిరస్తంచు ని
స్తముఁడై గ్రక్కున ధారవోసె బలి యుత్సాహంబు సంధిల్లఁగన్.

మ॥ మమతాహంకృతు లుజ్జగించి మదిఁ గామశ్రేణి నిశ్శ్రేణికా
క్రమణభ్రాంతిఁ బరిత్యజించి శమసామ్రాజ్యస్థుఁడై యిందిరా
రమణున్ విష్ణు నశేషశేషిఁ గరుణారాశిం దదిష్టైకశే
షమతిన్ మర్త్యుఁడు గొల్చు టెంతయు నభీష్టం బార్య నా కెప్పుడున్.

శా॥ లోకప్రస్తుతశాస్త్రజాలముల నాలోకించియున్ లీప్సచేఁ
బైకొన్నట్టివిచారమార్గమున నొప్పం జూడఁగా నిశ్చితం
బేకం బయ్యె బహుప్రకారముల లక్ష్మీశుండు నారాయణుం
డేకాలంబున నెల్లవారల కనుధ్యేయుండు సంసేవ్యుఁడున్.

ఉ॥ ఎడ్డెకుఁ జేయుసత్కృతము వెంగలి కిచ్చినయట్టికన్నియల్ (?)
గ్రుడ్డికిఁ జూపునద్దములు కుత్సితవృత్తికిఁ జేయుదానముల్
గొడ్డగునట్టిమ్రాని కొనగూర్చినప్రోదులు చక్రహస్తుపై
నొడ్డినభక్తి లేనిగతయుక్తికిఁ జెప్పినశాస్త్రజాలముల్.

## రాచమల్లువారి శృంగారషష్ఠము.

మ॥ అని యీవిద్య గురుప్రసన్నుఁడు దృఢస్వాంతుండు నాచిత్రకే
తునృపాలాగ్రణి కిచ్చి నారదమునీంద్రుం డంగిరోయుక్తుఁడై
చనియెన్ బంకజగర్భగేహమున కాసర్వంసహాభర్త దా
ని నుపాసించి భజించె నేడహములన్ విద్యాధరాధ్యక్షతన్.

క॥ అనుటయుఁ గృష్ణద్వైపా
యనతనయుం డిట్టు లనియె నవనీతమతిన్
వినుమతిగుహ్యము నారా
యణాకవచము భక్తవాంఛితార్థప్రదమున్.

గీ॥ తత్తరమున నాపోశన మెత్తఁబోయి
భూసురుం డెత్తు నుత్తరాపోశనంబు.

సీ.గీతి॥ వలవదు భయంబు వా రెంతవార లైన
నట్టివారలు మన కగ్గమైనవారు
వారు నిరయంబునకుఁ గాపు వచ్చువార
లనుచు బుద్ధిగఁ జెప్పె మార్కండసుతుఁడు.

గీ॥ తల్లియును దండ్రి దైవంబు తలఁప గురుఁడ
కాఁడె యితఁ డేమి చేసినఁ గనలఁ దగునె
నాస్తికాధమ! యోరి! యన్యాయవృత్తి
నాస్తి తత్త్వం గురోః పర మనఁగ వినవె?

చ॥ పెరిగినయాసున న్నెమలిపింఛములం బురివిప్పఁ దోలుని
సరసిరుహాక్షి వేనలికి సాటిగ నిల్వఁగ నోడి చొచ్చె నిం
దిర శరణంబు తేఁటిగమి నీలము లింద్రునిపేరు గాంచెఁ జె
న్నిరులు సుహాశ్రయంబు గనియెన్ నెఱి గల్గినవారి కోర్తురే.

క॥ నెరసె నెలసంజ చక్రక
సరసీరుహవిరహవేదనసంసూచకమై...

క॥ అరిగి సమిత్ప్రసవకుశాం
కురపక్వఫలోత్కరంబు గొని గృహమునకున్
మరలి యిట వచ్చునప్పుడు
ధరణీసురనందనుండు దనకట్టెదుటన్.

౭

# మధురకవితలు.

ప్రాచీనాంధ్రలక్షణకర్తలు తెలుఁగుఁగవిత్వమును 'ఆశు, మధుర, చిత్ర, విస్తరము' లనుపేర్లఁ జతుర్విధములఁ విభజించిరి. యక్షగానాదు లందులో మధురకవిత్వమునఁ జేరును.

"మధురకవిత్వం బన్నది నాటకాలంకారంబులు, కళికోత్కళికలు, విభక్త్యధిదేవతోదాహరణములు, సప్తతాళనటనలు, నట్టొట్లు, గీతప్రబంధంబులు, చతుర్భద్రికాష్టభద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, త్యాగఘోష, చతురుత్తరసంఘటనలు, యక్షగానంబున వెలయుపదంబులు, దరువులు, నేలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనంబులు, ఉయ్యాలజోలలు, జక్కులరేకుపదంబులు, చందమామసుద్దులు, అష్టకంబులు, ఏకపద ద్విపద త్రిపద చతుష్పదాష్టపదులు నివి యాదిగాఁ గల్గునన్నియు."

— లక్షణదీపిక.

మధురకవితలు ప్రాయికముగా భాష, భావము, ఛందము దేసిగా నుండుటచే సంగీతసంస్కారము గలిగినసామాన్యజనుల నాలుకలమీఁద నాట్య మాడునవిగా నుండును, గానలోలుత నవి యంతగా లిపి కెక్కక పోయెను. సంస్కృతప్రాయ

రచనలు గలచిత్రవిస్తరకవితల ప్రాబల్యమునఁ గూడ వానికి సత్కవితలలోఁ బరిగణన మంతగా లేకపోయెను. ఇటీవల కవులుగాఁ బురాణప్రబంధరచయితలే పరిగణింపఁబడుచుండిరి గాని మధురకవితారచయితలు లెక్క కెక్కకున్నారు. ఆంధ్రవాఙ్మయవృక్షమున ముఖ్యమయిన మాధురకవితాశాఖ యిందాఁక సుపరిశీలనము లేకయే యున్నది. ఇక్కడ నాకిప్పుడు దేసి నాటకము లనఁదగినయక్షగాన రచనముల ప్రశంసయే ప్రసక్త మగుటచే వాని పుట్టుపూర్వోత్తరములఁ గూర్చి మాత్రము నాకు గోచరించినవిషయములఁ గొన్నింటి వివరింతును.

## దేశిదృశ్యరచనలు.

యక్షగానము లన్న పేరు గలదృశ్యరచనములు నన్నయాదుల కాలమున నున్న వనుటకుఁ బ్రబలాధారములు గానరావు. కాని యానాఁడో కొన్ని దేశిదృశ్యరచనము లున్న వని మాత్రము గుర్తింపనగును. నన్నయ కిన్నూఱేండ్లకుఁ దర్వాత నున్నపాల్కురికి సోమనాథుఁ డిట్లు చెప్పినాఁడు.

"భ్రమరులు జాళిమాల్ బయకముల్ మెఱసి
రమణఁ బంచాంగ పేరణి యాడువారు
ప్రమథపురాతన పటుచరిత్రములు
క్రమ మొంద బహునాటకము లాడువారు
లలితాంగ రసకళాలంకారరేఖ

ఉలవడ బహురూప మాడెడువారు

*　　*　　*　　*

అమరాంగనలు గిరి నాడెడుమాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు
ఆవిష్కృత యుక్తు లాడెడునట్టి
భావన ప్రేంకణలపై నాడువారు
భారతాదికథలు చీరమఱుంగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగఁ గంభసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు
నాదట గంధర్వయక్షవిద్యాధ
రాదులై పాత్రల నాడించువారు

పర్వతప్రకరణము — పండితారాధ్యచరిత్రము.

పై ద్విపదలందు, నేటివీథినాటకములు, బొమ్మరాటలు, తోలుబొమ్మలాటలు మొదలగునవి పేర్కొనఁబడినవి. ఇట్టి సంప్రదాయములు వీనిఁ బేర్కొన్న సోమనాథుని కిన్నూఱేండ్ల పూర్వకాలమునఁ గూడ నుండుట సంభావ్యమే. తెలుఁగునకు సాటిభాష లగుద్రవిడ కర్ణాటభాషల పద్ధతులను బట్టియుఁ దెలుఁగులో నిప్పు డుపలభ్యమానము లగుచున్నకొన్ని ప్రాచీనదృశ్య రచనములతీరులను బట్టియు, ద్రావిడభాషాసామాన్యముగాఁ దొలుత వెలసిననాటకరచనల స్వరూపము కొంత గుర్తింప వచ్చును.

## కురవంజి [1]

తొలుత ద్రావిడభాషలలో వెలసినదృశ్యరచనములు కురవంజు లనఁబడునవి. ఆంధ్రకర్ణాట ద్రవిడదేశముల యరణ్యములలో వసించునాటవికులు, చెంచులు, కురవలు (క్రోవ, కోయ) అనువారు. అందుఁ గురవజాతివారి యంజె=అడుగు (నృత్యవిశేషము) కురవంజె యనఁబడెను. చిందు, గంతు, గొండ్లి, అంజె, అంగ—ఇత్యాదులు నృత్యవిశేషములు. ఆంధ్రదేశమున బహుకాలమునుండి శివక్షేత్రము లగుశ్రీశైలము ఇంద్రకీలనగము (బెజవాడకొండ) మొదలగుపర్వతములమీఁదను, నృసింహక్షేత్రము లగువేదాద్రులు (పెక్కు లున్నవి. మంగళాద్రి, సింహాద్రి, గరుడాద్రి, మాల్యాద్రి, వెంకటాద్రి,) మొదల

1. వాల్పిచి గుజ్జరి విల్వేడు (?) దండలాస్యము కందుకక్రీడ యల్లికయును కొరవంజి(జె) శుభలీల గుజరాతి దేసి చొపదము జక్కిణి దురుపదము పదన పదదౌత్యమును జోగిపదచాళి శారదాసామ్రాజ్యమును సందు సవతిమచ్చరంబులు నాట్యకదంబంబు మొదలైన నాట్యముల్ హావణించునవగసజ్జ

(విజయరాఘవనృపాలుని ప్రహ్లాదచరిత్ర—యక్షగానము) ఇందు 'కొరవంజి' నృత్యవిశేషముగానే పేర్కొనఁబడినది.

2. కురవంజి, కురవ + అంజె (ఆంజ, అంజె, అంజ యను రూపాంతరములు) కురవంజియు కురవంజెలనుండి కురవంగి అనురూప మేర్పడి యుండవచ్చును.

గుపర్వతములమీఁదను వర్షోత్సవములు (యాత్రలు, జాత్రలు, జాతరలు) జరుగునప్పు డక్కడికి నాగరకప్రజలు చేరుచుండు వారు. వారి వినోదమునకై యక్కడి యాటవికులు రాత్రులందు నృత్యవిశేషములు నెఱపి ధనార్జనము చేయుచుండువారు. అక్కడక్కడి కొరవజాతులవారు చేయునృత్యములు కొరవంజులనఁబడెను. కొరవంజె యన్నపేరు తొలుత వారి నృత్యమునకును, బిదప నృత్యవిశిష్ట మయిన వారి చిన్నిచిన్ని గేయరచనలకును, నాపై కురవజాతివారికిని గూడఁ బేరైనది. కురవజాతివారు తొలుత చేయునృత్యవిశేషము కాలక్రమమున నాయా పర్వతప్రదేశముల స్థలమాహాత్మ్యకథలతోను, శివవిష్ణులీలాకథలతోను మిళితము లయి గేయవిశిష్టనాట్యరూపములను బడసెను. అపుడు మాయాకిరాతవేషు లగుపార్వతీశివులకథలతో నున్నకిరాతార్జునీయము, నృసింహస్వామి చెంచీతను బెండ్లాడు స్థలమాహాత్మ్యకథలు (చెంచీతకథ) కురవంజులుగా వెలసెను. ఇట్లు వెలసినయాదృశ్యరచనములు తొలుత నత్యల్పముగా గేయభాగములును విశేషముగా నృత్యమును గలవై యుండెను. అవి సింగి, సింగఁడు — అని యిద్దఱు పాత్రములు గలవై సంస్కృత వీథీనాటకములఁ బోలియున్నవి. సింగి, సింగఁడు సంస్కృతనాటకములలోని నటీనటులవలె నాలుమగండ్రు. వీరిద్దఱే కథాపాత్రము లగుచుందురు. కొన్నింట గథాసంధాయకుఁడు — సంధివచనములఁ

జెప్పువాఁడు—విదూషకుఁ డనఁదగినవాఁడు—మూఁఢవపాత్రము—కోణంగి యనువాఁడు—( పిదప చోడిగాఁడు ) కాన నగును. కోణంగి సంస్కృతనాటకములలోని విదూషకస్థానీయుఁ డగుట స్పష్టముగాఁ గానవచ్చును. సంస్కృతనాటకములలోని ధ్రువాగానమే కురవంజులలో దరు వనఁబడెను. దేశిరచనలలోనుండి సింగి, సింగఁడు, కోణంగి, దరువు అనునవి నటీనటులుగను, విదూషకుఁడుగను, ధ్రువగను సంస్కృతనాటకములఁ జేరనేమో యని కూడ యోజింపఁదగినట్లున్నది. ఎంతో కాల మిట్లు కొండపట్టులందు సాఁగుచుఁ బెంపొందినగేయనృత్యసందర్భములు నగరములకుఁ గూడఁ గ్రమముగా వ్యాపించినవి. చెంచులు, కురవలు నడవులనుండి పులిగోళ్లు, అడవిపందికోఱలు, అడవిపండ్లు, వెదురుబియ్యము, వెదురుబెత్తములు, పిల్లనగ్రోవులు, సూదంటురాళ్లు, ఓషధులు, తేనె మొదలగునాటవికవస్తువులను నగరములకుఁ గొనివచ్చి యమ్ముచు నప్పుడప్పుడు తమగేయనృత్యవిశేషములను నగరములందును, బల్లెలందును బ్రయోగించుటచే నవి నాగరకదేశములందును వ్యాపించెను.

## యక్షగానములు

ఇట్లు నగరములందు నభిరుచి గొల్పినయాగేయవిశిష్టనృత్యదృశ్యములు, జక్కులవారు(యక్షులు, కళావంతులు)తర్వాత

నగరములందును బ్రయోగింపఁ జొచ్చిరి. వీరి ప్రయోగములందు దృశ్య మయిననృత్యాభినయములతోపాటుగా నధికముగా గేయ వచనరూప మైనశ్రవ్యరచనము గూడఁ జేరెను. కురవంజులకంటె యక్షగానములు పర్యాప్తముగా శ్రవ్యము లగుకవిరచనములుగ గలవి. వీరిరచనములలో బహువిధము లగుపురాణకథ లెల్లఁ జేరినవి. కురవంజులలోని సింగి, సింగఁడుపాత్రలు మాఱి రాము నల హారిశ్చంద్ర సీతా దమయంతీ చంద్రమత్యాదిపాత్రలు వచ్చినవి. కాని వీనిలో నాటకరచనాసంస్కారసూచకముగా, 'ఎఱుకతసాని' పాత్రము వెలసినది. కురవంజులలోని దేసిరచనల కంటె నత్యధికముగా వీనిలో దేసిచ్ఛందోబద్ధము లగుగేయరచనలు ప్రబలినవి. రాజసభలలో, దేవోత్సవములలో, ఊరిజాత్రలలో యక్షగంధర్వాదివేషముల ధరించి [1]వేశ్యలు ప్రదర్శించునని గావు

1. శ్రీనాథుఁడు భీమఖండమున ద్రాక్షారామభీమేశ్వర మహోత్సవ సమయములందు సానులు (వేశ్యలు) వేషములు వేసికొని నాటకము లాడుట నిట్లు వర్ణించెను.

సీ॥ విరులదండలతోడి వేణికాభాగంబు
పొంకంబు పిఱుఁదులఁ బొరసి యాడ
మణితులాకోటికోమలఝుణత్కారంబు
రవలి మట్టెల మ్రోఁత యనుఘటింపఁ
గుగురు నిండిన చిన్న గుబ్బచన్నులమీఁద
ముత్యాలసరంబు మురువుఁ జూప

నను, నృత్యధర్మములకంటె గేయధర్మము లధికముగాఁ గలవి కావునను నివి యక్షగానము లనఁబడెను. కళావంతులలో నొక తెగకు నేఁడు జక్కులవా రను పేరు గలదు. యక్షాదివేషముల ధరించి నృత్యగానప్రదర్శనములను గావించుటచేతనే వారి కాపేరు వచ్చియుండవచ్చును. శ్రీనాథుఁడు క్రీడాభిరామమున జక్కుల వారిని గూర్చి కొంతప్రశంస నెఱపినాఁడు.

సీ॥ కోణాగ్ర సంఘర్ష ఘుమఘుమధ్వని తార
కంఠస్వరంబుతో గారవింప

నలమాన తాటంక వజ్రాంకురచ్ఛాయ
లేఁత వెన్నెలఁ బుక్కిలించి యుమియ
సాని యీశానియై మహోత్సవమునందుఁ
గేల నవచంద్రకాంతపుగిన్నె పూని
విధి భిక్షాటన మొనర్పు వేళఁ జేయు
మగలు నృత్యంబు జగముల మగలు కొలుపు. (అ. ౧. ౧౦౫.)

వ॥ మహోత్సవమండపమునందుఁ బేరోలగం బుండి, కుండలీదండ లాసక ప్రేరణీ ప్రేంకణ సింధుకందక ఘనూళి చేల మత్తల్లీహల్లీసకాది నృత్యంబు లాలోకించుచు. (అ. ౧. ౧౧౭.)

శ్రీనాథునికాలమునకే దేవోత్సవాదులయందు వేశ్యలు వేషములు కట్టి నాటకములఁ బ్రదర్శించుసంప్రదాయము ప్రబలినది.

“కీర్తింతు రెవ్వానికీర్తి గంధర్వులు–గాంధర్వమున యక్షగానసరణి” భీమ ఖ–అశ్వా. శ్రీనాథునికాలమున యక్షగానములు ప్రబలియుండుట దీనిచేఁ దెలియనగును

మని బొగ్గు బోనాన నసలుకొల్పినకన్ను
కొడుపుచేఁ దాటించు నెడప దడవు
శ్రుతికి సుత్కర్షంబుఁ జూపంగ వలయుచోఁ
జెవిత్రాడు బిగియించు జీవగఱ్ఱ
గిల్కు గిల్కున మ్రోయుకింకిణీగుచ్ఛంబు
తాళమానంబుతో మేళవించు
రాగమునసుండి లంఘించు రాగమునకు
నురుము యూరుద్వయంబుపై నొత్తిగిల్ల
కామవల్లీమహాలక్ష్మికై టభారి
వలపు నాడుచు వచ్చె జక్కులపురంధ్రి.

## అప్పకవి యక్షగానలక్షణము నిట్లు చెప్పినాఁడు.

సీ॥ తుద నేడులఘువులు తొలఁగించి చదివినఁ
త్రిపుటకు వృషభగతిపదయుగము
లలిఁ గడపల నొక్క లఘువు మానిన జంపె
మను ద్విరదగతిసమపదయుగము
గురు తగురచ్చెరకుఁ దురగవల్గనా
హ్వాయ మేకతాళి యామధురగతికి(?)
సంక్రీ కీర్త్యాదినాలు గటతాళముస మాత్ర
లోలి విశ్రాంతి సద్మాలుగింటఁ
దేశియ వర్ధంబు సర్ధచంద్రికలు వీన
యక్షగానప్రబంధంబు లతుకవచ్చు
రగడభేదంబు లివి యంద్రు రసఁ గవీంద్రు
లవితనిజసేవకస్తోమ! యబ్ధిధామ.!

పై పద్యమునుబట్టి చూడఁగా యక్షగానములందలి ప్రధాన రేయరచనములు దేశిరచన లగురగడలలోఁ గొంతమార్పు జరిపి— త్రిపుట, జంపె, ఏక, అట, అను తాళముల కనుగుణముగాఁ గల్పింపఁబడినవిగాఁ గానవచ్చును. అప్పకవి రగడవికారరచనము లను తాళములపేరనే పేర్కొనెను గాని వానికిఁ బేరులు వేఱె తెలుపలేదు. అప్పకవి పేర్కొన్నయీరచనములే కాక యక్ష గానములలో నింకను ననేకవిధము లయిన దేశిరచనములు చేరినవి. ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, చంద మామసుద్దులు, వెన్నెలపదములు, విరాళిపదములు, తుమ్మెద పదములు, గొబ్బిపదములు, కోవెలపదములు, చిలుకపదములు, అల్లొనేరేళ్ళు, సీస-కందార్థములు, త్రిభంగులు, ద్విపదలు, త్రిపదలు, చౌపదలు, షట్పదలు, మంజరులు, జక్కులరేకులు మొదలగునవి.

యక్షగానము లిట్లు వెలసినను ప్రాచీనము లయినకురవంజి రచనములును యక్షగానరచనావిధానసంకలితములై ఈకాలమునఁ గూడఁ గొన్ని సాఁగుచునే వచ్చినవి. దేవోత్సవరాజాస్థానాదులం దిట్లు వేశ్యలచేఁ బ్రదర్శింపఁబడుచున్న యక్షగానములు పెంపొందు చుండు నీకాలమున, దక్షిణదేశమున విజయనగరరాజ్యమున కుపశాఖలుగా తంజావూరు మధురరాజ్యము లాంధ్రనాయక రాజుల పరిపాలనమున వెలసినవి. ఆంధ్రదేశమునందును, దక్షిణ

దేశమునందును నీకాలమున యక్షగానరచనము మిక్కిలి ప్రబలఁ జొచ్చెను. ఇవి యిట్లు కలావతులచేతఁ బ్రదర్శింపఁబడుచున్న వాట గొంతెతగాఁ గనిపట్టియో యేమో కాని, కృష్ణాతీరము నందలి కూచిపూఁడిగ్రామమున సిద్ధేంద్రుఁ డను యోగి యొకఁడు భాగవతకథలను పారిజాతము, గొల్లకలాపము మొదలగు పేర్లతో యక్షగానములుగా రచియించి శాస్త్రీయ మయినభరతనాట్య సంప్రదాయములకు రక్షగా, స్త్రీనిస్సహాయముగా, నాయూరి బ్రాహ్మణులచేతనే ప్రదర్శనము చేయింప నేర్పాటు చేసెను. ఆయూర జన్మించిన బ్రాహ్మణుఁ డెవ్వఁడు గాని, ఒక్కతూరి యైనను, యక్షగాన ప్రదర్శనమున స్త్రీవేషమును ధరించి తీరవలె ననియు, నది వారి కులాభ్యుదయహేతు వనియుఁ గూడ శాసించె నఁట. నేఁడు కూడ కూచిపూఁడి బ్రాహ్మణులు శాస్త్రీయ మయినభరతనాట్యముతో భాగవతకథలను బ్రదర్శించువారుగా నున్నారు. ఈసంప్రదాయము వెలసినపిదపనే తత్ప్రదర్శకులకు భాగవతు లనియు, తద్రచనములకు ఆటభాగవతము లనియుఁ బేరయ్యెను.

## ఆటభాగవతములు.

ఈ భాగవతకథలలో పారిజాతహరణకథ హృద్యతర మగుటచే దానికిఁ బ్రచార మెక్కువయ్యెను. అది హృద్యతర మగుట కందలి సవతులకయ్యపుఁబట్టు ప్రధానకారణము. దీనినిఁ

బట్టి యక్షగానసామాన్యమునకుఁ బారిజాతము లనియుఁ బేర య్యెను. ఏయక్షగానముఁ బ్రదర్శించినను నందు సవతుల కయ్యపుఁబట్టునకుఁ బ్రసక్తి గల్పించుటయో లేక పారిజాతము నందలి తత్కథాఖండమునే స్వతంత్రముగాఁ బ్రదర్శించుటయో పిదప నేర్పడెను. ఈసవతులకయ్యపుఁగథపట్టు హృద్యతర మగుటచేఁ బ్రబంధకవులను గూడ నిది వలపించెను. కళాపూర్ణోదయమున పింగళి సూరన్న పారిజాతకథలోని సవతుల కయ్యపుఁ బట్టు ని ట్లనుకరించెను.

అంత మదింపకువే యని పల్కిన నంత మదింపకువే యనుచున్
గంతు లడంచెద లెమ్మని పల్కిన గంతు లడంచెద లెమ్మనుచున్
రంతుల నేమి ఫలం బని పల్కిన రంతుల నేమి ఫలం బనుచున్
బంతము చూడఁగదే యని పల్కినఁ బంతము చూడఁగదే యనుచున్.

సీ॥ ఒట్టుసుమీ యన్న నొట్టుసుమీ యంచు
నేమేమి యనిన నేమేమి యనుచుఁ
గానీగదే యన్నఁ గానీగదే యంచు
నింకేల యనిన నింకేల యనుచు
నోసి పోవే యన్న నోసి పోవే యంచు
నౌనంటి ననిన నౌనంటి ననుచు
మఱువకు మిది యన్న మఱువకు మిది యంచు
నీ వెంత యనిన నీ వెంత యనుచు
నొకతెమగనికి నాసించు టొప్పదనిన
నొకతెమగనికి నాసించు టొప్పదనుచుఁ

బట్టియాడెడి నారంభతోఁ బ్రహ్మరంధ
ప్రియుఁడు నిలుచున్న సిలువ పెద్దగొనగ.

కళా. ఆ. 3—౧౯౫, ౧౯౬.

ఆంధ్రదేశమున వెలసినయీకూచిపూఁడి భాగవతముల ప్రయోగవైశారద్యము దక్షిణదేశమునకుఁ గూడ వ్యాపించినది. ఆనాఁడు కూచిపూఁడి భాగవతుల యాటభాగవతసంప్రదాయము నేఁటికిని దక్షిణదేశమునఁ గలదు. దక్షిణదేశమున బ్రాహ్మణులు పురుషులే నేఁడును భాగవతయక్షగానములను దశగుణవానినే ప్రదర్శింతురు. ఆంధ్రదేశమున వెలసినయక్షగానము లిన్నూటికిఁ బైచిలుకు పరిగణింపఁబడినవి. వీని ననుసరించి వెలసిన దక్షిణదేశపుయక్షగానములు మున్నూటికిఁ బైచిలుకు గలవు. భక్తాగ్రేసరుఁ డనఁబడినశివనారాయణతీర్థులవారు (కృష్ణలీలాతరంగిణి కర్త), త్యాగరాజస్వామివారు పారిజాతాపహరణ మని, నౌకా చరిత మని భక్తిరసభరితము లయినయక్షగానములను రచించిరి. భగవత్కథలతోఁ బురాణకథలతోఁ బెంపు వెలసిన యీ భాగవతయక్షగానములు తత్ప్రదర్శనములు నాయకరాజుల కాలమునను, మహారాష్ట్రరాజుల కాలమునను మితిమీఱి యాయారాజుల శృంగారజీవితవర్ణనాత్మకములుగాఁ గూడ రచితములై ప్రదర్శితము లగుచు వచ్చినవి. దిక్ప్రదర్శనలుగా కొన్ని కురవంజులను, యక్షగానములను, భాగవతములను చేర్కొనుచున్నాను.

“ కిరాతార్జునీయము, శ్రీగిరికొరవంజి, గంగాగౌరీవిలాసము, అలమేలుమంగావిలాసము, ఎఱుకలవేషకథ, కపోతవాక్యము, గరుడాచలము, త్రిపురసంహారము, దారువనక్రీడ, నలచరిత్ర, నిజలింగచిక్కయ్యకథ, కన్యకాచరిత్ర, పారిజాతాపహరణము, పార్వతీపరిణయము, మృత్యుంజయవిలాసము, శివపారిజాతము, సముద్రమథనము, విజయరాఘవ చంద్రికావిహారము, రఘునాథనాయకాభ్యుదయము. — ”

భిన్నపాత్రవేషధారణము లేక సింగి, సింగఁడు (కొన్నింటఁ గోణంగికూడ) పాత్రలతో వెలసినవీథినాటకము లనఁబడు కురవంజులు యక్షగానరూపమునఁ బొందినపుడు వేషభేదము గల పాత్రభేదములును బొందెను. ఇట్లు పాత్రబాహుళ్యముకూడఁ గలవైనయక్షగానములందు సంధివచనములఁ జెప్పు కోణంగి లేక సూత్రధారుఁడు ‘ వచ్చెనమ్మా సత్యభామ - ’ ఇత్యాదివిధములను, ‘ అంతట హనుమంతుఁ డేమనుచున్నాఁడు ’ ఇత్యాది విధములను బాత్రములఁ బేర్కొనఁగాఁ దద్వేషధారులు వచ్చి తమ యాటపాటలు నెఱపుదురు. ఇట్టింకను బెంపొందిన యక్షగానములు తెరలు, రంగభేదములు కలవయి కొంతసంస్కృతనాటకచ్ఛాయయుఁ జొప్పడఁగా నాటకము లనుపేరను గూడఁ బదునెనిమిదవ శతాబ్దినాఁటికిఁ బేర్వెలసినవి.

ఇంచుమించుగాఁ దెలుఁగున నేనూటయింటిదాఁక లెక్కింపఁ దగియున్న యక్షగానములలో _ సుగ్రీవవిజయ మొకప్రశస్తకృతి.

దానికర్త.

కందుకూరి రుద్రకవి.

ఈతఁడు విశ్వబ్రాహ్మణవంశ్యుఁడు. కందుకూరికిఁ జేరువనే పాలేటియొడ్డునఁ గలచింతలపాలె మన్యగ్రామ మీతని యూరు. ఆయూరనే తద్వంశ్యు లిప్పటికిని గలరు. రుద్రకవి మూలమున నావంశమువారికి 'కవివారు' అని యుపనామ మేర్పడినది. ఆవంశమున రుద్రకవికిఁ దర్వాతఁ బలువురు రుద్రకవినామకు లుండిరి. తొలుతటి రుద్రకవి కృష్ణదేవరాయల యాస్థానమున నష్టదిగ్గజము లనఁబడుకవు లెనమండుగురిలో నొక్కఁడుగా నుండెనఁట* మల్కిభ్రహీంకాలమునఁగూడ నొక రుద్రకవి యుండెను. ఇబ్రహీంకాలమునఁ గలరుద్రకవియే కృష్ణరాయలకాలమున బాలుఁడుగా నుండఁబోలును. చింతలపాలె మన్యగ్రామము మల్కిభ్రహీంప్రభువే రుద్రకవి కొసఁగెను.

అద్యాశీతిచతుశ్శతాధిక సహస్రం వై శకాబ్దా గతాః
అస్మిన్ శ్రీజయవత్సరే జయతిథౌ మాసే చ మాఘే తథా

---

* రుద్రకవి విషయమును చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగమునఁ జూచునది.

> పంచమ్యాం ద్వయుగంత్రిణీజనపదం రుద్రస్య విద్వత్కవేః
> ప్రీత్యా శ్రీబుధరామభూపసుగదాత్ క్షోణీధరాఖండలః ॥

ఇబ్రహీంప్రభు విచ్చినయగ్రహారమును నిన్న మొన్నటి దాఁకఁ దద్వంశ్యులే యనుభవించుచుండిరి.

సుగ్రీవవిజయము రచించినరుద్రకవియే నిరంకుశోపాఖ్యాన మని గ్రంథాంతరము రచియించెను. రెండుగ్రంథములందును గర్తకు కందుకూరుజనార్దనభక్తత్వము, పెదలింగనార్యపుత్త్రిత్వము గలదు గావున రెండుగ్రంథములు నొక్కనివే యనుట స్పష్టము. నిరంకుశోపాఖ్యానమున,

> "చేరి కన్నడభూపు చెఱపట్టుపాశ్చాత్త్య
> నృపతికైనను గొంకకృప దలిర్చు.

అని సీసచరణ మున్నది. అది విద్యానగరమును దురుష్కులు కొల్లఁగొట్టినదుస్సందర్భమును దెలుపుచున్నది. విద్యానగర వినాశనము క్రీ. శ. 1568 నాఁడు జరగినది. కావున నిరంకుశోపాఖ్యానరచన మటుతరువాత జరగినదగును. అప్పకవీయమున వినుకొండలో గుంటుపల్లి భాస్కరయగారి సముఖమునఁ గందుకూరి రుద్రకవి కవితాచర్చ జరపినట్లు కలదు. మనరుద్రకవి యాతఁడగునేమో! నిరంకుశోపాఖ్యాన సుగ్రీవవిజయకర్త క్రీ. శ. 1568 ప్రాంతములవాఁడేని, కొంతతర్వాతివాఁడేని కాఁగలఁడు. దక్షిణ

దేశమం దల్పముగా నాంధ్రదేశమం దధికముగా యక్షగానముల రచనములు, ప్రయోగములు సాగుచుండిన కాల మది.

## సుగ్రీవవిజయము.

శ్రీమద్రామాయణమునం గలకథాఖండములలో సుగ్రీవ విజయకథ యొక టెండపట్టు. అత్యల్పకాలమున వడివడిగా గంటలలో నడచిన యీకథపట్టు రామలక్ష్మణులు, హనుమంతుడు, సుగ్రీవుడు, వాలి, అంగదుడు, తార అనుకథాపాత్రముల శీలపు మేలిమి నొఱసి మెఱుగుతెఱగులు చూపినయొఱగల్లనదగినది.

తెలుగున నుత్తరదిశిరామాయణాదు లగురామాయణ గేయకృతులలో నీసుగ్రీవవిజయపుఁగథపట్టు చాల హృద్యరచనములలో నున్నది.

'ఎంత పని చేసితివి రామా! నిన్ను
నేమనందును సార్వభౌమా!
యెంత కీడు గావించె చెట్లలో దాగి
యింతపాపము నెట్టువిధ మాయెనా ప్రభువు!

ఇత్యాదిగేయములను బలువురు పాడుచుండురు.

ఈరుద్రకవిసుగ్రీవవిజయమును గూడ స్త్రీ, వృద్ధ, పామరాదులు పలువురు పాడుచుండురట! ఆయాపాత్రముల పాటలు పాత్రవేషధారులు వచ్చి పాడునట్లుగా దక్కినసంధివచనాదులు

ఒక్కరిద్దఱు సూత్రధారప్రాయులు వఠించుట్లును నీసుగ్రీవ విజ యము వీధియాటగా నాడబడుచుండెడిది. ప్రాచీన సంస్కృత నాటకరచయితలు భాసభవభూత్యాదు లీ సుగ్రీవవిజయాచిత్య మును దమనాటకములలో విమర్శించిరి. శ్రీరాముని శీలమును శ్రీవాల్మీకిరామాయణపద్ధతిని సమర్థించిరి.

భవభూతి "యద్వా కౌశల మింద్రసూనుదమనే తత్రా ప్యభిజ్ఞో జనః" యని దీని యాచిత్యము నించుక చెనకెను. మన రుద్రకవి సంస్కృతాంధ్రరామాయణకవులు త్రొక్కినత్రోవనే త్రొక్కెను గాని యపూర్వకల్పనాంశము నేమాత్రము నిందుఁ జేర్పలేదు.

ఆ యాపాత్రములు ప్రసిద్ధరామాయణములలో నెట్టి యుక్తిప్రత్యుక్తులు గలవిగాఁ జిత్రితము లయ్యెనో యిందు నదే తీరు గలదు. కాని యిది దేశిరచనముతో గేయరూపమున నుండుట విశేషము. ఇఁక దీక్రింది గేయరచనలు ప్రశస్తము లయినవి !

> హా సతీమణి ధర్మచారిణి హా గుణోన్నత జనకసుత ననుఁ
> బాసిపోయితి వింతలోనే పద్మనయన
> లేటివాయాలు మదిని దలియఁగ లేక పాపపురక్కసునిచే
> బోటి నిను గోల్పోతి నిఁక నా కేటిబ్రదుకు !
>
> * * * *
>
> లలన నినుఁ గలనైన బాయఁగఁ గలన నీ విట లేక యుండినఁ

జలన మొందెను నాదుహృదయము జలజనయన !

*　　　*　　　*　　　*

తరణికులమునఁ బుట్టి శరచాపములఁ బట్టి
తరుణిఁ గోల్పడుకంటె మరణమే మేలు
నను శౌర్యవంతుఁ డని తనపుత్రి నిడినట్టి
జనకవిభుఁ డీవార్త విని నగవకున్నె.

*　　　*　　　*　　　*

నాయు మాఱుగక చంపితివి నరనాథ పాపము గట్టికొంటివి
బోయ వింతిరో కాక నీవొక భూమిపతివా ?

*　　　*　　　*　　　*

శ్రీరాము నీరాముఁ జెఱఁగొన్న రావణుని
వారిధుల ముంచితిని వాలమునఁ జుట్టి
ఒకమాట నాకుఁ జెప్పక పోయితివి గాక
సకలదైత్యుల దున్మి జానకిని దేనె ?

*　　　*　　　*　　　*

ఆలిఁ జెఱఁగొని పోయినట్టిదశాస్యుఁ జంపఁగ నిర్నిమిత్తము
వాలి నేటికిఁ జంపితివి రఘువంశతిలకా !
ఇట్టిసాహసకర్మ మొచటికి నేఁగ భరతుఁడు నిను వెడలఁగఁ
గొట్టి రాజ్యము పుచ్చుకొన్నెడఁ గుసలయేశా !
నాయెడ నేటికిఁ దప్పితివి రఘునాథ జానకితోడనే చెఱఁ
బోయెనే నీరాజనీతియు భూరిమతియుఁ గా.

*　　　*　　　*　　　*

శ్రీరామచంద్రమూర్తి చెట్టుచాటుననుండి వాలిమేనఁ

గాడనేసినవాఁడిముఁలుకులకంటె నిక్కడ తార ప్రత్యక్షమై నిలు చుండి శ్రీరాముని యంతరంగము నుచ్చిపోవునట్లు ప్రయోగించిన పలుకుములుకులు క్రొవ్వాఁడి గలవి.

సుగ్రీవవిజయము వీరకరుణారసభరితము. స్త్రీ బాలపామరాదులుకూడఁ బఠింపఁ దగినది.

ఆ యక్షగానమున నీక్రింది దేశిరచన లున్నవి. త్రిపుట, జంపె, కలుచజంపె, అర్ధచంద్రికలు, ఆటతాళము, ఏకతాళము, ద్విపదలు, ధవళములు, ఏలలు. అర్ధచంద్రికలు త్రిపుటాదిరచనల ఖండరచనలు గాఁబోలును. ఇందలియర్ధచంద్రిక లెల్ల నొక్క తెఱఁగునడక గలవి గాక భిన్నగతులతో నున్నవి. సంగీతతాళ లక్షణము తెలిసినవారు వానిప్రభేదములు గుర్తింపవలెను.

కురవంజులు, యక్షగానములు నింకను మంచిరచనములు గలవి కొన్ని యున్నవి. అవి యేవేని సుగ్రీవవిజయమువలె సుముద్రితము లైనచో నాంధ్రమధురకవితావిశేషములను సహృదయు లింక నధికముగా నాస్వాదింపఁగల్గుదురు.

## ౨

# కృష్ణరాయల విద్యాగోష్ఠులు.

## ౧

కృష్ణరాయలయాస్థానమున నెనమండ్రు తెలుఁగుకవీశ్వరు లష్టదిగ్గజము లనుపేర వెలసియుండి రనులోకప్రతీతిని వీరేశలింగము పంతులుగారు విశ్వసింపకపోయిరి. కృష్ణరాయఁడు కవితాప్రియుఁడు గాన యాయనయాస్థానమందు లేకున్నను బలువురుకవీశ్వరుల నప్పటివారినిగా భావించి పామరలోకము కట్టుకథలు కల్పించె నని వారు తలంచిరి. వీరేశలింగముపంతులుగారితలఁపు యుక్తమయి నది కాదని యిప్పుడు స్పష్టముగాఁ దెలియవచ్చుచున్నది.

చాటుపద్యమణిమంజరి ద్వితీయభాగమునఁ గందుకూరి రుద్రకవిచరిత్రమును నేను రుద్రకవివంశ్యులకడనుండియే కైకొని ప్రకటించితిని. రాయలయాస్థానమునం దష్టదిగ్గజము లనఁబడు నెనమండ్రుకవులలో రుద్రకవి యొకఁడనియు, నాతఁడీశాన్యసింహాసనాసీనుఁడై యుండువాఁడనియు నందుఁ గలదు. అనఁగా రాయలసభాస్థాన మగుభువనవిజయమున నెనిమిదిదిక్కుల నెనిమిదిసింహాసనము లుండెడి వనియు, వానిపై దిగ్గజము లనఁబడు నెనమండ్రుకవులు నాసీనులై యుండెడివా రనియు నర్థమగు

చున్నది. రుద్రకవిచరిత్రమే కాఁ యీక్రిందిశాసనశ్లోకముగూడ రాయలయాస్థానమునఁ దష్టదిగ్గజకవులు ప్రముఖకవు లుండెడివా రని తెల్పుచున్నది.

శ్లో॥ యత్కీర్తి ర్భువనైకభూషణ మభూ ద్యస్య ప్రసాదా న్నరా
స్సర్వే రాజసమానతా ముపగతా స్సంప్రాప్య విత్తం బహు
యస్యాష్టౌ కవిదిగ్గజాః పృథుయశోభారాజగర్భోద్భవా
యద్దానోదకసామ్య మేవ సరితా మాసేతుశీతాచలమ్.

ఈశ్లోకము రాయలు నందిదుర్గమున సోమశంకరస్వామికి నాలయమును కట్టించినప్పుడు చెక్కించిన శాసనమం దున్నది. ఆశాసనముప్రాంతప్రతి ప్రాచ్యలిఖితపుస్తకశాలలో నున్నది. కృష్ణదేవరాయఁడు రచించినదిగా జాంబవతీకల్యాణ మని సంస్కృతనాటక మొకటి కలదు. తంజావూరులైబ్రరినుండి దాని ప్రతినిగొనివచ్చి శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు చెన్నపురిలైబ్రరి కొసంగిరి. దానిలోఁ బ్రస్తావన కొంత గ్రంథపాతములు గలిగి యున్నది. గ్రంథకర్త కృష్ణరాయఁ డనియో యం దున్నది. కాని గ్రంథాంతమం దీశ్లోక మున్నది:—

శ్లో॥ ... ... ...
శేషక్ష్మాధరనాయకస్య కృపయా విస్తార్ణవీమధ్యగాం
రక్షన్ గామిహ కృష్ణరా ట్స్వనృపతి ర్జీయా త్సహస్రం సమాః.

ఈనాటకము ప్రాకృతబహుళమై సంస్కృతచ్ఛాయ లేక గ్రంథపాతములతో నున్నది. కావున నిసిగా ముద్రించుట దుష్క—

రము. దీని నేను జదివితిని. కృష్ణుఁడు జాంబవతిని బెండ్లాడుట యిందలికథావస్తువు. కథానాయకుఁడగు కృష్ణుఁడు కృష్ణదేవ రాయఁడుగాను, నాయిక యగుజాంబవతి ప్రతాపరుద్రగజపతి కుమార్తె యగుభద్రాదేవిగాను నాకు స్ఫురించినది. ఈదృష్టితోఁ జూడఁగా నాటక మెల్ల శ్రీకృష్ణదేవరాయలకథను జెప్పునదిగా సమన్వయింపఁదగినట్లు నాకు గోచరించినది. అయినను నీవిషయ మింకను బరిశోధింపఁదగినది.

---

కృష్ణదేవరాయలు సాహిత్యమందే కాక సంగీతమందును మిక్కిలి యభిరుచి గలవాఁడు. ఈయన యాస్థానమున బండారు లక్ష్మీనారాయణుఁ డని యొక సంగీతవిద్వాంసుఁ డుండెను. రాయల యంతఃపురస్థానమున నాయన నాట్యరసాధిపత్యము వహించి యుండెడువాఁడు. అతఁడు రచించినది సంగీతసూర్యోదయ మని యొకసంస్కృతగ్రంథ మిప్పుడు దొరకినది. దాని పీఠికలో విద్యానగరము, కృష్ణరాయల దిగ్విజయములు వర్ణితము లయినవి. రాయల దిగ్విజయవర్ణనములలో నపూర్వవిషయము లొండు రెండు గానవచ్చుచున్నవి. సంగీతసూర్యోదయకారునకు నభినవభరతాచార్య, రాయవాయకాఁ, తోడరమల్ల, సూక్ష్మభరతాచార్య బిరుదములు గలవు. కృష్ణరాయ లీయనకు

బంగారుపల్లకీ, ముత్తెసరులజల్లులు గలవి రెండు ముక్తాతపత్రములు, మదపుటేనుఁగులు, మలహరీవాద్యమునొసఁగెను. ఈయన విష్ణుభట్టారకులయొద్ద దత్తిల కోహలాది భరతమతగ్రంథములను సవ్యాఖ్యముగా నధ్యయనము చేసినాఁడు. తాళాధ్యాయము, నృత్తాధ్యాయము, స్వరగీతాధ్యాయము, జాత్యధ్యాయము, ప్రబంధాధ్యాయము నని యయిదధ్యాయములతో నీతఁడు సంగీతసూర్యోదయము రచించినాఁడు. ఈయన గ్రంథావతరణిక నుండి కొన్ని శ్లోకములు.

శ్లో॥ కర్ణాటాహ్వాయదేశ సౌఖ్యజననీ శ్రీతుంగభద్రావృతా
మాతంగోన్నతమాల్యవత్ క్షితిధర శ్రీహేమకూటాన్వితా
పంపాధీశ్వరవిట్ఠలేశ్వరకృపాదృష్టిప్రభామండితా
శ్రీవిద్యానగరీ విభాతి ధరణీధమ్మిల్లమాణిక్యవత్.

* * * *

శ్లో॥ బాల్యే ఽ సౌ సకలకలాకలాపయుక్తః
స్వప్రా(త్రా ?)ణం సపది విజిత్య గంగరాజం
భఙ్క్త్వా తచ్ఛివనసముద్ర ముత్కటంద్రా
గావాసం వ్యతనుత నిర్భరం శివానామ్.

శ్లో॥ దుర్గం జిత్వాథ సోఽసా వుదయగిరివరం తత్ర రాహుత్తరాజం
బందీకృత్యాశు హృత్వా యుధి నగరవరే కొండవీడ్కొండపల్యౌ
శివగ్రాహం గృహీత్వా గజపతితనయం పొట్టునూర్పట్టణాగ్రే
విశ్వశ్లాఘ్యప్రతాపో విరుదయుతజయస్తంభ ముచ్చై ర్వ్యఖానీత్.

## కృష్ణరాయల విద్యాగోష్ఠులు

శ్లో॥ సోఽయం కృష్ణనరేశ్వరో గజపతిం జిత్వా తదీయశ్రియా
సాకం తస్య సుతా ముదూహ్య యవనక్ష్మాపం సపాదం తతః
గౌబ్బూరుస్థలవాసినం సగభసం జిత్వా స విద్రావ్య తం
హస్త్యశ్వాన్ స తదీయదుర్గ మతులం......మారు మదత్తవాన్.

శ్లో॥ కృష్ణా ముత్తీర్య సోఽయం యవనజనపదం వహ్నినా సాత్కృత్య సర్వం
పేనోజాంబాదసింహాద్వరు (?) సగరసమాఖ్యాని దుర్గాణి జిత్వా
షట్ కోట్యశ్చైవ పాంసీకం కలుబరిగిపురీం ద్రాక్సపాదార్థమానః ?
కాంతా (క్రాంత్వా ?) వ్యాకృష్టవాన్ సోఽబ్బులఘునత్రీన్ సుసుత్రాణపుత్రాన్.

## గ్రంథకర్త

శ్లో॥ తస్య శ్రీకృష్ణరాయస్య కృపాక్షీరాబ్ధిచంద్రమాః
లక్ష్మీనారాయణో నామ సంగీతే సరసాగ్రణీః
సదాఽభినవశబ్దాదిభరతాచార్యనామకః
బిరుదం ధరణీచక్రే ధత్తే చాఽని వాఖ్యతః

శ్లో॥ శ్రీమత్కృష్ణనరేశ్వరస్య దయయా స్వర్ణాంచితాం పాలకీం
ముక్తాగుచ్ఛకృతానుబద్ధవలయం ముక్తాతపత్రద్వయమ్
శశ్వన్మత్తమతంగజాన్ మలహరీవాద్యం నిజాంతఃపుర
స్థానే నాట్యరసాధిపత్య మసకృల్లక్ష్మీపతిః ప్రాప్తవాన్.

శ్లో॥ సంగీతాగమలక్ష్యలక్షనిపుణైః శ్రీవిష్ణుభట్టారకైః
జ్ఞాత్వా దత్తిలకోహలాదిభరతగ్రంథాన్ సటీకాన్వితాన్
భూమౌ కీర్తిశరీరరక్షణధియా గ్రంథః కృతోఽయం మయా
......... యోగ్యతాధికతర స్సంగీతసూర్యోదయః.

## గద్యము.

ఇతి శ్రీమద్విప్రకులవర్య భండారుపట్టమేశ్వరనందన సూక్ష్మభరతా (లిఖి[illegible]) చార్య రాయబయకార సోదరము ల్లాభినవభరతాచార్య శ్రీలక్ష్మీనారాయణవిరచితే సంగీతసూర్యోదయే.

## ఇంకొక విశేషము.

ఈ భండారులక్ష్మీనారాయణుఁ డిట్లు కృతికర్త యగుటె కాక మఱి కృతిభర్తయు నగుట తెలియఁబడుచున్నాఁడు. భానుకవి యని యొకతెనుఁగుకవి యీతని కంకితముగాఁ బంచతంత్రిని తెనిఁగించినాఁడు. చిట్టయమంత్రి (చిట్టమరసు?) ప్రేరణచే నరసింహభట్టు, నరసమంత్రి, అవధానము కృష్ణఘనుఁడు, భరతము విష్ణుభట్టు (ఈతఁడే లక్ష్మీనారాయణునకు సంగీతాగమము నుపదేశించినవాఁడు) అనువారు సమ్మతించి ప్రోత్సాహపఱుపఁగా లక్ష్మీనారాయణుఁ డీభానుకవిని దనపేరఁ బంచతంత్రిని దెలిఁగింపఁ గోరినాఁ డఁట! భానుకవి తనకృతిపతి సంగీతసూర్యోదయము రచించె నని చెప్పలేదు గాని యీతనిబిరుదములను, నభినవభరతాచార్యాదులను దఱచుగా గ్రంథమునఁ జేర్కొన్నాఁడు.

క॥ పతికంటె మంత్రి బలిసిన క్షితి యాతని దైవ తనర్చు సిద్ధము సతి దాఁ
బతికంటె నవగ నైనను బతికార్యము చెడును సూక్ష్మభరతాచార్యా!

విద్యానగరము నీతఁ డిట్లు ప్రశంసించినాఁడు.

సీ॥ పంపావిరూపాక్ష భైరవహటకేశ్వర ముఖ్య దేవతా వ్రజము చేత
పరిపంథిగిరిదుర్గవిభేదన శ్రీకృష్ణరాయభూధవభుజార్గళము చేత
భటనటఘోటకపదాతిగణికాసుగ్రీవ గణసత్కవీశ్వరుల చేత
సంతతమహావాహినీ మహాకుండాలస్నాటాటవప్రకటఘోటముల చేత

గీ॥ రమ్యమై యుండు విద్యాపురంబు నందు
నిమ్మహాకృతి ... ముక వీశ్వరుండు
తెనుఁగు బాసను వర్చెను వినుతి కెక్క
నవని నాచంద్రతారార్క మగుచుఁ దనర.

ఈ పంచతంత్రిలోని కథలోఁ గూడ నీతిపద్యములు కృతిపతిసంబోధనములతో నున్నవి. "కరణికలక్ష్మ, సూక్ష్మలిఖితాచార్య, విట్టయలక్ష్మధీమణీ" ఇత్యాదులు. ఇట్టి సంబోధనములవలన నీతఁడు సంగీతాచార్యుఁడే కాక మంత్రియు నని యెఱుఁగ నగుచున్నది.

మాదిరి శ్లోకపద్యము:—

సీ॥ విద్య కవులయందు విశ్రాణ నందును
ప్రత్యర్థివిభులందు బాహుబలము
శరణాగతులయందుఁ గరుణాకటాక్షంబు
నృపకార్యములయందు నీతిగరిమ
బంధుసంతతియందుఁ బరమసంతోషంబు
నాశ్రితులందుఁ బాయునితలంపు

ధర్మమార్గమునందుఁ దగిలిన చిత్తంబు
సత్యవాక్యములందుఁ జతురతయును
గీ॥ గలిగి యొప్పాఁడు వెలుఁగు జగత్త్రయమున
నతనికీర్తులు లుబ్ధమోహాంధతమస
పటల మణఁగించుఁ జంద్రికాప్రభలయట్లు
లలితగుణధుర్య! తిప్పలక్ష్మణామాత్య!

3

కృష్ణరాయలు రాజ్య మేలుచుండఁగా నీశ్వరదీక్షితుఁ డనుసంస్కృతవిద్వాంసుఁ డొకఁడు వాల్మీకిరామాయణమునకు బృహద్వివరణ మని లఘువివరణ మని రెండు వ్యాఖ్యలు రచించినాఁడు. శ్రీకృష్ణరాయల కలువదిగవియులలో రామాయణ మేఁడుకాండములు వినిపించి యాయనప్రోపునఁ జిత్రకూటమున (హంపి) నుండి రామాయణవ్యాఖ్యలు తాను రచించిన ట్లాతఁడు చెప్పుకొన్నాఁడు.

శ్లో॥ బృహద్వివరణం చైవ తథా వివరణం లఘు
వ్యధా ద్రామాయణే వ్యాఖ్యాద్వయ మీశ్వరదీక్షితః
శ్లో॥ కర్ణాటాధీశ్వరే రాజ్యం కృష్ణరాయే ప్రశాసతి
రామాయణం చిత్రకూటే వ్యాఖ్యా దీశ్వరదీక్షితః.

౪

నగరు, సగరు, తొగరు, పగరు అని చరణాద్యక్షరము లుండునట్లు రామాయణ, భాగవత, భాగవతపరములుగా

మూఁడు పద్యములు చెప్పు మని పెద్దన సమస్య యొసఁగఁగా నట్లే చెప్పి సత్కృతుఁ డయినచింతలపూఁడి యెల్లయకవికి శ్రీకృష్ణరాయలు రాధామాధవుఁ డని బిరుదనామ మిడెను.

శా॥ రాధామాధవ నామ్యశాంకితముగాఁ బ్రౌఢక్రియం జెప్పి త
న్మాధుర్యంబునఁ గృష్ణరాయవిభుఁ గర్ణాకేళు మెప్పించి వా
ణాధాత్రప్రతిమాన సత్కవులలోనన్ భూషణశ్రేణితో
రాధామాధవ నామ మందినజగత్ప్రఖ్యాతచారిత్రుఁ డన్.

ఈ రాధామాధవకవి కృతులు రాధామాధవము, విష్ణు మాయావిలాసనాటకప్రబంధము, తారకబ్రహ్మరాజీయము నను నవి దొరకియున్నవి.

---

౫

ఆముక్తమాల్యద కృష్ణదేవరాయవిరచిత మని గ్రంథమం దున్నను బెద్దన రచించిన దని లోకమునఁ బ్రతీతి కలదు. వ్యాఖ్యాతలు లాక్షణికులు కొందఱట్లే గ్రంథములందును జెప్పినారు. ఆముక్తమాల్యదావ్యాఖ్యాత శ్రీనివాసకవి—

ఉ॥ ఉరు వగువిష్ణుచిత్తతనయోద్వహనంబును సంస్కృతాంధ్రవా
గ్గరిమ నలంక్రియారససుఖం బగునట్లుగఁ బెద్దనార్యుఁ డు
ద్ధురభణితిన్ రచించె నది దుర్ఘటబోధము గావునన్ ధరన్
స్థిర మగుచుండునట్లుగను జేసెదఁ డీక సవిస్తరంబుగాన్.

**గుడిపాటి** వెంకటకవి___

గీ॥ ప్రేమ నల్లసాని పెద్దన యాముక్త
మాల్యదాఖ్యకృతి సమంచితముగఁ
జేసె నీవు టీక చేయుము చెఱకునఁ
బండు పండినట్లు లుండుఁ గాన.

సీ॥ కర మర్థిఁ గవిరాయగండపెండేరంబు చెల్లించుకొన్నట్టిబల్లిదుండు
కవులలోపల నాంధ్రకవితాపితామహాబిరుదాంకుఁ డైనగంభీరమూర్తి
మనుచరిత్రాదిసమ్యక్కావ్యగుచ్ఛ నలఁ జెప్పినవైష్ణవచక్రవర్తి
కృష్ణరాయలు తన కేల్దమ్మిచే నెత్తఁ బల్లకి యెక్కినభాగ్యశాలి

గీ॥ యలఘుఁ డలసాని పెద్దన యాఘనుండు
మహిమఁ జేసినయాముక్తమాల్యదాప్ర
బంధ మెచటఁ దదీయార్థపటిమ యెచట?
నాకు శక్యంబె దానికిఁ డీక సేయ?

రంగరాట్ఛందస్సులోఁ గూడఁ బెద్దన చెప్పినయాముక్త
**మాల్యద** యని యున్నది.

---

౬

విశాఖపట్టణమండలమున 'ప్రపంచదర్పణ' మని యొక సంస్కృతగ్రంథము ప్రాచ్యలిఖితపుస్తకశాలవారికి దొరకినది. అది సంధానగ్రంథము. ప్రాచీనగ్రంథములనుండి యనేకవిషయము

లందు సంకలనము చేయబడినవి. ఇం దీక్రిందిశ్లోకము లున్నవి.

అల్లసాని పెద్దనార్యేణ సత్యావధూపరిణయే—

శ్లో॥ అంగుళీషు కురంగాక్ష్యా శోభితే ముద్రికావళీ
ప్రోతేవ బాణైః పుష్పేషో స్స్వాక్ష్యలక్ష్యపరంపరా.

అల్లసాని పెద్దనాఖ్యే నాప్యేవ ముక్తం రసమంజర్యామ్—

శ్లో॥ ఉడురాజముఖీ మృగరాజకటి ర్గజరాజగతిః కుచభారనతా
యది సా రమణీ హృదయే నిమతే క్వ జపః క్వ తపః క్వ సమాధిమతిః.

మొదటిశ్లోకము గల గ్రంథముపేరు సత్యావధూప్రీణనమయి యుండు నేమో! ఆముక్తమాల్యదలోఁ గృష్ణరాయల కృతులుగా నీగ్రంథములు గలవు గదా!

“ సీ॥ పలికె నుత్ప్రేక్షోపమాన ”—

ఇత్యాది పద్యమున—

“ భావధ్వనివ్యంగ్యసేవధి గాఁగఁ జెప్పితిఁ సత్యావధూప్రీణనంబు.”

మఱియు—

“ రసమంజరీముఖ్యమధురకావ్య, రచన మెప్పించుకొంటి
గీర్వాణభాష ”

ఈ సంధానగ్రంథమున నీపేళ్లతోఁ బెద్దనార్యకృతులను జేర్చుకొనుట వింత గదా! కృష్ణరాయకృతులలోనివిగాఁ గూడ నందు శ్లోకము లున్నవి.

కృష్ణరాయ స్యాలంకారసారసంగ్రహే—

> సిందూరం రవి మిందు మానన మసౌ ధమ్మిల్లరాహో గ్రహో
> ద్యద్గాఢం గ్రసతీతి తచ్చ విబుధై ర్విజ్ఞాత మాత్పాతికమ్
> జోశే చంచలతా భవిష్యతి హతా త్వాస్య త్యుంతలే కర్ణణమ్
> కాం.........హే.........అంగే మహో స్సంగరః.

ఇందుఁ జూపఁబడినశ్లోకములు సుభాషితరత్నభాండాగారమునఁ గూడ నున్నవి. “అంగుళీషు” ఇత్యాదిశ్లోకము బిల్హణునిదిగా నందుఁ జెప్పఁబడినది. తక్కినవి యెవ్వరు రచించినవో యందు లేదు.

ఆగ్రంథసంధాత యోగ్యుఁడు. ప్రసిద్ధగ్రంథములవెల్లెత్రో నెక్కడివో తెలియరానిమంచిశ్లోకములఁ గూడ నాతఁడు గూర్చియుండు నని సందేహించుట కందుఁ గొన్నిచోట్ల నెడము గలుగుచున్నది. ఈ శ్లోకము లట్టి వయి యుండవచ్చు నేమో!

౯

# ఉద్భటారాధ్య చరిత్రము.

ఉద్భటారాధ్యచరిత్ర మపూర్వసత్ప్రబంధములలో నొక్కటి. దీనికి

## కర్త తెనాలిరామలింగకవి

అనఁగానే దీని సత్ప్రబంధత్వము గొంత సమర్థిత మగును గదా! తెనాలిరామలింగకవి యని తెనాలి రామకృష్ణకవి యని యొక్కనినే యటు నిటు గూడ లోకము పేర్కొనుట గలదు. తొలుత నాతఁడు శైవుఁడనియు, నప్పుడు రామలింగఁడని పేరయ్యె ననియుఁ, దర్వాత వైష్ణవము పుచ్చుకొనె ననియు, నప్పుడు రామకృష్ణుఁ డని మార్పుపే రయ్యె ననియుఁ బ్రతీతి. దీనిని వీరేశలింగము పంతులుగారు మొదలగువారు గొందఱు నమ్మిరి. మఱికొందఱు నమ్మరయిరి.* ఆ రెండుపేళ్లు నొక్కనివే యని నేనును విశ్వసించుచున్నాఁడను. అట్లు విశ్వసించుట కిదివఱ కున్న యైతిహ్యము మాత్రమే కాక యపూర్వముగాఁ గొన్ని యాధారములును నాకగపడినవి. తెలుపుచున్నాఁడను.

* విశ్వకర్మవంశ్యుఁడు, ధీరజనమనోరంజనకర్త, తెనాలి రామలింగకవి యొకఁడున్నాఁడు. అతఁడు వేఱు.

## రామలింగఁడే—రామకృష్ణుఁడు

రామకృష్ణకవికృతములుగా నిదివఱకు దొరకి ప్రకటితము లయియున్న గ్రంథములు రెండు. అవి పాండురంగమాహాత్మ్యమును, ఘటికాచలమాహాత్మ్యమును. రామలింగకవికృతిగా నిప్పుడు క్రొత్తగా దొరకి ప్రకటిత మయినది యుద్భటారాధ్యచరిత్రము. తొల్త నాతఁడు శైవుఁడుగా నుండి తర్వాత వైష్ణవుఁడుగా మాఱెననియే నే నిందు ముందు నిరూపింపనున్నాఁడను గాన యుద్భటారాధ్యచరిత్రము మునుపటి గ్రంథముగాను తక్కిన రెంటిని దర్వాతివానిఁగాను దెలుపుచున్నాఁడను.

ఉద్భటారాధ్య చరిత్రమున రామలింగకవి స్వవిషయ మిట్లు తెల్పుకొన్నాఁడు:—

సీ॥ కౌండిన్యముని రాజమండనగోత్రుఁ శంకరపాదాబ్జ నవసుధాభానుమూర్తిఁ
బాలను మేలెన పదపయోజద్వయీధ్యానధారణసముదాత్తచిత్తు
మానితాయాతయామానామభాసితవిపులమహోయశ్వేదవేది
రామేశ్వరస్వామిరమణీయకరుణావిశేషపోషితకవితాసమగ్ర

గీ॥ సహజసాహిత్యమాధురీసంయుతాత్మ
లక్కమాంబకు ఘనయశోలక్ష్మి వెలయ
రామధీమణికిని బుట్టి రామలింగ
నామవిఖ్యాతుఁ గావ్యనిర్ణయధురీణు.

గద్యమునందును, "ఏలేశ్వర గురువరేణ్య చరణారవింద

షట్చరణ సకలకలాభరణ రామనార్యసుపుత్ర సుకవిజనమిత్ర కుమారభారతీబిరుదాభిరామ రామలింగయప్రణీత" యని యున్నది.

పాండురంగ మాహాత్మ్యమున రామకృష్ణకవి యిట్లు చెప్పుకొన్నాఁడు.

సీ॥ .........శైవవైష్ణవపురాణావళీవ్యాఖ్య
ములు నీకుఁ గరతలామలకనిభము
గీ॥ లంధ్రభూమికుచాగ్రహారాభమైన
శ్రీతెనాల్యగ్రహారనికేత వగ్ర
శాఖికాకోకిలమ వీవు సరసకవివి
రమ్యగుణకృష్ణ! రామయరామకృష్ణ!

క॥ కౌండిన్యసగోత్రుఁడ వా
ఖండలగురునిభుఁడ వఖిలకావ్యరససుధా
మండనకుండలుఁడవు భూ
మండలవినుతుఁడవు లక్ష్మమాంబాతనయా!

"శారదనీరూపము రామకృష్ణ కవిచంద్రా! సాంద్ర
కీర్తిశ్వరా"

క॥ వాక్కాంతాశ్రయు భట్టరు
చిక్కాచార్యుల మహాత్ము శ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద
నిక్కవ్యశ్లోకలాప మీడేఱుటకున్.

మీఁగడ తఱకలు

గద్యమున—ఇది శ్రీమత్పరమపదనాథనిరవధికకృపాపరిపాకపరిచితసరసకవితాసనాథ రామకృష్ణకవినాథ ప్రణీతం బైన— అని యున్నది.

| రామలింగకవి | రామకృష్ణకవి |
|---|---|
| కౌండిన్యగోత్రుఁడు | కౌండిన్యగోత్రుఁడు |
| శుక్లయజుర్వేది | శుక్లయజుర్వేది |
| తండ్రి, ᐧ మయ్య | తండ్రి, రామయ్య |
| తల్లి, లక్ష్మమ్మ | తల్లి, లక్ష్మమ్మ |
| కుమారభారతీబిరుదాభిరాముఁడు | శారదనీరూపము రామకృష్ణకవిచంద్రా ! |

ఉద్భటచరిత్రము బాల్యమున రచించినది గాన 'కుమారభారతి' యని బిరుదు చెప్పుకొన్నాఁడు. పాండురంగమాహాత్మ్యము ముదిమయసున రచించినదిగాన 'శారదనీరూపము' అని కృతిపతి తన్ను సంబోధించినట్టు చెప్పుకొన్నాఁడు. కాన యీభేదము సంగతమే. ఇన్ని సరిపడి యున్నను నుద్భటచరిత్రమున రామలింగయ యని గ్రంథకర్తపేరును పాలగుమియేశ్వరుఁ డని గురుని పేరును, పాండురంగమాహాత్మ్యమున రామకృష్ణుఁ డని గ్రంథకర్తపేరును,భట్టరు చిక్కాచార్యులని గురునిపేరును గానవచ్చుట, గద్యములరీతులు భిన్నములుగా నుండుట రెండు నొక్కనివేళ్లే యనుసిద్ధాంతమునకుఁ గొంత బాధకముగాఁ గానవచ్చును. ఈభేదములు మతము మాఱుటచే నేర్పడినవే యని నే ననెదను.

## ఇందుకు సాధకములు

ఇందుమతీపరిణయ మని తెనాలిరామభద్రకవికృతి యొకటి కలదు.* అం దిట్లున్నది.

...................కవితాఘనతామహు మత్పితామహున్
రామయ రామకృష్ణకవిరాజుఁ దలంచి నుతించి మ్రొక్కెదన్.

గీ॥ తదనుసంభవు నిని సుదక్షిణాప
రిణయముఖకావ్యరచనాధురీణు నాంధ్ర
కవికదంబములోనఁ బ్రఖ్యాతి గన్న
యన్నపకవీంద్రు ధీసాంద్రు నభినుతింతు.

* * *

సీ॥ ప్రౌఢి మీపెదతాత పాండురంగాదిస
త్కృతులు చేసెను రామకృష్ణసుకవి
యనుజుఁ డన్నప్ప మీపినతాత రచియించెఁ
బరఁగ సుదక్షిణాపరిణయంబు
మీతాత శ్రీగిరి చాతురీవిఖ్యాతి
శ్రీశైలమాహాత్మ్యకృతి యొనర్చె
కడిమి మీతండ్రి యిమ్మడి రామకృష్ణాఖ్యుఁ
డనఁ గీర్తి గనె సంస్కృతాంధ్రములను

---

* ఇది తంజాపురపు సరస్వతీపుస్తక భాండాగారమునఁ గలదు. శ్రీమానవల్లి రామకృష్ణకవి, యం. ఎ. గారు దీనివిషయము 1914 సంవత్సరాది సంచికలో "తెనాలికవులు" అను వ్యాసమునఁ దెలిపినారు. వారే దీనిప్రతిని చెన్నపురి గవర్నమెంటు లైబ్రరికిని నొసఁగినారు

గీ॥ నార యనిపించె మిాయన్న వీరరాఘు
వాఖ్యకవి సర్వకవితామహత్త్వమునను
ని న్ననూచానసంతాను నెన్నఁ దరమె?
ప్రాజ్ఞహృదయాబ్జరవి రామభద్రసుకవి!

దీనింబట్టి చూడఁగాఁ బాండురంగమాహాత్మ్యాదు లను రచించిన తెనాలిరామకృష్ణకవియును, సుదక్షిణాపరిణయము రచించిన తెనాలియన్నయకవియును నన్నదమ్ము లని యేర్పడు చున్నది. దీనికి సరిగానే సుదక్షిణాపరిణయమున :

గీ॥ నవ్యసుగుణాభిరాము తెనాలిరామ
పండితాగ్రణిసత్పుత్త్రి భవ్యమిత్రు
హరపదాంభోజసౌముఖ్యు నన్నపాఖ్యు
నన్నుఁ బిలిపించి యాదరోన్నతి వహించి.

*　　　　*　　　　*

గద్యము—"ఇది శ్రీమత్తెనాలి రామేశ్వరశాశ్వతకృపా కటాక్షలక్షితకవితాభిరామ రామయపండితకుమార సహజ శైవాచారసంపన్న ధీమదన్నయనామధేయప్రణీతం బైన సుద క్షిణాపరిణయమందు" అని యున్నది.

ఈ సుదక్షిణాపరిణయపద్యములవలనఁ గూడఁ దెనాలి రామకృష్ణుఁడు, తెనాలియన్నయ, యన్నదమ్ము లగుట యితర ప్రమాణనిరపేక్షముగానే యేర్పడుచున్నది. ఇర్వురును రామయ పండితునికొడుకులే; తెనాలివారే; ఒకకాలమువారే. (అది

ముందు తెలియనగును.) అంతే కాక రామలింగఁడే రామకృష్ణుఁ డయ్యె ననుటను గూడ నీసుదక్షిణాపరిణయమే స్వతంత్రముగా సాధించుచున్నది. ఉదాహృతగద్యపద్యములవలన నన్నయ సహజశైవాచారుఁ డనియుఁ దెనాలిలో వెలసినరామేశ్వరస్వామి యనుగ్రహమునఁ గవిత నేర్చినవాఁడనియు, మఱియు,

గీ॥ కాళిదాసాది సంస్కృతకవులఁ దలఁచి
యాంధ్రభాషావిశేషభాషాధిపతుల
నన్నపార్యాదులను బుద్ధి నన్నుతించి
పాలగుమ్మిభీమగురుని సద్భక్తిఁ గొలుతు.

అనుపద్యమువలనఁ బాలగుమ్మిభీమయశిష్యుఁ డనియు నెఱుకపడుచున్నది. దీనినిఁబట్టి యన్నయకుటుంబమువారును సహజముగా శైవాచారసంపత్తి కలవారనియు, తెనాలిరామలింగస్వామిభక్తు లనియుఁ, బాలగుమ్మివారిశిష్యు లనియుఁ దలఁపఁ గూడును.* మనప్రస్తుతగ్రంథ మగునుద్భటచరిత్రమును రచించిన రామలింగకవి యిట్టిలక్షణములు గలవాఁడు. అతని శైవాచార

* పాలగుమ్మివారారాధ్యులు గాఁబోలును రామలింగకవి కింతను నూఱేండ్లకు ముందొకఁడా యింటిపేరివాఁడు శైవాచార్యుఁడు కొండవీటి రెడ్డిరాజ్యమున నున్నట్లు శాసనమున్నది. శ్లో. పాల్గుమిశ్రీకంఠగురోః పంచాక్షరమంత్రపౌనరుక్త్యస్య; శిష్యాయ శిష్యపరిషద్రత్నా దాక్షిణ్యసత్కటాక్షస్య. శక 1336 నాఁటిది పెదకోమటి మాచారెడ్డిశాసనము. శృంగార శ్రీనాథము ననుబంధము చూడనగు.

నిరతి యుద్భటచరిత్రమున స్పష్టముగాఁ గన్పట్టుచున్నది. మఱియు నాతఁడు 'రామేశ్వరస్వామి రమణీయకరుణావిశేషపోషిత విలసిత సమగ్ర, సహజసాహిత్యమాధురీసంయుతాత్ముఁడ' ననియు 'పాలకుమేలేశపదపయోజద్వయీధ్యానధారణ సముదాత్తచిత్తుఁడ' ననియుఁ జెప్పుకొన్నాఁడు. పాలకుమియేలేశ్వరుఁడును బాలకుమి భీమేశ్వరుఁడును నన్నదమ్ములో తండ్రికొడుకులో యయి యుందురు.

మఱి యన్నయ తన యన్నయని రామలింగనిఁ (లేక రామకృష్ణునిఁ) బ్రస్తుతింపకున్నంతమాత్రాన వారి సౌదర్యవిషయము సందేహింపఁ దగిన దేమో యనరాదు. తెనాలిరామభద్రకవి తనతాత లన్నదమ్ములు ముగ్గు రనియు, మొదటివాఁడు పాండురంగమాహాత్మ్యకర్త రామకృష్ణుఁ డనియు, రెండవవాఁడు తన తండ్రితండ్రి శ్రీగిరి యనియు, మూఁడవవాఁడు సుదక్షిణాపరిణయకర్త యన్నయ యనియు స్పష్టముగాఁ జెప్పినాఁడు గాన యిట్టిసందేహమునకు సందు లేదు.

అన్నయకవి మతము మార్చుకొన్నాఁ డన్నయనాదరముచే నన్నగారిని బ్రస్తుతింపక పోయెనేమో! 'సహజశైవాచార' మన్నపద మాయన్న నడుమఁ దెచ్చుకొన్నవైష్ణవాచారము మీఁది వైమనస్యముచేఁ జేర్చుకొన్న దేమో! రామకృష్ణకవి తన మతము మార్పును దెలుపుకొనకున్నను, బాండురంగమాహాత్మ్య శ్రీ

మున ' శైవవైష్ణవపురాణావళీ నానార్థరచనా పటిష్ఠకరమ్య

మతివి' † అని తన శైవప్రబంధరచనమును దెలుపుకొన్నాఁడు.

తెనాలిలో నుండుటచేతనే తర్వాత తెనాలివారని యింటిపే రేర్పడినది గాని యంతకుముందు వారియింటి పేరు గార్లపాటి వారని ప్రాఁతవ్రాఁతలలో నున్నది. గురుజాడ శ్రీరామమూర్తి పంతులుగారును వీరేశలింగముపంతులుగారును దీనిని జెప్పిరి. తెనాలిలో నున్న రామయపండితుఁడు శైవాచారపరుఁడు గాన యక్కడ వెలసియున్న రామలింగస్వామిపేరే తనప్రథమపుత్త్రునికిఁ బెట్టుకొనె నని నేను దలఁచుచున్నాఁడను. అన్నయ చెప్పుట చేతనే కాక యీక్రిందిసాధనముచేతఁ గూడ నాతఁడు శైవాచారపరుఁ డని రామలింగేశ్వరస్వామిభక్తుఁ డని యేర్పడుచున్నది.

తెనాలిలో రామలింగేశ్వరస్వామి యాలయమున నొక యుత్సవవిగ్రహముపీఠముమీఁద నీశ్లోక మున్నది.

శ్లో॥ శ్రీ తెనాలినగరే వ్యరాజయ ద్గార్లపాటిపుర రామపండితః
శుక్లమాఘసిత పంచమీ గురౌ రామలింగ మమరోత్సవాకృతిమ్ *

---

† 'శైవవైష్ణవ పురాణావళీ నానార్థములు నీకుఁ గరతలామలకనిభము' లని పాఠాంతరము కలదు. పాండురంగమాహాత్మ్యమున నీపద్యము పాఠభేదములతో నున్నది.

* ఈ శ్లోకమునుగూర్చి గుంటూరిలో శ్రీమల్లాది సోమయాజులుగారు నాకుఁ జెప్పిరి. పిదపఁ గొంతకాలమునకు దాని నేను జూచితిని. ఇప్పుడొకమిత్రుఁడు చూచి వ్రాసి పంపెను. శుక్ల సం॥ మాఘ శుద్ధ పంచమీ గురువారము స్వామికన్నుపిళ్లగారి పుస్తకమును బట్టిచూడఁగా సరిపడకున్నది.

రామలింగని యింటిపేరు గార్లపాటివా రని యిదివఱకు వ్రాసినవా రెవ్వరు గాని యీశ్లోకము నునికి నెఱిఁగినట్లు తెలి రాలేదు. రామలింగని యింటిపేరు తొల్త గార్లపాటివా రనుట నీశాసనశ్లోకము స్థిరపఱచుచున్నది. ఉద్భటారాధ్యచరిత్రలో రామలింగఁడు తన యింటిపే రేదో పేర్కొననే లేదు. రామకృష్ణుఁడై పాండురంగమాహాత్మ్యమునను బేర్కొనలేదు. 'శ్రీతెనాల్యగ్రహారనిర్ణేత' నని మాత్ర మందుఁ జెప్పుకొన్నాఁడు. అప్పటికిఁ దెనాలివా రని యింటిపేరు స్థిరపడకుండవచ్చును. అన్నయ సుదక్షిణాపరిణయమునఁ 'దెనాలి' యింటిపేరు చెప్పుకొన్నాఁడు.

మనుమఁ డగురామభద్రకవి చెప్పుటచేతను, దల్లిపేరు మొదలగునవి సరిపోవుటచేతను రామకృష్ణుఁడును, నన్నయయు నన్నదమ్ము లని స్పష్టపడినది. ఉద్భటచరిత్రమందుఁ గానవచ్చు రామ (లింగే) శ్వరస్వామి యనుగ్రహము, పాలగుమివారి శిష్య త్వము, శైవాచారము మొదలగునవి సరిపోవుటచేతను, లోక మందుఁ బారంపర్యముగా వచ్చుచున్నప్రతీతికిఁ గూడ నిర్వాహ మేర్పడుటచేతను, నుద్భటారాధ్యచరిత్రకర్త యగురామలింగ యయ్యే వైష్ణవమతము పుచ్చుకొని రామకృష్ణుఁడై పాండురంగ మాహాత్మ్యము రచియించినాఁ డని, వారు వేఱుపురుషులు గా రని, నిర్ణయించుట ప్రమాణదూరము కాదు.

## పోలికలు

రామలింగకవియే రామకృష్ణుఁ డయ్యె ననుట కింకను మఱియొక బలవత్ప్రమాణము చూపెదను. పాండురంగ మాహాత్మ్యమున 'శైవవైష్ణవపురాణావళీనానార్థరచనాపటిష్ఠైక రమ్యమతివి' యని చెప్పఁబడుటచే నాతఁడేవో శైవపురాణ కథల రచియించి యుండవలె ననియు నీయుద్భటారాధ్యచరిత్రము వానిలోనిది యగు ననియు ననుకొంటిమి. తొలుతఁ దాను శైవుఁడై యున్నపుడు రచియించిన యుద్భటారాధ్యచరిత్రము లోని పద్యములే మార్చి మార్చకుండఁ దర్వాత వైష్ణవుఁడై రచించినఘటికాచలమాహాత్మ్యమున నాతఁడు చేర్చుకొన్నాఁడు. ఇవిగో చూడుఁడు.

సీ॥ అచలసుతాభర్త కర్పించి మఱి కాని
మృగములు లేఁ బూరి మేయ వచట
నసమలోచనునకు నర్పించి మఱి కాని
యళులు క్రొవ్విరితేనె లాన వచట
నంధకధ్వంసికి నర్పించి మఱి కాని
కోయిల లిగురాకుఁ గొఱుక వచట
నంగజారాతికి నర్పించి మఱి కాని
చిలుకలు పండ్లు భుజింప వచటఁ
గీ॥ దక్కుఁ గలజంతువులు శంభుఁ దలఁచి కాని
యుచితవర్తనములఁ గోరి యుండ వచట

వదనములు వేయుఁ గలయంతవానికైన
నాయరణ్యంబుఁ గొనియాడ నలవి యగునె?

మ॥ హరిణంబున్ బులి పెంచు సింగ మొగి సయ్యాటంబు లాడున్ గరిన్
బురినీడన్ ఫణిడింభజాలముల నిల్వం జేసి, చిల్కల్ లన్
గరుణన్ బిల్లులజాలముల్ బెనుచుఁ గాకంబుల్ నిశావేళ ఘూ
కరఘూకంబులపాంతఁ గన్ను మొగుచున్ గాంక్షించి తద్భావములన్

గీ॥ తబిసి మొత్తంబు లుపాడి తానమాడి
డిగ్గియల చేరువలను బూదియ యలందు
కాలమునఁ బల్కును 'త్రియంబకం యజామ
హే' యటంచును జలపక్షు లెల్లయెడల.

ఉ॥ సామగుణంబుఁ గ్రోల్చుఁ బికశాబకపంక్తులు శైవధర్మముల్
బ్రేమ నుపన్యసించు శుకబృందము లీశ్వరయోగశాస్త్రముల్
కోమలరీతి శారికలు గూడి పఠించు వినోదలీలలన్
గామవిరోధిఁ బాడు నధికంబుగ నచ్చట భృంగపోతముల్.

సీ॥ అభ్రగంగాప్రవాహమ్ము లెన్నియో కాని
తల ధరియింతు రందఱును నదులు
పదినూఱుపడగలపాము లెన్నియో కాని
యందఱు నురగేంద్రహారయుతులు
డాలొందుచంద్రఖండంబు లెన్నియొ కాని
యందఱు ధరియింతు రమృతకరుని
విషరాశిఁ బుట్టినవిషము లెన్నియొ కాని
యందఱు హాలాహలాంకగళులు

గీ॥ గంధగజదైత్యు లెందఱో కాని యంద
అతులగజచర్మపటధారు లైనవారు
కా॥ బంధంబు........................
క్రాలుకొనమండ విద్రింపఁజాలుఘనులు.

—ఉద్భటచరిత్ర

సీ॥ మొకరితేఁటులు మూతి మొట్టవు తేనియల్
శ్రీమధుకాసి కర్పించి కాని
కోకిలమ్ములు చివురాకులు గొఱుకవు
శ్రీవనమాలి కర్పించి కాని
లేఁబచ్చికల్ గబళింపవు హరిణముల్
శ్రీనీలమూర్తి కర్పించి కాని
ఫలభుజిక్రియలసఁ జిలుకలు దలఁపవు
శ్రీమాధవునకు నర్పించి కాని

గీ॥ యితరజంతువులును హరి మదిఁ దలంచి
కాని యేసద్రసమునకుఁ బూన వనిన
నాతపోవనమాహాత్మ్య మభినుతింప
నలవియే వేమొగంబులచిలువ కైన

మ॥ పులు లేదుక న్మృగశాబకంబుల హరుల్ పోషించు నత్యాద్భుతిక
గలభానీకముఁ గాకముల్ మేలఁగు ఘూకశ్రేణితోఁ బిల్లు లె
ల్కలఁ గాచుక శిఖికోటి లేఁజిలువలక లాలించు సుఖోల్లబ
ర్హాలసచ్ఛాయల నుంచి యచ్చటియగణ్యానీ ప్రదేశంబులక.

క॥ ఒకచిత్ర మచటి జటిపా
లికి ముక సంజలను గ్రుంకి లేచి సమాధిక

సకలశకుంతంబులు తా
రకమంత్రోచ్చారణాభిరతి మతిఁ బొదలుఁగన్.

మ॥ శుకముల్ ప్రామినతుల్ గుణించు గణియించున్ ధర్మమర్మోక్తిహా
సకథల్ శారిక లీరిక ల్గొను మనీషన్ శేషభాషావిశే
షకళాశాస్త్ర ముపన్యసించు బకముల్ సాత్రాజితీప్రాణనా
యకనామాళి నళుల్ పఠించు సతతోద్యద్గీతికాచాతురిన్.

సీ॥ ననుగాలిదూదిపానుపు లెన్నియో కాని
యందఱు శయనీకృతాహివరులు
సురలోకవాహినిర్ఝరము లెన్నియొ కాని
యందఱు దివ్యతీర్థాంబుపదులు
నీట జనించుమానికము లెన్నియొ కాని
యందఱు కౌస్తుభహారయుతులు
చలివేఁడివెలుఁగులసామ లెందఱొ కాని
యందఱు నిందుకంజాప్తదృకులు

గీ॥ ఖగకులాధీశు లెందఱు కలరొ కాని
యందఱును బుల్గురాటెక్కియములవారు
వారు వోసినరీతి నున్నారు ధీరు
లన్నగరియందుఁ గాపురం బున్నవారు

—ఘటికాచలమాహాత్మ్యము.*

---

* ఘటికాచలమాహాత్మ్యము తెనాలిరామకృష్ణకవిరచిత మయినను నది యాతని మనుమని కాలమున (ఆమనుమని పేరు లేదు) ఖండోజిరాయఁడను మహారాష్ట్రునకుఁ గృతి యీయఁబడినది. కాన యందుఁ గృత్యవతరణిక రామకృష్ణుని రచనము గాదు. రామకృష్ణుని విషయ మం దేమియు లేదు. అది కళావతీ ముద్రాక్షరశాలలో 1902 సం॥ ముద్రిత మయ్యెను.

ఉద్భటారాధ్యచరిత్రపద్యముల ఛాయ గలపద్యములు పాండురంగమాహాత్మ్యమునఁ గూడ లేకపోలేదు కాని ప్రౌఢతర మయినరచన మగుటచేఁ బాండురంగమాహాత్మ్యమున నీవిధముగాఁ బాడినపాటయే యనఁదగుపద్యములు గానరావు. ఈ సాధనము లన్నియు రామలింగఁడే రామకృష్ణుఁ డయ్యె ననుసిద్ధాంతమును నిర్వివాదముగా నెలకొల్పఁగల వని నానమ్మకము.

## ఇంకొకసాధకము

ఇన్ని సరిపడినను నుద్భటారాధ్యచరిత్ర రచనాకాలమును, బాండురంగమాహాత్మ్యరచనాకాలమును నొక్కపురుషుని జీవిత పరిమాణమునందుఁ బొందనివిగా నుండినచో నిఁక నీ వాద మెల్ల వమ్మయి పోవలసినదే యగును. ఆచిక్కు లేకుండ నదియుఁ గుదురుచున్నది. ఒక్కనికే రెండుపేళ్లనుసిద్ధాంతము నిర్వివాదముగా నిల్చుచున్నది.

## ఉద్భటచరిత్ర రచనాకాలము

కొండవీడుదుర్గాధ్యక్షుఁడుగా నున్ననాదిండ్ల గోపమంత్రికడ ముఖ్యోద్యోగి యయినయూరెదేచమంత్రి యుద్భటారాధ్యచరితము కృతి గొన్నాఁడు. అది యెల్లఁ గృత్యవతరణికలోఁ జూడఁదగును. శ్రీకృష్ణదేవరాయఁడు క్రీ. 1515 సం॥ కొండవీడు జయించెను. అదిమొదలుగాఁ గృష్ణరాయల యేల్బడి కది

లోపడినది. రాయలమంత్రి యగుసాళ్వతిమ్మరసు కొండవీటి పాలనమును దన మేనల్లుఁ డగునాదిండ్ల గోపమంత్రి కప్పగించెను. నాదిండ్ల గోపమంత్రి సుప్రఖ్యాతుఁడు. గోపమంత్రి క్రీ. 1517న దేచమంత్రి కొక యగ్రహారము నొసఁగెను.

దేచమంత్రి శైవాచారపరాయణుఁడు. ప్రోలనారాధ్యుని వంశమువాఁ డగుచంద్రశేఖరవాచంయముని శిష్యుఁడు. మఱియు మహావిద్వాంసుఁ డగులొల్లలక్ష్మీధరపండితునకును శిష్యుఁడు. ఆలక్ష్మీధరుఁడు కటాక్షింపఁగా శివపంచస్తవి కితఁడు వ్యాఖ్యానము రచించెను.

అందు:—

శ్లో॥ "నాదిండ్ల గోపనృపతే రూరేదేచప్రధానతా
క్వచి దర్థః క్వచి న్మైత్రీ క్వచి ద్ధర్మః క్వచి ద్యశః
* * * *
......యస్మా దస్తే౨ మదా దఖిలమనుపతిం దేచయామాత్యవర్య
స్సో౽యం శ్రీచంద్రమౌళి ర్జయతి గురువరః ప్రోలనారాధ్యవంశ్యః.
సచాయం దేచయామాత్యో మాహిమ స్తవపంచకామ్
లక్ష్మీధరకటాక్షేణ కురుతే గురుతేజసా."

(ఈగురునిఁగూర్చి యుద్భటారాధ్యచరిత్రము నవతరణికను గ్రంథావసానమును గూడఁ జూచునది.)

దేచమంత్రి గోపమంత్రిచే నగ్రహారాది సమ్మానముఁ బడసి ప్రఖ్యాతుఁ డయినపిదపనే యుద్భటచరిత్రము కృతి నంది

యుండును. ఆకాల మించుమించుగా క్రీ. 1525 అని తలంప వచ్చును. దీనిచేఁ దెనాలి రామలింగకవి కృష్ణదేవరాయలసభలో నున్నాఁడన్న లోకప్రతీతి సదాధార మయి సంరక్షిత మగుచున్నది.

† పాండురంగమాహాత్మ్యరచనాకాలము

పాండురంగమాహాత్మ్యము విరూరి వేదాద్రిమంత్రి కంకిత మయినది. ఆ వేదాద్రిమంత్రి కందాళ యప్పలాచార్యుల శిష్యుఁడు. మంగయగురువరాజు కుమారుఁ డగు పెదసంగ భూపాలునొద్ద వ్రాయసకాఁడు. చిత్రభారతకృతిపతితండ్రి పెద్ద తండ్రులును, వైజయంతీవిలాసకర్త యగుసారంగుతమ్మకవియు నీ కందాళ యప్పలాచార్యులకు శిష్యులు. క్రీ. 1542 పరాభవ వత్సరమున గండికోటప్రభువు కందాళప్పలాచార్యులకు భూదాన మొసగిన శాసనము గలదఁట. దీనిఁబట్టి పాండురంగమాహాత్మ్య రచనాకాల మించుమించుగా క్రీ. 1550, 1560 అగునని తలంప వచ్చును. మఱియుఁ బాండురంగమాహాత్మ్యమున రామకృష్ణునిచే

భట్టరు చిక్కాచార్యుఁడు

తన గురుఁడుగా స్తుతింపఁబడినాఁడు. ఈచిక్కాచార్యు

† శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు 'తెనాలి కవులు' అనుపేర 1914 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచికలో వ్రాసినవ్యాసమునఁ బాండురంగ మాహాత్మ్యరచనాకాలమును జక్కఁగా నిర్ణయించినారు. దానిసారమే యిక్కడఁ జూపఁబడినది.

నికిఁ బలువు రాంధ్రకవులు శిష్యు లయి యుండిరి. చాతుర్వాటికామాహాత్మ్యము, ఆనందకాననమాహాత్మ్యము మొదలగు ప్రబంధములను రచియించిన లింగమకుంట రామకవి (ఈతఁడు తెనాలి రామకృష్ణకవి యల్లుఁడు) యు నాతనితమ్ముఁ డగులింగమకుంట తిమ్మకవియు నీ చిక్కాచార్యులకు శిష్యులు.

క॥ గురురాయపట్టభద్రుని
నరిహరు శ్రీరంగనాయకాంశభవుఁ భ
ట్టరు చిక్కాచార్యుల మ
ద్గురులఁ దలఁచి యడుగులకు నతుల్ గావింతున్.

—లింగమకుంట రామకవి.

సీ॥ శ్రీవైష్ణవహితుండ జిక్కయభట్టరు
శిష్యుండ........ —లింగమకుంట తిమ్మకవి.*

మఱియు రామకృష్ణకవులచేఁ గామందకము కృతిగొన్నవాఁడు కొండ్రాజు తిమ్మరాజుకొడుకు కగు వేంకటాద్రియు నీయాచార్యుని శిష్యుఁడే.

క॥ శ్రీచంచద్భట్టరుచి
క్కాచార్యవరార్యశిష్య యతులితశౌర్య
ప్రాచుర్యవిర్య గుణర
త్నాచల జయలలితస్థైర్యనయతత్త్వనిధీ.

(కామందకము కృతిపతి సంబోధనము)

---

* సులక్షణసారకర్త (లింగమకుంట తిమ్మకవి) అప్పకవికంటెఁ దర్వాతివాఁడని కం. వీ. గారు వ్రాయుట ప్రామాదికము.

మఱియు నీకామందక కృతిపతి, పాండురంగమాహాత్మ్య కృతిపతి యగువిరూరివేదాద్రిమంత్రి నేలినప్రభు వైనపెదసంగ భూపాలునకుఁ జెల్లెలి కొడుకు. శా. 1505, క్రీ. 1584 స్వభాను వత్సరమున వేంకటరామకృష్ణకవులచే నా కొండ్రాజు తిమ్మరాజు కొడు కగువెంకటాద్రి కామందకకృతి నందుకొన్నాఁడు.

మ॥ రమణీయంబుగ శాలివాహశకవర్షంబుల్ గతంబై సహ
స్రము నేనూఱును నాఱునై వెలయఁగాఁ బ్రౌఢిం దెనింగించి రా
ర మహిం దిమ్మయ వేంకటాద్రివిభుపేరన్ వేడ్కఁ గామందకీ
యము వేంకటరామకృష్ణులు స్వభాన్వబ్దంబునన్ రూఢిగాన్.

వీనిఁబట్టి చూడఁగాఁ బాండురంగమాహాత్మ్యరచనా కాలము క్రీ. 1565 ఇంచుమించుగా నగు నని యేర్పడుచున్నది. అనఁగాఁ దెనాలి రామలింగకవి యించుమించుగా క్రీ. 1525 ఉద్భటచరిత్రమును, మఱి ముప్పది యేండ్లకుఁ బాండురంగ మాహాత్మ్యమును రచించి యుండు నని చెప్పనొప్పుచున్నది. మనకవి తమ్ముఁ డగునన్నయకవి సుదక్షిణాపరిణయరచనా కాలము కూడ నిందుకు సరివచ్చుచున్నది. మఱి పెక్కుమార్గ ములచేఁ గూడ మన కవివర్యుని కాలమును నిర్ణయింపవచ్చును గాని యామార్గములు కొంత డొంకతిరుగుడుగా నుండుటచేతను, నిప్పుడు చెప్పిన కాలమునకే చేరునవిగా నుండుటచేతను విడనాడి నాఁడను.

## కవిస్తుతులు

నేఁ జూచినంతవఱకుఁ గవిస్తుతులలో ' రామలింగకవి ' యన్న పేరే కానవచ్చినది. నడుమఁ దెచ్చిపెట్టుకొన్న రామకృష్ణనామము ప్రాచీనకాలమునఁ బ్రఖ్యాతము కాలేదు కాఁబోలును ! పాండురంగమాహాత్మ్యప్రౌఢిమ ప్రఖ్యాత మైనతర్వాత రామకృష్ణనామము గూడ రహి కెక్కినది.

ఉ॥ రంగుగఁ బాండురంగని తెఱం గలరంగ రచించి వేడ్క మీ
ఱంగ ఛలోక్తులన్ నృపుఁ గరంగ నొనర్చుహొఱంగు నింగి ము
ట్టంగ మెలంగు నేరుపుఁ గడంగి చెలంగునభంగసద్యశో
లింగుని రామలింగ శశలింగకళానిధినిన్ గణించెదన్.

(నాగ్నజితీపరిణయము—వల్లూరి నరసింహకవి)

క॥ శృంగారరసాలింగిత
రంగత్కవితానదీతరంగము హృదయ
త్వంగద్భుజంగ మాంగద
లింగమ్ము తెనాలిరామలింగముఁ దలఁతున్.

(పృథుచరిత్రము—సరస్వతీ సోమయాజి)

పై పద్య మాతఁడు లింగధారి యనికూడఁ జెప్పుచున్నది.

“ రంగనాథుని రామలింగకవిని ”

(కూర్మపురాణము—రాజలింగకవి)

“ రామ, లింగకవి రామభద్రుల లీలఁ దలఁతు ”

(అధ్యాత్మరామాయణము—శరభనకవి)

“ భీమకవి రామలింగని ”

(చంద్రరేఖావిలాసము—జగ్గన)

ప్రబంధరత్నావళిలోఁ దెనాలి రామలింగకవి కృతులు కందర్పకేతువిలాసము, హరిలీలావిలాసము ననువానినుండి కొన్ని పద్యము లుద్ధరింపఁబడినవి. వానిఁగూర్చి ముందుఁ దెలుపుదును. అందును రామలింగనామమే యున్నది. మఱియు నీచాటుపద్య మున్నది.

ఉ॥ లింగనిషిద్ధుఁ గల్వల చెలింగని మేచకకంధరుం ద్రిశూ
లింగని సంగతాళి లవలింగని కర్దమదూషితన్మృణా
లింగనిఁ గృష్ణచేలుని హలింగని నీలకచన్ విధాతృనా
లింగని రామలింగకవి లింగని కీర్తి హసించు దిక్కులన్.

అప్పకవి మొదలగువారు మఱియుఁ బెక్కురు రామలింగఁడనియె పేర్కొనిరి. అయినను ఆతనియల్లుఁడగు లింగమకుంట రామకవియు, మనుమఁడగు రామభద్రకవియు రామకృష్ణనామము పేర్కొనిరి.

చతుర్వాటికామాహాత్మ్యము, ఆనందకాననమాహాత్మ్యము ననుకృతులలో :—

సీ॥ శ్రీరామసేవాప్రసిద్ధుఁ గాశ్యపగోత్రు
శుభదకాత్యాయనసూత్రపాత్రు
లలితచారిత్రుఁ గాశయమంత్రికిని గోన
మకును దౌహిత్రు సర్వకవిపౌత్రు
తిరుమలాంబాగర్భవరవార్ధిపూర్ణేందు
ధన్యాత్ము లక్ష్మప్రధానపుత్రు

మిూఁగడ తఱకలు

నిజపాలక జనక నిష్ఠాగరిష్ఠ రా
మసచివలబ్ధ రామజపధుర్యు

గీ॥ రామకృష్ణాఖ్యజామాతఁ బ్రకటవిభవు
శుక్లయజురధ్యయనుఁ బేర సూరిమాచ
యానుజునిఁ దిమ్మధీనిధి కగ్రజాతు
ననఘు లింగమకుంట రామార్యునన్ను.*

ఇట్లు అల్లు డగురామకవియుఁ, బూర్వోదాహృత పద్యమున మనుమఁ డగురామభద్రకవియు, రామకృష్ణ నామము పేర్కొనుటకు వారు వైష్ణవమతమం దెక్కువగా నభినివేశము గలవారగుట కారణము గావచ్చును. వారి వైష్ణవమతాభినివేశ మాయాగ్రంథములఁ జూడవచ్చును.

## మఱికొన్ని కృతులు

తెనాలి రామలింగనికృతులు మఱిరెండు తెలియవచ్చుచున్నవి. వానిపేళ్లు కందర్పకేతువిలాసము, హరిలీలావిలా

* ఆనందకానన · మాహాత్మ్యములో ' నిజపాలకజనక ' అనుచోట, ' నిజజనకాగ్రజ ' అనియున్నది. దీనిచే నాతఁడు తనపెద్దతండ్రికి దత్తుఁడయ్యెనని తెలియనగును. లింగమకుంట రామకవి తెనాలి రామకృష్ణకవి యల్లుఁడని లింగమకుంటవారెల్లరు నేఁటికిని జెప్పుచున్నారు. నేఁడు లింగమకుంటవారి యల్లురగు శ్రీకొండ వెంకటప్పయ్యపంతులుగారివల్ల తొలుత నిది విని తర్వాత లింగమకుంటలో విచారించి రామకవికృతుల సంపాదించి యందును జూచి నేనిది తథ్యమని నమ్మితిని.

సము. ఆప్రబంధము లిప్పుడు కానరావుగాని, వానినుండి కొన్ని పద్యములు ప్రబంధరత్నావళిలో నుద్ధృతము లయినవి. వాని నాగ్రంథమునఁ జూడఁదగును. ఇవి గాక పాండురంగ విజయ మని మఱియేమో అని యీకవికృతు లున్నట్లు కొందఱు పేర్కొందురు గాని వానివిషయము నమ్మఁదగినది గాదు.

## కథలు

తెనాలిరామలింగని కథ లని దక్షిణహిందూదేశమెల్లఁ బ్రఖ్యాతికెక్కిన పెక్కుకథ లున్నవి. వానిగూర్చి మన మేమియుఁ జెప్పఁజాలము. అతఁడు హాస్యచతురుఁడై యుండవచ్చును. నిజముగాఁ గొన్నికథ లాతనికి సంబంధించినవే కావచ్చును. లోకులు మఱియు ననేకాద్భుతకథ లాతని తలకుఁ దగిలించియు నుందురు. పెక్కుగథలు శ్రీకృష్ణదేవరాయల గోష్ఠిలో జరిగి నవిగా వినవచ్చును. రామలింగఁడు రాయల సమకాలము వాఁడే. కావున నవి సంభావ్యములుగావచ్చును. చాటుపద్య మణి మంజరిలో నే నాతని కథలకు సంబంధించిన చాటుధారలఁ గొన్నిటిని జేర్చినాఁడను. క్రొత్త దొక్కటి యిక్కడ చూపు చున్నాడను.

క॥ ఓయమ్మలార! మందులు
వేయేల మకారకొమ్ము విషకవి గానీ
వాయెత్తకుండఁ జేసిన
వాయెత్తదు రామరాయవను శేఖునకున్.

అళియరామరాయనికి వాయురోగము వచ్చెనఁట! అంతఃపుర స్త్రీ లాతనికి మందుల నిప్పింపఁ దంటాలు పడుచుండగా రామలింగఁ డీపద్యమును జెప్పినాఁడఁట. మకారకొమ్ము విషకవిగాఁ డనఁగా మూర్తికవి. ఆతని వాయి=నోరు, ఎత్తకుండఁ జేసినచో రామరాయలకు వాయి=వాయురోగము, తలచూపదని పద్యార్థము. మూర్తికవి విషకవిత్వప్రయోగముచే రాయలకు రోగమువచ్చెనని స్త్రీలను నమ్మించి యాతని యుద్యోగవైభవము నూడఁగొట్టించుట కెత్తిన యెత్తుగాఁబోలునిది !

ఇఁకఁ గవివిషయమును విడిచి ప్రస్తుతగ్రంథమును గైకొందము. శైవారాధ్యులలో నొక్కఁడయినయుద్భటారాధ్యుల చరిత్ర మిందు వర్ణిత మయినది.

పాల్కురికి సోమనాథకవి రచియించిన బసవపురాణములో సప్తమాశ్వాసమున నీయుద్భటుని చరిత్రము వర్ణితమైనది. ఆకథనే మనకవి ప్రపంచించి ప్రబంధముచేసినాఁడు. తెలుఁగున మల్లికార్జున పండితారాధ్యుఁడును, నన్నిచోడఁడును నుద్భటుని స్తుతించిరి.

క॥ హారలీలా స్తవరచనా
స్థిరనిరుపమభక్తిఁ దనదు దేహముతోడన్
సుగుచిరవిమానమున నీ
పురమున కుద్భటుఁడు ప్రీతిఁ బోవఁడె రుద్రా!

—శివతత్త్వసారము.

క॥ క్రమమున నుద్భటుఁడు గని
త్యము మెఱయఁ గుమారసంభవము, సాలంకా
రము, గూఢవస్తుమయ కా
వ్యము గాహరు (ర?) లీల, చెప్పి వారు మెప్పించెన్.

—కుమారసంభవము.

పయిపద్యములఁబట్టి యుద్భటుఁడు హారలీల, కుమారసంభవము, అలంకారగ్రంథము (కావ్యాలంకార సంగ్రహము) రచించినాఁడని తెలియనగుచున్నది. ఇందుఁ గావ్యాలంకార సంగ్రహ మొక్కటితక్కఁదక్కిన విప్పుడు కానరాకున్నవి. ఆతని కుమారసంభవమునుండి కొంద ఱాలంకారికులు కొన్నిశ్లోకముల నుద్ధరించిరి. *ఉద్భటుఁడు కాశ్మీరరాజగు జయాపీడునిసభలో విద్యాపతిగా నుండెనని (క్రీ. 779 నుండి 813 వఱకు) రాజతరంగిణిలో నున్నది.

ఆంధ్రకవు లీతని శివకవులలోఁ జేర్కొనుట మన కథానాయకు డీతఁడే యనుటకు సాధకముగాని యీకథలోనాగ్రంథముల స్మరణము లేకపోవుటయుఁ గాలముసరిపడకపోవుటయుఁ గొంతబాధక మగుచున్నది. ఈప్రబంధమున నుద్భటుఁడు ముంజభోజునికి శైవదీక్ష నొసఁగిన గురువుగాఁజెప్పఁబడినాఁడు. ముంజభోజుఁడు దశమశతాబ్దివాఁడు. ఉద్భటుని గ్రంథము లీభోజుని కింకను బూర్వకాలముననే పుట్టినవి. ఈయుద్భటారాధ్యచరిత్రలో ముంజభోజుని పేరున్నను దీని కాకరమయిన బసవపురాణమున భోజుఁడనిమాత్రమే యున్నది. పలువురు భోజు లున్నారుగాన

* నన్నెచోడని కుమారసంభవము పీఠిక చూడుము.

యీతఁ డాకాలమువాఁ డగుననుఁ గావచ్చును. ముజభోజుఁ డనుట రామలింగకవి స్వకల్పితముగాన యది యప్రమాణమని త్రోసివేయవచ్చును. ముదిగొండవారని యిప్పు డాంధ్రదేశమునఁ బ్రఖ్యాతులుగా నున్న యారాధ్యబ్రాహ్మణుల కీయుద్భటారాధ్యుఁడు మూలపురుషుఁ డని యీప్రబంధమందుఁ గలదు. ఆయుద్భటుని దగ్గఱనుండి ముదిగొండవారి వంశక్రమముగూడఁ గొంత గ్రంథాంతమున గానవచ్చుచున్నది. ఈవంశక్రమము పాల్కురికి సోమనాథుని గ్రంథమునఁ గానరాదు.* కర్ణాటభాషలో గూడ నుద్భట చరిత్రములు గలవు. సోమరాజకవి బసవాంకకవి యనువా రిర్వురు వానిని రచించిరి. పాల్కురికి సోమనాథుడు కుమారపాలఘూర్జరునిదిగాఁ జెప్పినకథనే కర్ణాటకకవు లుద్భటుని కథగాఁ జెప్పిరి. ఆకర్ణాటకకవులకంటె మనసోమనాథుఁడు ...ర్వుఁడు. కుమారపాలున కుద్భటదేవుఁ డని నామాంతరముగా నా యుద్భటదేవచరిత్ర పీఠికలో శ్రీశ్యామాచార్యులు గారు వ్రాసిరి. అదియెట్లో ? మల్లికార్జున పండితారాధ్యుఁడు సోమనాథుఁడు, వారినిర్వురను వేర్వేఱుగాఁ బేర్కొనిరి. కుమారపాలుని చరిత్రమున నాతని కానామాంతర మున్నట్టు చెప్పరయిరి. పాల్కురికి సోమనకథ చొప్పున రచియింపఁబడిన యీ యుద్భటారాధ్య చరిత్రమునకును, నాకర్ణాట ప్రబంధములకును నేమియు సంబంధమును గానరాదు.

---

* చంద్రశేఖరగురునివఱకు నావంశక్రమమున్నది. ఈచంద్రశేఖరుఁడే నెచయామంత్రిగురుఁడగునని నేననుకొనుచున్నాను.

## ౧౦

# మనుచరిత్ర

ఆనాఁడు దిగ్విజయయాత్రలో కృష్ణదేవరాయల వారు విజయవాడలో విడిసి యున్నప్పుడు పెద్దనకూడ వెంట నుండెనఁట. అప్పుడు విజయవాడవిద్వాంసులకు తన మనుచరిత్రమును వినిపించి కూడ నుండవచ్చును. కృష్ణదేవరాయలవారు ;

కం॥ మనువులలో స్వారోచిష
మనుసంభవ మరయ రసనమంచితకథలన్
వినిపింపు కలిధ్వంసక
మనఘ ! భవచ్చాతురరచన కనుకూలంబున్.

కావున మార్కండేయ పురాణోక్తప్రకారంబునఁ దానిఁదన కంకితముగాఁ జేయుఁ డనిరఁట !

ప్రపత్తిపరుఁ డయిన పెద్దన కలిధ్వంసకము కానికథను చెప్పఁడుకదా !

ఇప్పుడు దొరకుట లేదు గాని శఠకోపయతి కర్పితముగ 'హరికథాసార' మని మఱియొక గ్రంథమును పెద్దన రచించినాఁడు. షట్చక్రవర్తుల, అష్టవసువుల, చతుర్దశమనువుల, షోడశమహారాజుల చరిత్రలు కలిధ్వంసకము లని పురాణోక్తి.

ఈ మనుచరిత్రలో కడపటిపట్టున స్వారోచిషమనువు

పుట్టుక కలదు. గనుక దానితో ననుబంధము గల ప్రబంధమంతయును కలిధ్వంసకమే యగును గదా యని పెద్దన తన మనమును సమాధానపఱచుకొని యుండును.

కాని యథార్థమున కీకథ కలి యనెడి గంధర్వుని ధ్వంసము చేసినది గనుక కలిధ్వంసక మని చెప్పుకొనుట యుక్తము.

మనుచరిత్రలో వరూధినికై తలమార్చుకొని, దొంగవేషము వేసికొనినగంధర్వుని పేరు కలి.

మేఘసందేశమున కాళిదాసు యక్షు ననామధేయునిగాఁ జేసినట్లే మనుచరిత్రమునఁ బెద్దన్న కూడ గంధర్వు ననామధేయునిఁ జేసినాడు. 'కలి' యన్న పేరు పేర్కొనలేదు.

ప్రధానముగ వరూధినీప్రవరుల సమాగమ కథను హృదయమున నుంచుకొనియే రాయలవారు పయి విధముగ మనుచరిత్రము రసవదంచితకథలలో నున్న దనియు, కలిధ్వంసకమనియు, పెద్దన్నచతురరచన కనుకూల మయిన దనియు పలికియుందురు.

రాయలవారి కోర్కి గావుననే పెద్దనామాత్యుఁడు, స్వారోచిషమనుసంభవకథను గ్రంథము కట్టకడపట నెక్కడనో రెండు ముక్కలలో నెత్తుకొని ముగించినప్పటికిని, వారి యవ్వాతాతల కథను మాత్రము—అనఁగా వరూధినీప్రవరుల, వరూధినీ

గంధర్వుల కథను—మూఁడాశ్వాసముల పైదాఁకఁ బెంచి ప్రబంధీకరించినాడు.

నేఁడు మనుచరిత్ర మనఁబడునీప్రబంధమునఁ దొలి నాలుగయి దాశ్వాసముల రచనను స్వారోచిస్సంభవ మనియు, నా తరువాత నాఱవ యాశ్వాసము తుదిదాఁకఁ గల రచనను స్వారోచిష సంభవ మనియు వేర్పఱచి రెండు ప్రబంధములుగా నేను పేర్కొందును. రెండు ప్రబంధములను రాయల కంకిత ముగా నొక కృత్యవతరణికతో నొక సంపుటముగా సంధా నించినాఁడు గనుక మొత్తము సంపుటమును మనుచరిత్ర మని పేర్కొనుచుందును.

పయిరెండు ప్రబంధముల తీరులు పరిశీలనార్హములే యయినను ప్రస్తుతము నేను తొలి ప్రబంధముగ పరిగణించు చున్న స్వారోచిస్సంభవమును గూర్చియు, నందులోని కథా రసౌచిత్యమును గూర్చియు మాత్రమే యించుక ప్రపంచింతును.

ఈ కథలో నాయిక వరూథిని. దేవయోని జాతులలో, ననఁగా—గంధర్వ, విద్యాధర, యక్ష, కిన్నర, కింపురుషాదు లలో నొక టయినయప్సరోజాతిపడుచు. అప్సరసలు దేవ వేశ్యలు. వారికిఁ బద్మసంభవ, వైకుంఠ భర్గ, దేవేంద్ర సభలు సంగీత నాట్య విద్యల సాముగరిడీలు. కామకలావిలాస ములు వెన్నతో నేర్పిన విన్నాణములు.

గంధర్వ విద్యాధరాదులతోడనే కాక భువినుండి దివికి విచ్చేసెడి జ్యోతిష్టోమాది యాజులతోఁ గూడ శృంగారవిహారములు వీరి కులాచారధర్మములు. వారు వీ రనుహద్దు లేక అందఱితోడను వినోదించెడివారు గనుక నీ వేశ్యలు సామాన్య వనితలు.

భూలోకమున నెవ్వరైనఁ దీవ్రతపము చేయుచు నింద్ర పదవికే ముప్పు దెచ్చున ట్లుండునో వారి తపమును జెఱుచుటకు దేవేంద్రుఁడు వీరినే ప్రయోగించుచుండును. వీరు నిత్యయౌవనులు. ఎప్పుడును ముప్పదేండ్ల వయోవిలాసముతో నుండువారు. వ్యాధులు, జరామరణాదులు వీరి కుండవు.

ఇట్టి యప్సరసను, వరూధినిని, వీరితోఁ గలసి మెలసి విహరించుజాతిలోనివాఁడే యయినగంధర్వుఁ డొకఁడు కలి యనువాఁడు వలచి, తత్కాలమునకు వలపించుకొన లేక ఉపాయములు వెదకుచు వెంటాడుచుఁ దంటాలు పడుచుండినాఁడు.

ఉ॥ ఒక్కొకవేళఁ బద్మముఖు లొల్లమి సేయుదు రొక్కవేళఁ బె
న్మక్కువ నాదరింతురు క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్
చక్కన జేసఁగన్ జన దుపాయములన్ దగు నిచ్చకంబులన్
జిక్కఁగఁ జేసి దాని సతిచిత్తముఁ బట్టి సుఖింపఁగాఁ దగున్.

అనుకొనుచుండును.

వరూధిని పురుషముఖ మెఱుఁగని, వివాహితగాని భారతీయార్యకుల నారీరత్నము కాదు సుమండీ! ఆమె సదా ముప్పదేండ్ల వయస్సుదే! కనుక ప్రస్తుత కథాసందర్భమునకు ముందెందఱినో గంధర్వ విద్యాధరాది దివ్యపురుషులను, భువినుండి దివికి విచ్చేసిన శ్రోత్రియులను, వినోదపఱచి వారితో వినోదించినదే! మర్త్యలోకపు, మర్త్యవేషపు శ్రోత్రియులమీఁద మక్కువ రేగినదో యేమో! హిమాలయ పర్వతాగ్రమున రేవిణి వేసియున్నది. హిమాలయము భూలోక స్వర్గలోకముల సంధానస్థలము. దేవయోనుల కక్కడ దేవభూము లెన్నియో యున్నవి. వేడ్క పుట్టినప్పు డెల్ల దివ్యు లచట విడిసి విహరించుచుందురు. మన పెద్దలకు కొడైకానల్ ఊటీ సిమ్లాలలో నెట్టి సౌఖ్యపరికరము లుండునో యట్టివే వీరికిని అచట గలవు. ఆ పర్వతాగ్రముల కప్పుడప్పుడు సిద్ధపురుషులు, మహాయోగులు మొదలగువారు, భూలోకవాసులును వెళ్లఁగలుగుచుందురు.

గ్రహచారము చాలియో చాలకయో యార్యావర్తమున నెచ్చటనో యున్న యరుణాస్పదపుర వాస్తవ్యుఁ డొకఁడు శ్రోత్రియ బ్రాహ్మణ కుమారుఁడు, ప్రవరాఖ్యుడు పాదలేపము లభింపఁగనే వెనుకముందులు చూచుకొనక, శ్రీ టిక్కట్టు దొఱికినదే తడవుగా రైలుప్రయాణమునకు సిద్ధపడు నాత్రగాని

వలె, హిమాలయమును దర్శింపఁ బోయినాడు! పాదలేపము కరఁగి పోఁగా నప్రయోజకుఁడై దిగులుపడుచు వరూధిని యుండిన కోనలోని కేగినాఁడు.

వరూధినికి వంటయింటిలోఁ గుందేలు చిక్కినట్లైనది. ఆకలి గొన్న మాంసాహారి వంటయింటి కుందేటిని విడువనట్లే వరూధిని ప్రవరుని వలపుఁజూపుల వలలోఁ జిక్కించుకొని దక్కించుకోఁ దంటాలు పడినది. తన వలపుపోలుపులు దులపరించినది. తుటారించినది. మిటారించినది. ఆదరించినది. బెదిరించినది. ప్రార్థించినది. పైఁబడినది. కౌగిలిపట్టుగఁ బట్టుకొనినది. వెన్నతోఁ దినిన విద్యనంతయు గ్రక్కినది. వెక్కివెక్కి యేడ్చినది. ఏమి చేసినను నెంత యేడ్చినను లాభము లేకపోయెను.

ప్రవరుఁడు గురువులయొద్ద నేర్చినసదాచార సంపదను నిలువఁ ద్రొక్కుకొనినాఁడు. ఆమెచేష్టలకు చీదరించుకొనినాఁడు. బదుళ్లు చెప్పినాఁడు. కౌగలింపగా శ్రీహరీ యని యొరమో మిడి తదీయాంసద్వయం బంటి పో పొ మ్మంచుం దొలఁగఁ ద్రోచినాఁడు "అనయా యావజ్జీవం హోష్యామి" అను మాటదక్కించుకొనినాఁడు. తన బ్రహ్మవర్చసమును ప్రజ్వలింపించుకొనినాఁడు. అగ్నిదేవుని నారాధించి, ప్రార్థించి,

యూం యజ్ఞేశ్వరుని యనుగ్రహముతో నాకాశ మార్గమున నెగసి యరుణాస్పదపురమునకు వెళ్లిపోయినాఁడు.

వరూధినికిఁ దగినపరాభవ మయినది. గంధర్వునికిఁ దనవలనఁ గలిగినయవమానమే ప్రవరునివలనఁ దనకు దాపురించినది. పొంచి గుర్తించుచుండినగంధర్వుఁ డిదేయద ననుకొని ప్రవరవేషమునఁ దయారయి వరూధినిని దక్కఁగొన్నాఁడు. ఈ వేశ్యావిషయికరతిలోని చమత్కారవిశేషమును గుర్తింపఁ జాలనిచో వరూధినీ కథాసారస్యముఁ దెలియఁజాలము. వేశ్యలును, దదాసక్తులు నయిననాయికానాయకులు పరస్పర మొకరి కొకరు వశులు కానిచో దబ్బఱలు, తాటోటులు, తబ్బిబ్బులు జరపి, మోసాలు చేసి, వేషాలు వేసి కార్యము సాధించుకొను చుందురు. నాయికానాయకులు పొంది పొసఁగుట జరిగిన పిదప త్రొల్లటి దుష్కృత్యములు, రసాభాసములు ప్రజ్ఞాప్రయోగములుగను, రసోత్కర్షాధాయకములుగ్గను మారి సామాజికులలో రససిద్ధిని గల్గించును. ఈ పద్ధతినే గంధర్వుని నడవడి యుచట సమర్థనీయము కాఁగలదు. కాని యిట్లు సమర్థించుటకు గంధర్వుఁడు తన ప్రజ్ఞాప్రయోగములను వరూధినికిఁ దెలియఁ జెప్పి మెప్పుపొందు టత్యావశ్యకము.

ప్రేమ లేనివరూధినిని దొంగవేషము వేసికొని గంధ

ర్వుఁడు కలసినట్లు కాదు — చెఱచినట్లు వర్ణించుట రోఁత ! కాని కొందఱు సహృదయు లీ విషయమున నిట్లనవచ్చును.

ప్రవరుని మర్యాద, వరూధిని కోరిక, గంధర్వుని బులుపాటము దక్కినది గదా! ఆ ముప్వురి హృదయములలో నెవ్వరి హృదయములోను కలుఁగని రోఁత మీ కేల కలుగవలెనండీ! అని.

రసానుభూతి కథాశ్రోతలకుఁ బ్రేక్షకులకు సంబంధించినది గాని కథాపాత్రలకు సంబంధించినది గాదు.

వరూధినికి వాఁడు వేషధారి యయినగంధర్వుఁ డను సంగతి తెలియదు గాని మనకుఁ దెలియును. కనుక యిది రసాభాసమే. రసాభాసమే కాదు — నేటి శిక్షాస్మృతి ప్రకారము కొన్ని యేండ్ల శిక్షకుఁ దగిన క్రిమినల్ కేసు కూడ !

గంధర్వుఁడు కొన్నాళ్ల తరువాత రహస్యము వెల్లడించి వరూధినిచే మెప్పు పొంది సత్కృతుఁడయినాఁ డనియే సరిపుచ్చుకోవలెను. లేనిచో రసాభాసమే! కథావిధాన మంతయు రోఁతయే!

గంధర్వుఁ డిట్లు తన మాయాకృత్యము వరూధిని ముందఱ వెల్లడించుట సంభవించుచో దాని కామె మెచ్చుకొనుట తటస్థింప దేమో యనెడిసందియము పొడముట సహజమే! ఆమె నిజమునకు ప్రవరునే ప్రేమించినది గాని, యీ నాళ్లలో

గంధర్వునిఁ బ్రేమింపలేదు. ఆమె మృచ్ఛకటికలోని వసంతసేన వలె గుణానురక్తగఁ బ్రేమించినది.

ఇచట వరూధిని ప్రవరునిఁ బ్రేమించిననాళ్లలో దదేకానురక్తగాఁ బతివ్రతగానే వర్తిల్లినది. అయినను నామె మాయా ప్రవరుఁడు మాయమైన తరువాత ధర్మశాస్త్రప్రకారము పండ్రెండేండ్లు ప్రతీక్షించి యాపై భర్తకు శ్రాద్ధము చేసి కలకాలము విధవగనే యుండిపోయిన దనుకొనుట సరికాదు.

ఆమె నిత్యయౌవన గాన కొన్నాళ్లకు మఱియొకనిఁ బ్రేమించితీరెడిదే అనుకొనక తప్పదు! నిన్నటివఱకు నామెతో మాయావేషమున విహరించినగంధర్వుఁడు రత్నమువంటి బిడ్డ పుట్టిన తరువాత వానినిఁ జేరదీయఁ డనియు, వరూధినిపై ని తన వలపులవిసరును— నందామె చిక్కుపడుటను దెలిపియుండఁ డనియుఁ దలఁచుట సరికాదు.

నే నిట్లందును. వరూధిని యా గంధర్వుని ముం దెన్న డెఱుగనిది గాదు. ఇట్టి వారి నెందఱినో యింతకుముందు బుట్టను బెట్టినదే! గంధర్వుఁడుకూడ నిట్టి కుచోద్యము లెన్నియో చేసి యెందఱినో దక్కఁగొనినవాఁడే! ఇట్టి వారికి సంబంధించి యుండును గనుకనే యాలంకారికులు కొందఱు వేశ్య సామాన్యవనిత యనియు, నామెకు సంబంధించినశృంగా

రము రసాభాసమే కాని శృంగారము కా దనియుఁ నందురు. అది కాదని వేశ్యలను విడనాడిన శృంగారరసమునకుఁ బరిపోషమే కలుగ దనియు, వారు శృంగారసర్వస్వ మనియు మఱి కొంద ఱాలంకారికులు దానిని ప్రతిఘటింతురు.

గంధర్వుఁడు మాయాప్రవరుఁడుగా మాయమైనను వరూధిని నంటిపట్టి యున్నాఁడనియు, నామె ప్రసవించి స్వరోచి కొన్ని నెలలో యేండ్లో పెరిగిన తరువాత ప్రవరుని రాక కెదురు చూచిచూచి చీకాకుపడుస్థితికి వరూధినిని రప్పించి తన పంతమును చెలికత్తెలకుఁ జెప్పి, వరూధినికిఁ జెప్పించి, ప్రవరునిపై సన్నగఁ దాను జెప్పి, ఛీ! ఛీ! పో నాతోఁ గూడినవాఁడు నిజప్రవరుఁడే యని యామె తిరస్కరింపఁగా తిరస్కరింపఁగా, తాను మాయావేషమునఁ గలసి యున్ననాళ్లలోనే ముందు జాగ్రత్తపఱచి వ్రాసి యుంచుకొనినయేకాంత రహస్యముల డైరీని వెల్లడించి, వీలగుచో నసలు ప్రవరుఁడే యబద్ధమనియు నది యంతయుఁ దన వేషమే ననియుఁ జెప్పి తమ పరస్పర ప్రేమ సాక్ష్య మయినకుమారుని స్వరోచిని కౌఁగలించుకొని (ఆ కుమారుడును శృంగారలోలుఁడై గంధర్వుని సంతానమే సుమా యనిపించుకొనినాఁడు గాని ప్రవరుని బిడ్డఁ డనిపించుకొనలేదు.) వరూధిని నబ్బురపుచ్చి, తన నేర్మిని మెప్పించి ద్విగుణీకృతప్రేమతో మరల వరూధినీసన్మానమున వర్తిల్లినాఁ

డనుకొననిచో వరూధినీప్రవరకథ రసాభాసాత్మకమై రోఁత గొల్పును.

పెద్దనగా రీసందర్భము నీవిధముగ నిర్వహింపక పోయినను సూచనగా నైన నిట్టితీరున దెల్పియుండవచ్చును. తెల్పక పోయినను మన మట్టి కథను గట్టుకొనుట కవకాశ మేనిఁ గల్పించియుండవచ్చును.

కాని, మాయమై పోవుసమయమున మాయాప్రవరుని తలఁపుల నీవిధముగఁ దానే విప్పి చెప్పి తంటా తెచ్చినాఁడు !

క॥ అంత వియచ్చరు డభిమత
మంతయు సమకూఱుటయును నచ్చర గర్భ
శ్రాంత యగుటయును గనుఁగొని
యింతట నిచ్చోటు వదల కే నిఁక నున్నన్.

క॥ వంచన యెఱిఁగిన మఱి శపి
యించునొ సురకాంత చెప్ప కేఁగినఁ బ్రేమం
బంచ శరశరపరంపరఁ
బంచత ప్రాపించి మీఁదఁ బాపంబిడునో.

వ. అని వితర్కించి యక్కపటవిప్రుం డెఱింగించి యనిపించుకొనియు
పోవువాఁడై ... — మనుచరిత్ర

ఏవేవో ప్రలాపించినాడు. ఆ యనినవన్నియు వట్టి యబద్ధములే ! అబద్ధములే కాక మోసపునీతివాదములు కూడ ! అమరుఁడైనగంధర్వుఁ డమరకాంతయైనవరూధినికిఁ 'బంచత'

ప్రాపించునేమో యనుకొనుట విరుద్ధము. (వియచ్చరుఁ డని వాక్యమునఁ గర్తృపద ముండగా మరల 'కపటవిప్రుఁ' డనుట యనన్వితముగనున్నది.)

ఈ విధమున ప్రవరవేషధారి యయినగంధర్వుని యంతరంగపుఁదలఁపులను వెల్లడించుట శ్రోతల హృదయములలో నిప్పున్న మర్యోడిశృంగారరసమును జెఱుచుట యనిపించినది.

వరూధినికిఁ బ్రవరునియందే గాని గంధర్వునియం దను రాగము లేదు. నిజప్రవరునికిఁ దన సోమిదమ్మయందే గాని వరూధినియం దనురాగము లేదు.

"యాం చింతయామి సతతం మయి సా విరక్తా
సా చాన్య మిచ్ఛతి జనం స జనో న్యరక్తః
అస్మత్కృతే చ పరితప్యతి కాచి దన్యా
ధిక్తాంచ తం చ మదనం చ ఇమాం చ మాం చ."

అనినభర్తృహరి సుభాషిత మిచ్చట సరిపోవును.

ఈ విషయ మిట్లుండినప్పటికిని వరూధినీ ప్రవర సంవాద ఘట్టమునఁ బెద్దన నిర్వహించిన నైజాణతనపుఁగవన మాంధ్ర సారస్వతమంతకు నద్వితీయ మయినది.

పెద్దన్నగారు శృంగారధర్మవీరముల కనుఁడు, శృంగార శాంతముల కనుఁడు, ఎట్లన్నను నిక్కడ నడిపించినపోరాటము,

యుక్తిప్రయుక్తులు, రచనాచమత్కారము, శయ్యాసౌభాగ్యము, భాషాసౌందర్యము నిస్సామాన్య మయినవి. కృష్ణరాయలవంటి మహారాజు దగ్గఱనుండి, నేటి తెలుగు సహృదయు లందఱిదాఁక నీ రచనాఘట్టము పెద్దనగారిపై నఖండ గౌరవమును, మనుచరిత్రకు నఖండప్రఖ్యాతిని గల్పించినది.

ఈ కథ కల్పించిన రసపారవశ్యమున, నాఁటినుండి నేటిదాక సహృదయప్రపంచము దానిలోని లోపములను వేసిని వెదకి పట్టుప్రయత్నము సేయలేని దయినది.

వరూధినీకామాగ్నిలో మైనమై కరఁగి పోక వజ్రహృదయుఁడై నిలిచి శీలరక్షణ చేసికొన్న ప్రవరుని మహనీయతను ప్రజ్వరిల్లఁ జేయుటలో పెద్దన నిర్వహించిననైఆజాణతన మాంధ్ర సారస్వతమున మఱి యన్యత్ర దొరకనిది. అద్భుతమైనది.

ఈ కథా ఘట్టమే రాయలసభలోఁ బెద్దన నష్టదిగ్గజములలోఁ దూర్పుదిగ్గజముగాఁ గావించినది. అగ్రహారము లిప్పించినది. రాయలరాజ్యములోఁ గడలూరి గవర్నరుగాఁ జేసినది.

మనుచరిత్రను దెలుఁగురసికు లందఱుఁ జదువుచునే యుందురు. నాల్గాశ్వాసముల దాఁకనే; నూటికిఁ బదిమంది యైనను దరువాత కథను జదువరు. చదివినను వరూధినీ గంధర్వ సమాగమము మరల నెక్కడ నయినను రాఁగల దేమో చూత మనునాశతోఁ జదువుచుందురు.

పయి విషయములే గాక, పెద్దన్న కవిత్వరచననుగూర్చి చెప్పినయుత్పలమాలిక, కృష్ణరాయ నిర్యాణానంతరము చెప్పిన సీసపద్యములు రెండు, మఱికొన్ని పెద్దన చాటుపద్యములు నాంధ్రసారస్వత మున్నంతదాఁక నిలిచి యుండఁగలవు.

పెద్దన్న సీసపద్యము నొకటిమాత్ర మిచ్చుటఁ జదివి రాయన ఘనతను స్మరింపుఁడు :—

సీ॥ ఎదురైనచోఁ దన మదకరీంద్రము నిల్పి
కేలూత యొసఁగి యెక్కించుకొనియె
బిరుదైనకవిగండ పెండేరమునఁ గీవ
తగు దని తానె పాదమునఁ దొడిగె
మనుచరిత్రం బందుకొనువేళఁ బుర మేఁగఁ
బల్లకిఁ దన కేలఁ బట్టి యెత్తె
కోకటగ్రామా ద్యనేకాగ్రహారంబు
లడిగినసీమలయందు నిచ్చె
గీ॥ నాంధ్రకవితాపితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర యని నన్నుఁ బిలుచునట్టి
కృష్ణరాయలతో దివి కేఁగఁ లేక
బ్రతికి యున్నాఁడ జీవచ్ఛవంబ నగుచు.

# దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము

క్రీ. శ. ౧౪౦౦ తరువాతినుండి తురుష్కులయు, గజపతులయు నలజడి యంధ్రదేశము నత్యధికముగ నలముకొన్నది. ౧౪౩౦ ప్రాంతపుటలజడిని చూడలేక తాళ్ళపాక యన్నమాచార్యుఁ డిట్లు సంకీర్తనరూపమున విలపించినాఁడు.

రామక్రియ

పల్లవి

తలిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయఁ జెప్ప నేఁడు కలికాలమహిమా॥

చరణములు

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
నిటువలె భూతములు యెట్లు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశ మెట్లోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమా॥ ౧

అంగలార్చుకామినుల యంగభంగపు దోఁపు
లింగితాన మింట సూర్యుఁ డెట్టు చూచెనో
పొంగు నానాజాతిచేత భువన మెట్లానెనో
తంగి లోక మిట్లాయఁ గలికాలమహిమా ॥ ౨

అరుదు గోహత్యలు నేయుఁగ మూడ లంగలార్వంగ
సరిధర్మ దేవ తెట్టుసమ్మతించెనో
పరధనచూర కెట్టు పట్టాయెనో లక్ష్మి
కరుణ యెం దణఁగెనో కలికాలమహిమా। ౩

దేవాలయాలు నానాదేశము లెల్లాఁ జొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు
తావు లేలేరాజులకు ఏయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయెఁ గలికాలమహిమా ॥ ౪

నిరపరాధులఁ జంపి నెత్తురు పారించఁగాను
తెరల కెట్లుండిరో దిక్పాలులు
విరసవర్తను లుండే విపరీతకాలమున
గరువాలుం గపటాలె కలికాలమహిమా ॥ ౫

ఉపమించి దంపతులు వొకరొకరినిం జూడ
చపలదుఃఖములతో సమయగాను
తపములు జపములు ధర్మము లెం దణఁగెనో
కపురుంబాపాలు నిండె కలికాలమహిమా ॥ ౬

తలలు పట్టీడువఁ గాను తల్లులు బిడ్డల వేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కులు గోయ మరుఁ డెట్టు వోరిచెనో
కలకలే ఘనమాయెఁ గలికాలమహిమా ॥ ౭

దీనతలోఁ బడి గుండెదిగు లనురునురులు
వాని నెట్లు లోఁగొనెనో వాయుదేవుండు

గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తికఁ గోయఁ
గానంబడె నింతేసి కలికాలమహిమా ॥ ౨

పలుమారు నమ్మించి ప్రాణములు గొనగాను
యిలఁ పినులోఁ ప్రాణా లెట్లుండెనో
నెలవై శ్రీవేంకటేశ నీవే యెరుంగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమా ॥ ౩

(అన్నమాచార్యుల ఆధ్యాత్మసంకీర్తనములు 3౭3 రేకు ౧ వ పాట)

క్రీ. ౧౫౦౦ నుండి ౧౫౬౫ దాఁక నష్టదిగ్గాయ భయంకరుఁడయినకృష్ణదేవరాయఁడు మొదలగురాజులు దక్షిణాపథమును సురక్షితపఱిచి భాగ్యలక్ష్మిని, సాహిత్యసరస్వతిని చాలఁగ సంవర్ధిల్లఁజేసిరి, గాని విద్యానగరవినాశము తరువాత ఆంధ్రరాజ్యలక్ష్మి, ఆంధ్రసాహిత్య సరస్వతి, దక్షిణదేశమును అనగా అరవదేశమునధికముగనాశ్రయింపవలసెను. కారణ మాదేశము రాజ్యోపప్లవము, దౌర్భాగ్యము లేక రాజస్వాంతముగా నుండుటయే. తంజావూరిలో చెవ్వప్ప నాయకాదులు, మధురలో నాగమ నాయకాదులు, పుదుక్కోటలో కోటవారు, రాజ్యము లేలుచు నాంధ్రదేశముననుండి కవులను, గాయకులను, గాయనులను, అభినేత్రులను, శిల్పకారులను, వ్రాయసగాండ్రను, నింకను రాజ్యాంగమునకు వలసినవిద్యావ్యవహార, వినోద, ముఖ్యతంత్రములవారినెల్లను వెంట గొనిపోయిరి. అరవదేశమున విఖ్యాతులుగ నున్నవిద్వాంసులను, గాయకులను, వ్యవహారదక్షులను సంపూర్ణ

ముగఁ దమకు సహాయపడుచుకొని సర్వసామరస్యముతో రాజ్య రక్షణము గావించిరి.

తొలుత చాళుక్యరాజ్యమునను, దర్వాత కాకతీయ రాజ్యమునను సంప్రదాయపరంపరాగతము లగుచుండు గ్రంథ సంచయమును గూడఁ దమతో వా రా యారాజ్యములకుఁ గొని పోయిరి. అట్లు కొనిపోయిన గ్రంథసంచయము తంజాపూర మహనీయముగఁ జెంపొందినది. ద్రవిడదేశమున నెలకొన్న నాయకరాజులు తమ పాలనతంత్రమును దమ పూర్వులు కృష్ణ దేవరాయాదులు నిర్వహించినతీరుననే నిర్వహించిరి. శ్రీకృష్ణ దేవరాయాదులు తమ పూర్వపుసంగమవంశపురాజుల తీరును, వారు తమ పూర్వపుఁ గాకతీయుల తీరును, వారు తమ పూర్వపుఁ జాళుక్యులతీరును ననువర్తించి రాజ్యతంత్రముల సాగించిరి. విద్యానగరమున నుండి తంజాపూరికిఁ జేరిన గ్రంథములలో నట్టి రాజ్యపరంపరాయాతము లనేకము లున్నవి. చాళుక్యుల యభిలషితార్థచింతామణీ, సంగీతచూడామణులు సామ్రాజ్య లక్ష్మీపీఠికాతంత్రము మొదలగుగ్రంథము లీ రాజ్యపారంపర్య సంప్రదాయములను వెల్లడించునవిగా గుర్తింప నగుచున్నవి. ప్రధానముగఁ బై మూడు గ్రంథములు శ్రీకృష్ణరాయల రాజ్య నీతి, రాజ్యతంత్రవిధానములకును, నట్లే తంజాపూరిరాజుల రాజ్య తంత్రరాజ్యనీతివిధానములకును సరిపోలునవిగా నిరూపణ కెక్కు

చున్నవి. రాయవాచకమునను, నాముక్తమాల్యదలోను నున్న రాజ్యనీతివిషయములు చాల సామ్రాజ్యలక్ష్మీపీఠికాతంత్ర మునను, నభిలషితార్థచింతామణిలోను నున్నవి. రాయవాచక మున కృష్ణరాయల దినచర్యాది విధానమునే తంజావూరి రాజులును బాటించిరి. నేఁటికిని మైసూరురాజ్య మావిధానమును గొంత పాటించుచున్నది. తంజావూరిలో నాట్యశాలాది నిర్మాణములు అభిలషితార్థ చింతామణి, సామ్రాజ్యలక్ష్మీపీఠికాతంత్రాది గ్రంథోక్తరీతుల ననువర్తించుచున్నవి. ఆయా విషయముల నెల్ల సరిపోల్చి చూపుటకు ప్రత్యేక పరిశీలనము చాల గావలెను.

తంజావూరిలో చెవ్వప్పనాయకుఁడు, అచ్యుతప్ప నాయకుఁడు, ప్రధానముగ రాజ్యపాలన స్వాస్థ్యములయం దధికముగా నాదరము చూపిరి. కాని రఘునాథ, విజయరాఘవ నాయకులు క్రీ. శ. ౧౬౫౦ ప్రాంతములనుండి రాజ్యవైభవానుభవములతో పాటు దేవాలయాదినిర్మాణములు, తదుత్సవాదివిశేషములు, సంస్కృతాంధ్రద్రవిడరచన ప్రోత్సాహములు, తత్కవిసత్కారములు, సంగీతవినోదములు, నాట్యవినోదములు, అందు నధికముగ నాంధ్రకవితాగాననాట్యవినోదములు గలవారై యఖండానంద మనుభవించి, ప్రజాసామాన్యమును గూడ ననుభవింపఁ జేసిరి. ఏవంవిధవినోదమునఁ బాల్గొనువారికి నిరంతరాన్నదాన సత్రములను వెలయించిరి. ఆనాఁడాంధ్రదేశమునుండి సత్కా

రము బడయుట కెంధఱో తంజాపూర్యాదిస్థలముల కరిగి రాజాదరము పడసి యక్కడనే నెలకొనిపోయిరి. వారు రచించిన గ్రంథము లనేకము లున్నవి. ఆ యాకవుల గ్రంథముల జాబితాల నిక్కడ ప్రకటించుట నాపని కాదు. అది సుందరమును గాదు. లభించిన యన్ని గ్రంథములనుగూర్చి విమర్శము వెలయించు టయు నల్పవ్యవధిలో నంత సుకరము గాదు.

తంజాపూరిగ్రంథములలో విశిష్టయోగ్యత గల గ్రంథములను గొన్నింటినిగూర్చి మాత్రమే, విశేషాంశములనే, క్రొత్తవానినే యిక్కడ వివరింపఁ బూనితిని.

తంజాపూరిలో రఘునాథనాయని విద్యావినోదము భోజమహారాజువిద్యావినోదమును, కృష్ణదేవరాయని విద్యావినోదమును దలపించునంతటిది. స్వయము రఘునాథరాయఁడు భోజునంత మహావిద్వాంసుఁడు. ఆతని కుమారుఁడు విజయరాఘవనాయకుఁడు మహారసికుఁడు, కవి, మహాదాత, గాయకుఁడు, పరమవైష్ణవుఁడు.

రాజసభలో నారితేరిన కవిచౌడప్ప రఘునాథరాయని రాజసభలో—

"కోరుదు నని మాటాడను,
వారిజభవునంతవాని వశమా తంజా

పూరి రఘునాథరాయని
గారి సభను కుండవరపుఁ గవిచౌడప్పా!"

"తముఁ దామె వత్తు రర్థులు,
క్రమ మెఱిగినదాతకడకు గమ్మన్నారా
కమలంబు లున్నచోటికి
భ్రమరంబుల నచ్చుతేంద్రు రఘునాథనృపా."

అనెను. ఈతఁడు విజయరాఘవనాయని రసికతను మెచ్చి, యాతనిపై గొన్ని పదములు రచించెను. అవి శృంగారరసగుళికలు.

రఘునాథనాయకుఁడు సంస్కృతమునఁ గూడ గొప్ప విద్వాంసుఁడు. యజ్ఞనారాయణదీక్షితు నంతవానికి కావ్యాలంకృతి నాటకాది సాహిత్యవిద్యలో గురుత్వము నెఱపినవాఁడు, అనేకులచే సంస్కృతగ్రంథములఁ గృతు లందినవాఁడు, తన చరిత్రమునే యనేకులు, ఒకరే యనేకవిధముల రచింపగా విని తనిసినవాఁడు నయినను దాను కవీశ్వరుఁడయి సంస్కృతమున కంటెఁ దెలుఁగుననే పలుగ్రంథములను రచించెను. అందు రామాయణభాగము, వాల్మీకిచరిత్ర, నలచరిత్ర ముద్రితము లయి యున్నవి.

రఘునాథరాయఁడు సంగీతమున గొప్ప విద్వాంసుఁ డగుటచే నందుఁ గూడ గొప్పగ్రంథము రచించెను. రచింపించెను.

రఘునాథనాయని సంగీతసుధ, వెంకటమఖిచతుర్దండిప్రకాశిక నాఁటి సంగీతగ్రంథములు.

రఘునాథనాయనినాఁటి గ్రంథములెల్ల సంస్కృతాంధ్రములలో శాశ్వతప్రతిష్ఠ గాంచదగినవే కాని తేలికపాటిరచనవి గావు.

ఆంధ్రమునఁ జేమకూర వెంకటకవి గ్రంథములు సర్వసహృదయవిదితములే కదా ; ఆతఁడు

"తా రసపుష్టిమైఁ బ్రతిప
దంబును జాతియు వార్తయుం జమ
త్కారము నర్థగౌరవము
గల్గ ననేకకృతుల్ ప్రసన్నగం
భీరగతిన్ రచించి మహి మించినచో
నిక నన్యు లెవ్వర
య్యా ! రఘునాథభూపరసి
కాగ్రణికిం జెవి సోక జెప్పఁగాన్."

అన్నాఁడు. రఘునాథరాయఁడు కృతిగొన్న గ్రంథములలో నైషధపారిజాతీయ మొక్కటి ; తద్గ్రంథకర్త కృష్ణాధ్వరి సంస్కృతాంధ్రములలో గొప్పకవి. ఆంధ్రమునకంటె సంస్కృతమున మఱీ గొప్పకవి. రఘునాథరాయలపేర నాతడు సంస్కృతమున నైదుగ్రంథముల రచించినాడు.

"నవరస 'శ్రీరఘునాథభూపాలీయ'
నామభామాభీష్టనాయకుండు
సరస 'నైషధపారిజాత' కావ్యాయకావ్య
వర్యాస్వయంవరవల్లభుండు
కల్యాణ 'కౌముదీకందర్ప' నాటక
కన్యోద్వహనబద్ధకంకణుండు
అమరుకాహంకారహారి భంగీశశృం
గారసంజీవనీకాముకుండు
తాళచింతామణీవధూతత్పరుండు
మంచిజామాత రఘునాథమనుజనేత!
తెలియ (తెలుఁగు?) నైషధపారిజాతీయకృతియు
నేవు రక్కా లచెల్లెలై హెచ్చు ననుచు.

పరదోషా ఽ పరయోషా
పరభాషారహితభూమిపాలకఋషికిన్
మరుదుర్వీధరదర్వీ
కరగుర్వీడ్యప్రతాపఘనశేముషికిన్.

వాణీనిపుణసభాంత
ర్వాణి హితసువస్తు నహితవాదాన్యకయు
క్పాణికిఁ బరగిరిఁబిరుదక్ష్మ
పాణికి రఘునాథభూమిపాలాగ్రణికిన్."

—నైషధపారిజాతీయము.

వర్ణ్యవస్తువు మంచిదైనపుడు కవి యెట్టివాఁడయినను వర్ణనము ప్రశస్తముగానే యుండు ననుటకు రఘునాథరాయనిఁ

గూర్చి వర్ణనలు చేసినసంస్కృతాంధ్ర కవుల రచన లన్నియు సాక్షులే — విజయవిలాసకథారచన మొక పెడ, దానికృత్యవతరణిక యొక పెడగాఁ ద్రాసులో దులదూఁప దగిన యోగ్యత కలది రఘునాథరాయవర్ణన.

కృష్ణాధ్వరి రఘునాథరాయని గూర్చి చెప్పిన పద్యముల నుదాహరింపక విడనాడఁజాలను.

నైషధపారిజాతహర
        ణాద్వికథార్థసమర్థనధ్వని
శ్లేషగతిప్రబంధము రచించిన
        మారఘునాథశౌరి సం
తోషము నందునన్ కణఁకతో
        దశదిగ్జయశోభితద్యశో
భూషణమైనయాకృతికిఁబూనితిఁ
        బ్రౌఢి నిరూఢి చెందగాన్.

ఫణితి ఫణీంద్రులార ! రస
        భావవశంవదభావనాఘనం
ఘనితమదుక్తిధోరణుల గల్గిన
        తప్పులు దిద్దరయ్య త
ద్గుణ మగుణంబు దూషణ
        మదూషణ మౌ ననువారు గాక త
ద్గుణము గుణంబు దూషణము
        దూషణ మౌ ననువార లాప్తులే

ఆలంకారికహర్షమత్కృతివర్గం
బాజానసారస్వత
శ్రీలుం డౌరఘునాథశౌరిఁ గవి
హర్షింపంగ నన్యుల్ వృథా
స్థూలంభావుకులైనకొందఱు దృఢ
న్యాతోష్ఠతానూచితో
పాలంభు ల్గనకున్న నేమి కుహనా
హాల్లోహలుల్ లోహలుల్.

ఆజిజితారికోటినతి
నన్వహ మన్న సువర్ణదానసం
పూజిత విప్రకోటిసుతిఁ
బొందుచు నార్గురు చక్రవర్తులన్
రాజులఁ జేయునట్టిరఘు
నాథనృపాలుఁడె చక్రవర్తి యా
నీజగమందు నేడు మొద
లిర్వదియిద్దఱు రాజు లెన్నగన్.

ఆయతకీర్తిధౌతహరి
దంచలు డంజనలక్షణాభిధో
పాయదృఢప్రయోగపరి
పాటి గృతుల్ రఘునాథభోజభూ
నాయకు డందు గాక
విగుణస్ఫుటదోషము లౌఘుణాక్ష
న్యాయజడప్రబంధముల
నందు మనం గలసైన నందునే.

స్వాయముక్తాత్మకృతిస్తుతుల్ జదులు భా
షామంజరిఁ లింగని
ర్ణయముఁ గొంత సమాసచక్రము క్రియల్
నైఘంటుకాఖ్యల్ నిర
స్వాయతం గూర్చి కవిత్వ మంచు సభలఁ
వర్ణించు విద్వత్కవి
ప్రియ మాషాపదవాక్యమానసువచ
శ్రీమత్కృతుల్ దక్కఁగాఁ.

—నైషధపారిజాతీయము.

కావ్యములలో నాశ్వాసాద్యంతపద్యములున్నను వానిని బాఠకులు, శ్రోతలు నంతగా బాటించి చదువుట, వినుట యుండదు. ఈగ్రంథమున నా కవి చవిగొల్పుచు జదువను, విని పింపను సముత్సాహపఱుచుచుండును.

కృష్ణాధ్వరి రచించినరఘునాథభూపాలీయాది గ్రంథము లయిదును సంస్కృతగ్రంథములు. అందురఘునాథభూపాలీయ మలంకారశాస్త్రగ్రంథము. దాని వ్యాఖ్యాన మొక యతీశ్వరు డానాఁడే రచించినాఁడు. కడమగ్రంథము లిప్పుడు గానరావు. సంస్కృతమున గొప్ప గ్రంథకర్త యగుకృష్ణాధ్వరి రఘునాథ రాయఁ డాంధ్రకవిత నధికముగా నభిమానించు నని యాతని వినోదపఱుచుటకై పరమోత్సుకతతోఁ బ్రయత్నించి యతి ప్రౌఢముగా నాంధ్రకవితారచన నలవఱుచుకొని యీగ్రంథము

రచించినాఁడు. నైషధపారిజాతీయ మాముక్తమాల్యదరచనమును దలఁపించుచు గూఢప్రౌఢశబ్దార్థశ్లేషాలంకారచిత్రితమై యొప్పారు చున్నది. రాఘవపాండవీయము, హారిశ్చంద్రనలోపాఖ్యానము నీగ్రంథమునకు మేలుబంతులే యయినను నా గ్రంథముల నీతఁడు గ్రంథరచనోపక్రమమున మాత్రమే యనుకరించె నన వచ్చును. కవి తానే దీనిని వ్యాఖ్యానించియుండిన బాగుగా నుండెడిది. పెక్కేండ్లకు ముందే యథామాతృకముగా దీని ప్రతి వ్రాయించుకొని సవ్యాఖ్యానముగాఁ బ్రకటింప నుత్సాహ పడితిని గాని పెక్కుచోట్ల శ్లేషచమత్కృతి దుర్గ్రాహముగా నుండు టచే నింతదాఁక దానిని ముగింపఁజాలకుంటిని. కుదిరినంతవఱ కయిన లఘుటీక గూర్చి ప్రకటింపవలెను. దీనిని బ్రకటించుటలో కృష్ణాధ్వరిమీఁది గౌరవము గాని, శ్లేషకవితమీఁది యాదరము గాని, యముద్రితగ్రంథప్రకటనముమీఁది యౌత్సుక్యము గాని కారణములు గావు. మహనీయుఁ డయినరఘునాథరాయలమీఁది యాదరమే యేతద్గ్రంథప్రకటనమునకు నన్నుత్సాహపఱుచు చున్నది.

ఈతని గ్రంథములోని రచనాచమత్కారములు గొన్ని చూపుదును. కథారంభపద్యము.

"బలభద్రస్థితి హైరివర్గము నడం
పక సత్యభామాదు లు

౧౨౨

జ్వాలసామ్రాజ్యభరార్హతం దెలుపఁగా
　　శౌర్యాఖ్యచే మాగధా
దులు దీర్ణానతవర్ణతం జెలఁగ సం
　　తోషశ్రితశ్రీకుఁడౌ
వలభూమీపతి గారవించె మహినిన్
　　న్యాయంబునన్ రుక్మిణిన్."

—నైషధపారిజాతీయము

ఇందు నాల్గవ చరణమున రెండర్థములకు సరిపడునట్లు నల—అల, 'న్యా' యతి కలదు. బలభద్ర, సత్యభామాదులు, శౌర్యాఖ్య, మాగధాదులు దీర్ణానతవర్ణతన్, ఔనలభూమీపతి, మహినిన్ రుక్మిణిన్—పదములు రెండర్థములకుఁ గుదురుపడునవి.

"ఆకార మున్న మణిగిరి
రాశ న్నల చూచు సొంపు రా భీమజన
వ్యాకుల సప్పురి బుణ్య
శ్లోకుఁడు గని భావికుశలసూచకుఁడై."

"పాద మూనినచోటఁ బగడాలధగధగ
　　లింపారఁ బుటికెల నింపవచ్చుఁ
గేలు సోకినచోటఁ గెంపులచకచకల్
　　సొంపార గంపల ముంపవచ్చు
వంగ మంటినచోట నవరంజిధళధళల్
　　పొంగార గాదెఁ బోయవచ్చు
నిక్క చూచినచోట నీలాలనిగనిగల్
　　నిండారఁ గణజాల నింపవచ్చు

నాత్మభూయత్న రుచిత మోహారివిభవ
పూరమాటోప మేజాడఁ బొగడువాఁడ
నింద్రజాలంబొ మాయయో యెఱుఁగ నైనఁ
జాడఁ గలుగుట మామకసుకృతఫలము."

* * * *

"వచ్చివాఁడమ్మ నీ వాంఛితాఖిలపూర్తి
వైభవంబున దేవవల్లభుండు
చనుదెంచెనమ్మ నీ సౌభాగ్య మలరింప
వరతేజమున హవ్యవాహనుండు
వెంచేసెనమ్మ నీ వేడుక లీడేర
దాక్షిణ్యవర్తన ధర్మరాజు
ప్రాపించెనమ్మ నీ భాగ్యంబు ఫలియింప
రత్నసంపద సింధురాజటంచు
వలపు దెలియంగ నమరశంభళులు దెలుప
విప్రవరసూక్తి విధృతజీవితఫలంబు
న్యాయవర్తనమహిమ నన్నలవిభుండు
హరిదయావహమూర్తి గా కన్యుఁ డగునె? "

రఘునాథరాయుని కుమారుఁడు విజయరాఘవనాయుఁడు చాల రసికుఁడు. సంగీతసాహిత్యకవితాగాననాట్యనాటకవినోదపరాయణుఁ డగుటే కాక వైష్ణవమతైకాభిమానమహితుఁడై విష్ణ్వాలయములకే విశేషవైభవముఁ గల్పించుచు వెలుఁగొందెను. అతని కాలమున నంధ్రకవితారచన శృంగారరసైకమయమై పలుచబడినది. గుజిలీపుస్తకములలోఁ బెద్దిదాసుచరిత్ర మని యొక

లఘుగ్రంథము ముద్రితమైదొరకుచున్నది. అందుఁగథానాయకుఁడు పెద్దిదాసు. విజయరాఘవనాయకుని నాఁటివాఁడు. అతఁడు మహా భక్తుఁడు. విజయరాఘవనాయకుఁ డాతని గేలి చేసి యాతని వేషమును గాడిదకుఁ గల్పించి యూరేగించియవమానపఱిచెనఁట! ఆభక్తుని సంకీర్తనములును, రాయని యవకరపుఁజేష్టయును నాలఘుకృతిలోఁ గానవగును. భక్తు నొకని నట్లు పరిహసించుట చేతనే యాతని రాజ్య మంతరించె నని కూడ నందున్న ట్లున్నది. అం దెంత సత్యము గలదో కాని యాతఁడు సంగీతసాహిత్యాది లోలుఁ డగుట తథ్యము. ఆతని నాఁటికృతులు చాల యక్షగానములు. రఘునాథనాయని చరిత్రము నాతఁడు ద్విపదకావ్యముగా రచించినాఁడు. ఇప్పటి కించుమించుగా నలువది యేండ్లకు ముందునే నాయాగ్రంథములెల్లను బరిశీలించి ముఖ్యాంశములు వ్రాసికొని వచ్చితిని. రఘునాథరాయచరిత్రమందలి తంజావూరి రాచనగరి వర్ణనాదులఁ బట్టి యాయా రాజసభాదిస్థానములను గుర్తించి యప్పు డక్కడి పండితులకుఁ బ్రజలకు వాని నెఱుకపఱిచి వచ్చితిని. తంజావూరి యాంధ్రరాజుల చరిత్ర మని పుస్తకముగా నాయావిషయముల సంగ్రహమును బ్రకటించితిని. అప్పటి సేకరణములోని విశేషములనే యిందు వెల్లడించుచున్నాను. విజయరాఘవనాయని నాఁటి యక్షగానములలో రచనాచమత్కృతులు కొన్ని :

దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము

విజయరాఘవు పట్టంపుకవి యైనకామరుసు వెంకటపతి సోమయాజి 'విజయరాఘవచంద్రికావిహారము'న—

## చోళదేశవర్ణన

కవు లెంతురు చోళదేశము, దివ్య
    కావేరీవారిప్రకాశము ;
నవరత్నము లున్నకోశము, సుర
    నాయకరాజ్యసంకాశము ;
చెఱకురాజనంపుఁబైరులు, కాపు
    సేమము గలిగినయూరులు,
తిరముగాఁ బ్రవహించునేఱులు, చోళ
    దేశంబున వెయ్యాఱులు.

ఆ రాజ్యరమకు మంజీరము, అల్ల
    అమరావతికన్న సారము
భూరమణీమణిహారము, తంజ
    పురము సంపదలకొటారము.
నవరత్నంబుల పేటలు, దివ్య
    నారికేళంబుల తోటలు,
సవరణ సేసినకోటలు, వీట
    సరసులు నూటాఱుకోటులు.

మలరాయనిమీఁది జోలలు, చాల
    వర్ణింప నేర్చినబాలలు

విలసిల్లు నాటకశాలలు, అందు
వింతవింతలు కృష్ణలీలలు
పరులను గెల్చినపోజులు, మెచ్చ
పాలింతురు దినరాజులు
సరిలేని విద్యాభోజులు, వీట
నడిసన్న రాజాధిరాజులు.

ఆ రాజధానికి రాజై రాజిల్లు రాజచంద్రుని నాతని పట్టంపుఁగవి యేమని కొనియాడుచున్నాఁడు—

శ్రీరామగోపాల సేవచేఁ జాల
పేరు గాంచిన ఱేఁడు బిరుదుమన్నీఁడు
లక్షణాన్వితుఁడు కళావతీసుతుఁడు
దాక్షిణ్యశాలి యుత్తమరాజమౌళి
రణముల జగజెట్టి రఘునాథుపట్టి
గుణరత్నములదీవి గురుజనసేవి
బహుదానపరుఁడు భూపాలశేఖరుఁడు
సహజకీర్తిస్ఫూర్తి సర్వజ్ఞమూర్తి
రతులకు రతిరాజు రాజుల రాజు
వితరణగుణహారి విభవజంభారి
జగదుపకారి వైష్ణవమతోద్ధారి
తగవుల వీడు చింతామణి జోడు
నీతికి మాంధాత నియమసంధాత
జాతివార్తల మేటి శౌర్యకిరీటి
సరసుండు నెఱజాణ చక్కనివాఁడు

పరమవైష్ణవులచేపట్టుకుంచంబు
బాహువిక్రమశాలి భరతకోవిదుఁడు
సాహిత్యభోజుండు సంగీతవేది
కోరినవారికిఁ గొంగుబంగారు
చేరువమేరు వాశ్రితవర్గమునకుఁ
పేదలపాలింటి పెన్నిధానంబు
వేదకోవిదులకు వెలలేనిసొమ్ము
పలికి బొంకనిరాజు పరమవివేకి
నిలుకడ గలవాఁడు నిత్యాన్నదాత
పట్టభద్రుండు కృపాసముద్రుండు
చుట్టలసురభి రాజుల మేలుబంతి
వరశరణాగతవజ్రపంజరుఁడు
నరులపాలింటిపున్నమచందమామ
ఏకవీరుండు జగదేకవదాన్యుఁ
డాకారమన్మథుం డసమసాహసుఁడు
మానినీనూతనమకరకేతనుఁడు
భానుసమానుండు పరతత్త్వవేది
అనుమానమునఁ దేలి యావసమాలి
చనవరి యిల్లాలిచనుబాలుఁ గోలి
పెరిగినయన్నగోభిలమానికన్న
పరతత్త్వరుచి గన్న పాయఃంపుమిన్న
విజయరాఘవశౌరి విద్యావిహారి
భుజబలకంసారి పూర్ణసంహారి
అన్నిట నవధాని యారాజధాని
మన్ననతో నేలు మహి మేలు మేలు.

[విజయరాఘవ నాయకుని విప్రనారాయణచరిత్రమున పదము]

హరిభక్తి దప్పింతునా నాపై
నసురక్తి రప్పింతునా
పరమపావను డీబాపఁడు నిను జూచి
పడసేవాడు గాడే, ఓచెల్లె
విటునిగా నడపింతునా దాసరి
నటనలు విడిపింతునా
కటకట నీ కింత గర్వ మేలె వీ
డటువంటివాడు గాడె, ఓ చెల్లె
గీతము వినిపింతునా మరునికై
జీతము కెనయింతునా
నాతిరో హరికీర్తనకు జొక్కువాడు
నీ గీతమునకు దక్కునా, ఓ చెల్లె
అడపము గట్టింతునా వానిచే
మడుపులు చుట్టింతునా
గడిదేరి చెలికేవు కైంకర్యపరుడు నీ
కడపము గట్టునట్టే, ఓ చెల్లె.

[పదం, కాంభోజరాగం, ఆటతాళం]

చదివేది దివ్యప్రబంధము, మాకు
సైపదు సంసారబంధము
ఎద నుండు హరిభక్తిగంధము యో
గీంద్రులతోనే సంబంధము
మాతో మీ కేటి మాటలు, విన
వాతి గాదు మీ పాటలు

భవనంబులు పర్ణశాలలు మా
పాటలు హరిమీఁదియోలలు
తగిలి యుందురు ముక్తిబాలలు మా
దాపురములు హరిలీలలు
మే మున్నయూరు శ్రీద్వారకా ముక్తి
కామినిపైని మా కోరిక
స్వామిభక్తి మాకు చేరిక వో
కోమలి నీ విక పూరకే, పోవే
ఆలుబిడ్డల పొందు కోరము మేము
కోరేది హరిభక్తిసారము
నీలవర్ణుని గొల్చువారము మీ
యాలాపములు విన నేరము
పరమాన్నములు కాయగూరలు మా
పరిధానములు నార-చీరలు
సరిపోవు మీకు మా మేరలు మా
సంగడివాండ్రు పకీరులు.

*　　　*　　　*　　　*

కంపాలతలు నటింపఁగఁ
దుంపురులై చినుకు లగుచుఁ దోరణ లగుచున్
జంపకగంధి చలింపఁగ
సంపాజాలంపువాన లప్పుడు గురిసెన్.

*　　　*　　　*　　　*

తాటోటు బావనదాసరి నీవు
తోటపనుల్ నేవి త్రొడు సెల్ల మాని

వోరి మాయింటి కొందుండి వచ్చితివి
వూరకె నాబిడ్డ యోజలు చెఱిచి.

*　　　*　　　*　　　*

తిరుమణి యేమి నీ తిరుచూర్ణ మేమి
కరమున శంఖచక్రంబు లివేమి
దాసరితన మేమి తావడా లేమి
నీసరివా రెల్ల నినుఁ జూచి నవ్వ
జడియక రావణసన్యాసి వగుచు
నడుచుచున్నావు వైష్ణవుఁడవా నీవు.

[పదం. కాంభోజ, ఆటతాళం]

ద్రావిడవేదము చదివినవాడనే
　　ధవళాక్షి నీవు న న్నేలవే
ద్రావిడవేదము చదివినవారు కం
　　దర్పుని వేదము నిందురా
అంగన మున్నారు దళిగె ప్రసాదమా
　　పొంగలి చవిగొన్నవాడనే
పొంగలి చవిగొన్నవానికి వనితల
　　కౌంగిలి చవి మనసాయనా
ఆరామకైంకర్య మాచరించి మ
　　న్నారుని గొలిచినవాడనే
ఆరామకైంకర్య మాచరించువాని
　　కీరామకైంకర్య మేలయా

చెలువ మన్నరుపాదతులసీదళములు
శిరసున ధరియించువాడనే
తులసీదళములు ధరియించువానికి
తొలుతటి ముడిపువ్వు లేలయా.

[పదం, శంకరాభరణం]

అయ్యయ్యో నిను నమ్మవచ్చునా, యి
ట్లైతే దైవము మెచ్చునా
నీయందు వేఱు లేనైతిగా, నేను
నిను నమ్మి యిటు చేరైతిగా
బాస లిచ్చి తప్పనంటివి, నా
భావ మెల్ల జూఱగొంటివి
ఆస జూపి వద్ద నుంటివి, ఇంత
దోస మేల కట్టుకొంటివి
బెల్లించి యెడబాయ నంటివి, అట్టు
తల్లిమాటలే వింటివి
తెల్లని వెల్లా పాలౌనా, ఇట్లు
కల్ల లాడితే మేలౌనా.

* * * *

పై విధమున విజయరాఘవనాయని రచనలు, నాఁటి కవయిత్రులయు, కవులయు రచనలు, పలుకుపొంకము, సౌలభ్యము, మృదుపాకము గల వయినను, బరువము దప్పిన పచ్చి శృంగారముతో గోవాళ్లను ద్రోవ దప్పించునవిగా నున్నవి.

యక్షగానములే యం దనేకములు. తంజావూరి నాటకశాలలో నా యక్షగానములను బిరుదుపాత్ర లభినయించువారు. విజయ రాఘవనాయనిగా రాయా బిరుదుపాత్రలకు శారదాధ్వజాదు లొసఁగి సత్కరించుచుండువారు. అంతయు నాటలమయము, పాటలమయముగా విజయరాఘవనాయని గోష్ఠి విరాజిల్లినది. నాయకరాజులతర్వాత వచ్చినమహారాష్ట్రరాజులు గూడ నీ యక్షగానవినోదములలో మునిఁగి తేలుచుండువా రనుటకు వారి నాళ్లలోఁ గూడ వెలసినయక్షగానము లనేకములు తార్కాణ.

రఘునాథరాయలవారి నాఁటి రచనలే తంజావూరి రచనలలోఁ బ్రశస్తమయినవి. రఘునాథరాయలు, చేమకూర వెంకటకవి, కట్టా వరదరాజు, ముకుందయోగి, కృష్ణాధ్వరి, చెంగల్వ కాళయ, చల్లపల్లి రంగన్న, వెంకటాచలవిలాసకర్త మొదలగువారి రచనలు తంజావురాంధ్రరచనలలో మెచ్చఁదగినవి.

అన్నింటిలోను కట్టా వరదరాజు ద్విపదరామాయణము* ముద్రితమై ముందర వెలయఁదగినది. ఆతని శ్రీరంగమాహాత్మ్య మొక్కటే ముద్రిత మయినది. పరమభాగవతచరిత్రము సమగ్రముగా దొరకకున్నను ముద్రింపఁదగినదే.

---

* తంజావూరి లైబ్రరీవా రిటీవలనే దీనిని ముద్రించిరి.

# దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము

కవిత లంటే వినువు పుట్టే
కాలమున శృంగారరచనల
దవిలి రోఁదే వ్రాయబోతే
తారుమారు లవుఁ
అవకతవకలు నా నికేమో
అవును, గావున రసికయువకులు
సవరణలతో సయిరణలతో
జదువుకొనవలయుఁ.

## ౧౭

# కొలచెలమువారు

బహుమహాగ్రంథములకు వ్యాఖ్యాతయై సంస్కృతసారస్వతముద్రను విప్పి చూపినమల్లినాథసూరి యింటిపేరు—కోలాచల, కొలచల, కోలచర్ల, కొలచలమ — అని యిన్ని తెఱఁగులఁ వ్రాఁతప్రతులలోను నచ్చులోను వాడుకలోను గానవచ్చుచున్నది. పలువురు పండితు లీపేళ్లు గలగ్రామములఁగూర్చి చర్చించియున్నారు. ఒకరు కోలాచలమును బురాణములందు వెదకి కనుఁగొనిరి. ఇంకొకరు 'పందిపాడు' అను గ్రామనామమునకు గీర్వాణీకరణ మనిరి. మఱొకరు కన్యాకుమారికడ నున్న కొలచర్ల యనుగ్రామ మగునో యని యధికముగాఁ బరిశోధించిరి. ఇదమిత్థ మని యిదివఱకు జరిపినపరిశోధనలవలన నిర్ధారణ మేర్పడలేదు. నామిత్రులు బ్రహ్మశ్రీ కొలిచిన అప్పాశర్మ, యం. ఎ. గారు ఈ విషయమును గూర్చి యాసక్తితో పరిశోధించియున్నారు. వారియింటిపే రగుకొలిచిన మల్లినాథసూరి యింటిపేరి వికారమే యగు నని వారు తలంచినారు. కోలాచలము శ్రీనివాసరావుగారు మొదలగువారు దమయింటిపేరే మల్లినాథసూరియింటిపే రని తలంచిరి. వీ రిర్వురును తెలగాణ్యులే యయినను గోత్రభేదము గల దఁట. ఒంగోలు ప్రాంతములందుఁ దెలుగాణ్యులలోనే కొలచెలమ యని యింటిపేరు

గలవారు గూడఁ గలరని వినుచున్నాను. వీరిలో మల్లినాథ సూరి వంశపరంపరలోనివా రెవ్వరగుదురో నిర్ణయింపఁదగిన యాధారములు కానరావు. మల్లినాథసూరిగోత్ర మేమో మనకుఁ దెలియరాలేదు.

చంపూరామాయణమునకుఁ బదయోజన మనుపేర మన మల్లినాథసూరివంశజుఁడు నారాయణపండితుఁడు వ్యాఖ్యాన మొకటి రచియించెను. పీఠికాశ్లోకములను బట్టి చూడఁగా నాతఁడు మనయెఱుకలో నున్న మల్లినాథసూరి కెనిమిదవ తరమువాఁ డగుచున్నాఁడు. ఆతని పీఠికాశ్లోకముల నాధారపఱుచు కొని ప్రధానముగా నీ వ్యాసము వ్రాయుచున్నాను. ఆశ్లోకము లివి:—

కొలచెల్మాన్వయాబ్ధీందు ర్మల్లినాథో మహాయశాః
శతావధానవిఖ్యాతో వీరరుద్రాభివర్షితః
మల్లినాథాత్మజ శ్శ్రీమాన్ కపర్దీమంత్రకోవిదః
అఖిలశ్రౌతకల్పస్య కారికావృత్తి మాతనోత్
కపర్దితనయో ధీమాన్ మల్లినాథోగ్రజ స్సత్కృతః
ద్వితీయ స్తనయో ధీమాన్ పెద్దిభట్టో మహోదయః
మహోపాధ్యాయ ఆఖ్యాత స్సర్వదేశేషు సర్వతః
మాతులేయక్రతౌ (కృతౌ) దివ్యే సర్వజ్ఞే నాభివర్షితః
గణాధిపప్రసాదేన ప్రోచే మంత్రవరాన్ బహూన్
నైషధజ్యోతిషాదీనాం వ్యాఖ్యాతాఽభూ జ్జగద్గురుః

పెద్దిభట్టసుత శ్రీమాన్ కుమారస్వామిసంజ్ఞకః
ప్రతాపరుద్రీయాఖ్యానవ్యాఖ్యాతా విద్వదగ్రిమః
తనయా స్తస్య చత్వారో మహాదేవ స్తదగ్రజః
మహాదేవాత్మజ శ్శంభు స్సప్తక్రతుభి రిష్టవాన్
తతో విశ్వజితం కృత్వా యజ్ఞం సర్వస్వదక్షిణమ్
శంభుయజ్వాత్మభూ ర్ధీమాన్ భాస్కరో భాస్కరప్రభః
శ్రీనాగేశ్వరయజ్వాఖ్య భాస్కర స్యాత్మసంభవః
పుత్రాః పౌత్రా శ్చ దౌహిత్రాః చత్వారో వేదవేదినః
జామాతరోఽపి చత్వార ఏతై ర్నిర్వర్తితాధ్వరః
సర్వతోముఖపద్మాద్యై స్సర్వక్రతుభి రిష్టవాన్
తస్యాత్మజః కొండుభట్టో ద్వితీయో వేదవిత్కవిః
శ్రీనాగేశ్వరయజ్వాఖ్యః కొండుభట్టసుత స్సుధీః
నరసకాఖ్యవధ్వాశ్చ శ్రీనాగేశ్వరయజ్వనః
నారాయణేన పుత్రేణ కొలచెల్మాన్వయేందునా
చంపురామాయణాఖ్యస్య ప్రబంధ స్యాఘహారిణః
వికృతిః క్రియతే ప్రేమ్ణా యథామతి సమాసతః.

మీాఁదిశ్లోకములందు వారియింటిపేరు "కొలచెలమ"వారని యున్నది. ఈవంశమువారికి ఓరుఁగల్లు రాజధానిగా రాజ్యమేలిన ప్రతాపరుద్రచక్రవర్తితోను రాచకొండ రాజధానిగా రాజ్య మేలినసర్వజ్ఞసింగభూపాలునితోను సంబంధము గల దని యీశ్లోకములు చెప్పుచున్నవి. వీరియింటిపే రగుకొలచెలమ గ్రామముకూడ నక్కడకుఁ జేరువగా నుండఁదగును. కొలచెలమ

గ్రామనామ మని — యది యోరుఁగల్లు రాచకొండల చేరువను గలదని — యీక్రింది వెలుగోటివారి వంశప్రశస్తిపద్యములు చెప్పుచున్నవి—

స్రగ్ధర. వీరుం డా యాచపృథ్వీవిభుఁడు........ఘోరాజి ధాటిఁ జెల్లం గొలచెలమపురీఘోటికాకోటిఁ దెచ్చెన్.

సీ॥ కొలచెల్మకాడను బలియుఁడై తురకలఁ గొట్టి యశ్వములను బట్టినాఁడు

ఇట్లు చూడఁగాఁ బురాణములందలి కోలాచలము గాని శ్రీకోలాచలం శ్రీనివాసరావు మొదలగువారు నిశ్చయించిన పందిపాడు గాని కన్యాకుమారికడ నున్న కొలచెర్ల కాని మల్లినాథసూరి యింటిపేరుగా నేర్పడిన గ్రామము కాదనవచ్చును. ఇంటిపేరు కొలచెలమ యని నిర్ణయించుకొందము.

## కొలచెలమ మల్లినాథుఁడు.

ఈయన శతావధానము చేసి విఖ్యాతిఁ గాంచినవాఁడు. నేఁటి కాలమున సస్మద్గురువర్యులు శ్రీ తిరుపతివేంకటేశ్వరు లఖండప్రతిభతో నాచరించుచున్నట్టియు — నాంధ్రదేశమందే విపులప్రచారము గల్గినట్టియు నీశతావధాన మానాఁ డీమల్లినాథ సూరి నిర్వహించినాఁడు. మనకుఁ దెలియవచ్చిన శతావధాన చతురులలో నెల్ల నీతఁడే ప్రాచీనతముఁడు. అద్భుతప్రతిభా ప్రదర్శక మైన యాశతావధానచాతుర్యమునకు మెచ్చి కాకతీయ

ప్రతాపరుద్రచక్రవర్తి మన పండిత పరమేశ్వరునకుఁ గనకాభిషేక సత్కారము గావించినాఁడు.

సామ్రాజ్యలక్ష్మీపీఠికాతంత్ర మని యొక గొప్పతంత్ర గ్రంథము తంజాపురపు సరస్వతీపుస్తకభాండాగారమం దున్నది. అందు రాజధర్మములు వారి దినచర్యాదులు మిక్కిలి చక్కఁగాఁ బ్రశంసింపఁబడినవి. రాజాస్థానమునఁ బండితగోష్ఠి నెట్లు నెఱప వలయునో — విద్వద్వివాదము నెట్లు నడుపవలెనో — జయించిన వారి కెట్టిసత్కారము గావింపవలెనో యం దున్నది. విద్వద్వి వాదమందు విజయ మందినవారికిఁ జేయఁదగినసత్కార ములలోఁ గనకాభిషేక మొకటి. అభిషేకించిన స్వర్ణముద్రి కాదుల నప్పాడచ్చుటికి విచ్చేసియున్న పండితులకుఁ గవులకుఁ దదితరులకుఁ బంచిపెట్టవలె నఁట ! ప్రాచీనపండితగాథలను బరి శీలింపఁగా నీకనకాభిషేకసత్కారముఁ గాంచినవా రాంధ్రులే పెక్కు రగపడుచున్నారు. ఈ వంశమువాఁడే యగుపెద్దిభట్టు, శ్రీనాథుఁడు మొదలగువారు.

ఈ మల్లినాథునికొమారుఁడు కపర్ది. ఈతఁడు శ్రౌత సూత్ర కారికావృత్తికారుఁ డని, మంత్రవేత్త యని చెప్పఁబడినది. కపర్దిస్వామి వైదికబృందమునకు సుపరిచితుఁడు. ఆపస్తంబ గృహ్యసూత్రాదులకు భాష్యములను రచించెను. కపర్దికారిక లని చెప్పఁబడెడుగృహ్యకారికలను రచించిన కపర్దిస్వామి

యీతఁడే కావలెను. కపర్దిస్వామి గ్రంథము లివి తెలియ వచ్చుచున్నవి. ఆపస్తంబగృహ్య సూత్రభాష్యము, ఆపస్తంబగృహ్యపరిశిష్టభాష్యము, ఆపస్తంబశ్రౌతసూత్రభాష్యము, దర్శపూర్ణమాసభాష్యము, భారద్వాజగృహ్యసూత్రభాష్యము, ఆపస్తంబగృహ్యకారికలు. ఇందు ఒకటి రెండు కంటె నెక్కువగ్రంథము లచ్చుపడలేదు. ఈతఁ డాంధ్రుఁడు, కోలచెలమవంశమువాఁడు నగుట యిదివఱకుఁ బ్రఖ్యాతముగా నెఱుకపడినవిషయము కాదు. ఈయన కిద్దఱు కుమారులు. పెద్దవాఁడు మల్లినాథుఁడు. జ్యేష్ఠుఁ డగునీమల్లినాథుఁడు విద్వాంసుఁడుగాఁ జెప్పఁబడలేదు. కనిష్ఠుఁడు పెద్దిభట్టు. ఈతఁడు మహోదయుఁ డని — సర్వదేశములందును మహోపాధ్యాయుఁడుగా విఖ్యాతిఁ గాంచె నని — సర్వజ్ఞ (సింగ) భూపాలునిచేఁ గనకాభిషేకసత్కారము గాంచె నని — గణాధిపప్రసాదముచే ననేకమంత్రములను [?] జెప్పె నని — నైషధాదికావ్యములకు జ్యోతిషగ్రంథములకు వ్యాఖ్యలు రచించె నని — చెప్పఁబడినది.

కోలచెల మల్లినాథకృతులుగా నా నైషధాదివ్యాఖ్యలను వానిగద్యములనుబట్టి మన మిప్పుడు తెలిసికొనుచున్నాము. కాని యిప్పుడుదాహరింపఁబడినశ్లోకము లాగ్రంథములు రచించినవాఁడు మల్లినాథుఁడు గాక యాతనితమ్ముఁడు పెద్దిభట్టారకుఁ

డని చెప్పుచున్నవి. లోకమునఁ గూడఁ బెద్దిభట్టే గ్రంథకర్త యనియు నాతఁడు తన గ్రంథముల నన్నగారగుమల్లినాథుని పేరఁ బ్రకటించె ననియు విద్వత్పరంపరనుండి యైతిహ్యమొకటి వినవచ్చుచున్నది. అట్లు ప్రకటించుటకుఁ గారణముగా నీ క్రిందికథ కూడ నున్నది.

"మల్లినాథుఁడును బెద్దిభట్టు నన్నదమ్ములు. మల్లినాథుఁడు మందబుద్ధి గలవాఁడు. పెద్దిభట్టు పెద్దబుద్ధి కలవాఁడు. వీరు నివసించు గ్రామముచేరువ నడవిలో నొక యోగీశ్వరుఁడు తపస్సు చేసికొనుచుండెను. మందబుద్ధి యగు మల్లినాథుఁడు తత్పరతతో నా యోగీశ్వరుని శుశ్రూషించుచుండెను. పెద్దిభట్టును సకృత్తుగా సందర్శించుచుండెడివాఁడు. మల్లినాథుఁ డొకప్పుడు కార్యవశమున గ్రామాంతరమున కరిగెను. అన్నగారిచే నాజ్ఞప్తుఁడై యప్పుడు పెద్దిభట్టా యోగి నారాధించుచుండెను. అది యా యోగికి నిర్యాణకాల మయ్యెను. మల్లినాథుఁడు దగ్గఱ లేఁడయ్యెను. తన కిన్నాళ్లు చేసిన శుశ్రూషకై యాయోగి మల్లినాథునకు సారస్వతము నుపదేశించి యుద్ధరింపఁ దలఁచెను. కాని యట్లు తటస్థింప దయ్యెను. అప్పుడు సేవించుచుఁ జెంత నున్న పెద్దిభట్టును జూచి మీాయన్నకుఁ జేయఁ దలంచుకొన్న యుపదేశము నాతని యసన్నిధిచే నీకుఁ జేయుచున్నాను. దీనిఫలము మీాయన్న

గారికే చెందఁజేయుదువు గాక యని యొక మంత్ర ముపదేశించి యాయోగి సిద్ధిపొందెను. పెద్దిభట్టంతతో మహోపాధ్యాయుఁ డయ్యెను. గుర్వాజ్ఞచొప్పున నాతఁడు తాను రచించిన గ్రంథ ముల నన్నింటిని నన్నగా రగుమల్లినాథునిపేరనే ప్రకటించెను. ” ఈ కథ మీఁదిశ్లోకములకుఁ దోడు పలుకుచున్నది.

## మల్లినాథుని వైదుష్యము

గ్రంథములందు మల్లినాథుఁ డని పేరున్నది. కావున నాపేరే పేర్కొనియెదను. ఈయన స్వతంత్రగ్రంథము లంతగా రచించినట్లు కానరాదు. హెచ్చుగా వ్యాఖ్యాన గ్రంథములే యగపడుచున్నవి. రఘువంశ కుమారసంభవ మేఘసందేశ కిరాతార్జునీయ శిశుపాలవధములకుఁ బంచకావ్యము లన్న పేరు కల్గుటయును, సంస్కృతభాష నభ్యసించు విద్యార్థు లీగ్రంథము లనే ప్రధానముగా నారంభించి చదువుటయును, సుగమము లైన మల్లినాథవ్యాఖ్యలు వెలసినతర్వాతనే యేర్పడిన దని కొందఱు తలంచుట కలదు. కాని, తార్కికరక్షటీకలో మల్లినాథుఁడే "స్ఫుటీకృతం చైతదస్మాభిః పంచకావ్యటీకాసు" అనుటవలన నాయననాఁటికే యీగ్రంథములకుఁ బంచకావ్యసంజ్ఞ కలదని యేర్పడుచున్నది. ప్రధానముగా విద్యార్థు లాగ్రంథములనే చదువుటకుఁ గారణము మల్లినాథవ్యాఖ్యలు కావచ్చును.

రఘువంశాది కావ్యములకు మల్లినాథునకుఁ బూర్వకాలమందే పదులకొలఁది వ్యాఖ్య లున్నవి. కాని యీయనవ్యాఖ్యలు వెలసినతర్వాత వానికిఁ బ్రచారము తగ్గినది. ముద్రణాదిసౌకర్యము లేనియాకాలముననే మన మల్లినాథుని గ్రంథము లాసేతుశీతాచలము వ్యాపించినవి. ఇట్టి వ్యాప్తికి వాని ఘనతయే కారణము. ఇది యాంధ్రు లభిమానింపఁదగిన విషయము. "దుర్బోధ మయినపట్టును — స్పష్టార్థమ్ — అని విడుతురు. స్పష్టార్థ మగుపట్టును వ్యర్థముగా దీర్ఘసమాసాదులతో నింపి విస్తరింతురు. అస్థానమున ననుపయోగము లగుజల్పములచే భ్రమము కలిగింతురు" అని కువ్యాఖ్యాతలను గర్హించిన భోజునిత్రోవ నీతఁడు చక్కఁగాఁ ద్రొక్కినాఁడు. "ఇహాన్వయముఖే నైవ సర్వం వ్యాఖ్యాయతే మయా నామూలం లిఖ్యతే కించి న్నానపేక్షిత ముచ్యతే.—అన్వయముఖముననే సర్వమును వ్యాఖ్యానము చేయుదును. మూలములేనిది కొంచెము కూడ వ్రాయను. అనావశ్యక మయినది చెప్పను"—అని మల్లినాథుని శపథము. కాళిదాసాది మహాకవుల కావ్యములకును నింక నితరశాస్త్రగ్రంథములకును సమర్థము లయినవ్యాఖ్యలు రచింపఁబూనువానికి ప్రాచీనము లగుసర్వవిద్యలందును సంపూర్ణపరిజ్ఞానము కావలసి యుండును. కణాద గౌతమ తర్కములందు — పూర్వోత్తరమీమాంసలందు — వ్యాకరణమందు — సాం

ఖ్యయోగములందు — జ్యోతిషమందు — నింక నితరవిద్యలందు — మల్లినాథుఁడు మహాపండితుఁడు. పదవాక్యప్రమాణపారావారపారీణుఁ డని — మహోపాధ్యాయుఁ డని — యాయన బిరుదులు. "కోశవా నాచార్యః" అన్నట్లుగా నెన్నివిద్య లభ్యసించినను బ్రసక్తి కలిగినప్పుడు పరిశోధించుటకుఁ దగినంత గ్రంథసంచయము కూడ నుండినఁ గాని సర్వంకష మగువైదుష్యము సమకూడదు. మల్లినాథుఁడు తనగ్రంథములందు ననేక ప్రాచీనగ్రంథముల నుదాహరించెను. అన్ని గ్రంథముల నాతఁ డెట్లు సంపాదించెనో యాశ్చర్యావహముగా నున్నది. పూర్వులు పరంపరగా గొప్పవిద్వాంసు లగుటచేత వారువా రార్జించిన గ్రంథసంచయము కొంత యింటనే యీయనకు లభించి యుండును. అది గాక కాకతిరుద్ర సర్వజ్ఞసింగభూపాలుర సంస్థానములతో సంబంధ ముండుటచేత నక్కడి సరస్వతీభండారములును దొరకియుండును. ఈయన తన వ్యాఖ్యలం దుదాహరించినగ్రంథము లనేకము లిపుడు లభించుట లేదు. కొన్ని యిట్టివని కూడఁ దెలియరాక యున్నవి. ఉదాహరణముగా నొకటిరెండు తెల్పెదను. సంగీతశాస్త్రవిషయములు వచ్చినప్పు డీయన వ్యాఖ్యానములందు 'తథా చ మతంగః' అని యుదాహరించినాఁడు. తెలియక ముద్రాపకులు కొందఱు 'మాతంగః' అని ముద్రించిరి. మతంగుఁడో మాతంగుఁడో

సంగీతశాస్త్రమున నేమి గ్రంథము రచించెనో నేఁ డెవ్వరికిని దెలియరాకుండెను. ఈ నడుమ శ్రీ మానవల్లి రామకృష్ణకవి, ఎం. ఏ. గారు తంజావూరి రఘునాథరాయని సంగీతసుధలో "గ్రంథం బృహద్దేశ్యభిధం మతంగమునిప్రణీతం నిపుణం విలోక్య" అని యుండుటను బరిశీలించి తిరువాన్కూరు మహారాజపుస్తకశాలవారిచేవల సంపాదించినబృహద్దేశిగ్రంథభాగము మల్లినాథుఁ డుదాహరించినమతంగకృతగ్రంథముగా గుర్తించిరి. మఱియుఁ గొన్నిచోట్ల "తథా చ చాక్షుషః" అని యున్నది. చాక్షుషుఁ డెవరో ఏమిగ్రంథము రచించెనో తెలియ దయ్యెను. ఇది రాజనీతిగ్రంథ మని శ్రీకవిగారే గుర్తింపఁగల్గినారు. మల్లినాథుఁ డుదాహరించినమహాయాత్ర యను గ్రంథ మిట్టిదని యిదివఱ కెఱుఁగరాకుండెను. అది యిప్పుడు ప్రాచ్యలిఖితపుస్తకశాలకు లభించినది. శాకునగ్రంథ మృగచర్మీయము రాజపుత్త్రీయము మొదలగుగ్రంథము లిప్పుడు దొరకకున్నవి. ఉభయమీామాంసలందును నుభయతర్కములందును బ్రాచీనగ్రంథము లీయన యుదాహరించినాఁడు. చార్వాక బౌద్ధగ్రంథముల నుదాహరించినాఁడు. అందుఁ గొన్ని యిప్పుడు కానరాకున్నవి. పంచకావ్యవ్యాఖ్యలం దీయన దక్షిణావర్తనాథుఁ డను నొక ప్రాచీనవ్యాఖ్యాతను—"నాథవచన మనాథవచన మేవ" ఇత్యాదివిధముల గర్హించినాఁడు. దక్షిణావర్త

నాథునివ్యాఖ్య లిప్పుడు దొరకినవి.

మల్లినాథుఁడు రచియించిన గ్రంథము లివి తెలియవచ్చు చున్నవి—రఘువంశ, కుమారసంభవ, కిరాతార్జునీయ, శిశుపాలవధము లను పంచకావ్యములకు వ్యాఖ్యలు, నైషధ వ్యాఖ్య, భట్టికావ్యవ్యాఖ్య, ఏకావళివ్యాఖ్య, తంత్రవార్తిటీక, సర్వమంజరీ వ్యాఖ్య (పరిమళము), తార్కికరక్షటీక, జ్యోతిషగ్రంథము, రఘువీరచరిత (?) రఘువీరచరితము మల్లినాథ కృతి యగునో కాదో!

మీఁద నుదాహరింపఁబడిన చంపూరామాయణ వ్యాఖ్యాత శ్లోకములందుఁ బెద్దిభట్టు సర్వజ్ఞ సింగభూపాలునిచే (మాతులేయక్రతౌ ? కృతౌ ?) మేనమామ కుమారుని యజ్ఞమునఁ గనకాభిషేకసత్కార మందినట్లున్నది. సర్వజ్ఞసింగ భూపాలకృతి యగురసార్ణవసుధాకరము నీతఁడు తనవ్యాఖ్యలం దుదాహరించినాఁడు. సర్వజ్ఞసింగభూపాలుని సమ్మానాభిమానము నిట్టు పెద్దిభట్టు చూపినాఁ డనుకొనుచున్నాను. పెద్దిభట్టు సర్వజ్ఞ సింగభూపతికాలమున నున్నవాఁ డనుటకు సాధకముగా నీ క్రిందిశ్లోకము నా కొకచోటఁ జేకూడినది :—

శ్లో॥ కిం వాససా చీకిరబాకిరేణ కిం దారుణా వంకరటింకరేణ
సర్వజ్ఞభూపాలవిలోకనార్థం వైదుష్య మేకం విదుషాం సహాయమ్.

పెద్దిభట్టొకనాఁడు చీఁకిరిబాఁకిరిచినుఁగులప్రాఁత కట్టుకొని వంకరటింకరకఱ్ఱ చేతఁ బట్టుకొని సర్వజ్ఞసింగభూపతి విద్వత్సభకుఁ బోవుచుండఁ ద్రోవలో నెవరో యడిగిరఁట, తాతగారూ! రాజసభ కిట్టివేషముతోఁ బోవుచున్నారే మని. అప్పు డాయన పై శ్లోకము చెప్పెనఁట.

మఱియుఁ బెద్దిభట్టు గణాధిపప్రసాదము గలవాఁడని చంపూరామాయణవ్యాఖ్యాదిశ్లోకములం దున్నది. రఘువంశాదివ్యాఖ్యలందుఁ బ్రధానముగాఁ జేసిన గణపతిస్తుతిశ్లోకము లున్నవి.

పెద్దిభట్టుపేర నీ క్రిందికథలను కొందఱు చెప్పుచున్నారు. “ పెద్దిభట్టుతోడియల్లుఁడు ఘనాంతము వేదవిద్య నేర్చినవాఁడు. మంచి కండపుష్టి కలవాఁడు. పెద్దిభట్టు మంచిసంస్కృత సాహిత్యము శాస్త్రపాండిత్యముఁ గలవాఁడుగదా! పెద్దయల్లుఁ డగునా వేదముగ్ధుఁడును జిన్నయల్లుఁ డగునీ శాస్త్రచతురుఁడును నత్తవారింటి కేకకాలమున నొకప్పు డేతెంచిరి. అత్తమామలా పెద్దయల్లు నలక్ష్యముతో నగౌరవముతోను, నీపిన్నయల్లుని మన్ననతో మర్యాదతోను జూడసాగిరి. ఆతని వేదవైదుష్యమును వెక్కిరించి — యీతని శాస్త్రచాతుర్యమును సన్నుతించిరి. ఆతనికి నడవలోఁ జాఁపమీఁదను నీతనికిఁ బడుకగదిలోఁ

బట్టెవంచముమీఁదను శయనవిధాన మేర్పఱచిరి. పెద్దాతఁడు కోపమునఁ గుములుచుండెను. పిన్నాతఁ డుత్సాహమున నుప్పొంగుచుండెను. పడుకగదినుండి రాత్రి లఘుశంకకు బయలి కేఁగుచు నీపిన్నాతఁడు త్రోవలో నడవలోఁ బండుకొనియున్న తోడియల్లు నొకతన్ను తన్ని యెఱుఁగక ప్రమాదమునఁ దన్ని నట్లు నటించి "క్షమధ్వమ్" అని బుజ్జగించి పోవుచుండెను. ఒకనాఁ డాయెను. రెణ్ణాళ్లాయెను. అనుదినము నట్లే తన్నుచు 'క్షమధ్వమ్' చెప్పుచుండ సాగించెను. ఒకనాఁడు రెణ్ణాళ్లు ఓర్చుకొనెను. కాని పెద్దయాతఁ డామీఁద నాగఁజాలఁ డయ్యెను. మూఁడవనాఁడు నట్లే యాతఁడు తన్ని క్షమధ్వము చెప్పెను. కోపాటోపముతో లేచి యాపెద్దయాతఁ డీపిన్నయాతని సిగ పట్టుకొని వంగలాగి "పొగరుఁబోతా! ప్రతిదినముఁ దన్నుచు నొకటే క్షమధ్వము చెప్పసాగించితివి. నీకొక క్షమధ్వము వచ్చిన నాకు ముప్పదిరెండు శ్రయధ్వములు వచ్చును. ఏమనుకొన్నావో నాదెబ్బ చూచికో" మ్మని ప్రథమా ద్వితీయేషు శ్రయధ్వం, ద్వితీయా స్తృతీయేషు శ్రయధ్వం, తృతీయా శ్చతుర్థేషు శ్రయధ్వం, (ఇట్లు ముప్పదిరెండు శ్రయధ్వములు గల వేదమంత్ర మున్నది.) అని సస్వరముగాఁ జదువుచు నొక్కొక్క శ్రయధ్వమున కొక్కొక్క గ్రుద్దుచొప్పున ముప్పదిరెండు గ్రుద్దులు వెన్నెముకలు విఱుగునట్లు వీఁపుమీఁదఁ దగిలించెను. అవ

మానితుఁడై పిన్నయల్లుఁ డడఁగియుండెను. అనేకు లీకథను పెద్దిభట్టుపేరఁ జెప్పుదురు. తన్నులు తగిలిన వనుటకు శ్రయధ్వము లయిన వనుట పారిభాషికముగా వైదికుల వాడుకలో నున్నది.

ఎల్లప్పుడును సుకవిసూక్తిరసాస్వాదనతత్పరుఁడుగా నుండునీపెద్దిభట్టు స్త్రీవర్ణనమున మంచిమంచి శ్లోకములను జదువుచుండఁగా వినుచున్నదై యాతనియిల్లా లొకనాఁ డిట్లు వేఁడుకొన్న దఁట! వారిని వారిని వర్ణించినశ్లోకములను జదువుచుందురే గాని నన్నొకనాఁడైన వర్ణింపరైతిరి గదా " యని. నాఁ డిట్లు వర్ణించినాఁడు పెద్దిభట్టు:—

శ్లో॥ మేరుమందరసమానమధ్యమా తింత్రిణీదళవిశాలలోచనా
అర్కశుష్కఫలకోమలస్తనీ పెద్దిభట్టగృహిణీ విరాజతే!

గ్రంథవ్యాఖ్యానదీక్షతోఁ గాల మెల్లఁ గడపుచుఁ బెద్దిభట్టింటిపని నంటించుకొన కుండెను. ఇత్యర్థః, ఇతి భావః, అనుచు నీయన కూరుచుండుటవలన నిల్లాలికి గృహనిర్వాహము దుష్కరమగుచుండెను. ఒకనాఁ డొక యాప్తవిద్వాంసుఁ డతిథియై యింటికి రాఁగా నేఁడేమి కూరగాయలు వండెద వని పెద్దిభట్టు భార్య నడిగెను. ఆమె యిట్లు బదులు చెప్పెను. ఇత్యర్థముల కూర—ఇతిభావముల పులుసు—వండెదను. మీరింటినిండ నించుచున్న పదార్థము లివే కదా!

ఈతఁడు శ్రీహర్ష నైషధమునకు వార్ధకమున వ్యాఖ్య గావింప నారంభించెను. జీవితసంశయముచేఁ దొందరతొందరగా రచించుటచేత నావ్యాఖ్య యపర్యాప్తముగా నుండెను. అది చూచి యొకపండితుఁ డింత లఘువుగా రచించుచున్నా రేమని యడుగఁగా "మాఘే మేఘే గతం వయః (మాఘమున, మేఘ సందేశమున వయస్సు కడచెను.) అని పెద్దిభట్టు బదులు చెప్పెను. ఇట్టికథలు మఱికొన్ని యున్నవి.

ఈతఁడు విద్యానాథమహాకవికృతి యగుప్రతాపరుద్రయ శోభూషణ మనునలంకారశాస్త్రగ్రంథమునకు వ్యాఖ్యాత. పెద్దిభట్టు మల్లినాథునకుఁ దనుజుఁ డని యీతఁడు తనగ్రంథమందుఁ జెప్పినాఁడు. చంపూరామాయణ వ్యాఖ్యానమునందు జనశ్రుతి యందు ననుజుఁ డని యున్నది. ప్రతాపరుద్రీయవ్యాఖ్యానమునం దున్నవిధము లేఖకాదిదోషజనితము కానిచో నదియే మనకు విశ్వాస్యతరము. ప్రతాపరుద్రీయ వ్యాఖ్యానపీఠికలోని శ్లోకము లివి. వాణీంకాణభుజీమ్—అన్నశ్లోకము తర్వాత:—

శ్లో॥ త్రిస్కంధశాస్త్రజలధిం చులుకీకరోతే స్మ యః
తస్య శ్రీమల్లినాథస్య తనయోఽజని తాదృశః
కోలచల పెద్దయార్యః ప్రమాణపదవాక్యపారదృశ్వా యః
వ్యాఖ్యాతనిఖిలశాస్త్రః ప్రబంధకర్తా చ సర్వవిద్యాసు

తస్యానుజన్మా తదనుగ్రహాప్త విద్యానవద్యో వినయావనమ్రః
స్వామీ విపశ్చిద్వితనోతి టీకాం ప్రతాపరుద్రీయరహస్యభేత్రీం.

ఈశ్లోకములు రఘువంశాది వ్యాఖ్యాత పెద్దిభట్టారకుఁడే యనునర్థమును ధ్వనించుచున్నవి.

కుమారస్వామి సోమపీథి కుమారుఁడు మహాదేవుఁడు. మహాదేవుని కుమారుఁడు శంభువు. ఈతఁ డనేకయజ్ఞములు చేసెను. శంభుపుత్త్రుఁడు భాస్కరుఁడు. భాస్కరుని పుత్త్రుఁడు నాగేశ్వరయజ్వ. ఈతఁడు పుత్త్రులు నలుగురు — పౌత్త్రులు నలుగురు — అల్లుండ్రు నలుగురు — దౌహిత్రులు నలుగురు — ఆర్త్విజ్యము చేయఁగా—సర్వతోముఖ పౌండరీకాంతయజ్ఞములు చేసినాఁడు. నాగేశ్వరయజ్వకొడుకు కొండుభట్టు, ఈతనికొడుకు నాగేశ్వరుఁడు, నాగేశ్వరుని కొడుకు చంపూరామాయణ వ్యాఖ్యాత నారాయణ పండితుఁడు అని చంపూరామాయణ వ్యాఖ్యాపీఠికాశ్లోకములం దున్నది.

## కాలము

ఈవంశమువారిలో సుప్రఖ్యాతుఁడు మల్లినాథుఁడు గదా! ఆయన వర్తిల్లినకాలమును మాత్ర మిక్కడ నిర్ణయించుచున్నాను. ఇంతకుముం దీయనకాలమునుగూర్చి విస్పష్టపరిజ్ఞానము

లేదు. మల్లినాథుని గ్రంథములలో సర్వజ్ఞ సింగభూపాలుని రసార్ణవసుధాకర ముదాహరింపఁబడినది. కావున నాతఁడు సర్వజ్ఞ సింగభూపతికి సమకాలమువాఁడు గాని తర్వాతివాఁడు గాని యగును. సింగభూపాలుని కాలనిర్ణయము తగవులతో నిండి యున్నది. ఇద్దఱు సర్వజ్ఞ సింగభూపాలు రున్నారు. స్థూలముగా నిక్కడ నింతమట్టు వ్రాయుచున్నాను. 1380-1450 ప్రాంతము వారు వారిర్వురును. మల్లినాథుఁడు వారిలో మొదటి సింగభూపాలుకాలమువాఁ డని నేను గొన్ని యాధారములచే నిర్ణయించుకొన్నాను. మల్లినాథునితాత ప్రతాపరుద్రునిచే సమ్మానితుఁ డగుటచేత మల్లినాథుఁడు సింగభూపతికిఁ దర్వాతికాలమువాఁడు కానేరఁడు. మల్లినాథునికొడుకు కుమారస్వామి సోమపీథి—తన ప్రతాపరుద్రీయ వ్యాఖ్యలోఁ బెద్దకోమటి వేమభూపాలుని సాహిత్యచింతామణి నుదాహరించినాఁడు. పెద్దకోమటి వేమారెడ్డి 1400 మొదలు 1420 దాఁక రాజ్యపాలనము చేసెను. కుమారస్వామిసోమపీథి 1450 ప్రాంతమువాఁడు.

# ౧౩

# త్యాగరాజు

## ౧

ఆంధ్రదేశము కర్మఠప్రచుర మయినది. ఆంధ్రబ్రాహ్మణులు శ్రౌతస్మార్తకర్మపరాయణులు. తక్కినవర్ణములవారును వీరి ననువర్తించినవారే. పాశుపత కాలాముఖ శైవములు, జైన బౌద్ధములు గూడ నాంధ్రులలో సురూఢము లయినవి. శంకరుల తర్వాత పై మతముల మొగుపును తగ్గించి యధికముగా నద్వైతమతమును, రామానుజులతర్వాత రెండుమూడు శతాబ్దులకు గొలదికొలదిగా వైష్ణవమును తెలుగుదేశమున నభివ్యాపించినవి. ఆంధ్రదేశమునందు ద్వైతమత ప్రచారము చాల నర్వాచీనము. ఇన్ని మతములు వ్యాపించి సాగుచున్నను నాంధ్రులలో బ్రాహ్మణులు, నితరవర్ణములవారు యోగప్రభేదము లగు మంత్ర, భక్తి, లయ, హఠ, తారకరాజాది యోగప్రభేదముల యోగవిద్య నధికముగా నభ్యసించుచు వచ్చిరి. శైవులు, శాక్తులు, వైష్ణవులు నధికముగా మంత్రయోగము నభ్యసించిరి. వేమన, పోతులూరి వీరబ్రహ్మదులు హఠయోగమును సాధించిరి. పోతన, రామదాసు, ప్రకాశదాసు మొదలగువారు భక్తి లయ యోగపరాయణు లయిరి. దక్షిణ

దేశమున నెలకొన్నను, త్యాగరాజుకూడ నక్కడి యాంధ్రు లయిననారాయణతీర్థులవలె భక్తిలయయోగముల ద్వారమున సంగీతరూప మగునాదబ్రహ్మానందరసము ననుభవించిరి. బాహ్య మయినమూర్త్యారాధనముకంటె త్యాగరాజుగా రధికముగా నంత ర్యామ్యర్చనమునే కావించిరి. త్యాగరాజుగారి కీర్తనలలోఁ బెక్కింట నీవిషయము ప్రవ్యక్త మగును. బాహ్యము లయిన తీర్థములను గంగాధనుష్కోట్యాదులను దిరిగి యారాధించుట కంటె నంతరంగమునఁ గలగంగాధనుష్కోట్యాదుల నర్చించుటలో బాహ్యము లయినకోటితీర్థముల నర్చించుఫలము లభించు నని యీక్రిందికీర్తనమున త్యాగరాజుగారు వెల్లడించిరి. ధను వనఁగా వెన్నెముక. దాని కోటి — యగ్రము — నాసాగ్రము గాని మూలా ధారకుండలిస్థానము గాని యగును. ఈ కీర్తన మీ యర్థమును నిరూపించుచున్నది.

తోడి — ఆది

కోటినదులు ధనుష్కోటిలో నుండఁగా
ఏటికి తిరిగేవే ఓమనసా ! ॥కోటి॥

సూటిగ శ్యామసుందరమూర్తిని
మాటిమాటికిఁ జూచేమహారాజులకు ॥కోటి॥

గంగ నూపురంబునను జనించను
రంగనిఁ గావేరి గని రాజిల్లను
పొంగుచు శ్రీరఘునాథుని ప్రేమతోఁ
బొగడేత్యాగరాజు మనవి వినవే ॥కోటి॥

వెన్నెముక నడిమి దగుసుషుమ్నకు రెండు పార్శ్వములను ఇడాపింగళానాడులు సాగుచున్నవి. మూఁడు నాడులును ధనుష్కోటిలో నాసాగ్రము గాని, కుండలిని గాని, రెండింటిలో నేస్థల మయినను, నక్కడ నేకీభవించుచున్నవి. శ్రుతితాళగేయములు సంగీతారంభమునను నవసానమునను నట్లే ముక్తాయింపులో నేకీభవించుచున్నవి. ఈ యేకీభావమునకే లయ యని నామాంతరము. త్యాగరాజుగారీ లయ బ్రహ్మానందరసమును సర్వదా యనుభవించుచు ధనుష్కోటిలో నానందసాగరమున నోలలాడుచునుండిరి.

పై యర్థమునే త్యాగరాజుగారీ సంకీర్తనమున మఱియు వివరించిరి.

గరుడధ్వని — దేశాది

ఆనందసాగర మీదని దేహము భూభారమె రామ
శ్రీనాయకాఖిలనైగమాశ్రితసంగీతజ్ఞాన మనుబ్రహ్మ
శ్రీవిశ్వనాథ శ్రీకాంతవిధులు పావనమూర్తు లుపాసించలేదా
భావించి రాగలయాదుల భజియించే శ్రీత్యాగరాజనుత ॥ఆ॥

ఈ విషయమునే నారాయణతీర్థులవా రిట్లు ప్రస్తుతించిరి.

భైరవి — ఆది

రామకృష్ణగోవిందేతి నామసంప్రదాయోగే
కామ మిహ స్నాతవ్యం సర్వోత్తమప్రయాగే

రామనామగంగాసమ్మిళితకృష్ణనామ
యామునే గోవిందనామసరస్వతీప్రథితే
యోగిమానసపరమహంసకులకలితే
వాగీశవిష్ణురుద్రాదివాగ్విహారిలలితే
స్నానసంధ్యాజపహోమతర్పణానపేక్షితే
హానివృద్ధ్యాదిరహితాఖండసుఖఫలదే
యాగయోగరాజభోగత్యాగసంబంధం వినా
భక్తివిరక్తివిజ్ఞానద్వారాముక్తిఫలదే
సర్వపాపౌఘతిమిరదండసూర్యమండలే
సాధునారాయణతీర్థతీర్థరాజవిమలే.

యోగప్రభేద మగునాదోపాసనమహిమను త్యాగరాజుగా రిట్లు వర్ణించిరి.

బ్యాగడ — దేశాది

నాదోపాసనచే శంకర
నారాయణవిధులు వెలసిరి యోమనసా ॥నా॥

వేదోద్ధరులు వేదాతీతులు
విశ్వ మెల్ల నిండి యుండేవారలు ॥నా॥

మంత్రాత్మ్కులు యంత్రతంత్రాత్ములు మఱి మా
న్వంతరము లెన్నో గలవారలు
తంత్రీలయస్వరరాగవిలోలురు
త్యాగరాజవంద్యులు స్వతంత్రులు ॥నా॥

లయవియోగములలో నాదానుసంధానమే యుత్తమో త్తమ మైన దని యోగీశ్వరు డైన గోరక్షనాథుఁ డిట్లు ప్రశం సించినాఁడు.

శ్రీయాదినాథేన సపాదిలక్ష
లయప్రకారాః కథితాః పురా వై
నాదానుసంధానక మేక మేవ
మన్యామహే ముఖ్యతమం లయానామ్ ॥

శ్రీత్యాగరాజస్వామివారి భక్తియోగపరాకాష్ఠ నీ సంకీర్తనమున గుర్తింపవచ్చును.

ముఖారి — రూపకం

ఎంతని నే వర్ణింతును శబరిభాగ్య ॥ఎం॥
దాంతులు వరకాంతలు జగమంత నిండియుండఁగ ॥ఎం॥
కనులార సేవించి కమ్మనిఫలముల నొసఁగి
తనువు పులకరించఁ బాదయుగములకు మ్రొక్కి
ఇనకులపతిసముఖంబున పునరావృత్తిరహితపద
మును పొందినత్యాగరాజనుతురాలి పుణ్యమ్మును ॥ఎం॥

త్యాగరాజుగారు మనోలయయోగము లేనిబాహ్యతంత్ర పరాయణుల నిట్లు పరిహాసించిరి,

ఆభోగి — ఆది

మనసు నిల్ప శక్తి లేకపోతే
మధురఘంటవిరుల పూజేమి జేయును ॥మ॥

ఘనదుర్మదుఁడై తా మునిఁగితే
కావేరి మందాకిని యెటు బ్రోచును ||మ||

సోమిదమ్మ సొగసుగాంచిఁ గోరితే
సోమయాజి స్వర్గార్హుఁ డౌనో
కామక్రోధుఁడు తపం బొనర్చితే
గాచి రక్షించునే త్యాగరాజనుత ||మ||

త్యాగరాజుగారు మంత్రజపయోగపరాయణుల నిట్లు మహనీయులనుగా స్తుతించిరి.

శ్రీరాగం — దేశాది

నామకుసుమములచేఁ బూజించే
వరజన్మమే జన్మము మనసా ||నా||
శ్రీమన్మానసకనకపీఠమున
చెలఁగఁ జేసికొని వరశివరామ ||నా||
నాదస్వర మనేవరనవరత్నపు
వేదిక పై సకలలీలావి
నోదుని పరమాత్ముని శ్రీరాముని
పాదములను త్యాగరాజహృద్భూషణుని ||నా||

భగవత్ప్రాప్తికి సూటి యైనదగ్గఱిమార్గ మగుహఠేతర యోగప్రభేదప్రకారము ఆంధ్రదేశమున సర్వదా అభ్యుదయము నందుచుండును గాక. త్యాగరాజుగారి వంటి మహనీయులు ఆంధ్రదేశమున తనరారుచుందురు గాక !

౨

త్యాగరాజస్వామీ! మీయద్వైతానుభూతి మాకానందము గొల్పుచున్నది. మీరు శివ దేవీ రామ కృష్ణ లక్ష్మీ సరస్వత్యాదిదేవతలను నాయా పుణ్యస్థలముల యర్చామూర్తులను స్తుతించుచుఁ గృతులను రచించితిరి గాని, యన్నింటను నీశ్వరాద్వైతానుభూతినే భగవంతుని సచ్చిదానందాత్మకతనే వ్యక్తపఱిచితిరి !

మీకృతులలో భావరాగతాళములు పరస్పరము సమేళమై యానుకూల్యముతో నైక్యముతోఁ బ్రస్తారము చెంది చెంది యాహ్లాదవినోదము లలరార్చి ముక్తాయింపు ముగింపులో మాఁడును చరమానందమున సమన్వితము లగుతీరులు మామనసుతలఁపును, నోటిపలుకును, చేనిచెయిదమును నైక్యపరిపాకమునకుఁ దార్చి, మాజీవితములనే దివ్యసంగీతములఁ గావించి మమ్ముఁ గూడ సుకృతులఁగా వెలయించుఁ గాక !

బండుదుండగము లాడువాఁడు "పలుకు తేనెలతల్లి" పాటలఁ బాడఁజాలడు. కట్టెలు గొట్టువాఁడు వీణ మీటఁజాలఁడు. సంగీతము సుకుమారకళ! ఇది భక్తిజ్ఞానపర మగుచో సుకుమారాతిసుకుమారము, మధురాతిమధురము నయిన యాత్మానుభూతికిఁ ద్రోవ త్రొక్కించు ననుట మీ యనుభవము.

శ్రుతిస్థాయి తప్పనిగానము నేర్చినట్లు మీరు భగవత్పరమే యయినరచనను గూడ నేర్చితిరి. మీ గేయరచనాగానవిధానములు మానవలోకోద్ధారకములు. దివ్యప్రజ్ఞాస్ఫోరకములు.

భగవంతుని కభిముఖముగా మనజీవయాత్ర సాగించుచు నాయనతో నన్వయము చెందునట్లు చేయుట గానమునకుఁ బరమార్థము. ఈ జీవశ్రుతిస్థాయిని సదా హృదయమునఁ గుదుర్చుకొని మనము గానానందము ననుభవింతము గాక!

ఈ యర్థమునకుఁ దార్కాణగా త్యాగరాజప్రసక్తమగు నొక కథ నిక్కడ వివరింతును.

త్యాగరాజుగారి తాతలకాలమునఁ దెల్గుదేశమున భయంకరక్షామపీడ కల్గె నఁట. ఒకపల్లెటూర వీరితాతలతాతగారు భగవత్సంకీర్తనము జరుపుకొనుచుఁ బలుఁవుర నాకట్టుకొని పూజ్యులుగా నుండెడివారఁట. ఆయన యాయూర నాహారపదార్థములఁ గొందఱిండ్లనున్నవాని నందఱకుఁ బంచి పెట్టించి నేఁటి రేషన్ విధానమునఁ గొన్నాళ్లు తక్కువతిండితో నూరివారి ప్రాణములు నిలిపె నఁట. ఏయింటను జిట్టెడుగింజలుకూడ లేని దుస్థితి వచ్చెను. ఎండలు మండుచున్నవి. మరణయాతన వచ్చినది. ఈ ముసలిబాపఁ డీశ్వరుఁడున్నాఁడు. రక్షించును అని సంకీర్తనము చేయుచుండెను. ఆయూరి కైదాఱుమైళ్ల దూరమున నీరు లేని

యిసుకయెడారి యేఱును, దాని కావలిగట్టున నొకగ్రామమును, నాయూరి రెడ్డియింటఁ జాల నిలువధాన్యమును నుండుట విన వచ్చెను. వానలు లేకున్నను నాయేటిచలువకు బావులలో నీళ్లుం డుటచే నాయూరఁ గొంతపంట పండెను. ఈభక్తబ్రాహ్మణుని ననుసరించి యూరివా రయిదుగు రారెడ్డిని యాచింపఁ బయనమైరి. ఈబ్రాహ్మణుఁడును బయన మయ్యెను గాని రక్షకుఁడుభగవంతుఁ డనుచు బాటలోఁ బాటలు సాగించెను. ఇసుకయేటిలో నడక-మట్టమధ్యాహ్నము మండుటెండ—ప్రాణాపాయస్థితిలో నందఱు నుండిరి. చింపిరిబట్టలు కాళ్లకుఁ జుట్టుకొనికూడ నిలువను నడుగు సాగింపను జాలకుండిరి. నోళ్లు పిడుచ కట్టుకొని పోవుచుండెను. ఇట్టిచోఁ గొన్ని గజముల దూరమున, జీబుకొన్న చిగురాకు జొంపములతో నిండారిననీడతో నొక గొప్ప వృక్షము గాన వచ్చెను. భక్తబ్రాహ్మణుఁడు దానిని జూచి తనిసి యటు చేరఁ బోవుద మనెను. అందొకఁడు మనకనులు తిరిగి మతిచెడి యట్టు చెట్టు గానవచ్చినది. నేనెఱుఁగుదును. ఇక్కడ చెట్టెన్నఁడును లేదు. చావో బ్రదుకో నేను మీఁదియూరికే యడుగు సాగించెద నని బండతనముతో నడువసాగెను. కడమవారు కళవళపడసాగిరి. భక్తుఁడు నేను ముందు చేరఁబోయి నిజ మయినచో మిమ్ముఁ గేక వేసి పిలుతును రండని చెట్టును జేర నడచెను. చల్లనినీడ చెట్టాతని కుల్లాసము గొల్పెను. కడమవారు ముగ్గురు నాయన పిలుపునఁ

జేరఁజనిరి. అందొకఁడు మాయో నిజమో చల్లనినీడ దొరకినది. నోరు పిడుచ కట్టుకొని పోవుచున్నది. స్వామీ! చెట్టునీడ నిప్పించినట్టు నీరు కూడ నిప్పింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. అంత నా చెట్టు చిగురుజొంపములనుండి చల్లని తియ్యనీరు చెంబులతోఁ బోసినట్లు ధారలుగా జారసాగెను. కనులు మొగము కడుగుకొని కడుపాఱ వాచాఱతో నీరు ద్రావి తల యొడలు కాళ్లు గడిగికొని హాయి హాయి మని యందఱు నానందించిరి. ఇదేమి వింతో అనిరి! ఒకఁ డిట్లనెను. "మండుటెండలలోను, బొడుగుళ్లలోను, నీరు లేని పాడునదులలోను దేవతలో పిశాచములో విహరించుచుందు రందురు. వారెన్ని వింత లయినఁ గొంతకాలము చేయఁగలరు. ఇదేదో అట్టివారి పని. ఏదైనఁ గానిండు. ఇది మాయము కాకముందే మన మంచి జరుపుకోవలెను. అయ్యా! మీరు ప్రార్థింపుఁడు. వచ్చినది తిండిగింజలకై—ఇంట, ఊర, అందఱు చచ్చుచున్నారు. వారికి నేఁటికి వలసినబియ్యము, పప్పు వగైరా పదార్థములు కావలెను" అనెను. పండ్లు రాలినట్లు బియ్యపుమూటలు, పప్పులు వగైరాల మూటలు రాలెను. తనవంతు గైకొని।యూరివారిని బంపుదు నని కాళ్లు కాలకుండు టకుఁ గూడఁ బ్రార్థింపుఁ డని భక్తుని వేఁడి యాతఁ డింటికిఁ బర్వెత్తెను.

ముగ్గురున్నారు. ఇదేదో ముసలిబ్రాహ్మణుని మంత్ర మహిమ. మంత్రాలకుఁ జింతకాయలు రాలునా యన్నమాట తలక్రిందైనది. ఉచ్ఛిష్టగణపతిమంత్రమో యట్టి దింకేదో యీతఁడు జపించుచున్నాఁడు. అట్టి క్షుద్రదేవత లిట్టి ఫలములు కూర్పఁ గలవు. మహామంత్రములు పరదేవతలు పరలోకమున ఫలప్రాప్తిని కలిగించునే కాని తుచ్ఛమైనయిహసుఖముల నీయవు. ఏమైనఁ గానిమ్ము. ఇప్పుడు చచ్చుచున్నాము గాన కోరక తప్పదు. అయ్యా! మాయూరి కరవు తీరుదాఁక నూర నందఱికిఁ గావలసినయాహార మాయిండ్లనే వేయునట్లు మీ దేవతనో, దయ్యమునో ప్రార్థింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. ఆతఁడు మరల ననెను. ఏమో! యిండ్లకడ లభించియుండవచ్చును. నా కిక్కడఁ గడుపార మంచి పండ్లు పాలు తిండ్లు దొరకవలెను. అవి తిని నే నింటికి వెళ్లుదు ననెను. వానికోరిక లభించెను. ఆరగించి వాఁ డింటికరిగెను.

ఇద్దఱున్నారు! ఒకఁడు మీభక్తికి మెచ్చి కల్పవృక్షమిక్కడ వెలసినట్లున్నది. ఏమి కోరవలెనో తెలియఁజాలకున్నాను. నా కేమి కావలెనో వాని నన్నిటిని మీరే యీకల్పవృక్షముచే నిప్పింపుఁడు అనెను. భక్తుఁడు ప్రార్థించెను. కాని చెట్టునుండి యేవియు రాలవయ్యెను. ఏల రాలకున్నవో బదులు చెప్పు మని భక్తుఁ డావృక్షమును వేఁడెను. చెట్టు గజగజ వణఁక

సాఁగెను. కొంత కీట్లు చెట్టునుండి బదులువచ్చెను. ఇంతదాఁక నేను నన్నుఁ గోరినవారికి వలసినవస్తువులనే యియ్యఁగల్గుచుంటిని గాని ప్రశ్నములకు బదులెఱుఁగుట పలుకుట యెఱుఁగను. మీ ప్రార్థనవల్ల నాకొంత తెలికొని, నాయంతర్యామిని బరమాత్ముని వేఁడి నేఁ డాప్రజ్ఞను బడసి మీకు బదులు చెప్పఁగల్గుచున్నాను. ఇది నాకుఁ గావలె నని యడుగనేరనివానికి, దానిలేవడివలని యిబ్బందిని గుర్తింపనివానికి నేది గాని లభింపదు. అట్టివాని కేది యిచ్చినను దానిని వాఁడు సరిగా ననుభవింపఁజాలఁడు. కాన యీతని కేదియు నీయవీలులేదు. తనకొంతల నాతఁడు గుర్తించి యర్థించుఁగాక యనెను. ఆతఁడు యోచించుచుండెను. భక్తుఁడు ప్రార్థించెను. నీ వెవరవమ్మా! కల్పవృక్షము నీవేనా? నేను కల్పవృక్షమనే. నీ ప్రార్థన లాలకించి, నాయంతర్యామిని సర్వాంతర్యామి యీశ్వరుడు కోరికలు దీర్పఁబంపెను. కోరుము అనెను. ఆనందపరవశుఁడై "అమ్మా! ఇఁక నిన్ను విడువఁజాలను. ముచు ముందుగా ఈపని గావింపుము. నన్ను నమ్మక మీఁదిగ్రామమునకు దూకినవాఁ డేమి సంకటములో నున్నాఁడో. వాని నిటకు దెప్పింపుము." కల్పవృక్షము మీఁదియూరు చేరలేక స్మృతిదప్పి త్రోవలోఁ బడియున్నవానిని రాల్చెను. స్మృతి లేదు. వానికిఁ బ్రాణము పోయు మని భక్తుడు వేఁడెను. అయ్యా ఇది నావల్లఁ గాదే యని వణఁకుచు నంతర్యామి నర్థించి దానిని గొనితెచ్చి వాని కిచ్చెను. పాలలోఁ బంచదార కలసిపోయినట్లు నీవు నాలోఁ గలసి పోయి నారూపముననే నెలకొనుము. కల్పవృక్షము అన్నికోరిక

లను దీర్చినది యన్న ప్రసిద్ధి నిలుపుకొనుమూ యని భక్తుఁ డనెను. ఎన్నఁడు నెవ్వరును గోరనిగోరికలు కోరుట జరుగుచున్నదే యని యచ్చెరువు చెంది యది యంతర్యామి నడిగి యిట్లు బదులు చెప్పెను. "నేను నీలో నైక్య మందుదును గాని నీవు ప్రపంచ ప్రాణికోటితో నైక్య మందవలెను. మానవతలో నేప్రాణిని గాని నీవు వేఱుపఱుపరాదు. ఏభాగమున నీవు వేర్పాటు పాటింతువో ఆభాగమున నే నుండ వీలుండదు" సర్వపరిపూర్ణత గోచరించి భక్తుఁడు వల్లె యని పరమానందభరితుఁడై చెట్టును కౌఁగిలించుకొనెను. చెట్టు మాయ మయ్యెను. చెట్టు మాయ మగుట చూచి చావు దప్పించుకొన్నతొల్లిటివాఁ డిది యంతయు మాయ యని నే నన్నట్టే యయ్యె ననెను. కడమవారు కూడ వారు తొలుత ననుకొన్నట్లే యనుకొనిరి గాఁబోలును ! భక్తుని తర్వాతి తీ రెట్లుండఁబోలునో మీరే పర్యాలోచించి నిర్ణయించుకొందురుగాక ! ఈకథనో, ఆచెట్టునో కడుపునఁ బెట్టుకొని త్యాగరాజుగారీపాట పాడిరి !

తరము గాని యొండవేళా కల్ప
    తరునీడ దొరికిన ట్లాయె యీవేళ
నన్ను విడిచి కదలకురా, రామ !
    ని న్నెడబాసి యరనిమిష మోర్వనురా !
    నన్ను విడిచి కదలకురా !

త్యాగరాజుగారి కీర్తన లన్నియు లోఁతు తఱచి చూచినచో నిట్టి యనుభవముల నాదబ్రహ్మావతారములే !

# ఆంధ్రభాషావతారము

## అమ్మ—అబ్బ—శబ్దరూపనిష్పత్తి

సాధారణముగా వాడుకలో నుండు దేశభాషలలో మాతా పితరులు, అగ్రజులు, పితృవ్యమాతృవ్యులు, పితృమాతృష్వసలు, పితామహమాతామహులు పసిబిడ్డ లుగ్గుపాలనాఁటిబోసినోటితో తమ్ముఁదా మెఱుఁగనేరనినాఁటికే, పరిచితులై పలుకరించువారు, పలుకరింపఁబడువారు నగుదురు గాన వారి చుట్టఱికపుఁబిలుపు పదములు నిర్దంతముగ్ధాస్యములతో నుచ్చరింపఁబడునవై యుండును.

నోరు తెఱచునపుడు వచ్చుధ్వని — అ.

నోరు మూసి తెఱచునపుడు వచ్చుధ్వని — మ్మ.

నిసుఁగులు నోరు మూయుచుఁ దెఱచుచు ధ్వని సేయు చుండుటలో - అమ్మ-శబ్ద మేర్పడును. అది మాతృవాచకమయ్యెను — అట్లే కొంచపుమార్పులతో అ - బ్బ, అ - ప్ప, అ - న్న, అ - క్క, అ - త్త పదము లేర్పడెను. శిశువునకు నిత్యసన్నిహితు లగుతలిదండ్రులకు, అన్నలక్కలకు అవి వాచకము లయ్యెను. — ప్ప ఒక్క యక్కరమే యగునపుడు పూర్వ మున్న అ - ప్ప - ప్ప

పలికినపుడు — పాప, బాబ, అయినది. --మ్మ — మామ అయినది. అత్త — తాత అయినది. -- క్క — కాక అయినది. ఇట్లు చూడఁగా:

అమ — అమ్మ — మామ — మామ్మ — అమ్మమ్మ
అన — అన్న — నాన — నాన్న
అక — అక్క — కాక — కిక్క
అత్త — తాత
అబ్బ — బాబ
అప్ప — పాప

రూపము లేర్పడినవి.

అరవమున 'త' తాయ్, — అది ద్విరుక్తము కాఁగాఁ దంద్రిపేరై — తందాయ్ — తంద్రై — అయినది. తాన + తాన తందాన అయినట్లు. ఈ పదము లన్నిటికి తుద 'ఆయ్' ఉండుట ద్రవిడోచ్చారసంప్రదాయము. దానిఁబట్టి అమ్మ — అమ్మాయి, మామ — మామయ, అన్నాయ్, అక్కయ, అక్కాయ్, అక్కయ్య, అబ్బాయి, పాపాయి, బాబాయి రూపము లేర్పడినవి. తాయ్ + తాయ్ ద్విరుక్తిచే నేర్పడిన 'తంద్రై' శబ్దమునుండియే — ప్రాఁకృభాషలో — 'తండ్రి'

శబ్దము పుట్టినది. ఎట్లనఁగా — తెల్గుభాషలో ప్రథమావిభక్తి తర్వాతికాలమున బహువచన రూపముతోనే యుత్పత్తిల్లినది. ఒక్‌ఱు, ఇరక్‌ఱు, మూక్‌ఱు — ఇందు 'ఱు' (బహువచన) ప్రత్యయము ఏకవస్తువాచక మయిన — ఒక్ పదము మీఁద కూడ నిది వచ్చినది. ద్వివచనము ద్రవిడభాషలలో లేదు గాన ఇరక్ + ఱు అను చో నా (బహువచన) ప్రత్యయ ముండఁ గూడును. మూక్ + ఱు లోను నుండవచ్చును. తెలుఁగు భాషలో నకారపొల్లు రేఫము సంధించినపుడు ఆయక్షరద్వయ సంధి సంఘర్షమువలన నడుమ డకార మవతరించును. పణ్ + రెండు — పండ్‌రెండు — పండ్రెండు, అవక్ (వాక్) + ఱు — వాక్‌డ్ఱు — వాండ్రు; ఇందలి బహువచనరూపము 'ఱు' లోపింపఁగా 'వాండు' ఏకవచన మయినది. అట్లే ఒక్ + ఱు లోఁ గూడ సంధిసంఘర్షమువలన ఒక్‌డ్ఱు — ఒండ్రు — అయి బహువచనప్రత్యయము 'ఱు' లోపింపఁగా 'ఒండు' అయినది. అట్లే రెండు, మూండు రూపముల నిష్పత్తి కూడ. ఈ పద్ధతి చొప్పున—'తండ్రె' తొలి రూపము — 'తందె' తర్వాతి రూపము (కన్నడము). తందె తంది అయి దానిపై బహువచనపు 'ఱు' చేరఁగా — తందిఱు ప్రాతిపదికపు తుది ఇకారమునుబట్టి 'రి' గా మాఱినది. ఒక్క ప్రత్యయమే యయినను (చేతు+రు,

చేసి+రి అయినట్లు) తంది+రి—తందిరి, తండిరి అయినది. తుదకు ఉండిరి—ఉండ్రి యయినట్లు తండిరి—తండ్రిగా మాఱినది.

మగఁడు— సర్వభాషలలోఁ దదర్థకపదము కృత్రిమమే. అది ముగ్ధశిశుభాషలో నుప్పతిల్లవలసినపదము కాదు. అది 'మహాన్' వికృతి కావచ్చును. అక్కడ మహత్త్వమువీర్యవత్త్వ రూపము. మగన్ (హాన్) గ్హాన్ (ఘన్) పదమునకు వీర్యవంతుఁడనుటయే ముఖ్యార్థము. ఆయర్థముననే యది ద్రవిడభాషలలోఁ బ్రధానముగాఁ బ్రయోగింపఁబడెను. అది యౌపచారికముగా వివక్షాయత్తముగాఁ గొన్ని దేశములలోఁ గొన్ని కాలములలోఁ-బెనిమిటికిని, భర్త ముసలివాఁడైనపుడు యువకుఁడుగా నున్న కుమారునికిని వాచక మయినది. నేఁటికిని గూడ నిట్టి పురుష సామాన్యార్థమున నీ పదము తెల్గువ్యవహారమునఁ గలదు.

ఇంట మగదిక్కు లేదు — మగకొడుకు = పురుషుఁడు (భర్తయే, యొండె, కొడుకే అని కాదు అర్థమిక్కడ) మగమొల్క— (కళాపూర్ణో—) మగలరాజు — (కుమార). ఈ పదము నేఁడు పెనిమిటి యన్న యర్థమున వ్యవహృత మగుచున్నట్లే ప్రాచీన కాలమునఁ గొడుకు అన్న యర్థమునఁగూడ (అరవమునంబోలె) వ్యవహృత మగుచుండెడిది.

'అన్న' యన్న పదము అగ్రజునకుఁ దండ్రికిఁ గూడ నేఁడాంధ్రదేశమున భిన్నస్థలములలో వ్యవహృత మగుచున్నది. అట్లే 'బాబు' అన్న పదము కూడఁ దండ్రికిని, దండ్రితమ్మునికి, లేక పినతల్లి భర్తకు వ్యవహారమున నున్నది.

అప్ప=తండ్రికిని — అక్క—గారికిని-

అక్క=తల్లికిని — అక్క—గారికిని-

మఱియు నీ పదము లెల్లఁ బూజ్యార్థమున నెల్లరియెడఁ గూడ వ్యవహృత మగుచున్నవి. వీనినిఁ బట్టి ప్రాచీనకాలపు నింతసంబంధముల లెక్కింపరాదు.

# ౧౫

# వాఙ్మయపరిణామము

శా॥ భాషాదేవత సుస్వరూప మది విస్పష్టంబుగాఁ గానరా ;
దీపద్జ్ఞానము లెల్ల వారికిని ; మా కీనాఁడు బహ్వర్థముల్
భాషింపన్ వలసెన్ ; నిబంధముల నిర్బంధం బసంబద్ధమన్
ఘోషం బేర్పడె ; మార్పు తప్ప ; దిట లగ్గుం గూర్పు మోయీశ్వరా !

పండితులదగ్గఱనుండి పామరులదాఁకఁ, బుట్టిననాఁటినుండి గిట్టిననాఁటిదాఁక నెల్లరకును, నెల్లప్పుడును లోకప్రవృత్తికి భాష పరమోపకారము ; అత్యావశ్యకము. కాని చిత్తసంస్కారములలో నావశ్యకతలలో రుచులలో నర్హతలలో భిన్నలక్షణము లుండుటనుబట్టి వారివారి భాషలు కూడ భిన్నలక్షణములతోనే యుండును. పండితులభాష వేఱు ; పామరులభాష వేఱు ; బాలురభాష వేఱు ; ప్రౌఢులభాష వేఱు. వారువారు వారి వారి భాషలలోఁ దమతమ యవసరములను దీర్చుకొనుచుందురు. పండితునకు రామకథ భవభూత్యాదిప్రౌఢకవినాటకము లచే దర్శనీయము కాఁగాఁ బామరునకుఁ దోలుబొమ్మలాటచే దర్శనీయ మయ్యెను. పండితుఁడు తిక్కనభారతము చదివి భారతకథ తెలిసికోఁగాఁ బామరుఁడు "హరిహరీ నారాయణాదినారాయణా" మట్టు పదములు మొదలైనవి చదివి దానిని

దెలిసికొనును. పండితుఁడు "వచ్చుచున్నా" నని "వస్తున్నా" నని యనఁగాఁ బామరుఁడు "వస్తుండాను" "వత్తుండాను" అని యనును. వారి రుచులు వేఱు; వీరి రుచులు వేఱు గదా! ఇట్లు భేదపరమావధులను జూపఁబూనినచో నొక్కొక్కని కొక్కొక్కతీరుభాష యున్న దన్నంతవఱకుఁ జూప వచ్చును. ఇందులో నెవ్వరు గాని సంఘమునుండి వెల్లిగొలఁగింప రానివారుగా నుందురో యట్టి వారి భాషయు నపరిహార్యమే యగును. కాని యింతవఱకుఁ గడచి చన్న కాలమం దట్లు జరుగలేదు. ఉన్నతసంఘములవారి యుత్కృష్టభాషయుఁ దత్ప్రయోజనములును, గొంతకొంత పరిరక్షింపఁబడినవి గాని యధమసంఘములవారి యవనతభాషయు వారి భాషాప్రయోజనములును బరిరక్షింపఁబడలేదు. అందఱకు సమాన మయిన యర్హత సమ్మానము ప్రాచీనకాలమునం దెట్లేర్పడలేదో యట్లే వారివారి భాషలకును భాషాప్రయోజనములకును సమాన మయినసమ్మానము, అర్హత కలుగదయ్యెను. ఇది సర్వలోక సర్వభాషాసామాన్య మయినవిషయమే.

ప్రస్తుత మగుటచే నిట మన తెనుఁగునాటిమాట తీసి కొనుచున్నాను. ఇతరులచేఁ బ్రాజ్ఞు లని సత్కరింపఁబడినవారు, ఇతరులను దమ నిర్ణయము చొప్పున వినిపింపఁగల్గినవారు ఎవరో

కొంద ఱాయాకాలములయం దేవో కొన్ని ఛందోవ్యాకరణాది విధుల నేర్పఱచి యా విధులచొప్పున గ్రంథరచనాదికము జరుగ వలె నని నిబంధములు గల్పించుచు వచ్చిరి. అధమగతి నున్న తక్కిన లోకము వారి నిర్ణయములను గొన్ని ప్రయోజనములందుఁ గొంతకొంత పాటించుచు వారిని వెంటాడుచు వచ్చిరి. దేశ కాలపాత్రములనుబట్టి యానిర్ణయములును మాఱుచు వచ్చినవి. మఱియు నిట్లింతకాలమువఱకు నా భాషాలక్షణనియామకులు తమకుఁ బరిచిత మయినజనసంఘమును బ్రయోజనములను మాత్రమే లక్ష్యముగాఁ జూచుకొని నిబంధములఁ జేయుచు వచ్చిరి. కాని యా భాష ప్రచారము గాంచినసర్వమానవసంఘ మునుగూర్చియు భాషవలన వారివారికిఁ గలుగవలసినసర్వప్రయో జనములను గూర్చియుఁ, జర్చించి సర్వార్థసాధక మగునట్లు నిబంధ ముల నేర్పఱిచినవారు కారు. కావ్యాలంకారచూడామణికారుని నుండి బాలవ్యాకరణకారునిదాఁకఁ గలపండితులు చేసిననిబంధము లాంధ్రదేశమందలి పరిమితమానవసంఘమునకుఁ బరిమితభాషా ప్రయోజన మైనకావ్యానందమునకు మాత్రమే కొంత చాలి యున్నవి. ఇంతదాఁకఁ గడచిన కాలముతీరు వేఱు. నేఁటి కాల ముతీరు వేఱు. పూర్వమువారు తలఁచి యైన నెఱుఁగనియావశ్య కత లెన్నో యీనాఁటివారికిఁ గల్గుచున్నవి. పూర్వమువారు మానవులుగాఁ గూడ గణింపనివా రెందఱో యిప్పుడు మహా

నీయు లగుచున్నారు. ఇట్టి స్థితిలోఁ బ్రాచీనుల నిబంధనము లీకాలమునఁ బనికిఁజాలనివి, పనికిమాలినవి యగుచున్నవి. భాషా విషయముననే కాక సర్వవిషయములందు నిట్టిసంఘర్షణ సంఘటిల్లినది. నేఁడొక యద్భుతశక్తి యఖిలప్రపంచము నావహించినది. భారతదేశము నది బలముగా నలముకొన్నది. ప్రతిమానవునకు " నేను బరతంత్రుఁడనుగా నుండరాదు. స్వతంత్రుఁడను గావలెను " అను నాత్మాభిమానము పొడముచున్నది. ఒకని నిబంధమున కింకొకఁడు లోఁబడకున్నాఁడు. బ్రాహ్మణుని యాధిక్యమును బ్రతిఘటించుటకు మాలవాఁడును, మహారాజు ప్రాభవమును బ్రతిఘటించుటకు దరిద్రుఁడును బ్రయత్నించుచున్నారు. ఈ సంఘర్ష మనివార్యముగా నున్నది. నివారించుట కూడఁ గూడనిపనిగాఁ దలఁపఁబడుచున్నది. దీర్ఘదర్శులు కొందఱు పెద్దలిందుకై చండాలాదుల యస్పృశ్యతాదులను దొలఁగింపవలె ననియు, దరిద్రులు సంపన్ను లగుటకు వలయు సాధనముల సమకూర్పవలె ననియు సంస్కారములు సేయ సమకట్టుచున్నారు. భాషావిషయమునఁ గూడ నట్టిదే జరుగుచున్నది. కొందఱు పండితులు, కొన్ని భాషాప్రయోజనములనే యుద్దేశించి చేసిననిబంధములు నిలువరింపరాని వనియు, భాషవలన నంతకంటె హెచ్చుప్రయోజనము లిప్పుడు పడయవలసినయావశ్యకత యేర్పడుచున్న దనియు, సర్వమానవసంఘమును భాషాప్రయోజన

సర్వస్వమును సమముగాఁ బడయవలసి యున్నదనియు, నందు లకై వాడుకభాషను గ్రంథరచనము జరుగవలె ననియు వాదించు చున్నారు. అట్లు గ్రంథరచనములు చేయుచున్నారు. నేనును నట్టి సంస్కారము నభిమానించినవారిలో నొక్కఁడను. కాని దానిఁగూర్చి యిటీవల నా యభిప్రాయము మఱింత విపులముగా విరిసి దిక్కు దోఁచనిదిగా నున్నది.

ఇదివఱకు మేము కొందఱము సంకల్పించినసంస్కారములు సంకుచితభావములు గలవిగా నే నిప్పుడు తలఁచుచున్నాను. ఏలనఁగా: "వచ్చుచున్నాను" అను శబ్దరూపమువలెనే "వస్తున్నాను" అనురూపము కూడఁ బ్రాహ్మవ్యవహారమందుఁ గలదు గనుక ప్రయోగార్హ మని యంగీకరింపఁ దగు నంటిమి. కాని ప్రస్తుతకాలపరిణామమునఁ జూడఁగాఁ బ్రాహ్మసంఘ మిది యని వేఱుపఱుచుట కిఁక వీలు కలుగనట్లున్నది. సర్వమానవ సంఘమందును విద్యావిజ్ఞానములు విపులముగా వెలయుచున్నవి. అహమిక నిండారుచున్నది. బ్రాహ్మణాదుల వ్యవహారమందుఁ గల 'వస్తున్నాడు' ప్రయోగార్హ మయినప్పుడు చండాలాదుల 'వస్తుండాడు' మొదలగురూపములు ప్రయోగార్హములు లేల కావు? బ్రాహ్మణుల యాధిక్యమును జండాలురు వెన్నాడకున్నప్పుడు వారి భాషాప్రయోగరీతిని మాత్ర మేల వెంటాడుదురు?

'మా సంఘవ్యవహారమున నున్నరూపమునే నేము మా గ్రంథములం దుపయోగించుకొందు' మందు రేని "వస్తున్నారు" మాత్రమే ప్రయోగార్హ మని తలంచువా రేమి బదులు చెప్పఁ గల్గుదురు? ఇట్టి రూపములే ప్రయోగార్హములని విధించుటకు వీరి కేమి యధికార మున్నది? నాకు నే నయి యింతవఱకు మాత్రమే సంస్కార మంగీకరింపఁ దగు నని నిబంధింపఁ బూనితి నేని యా నిబంధమునకు లోఁగువా రెవ్వరు? ఇట్టి చిక్కు భాషావిషయముననే కాక, సర్వవిషయములందును గూడ సంఘటిల్లినది. సాంఘిక రాజకీయవిషయములందుఁ గొన్ని సంస్కారములు మహాత్ములకుఁ గూడఁ గొఱుకఁబడనివిగా నున్నవి. ఈ చిక్కుయొక్క పరమావధి యేమనఁగా:—ఒక్కొక్క మనుష్యుఁడును 'నా భాషను నేను వ్రాయుదును. ఇంకొకరి నిబంధము నాకు విధాయకము గాదు' అన్నంతవఱకుఁ బోవచ్చును. కాని యట్టి సంఘర్షమునఁ జిదికిపోయెడిచింతనము లేవో బ్రదుకఁ గల్గెడిభావము లేవో వీని పరిణామ మెట్టి దగునో నా యల్పబుద్ధికి గోచరము గాకున్నది. నేఁడు భాషాసంస్కారము నపేక్షించి చర్చించువారిలోఁ గూడ నైకకంఠ్యము లేదు. "చూచినాడు, చూచాడు, చూసినాడు, చూశినాడు, చూశాడు, చూసేడు" అని యిన్ని రూపములును వ్రాయువారున్నారు. ఇందుఁ గొన్నియే పరిగ్రాహ్యము లని వ్యవస్థాపించి

యాఁచి పట్టుట కధికారులు లేరు. సంస్కారమే పనికిరా దని యడ్డు పెట్టుట కంతకంటె నధికారులు లేరు. ఆ సంస్కార మనివార్యముగా జరుగుచునే యున్నది. అయ్యో! ఎంత భయంకర మైనచిక్కు? ఇట్టి చిక్కు భాషావిషయమందే కాక సర్వవిషయములయందు సంప్రాప్త మయినదిగదా! మానవమాత్రుఁడు ప్రాభవముచేఁ గాని ప్రజ్ఞచేఁ గాని యిఁకమీఁది కాలమున లోకమున నేవిషయమునుగాని యనుశాసింపఁజాలఁడేమో యని నాసంశయము. భగవంతుఁ డొకఁ డుండెనేని లోకమును బరమానందోద్దేశమునకుఁ జేర్చుటే తదుద్దేశమేని, యాయన కల్యాణమార్గ మేదో లోకమునకుఁ గల్పింపఁగలఁడు. అది యేదో యందువఱకును మనప్రయత్నములు గ్రుడ్డియెద్దు చేనఁ బడినలాగున సాగుచుండవలసినవే కాఁబోలును! అట్టి శుభసమయము లోకమునకు లభించు టెప్పుడో!

# శ్రీ ప్రభాకరశాస్త్రిగారి గ్రంథములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1. | తెలుఁగు మెఱుఁగులు | ... | 2 | 0 | 0 |
| 2. | శృంగారశ్రీనాథము | ... | 3 | 0 | 0 |
| 3. | క్రీడాభిరామము (విపులమైనపీఠికతో) | ... | 5 | 0 | 0 |
| 4. | నీతినిధి | (అచ్చులోనున్నది) | | | |
| 5. | చాటుపద్యమణిమంజరి (ద్వితీయభాగము) | త్వరలో ప్రకటింపబడును. | | | |
| 6. | ప్రతిమా నాటకము | ... | 2 | 0 | 0 |
| 7. | మత్తవిలాసము | ... | 0 | 8 | 0 |
| 8. | మధ్యమవ్యాయోగము | (అచ్చులోనున్నది) | | | |
| 9. | కర్ణభారము | ... | ,, | | |
| 10 | ప్రబంధరత్నావళి | ... | ,, | | |
| 11. | కడుపుతీపు | ... | 1 | 0 | 0 |
| 12. | కపోతకథ | ... | 1 | 0 | 0 |
| 13 | విశ్వాసము | ... | 0 | 10 | 0 |
| 14. | దివ్యదర్శనము | (అచ్చులోనున్నది) | | | |
| 15. | మూన్నాళ్ల ముచ్చట | ... | ,, | | |
| 16. | చిన్ననాఁటిచేష్టలు | ... | ,, | | |
| 17. | తంజావూరి ఆంధ్రరాజులచరిత్ర | ... | ,, | | |
| 18. | కామధేనువు కథ | ... | ,, | | |
| 19. | మీఁగడ తఱకలు | ... | 2 | 8 | 0 |
| 20. | కనకాభిషేకము | (అచ్చులోనున్నది) | | | |
| 21 | ఉత్తరహరివంశము (శ్రీశాస్త్రిగారి వ్యాఖ్యానము) | ,, | | | |

## కుమారసంభవము.

నన్నిచోడుని గ్రంథమునకు కొంతవరకు శ్రీ శాస్త్రి గారి వ్యాఖ్యానములతోను, సాధుపాఠములతోను, అర్థవిశేషములతోను త్వరలో ప్రకటింపఁబడును.

## చాటుపద్యమణిమంజరి

(ద్వితీయభాగము)

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిచే సరిక్రొత్తగా సమకూర్పఁబడిన ప్రాచీనాద్భుతచాటుపద్యరత్నములకూర్పు, అనేకనూతనాంశముల జేర్చి పునర్ముద్రణ మందుచున్నది. దేవతాస్తుతి స్తబకము, కవిప్రశంసా స్తబకము, రాజప్రశంసా స్తబకము, ప్రసిద్ధమహాపురుష స్తబకము, నీతి స్తబకము, శృంగార స్తబకము ఇత్యాది విషయవిభాగములతో డెమ్మాఁడైన రెండు సంపుటములుగా ప్రకటింపఁబడుచున్నది. మొదటి సంపుటము త్వరలో ప్రకటింపఁబడును.